www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

నిర్మాణ వ్యర్థాల నిర్వహణ ప్రణాళిక ఉంటేనే.. ఇకపై
భవనాలకు అనుమతుల జారీ!


నిర్మాణ వ్యర్థాల అక్రమ డంపింగ్‌తో
పర్యావరణానికి హాని.. చెరువులు, నాలాల ఆక్రమణ
అడ్డుకునేలా కేంద్రం కొత్త నిబంధనలు
మార్గదర్శకాలపై రాష్ట్ర ప్రభుత్వ కసరత్తు
వచ్చే ఏడాది ఏప్రిల్ 1వ తేదీ నుంచి అమల్లోకి..

10



గురువారం | 17-7-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 23 సంచిక (Issue) : 109 | శ్రీ విశ్వావసునామ సంవత్సరం, దక్షిణాయనం, గ్రీష్మరుతువు, ఆషాఢమాసం, బహుళపక్షం; తిథి: సప్తమి రా.7.09 తదుపరి అష్టమి; నక్షత్రం: రేవతి తె.3.39 తదుపరి అశ్విని, వర్జ్యం: సా.4.14-5.45, దుర్ముహూర్తం: ఉ.10.12-11.03, మ.3.22-4.14, అమృతఘడియలు: రా.1.22-2.53, రాహుకాలం: మ.1.30-3.00, సూర్యోదయం: 5.53, సూర్యాస్తమయం: 6.49 | వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



ఢిల్లీలోని శ్రమశక్తి భవన్‌లో సీఎం రేవంత్‌రెడ్డికి పుష్పగుచ్ఛం ఇస్తున్న ఏపీ సీఎం చంద్రబాబు. చిత్రంలో కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్, మంత్రి ఉత్తమ్

జలవివాదాలపై కమిటీ

రెండు రాష్ట్రాల నిపుణులు, అధికారులతో ఏర్పాటు.. 21లోగా నియామకం

రిజర్వాయర్ల ఔట్‌ఫ్లోల వద్ద టెలిమెట్రీలకు సుముఖం
కృష్ణా నదీ యాజమాన్య బోర్డు ఏపీకి తరలింపు
గోదావరి బోర్డు హైదరాబాద్‌లో కొనసాగింపు
శ్రీశైలం ప్రాజెక్టు మరమ్మతులకు ఏపీ అంగీకారం
రెండు తెలుగు రాష్ట్రాల సీఎంల భేటీలో నిర్ణయాలు
ఇది తెలంగాణ సాధించిన విజయం
బనకచర్లను కదతామని ఏపీ చెప్పలేదు
అలాంటప్పుడు ఆపాలని చెప్పాల్సిన పనిలేదు
రాష్ట్రాల మధ్య గొడవల కోసం కొందరి ఎదురుచూపు
తెలంగాణ హక్కులు ఏపీకి కేసీఆర్ ధారాదత్తం
తప్పుల్ని సరిదిద్దే యత్నం చేస్తున్నాం: సీఎం రేవంత్

న్యూఢిల్లీ/హైదరాబాద్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): తెలుగు రాష్ట్రాల్లోని కృష్ణా, గోదావరి నదులకు సంబంధించి జలవివాదాల పరిష్కారానికి ముందడుగు పడింది. రెండు రాష్ట్రాల్లోని ప్రాజెక్టుల సమస్యల సమగ్ర పరిష్కారానికిగాను కమిటీని నియమించాలని నిర్ణయించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి అధికారులు, సాంకేతిక నిపుణులతో ఈ కమిటీని ఈ నెల 21లోగా నియమించనున్నారు. ఈ మేరకు బుధవారం న్యూఢిల్లీలోని శ్రమశక్తి భవన్‌లో కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్ ఆధ్వర్యంలో జరిగిన రెండు రాష్ట్రాల ముఖ్యమంత్రుల సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. పోలవరం-బనకచర్ల అనుసంధాన ప్రాజెక్టు, కృష్ణా, గోదావరి జలాలకు సంబంధించి 13 అంశాలు ఎజెండాగా నిర్వహించిన ఈ సమావేశానికి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రులు రేవంత్‌రెడ్డి, చంద్రబాబునాయుడు.. నీటి పారుదల శాఖ మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, నిమ్మల రామానాయుడు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సీనియర్ అధికారులు హాజరయ్యారు. దాదాపు గంటన్నరపాటు జరిగిన ఈ సమావేశంలో రెండు రాష్ట్రాల మధ్య నెలకొన్న జలవివాదాలు, నీటి నిర్వహణ పద్ధతులకు సంబంధించి కీలక అంశాలపై చర్చించారు. వివాదాల పరిష్కారం కోసం కమిటీ ఏర్పాటుపై నిర్ణయంతోపాటు కృష్ణా బేసిన్‌లోని ప్రాజెక్టుల నుంచి కాలువలకు వెళ్లే నీటి ప్రవాహాల తీరుతెన్నులను రియల్ టైంలో పర్యవేక్షించడానికి టెలిమెట్రీ పరికరాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. దీంతోపాటు శ్రీశైలం డ్యామ్‌ను పరిరక్షించడానికి

మిగతా 13వ పేజీలో...

13

తెలుగు రాష్ట్రాలే నాకు ముఖ్యం

ఒక్కరే బాగుండాలనుకునే వ్యక్తిని కాను.. సమస్యలు సామరస్యంగా పరిష్కరించుకుందాం
టెక్నికల్ కమిటీ ముందు అన్నిటిపైనా చర్చిద్దాం.. అయినా తెగకపోతే అపెక్స్ కౌన్సిల్‌లో..
గోదావరిలో మా వాటా కిందే బనకచర్ల.. వృథాగా పోయే వరద నీరే వాడుకుంటాం
తెలంగాణ పథకాలకు ఎప్పుడూ అడ్డుచెప్పను: ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు

బనకచర్ల ప్రస్తావనే లేదంటూ
రేవంత్ అబద్ధాలు

ఆ ప్రాజెక్టుపైనే కమిటీ అన్న ఏపీ మంత్రి
కమిటీ నిర్ణయాన్ని అంగీకరించడం..
తెలంగాణకు మరణ శాసనమే
బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు

13



నిన్నటి ఆయుధాలతో..
నేటి యుద్ధం గెలవలేం!

దేశ రక్షణ సామర్థ్యాన్ని
తక్షణం ఆధునీకరించాల్సి ఉంది
సీడీఎస్ జనరల్ అనిల్ చౌహాన్

2

సీఎంఆర్ఎఫ్ చెక్కుల గోల్‌మాల్..
హరీశ్‌రావు కార్యాలయ మాజీ సిబ్బంది
మరోసారి అరెస్టు

రిమాండ్‌కు ఇద్దరి తరలింపు
పరారీలో మరో ముగ్గురు

12

పీఎం ధన ధాన్య కృషి యోజనకు ఆమోదం

కేంద్ర క్యాబినెట్ కీలక నిర్ణయం
దేశవ్యాప్తంగా 100 జిల్లాల్లో అమలు
ఏడాదికి 24 వేల కోట్ల కేటాయింపు
ఉత్పాదన, రుణ సౌలభ్యం పెంపు లక్ష్యం
1.7 కోట్ల రైతులకు ప్రయోజనం
రేపు రైతుల ఖాతాల్లోకి పీఎం కిసాన్
బిహార్‌లో విడుదల చేయనున్న మోదీ

2

నేడు, రేపు భారీ వర్షాలు!

పలు జిల్లాలకు ఎల్లో అలర్ట్
ప్రాజెక్టులకు కొనసాగుతున్న వరద

3

ఆ ముగ్గురి అక్రమాస్తులు
రూ.1000 కోట్ల పైనే!

కాళేశ్వరం ప్రాజెక్టు ఇంజనీర్ల అవినీతిపై రంగంలోకి ఈడీ
మురళీధర్‌రావు, హరిరామ్ నాయక్, శ్రీధర్ కేసుల
వివరాలను ఇవ్వాలంటూ ఏసీబీకి లేఖ
మనీలాండరింగ్ కోణంలో ఈడీ దర్యాప్తు!
శ్రీధర్ కుమారుడి 'థాయ్‌లాండ్ పెళ్లి',
మురళీధర్ కొడుకు కంపెనీ లావాదేవీలపై నజర్
మురళీధర్‌కు 2 వారాల రిమాండ్.. జైలుకు తరలింపు



మురళీధర్



హరిరామ్



శ్రీధర్

హైదరాబాద్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): ఇద్దరు ఇంజనీర్ ఇన్ చీఫ్ (ఈఎన్‌సీ)లు, ఒక ఈఈ.. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగస్వాములైన ఈ ముగ్గురూ అక్రమాస్తుల కేసులో అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ)కు పట్టుబడ్డారు. ఆదాయానికి మించి ఆస్తులను సమకూర్చుకున్న ఈ ఇంజనీర్ల బాగోతంపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) దృష్టి సారించింది. ఏసీబీ అధికారులు అరెస్టు చేసిన విశ్రాంత ఈఎన్‌సీ మురళీధర్‌రావు, కాళేశ్వరం ఈఎన్‌సీగా పనిచేసిన హరిరామ్ నాయక్, ఈఈ నూనె శ్రీధర్ ఆస్తుల మార్కెట్ విలువ రూ.1000 కోట్ల వరకు ఉండవచ్చని భావిస్తున్నారు. ఈ క్రమంలో వారిపై నమోదైన కేసుల ఎఫ్ఐఆర్‌లు, రిమాండ్ రిపోర్టులు, కస్టడీ విచారణ నివేదికలు ఇవ్వాలని కోరుతూ ఈడీ అధికారులు ఏసీబీకి లేఖ రాసినట్లు సమాచారం. నూనె శ్రీధర్ కుమారుడి వివాహం థాయ్‌లాండ్‌లో జరిగిన నేపథ్యంలో ఆ ఖర్చులపై ఈడీ దృష్టి సారించింది. మురళీధర్‌రావు కుమారుడు అభిషేక్‌రావు కొన్ని

మిగతా 14వ పేజీలో...

ఏసీబీకి చిక్కిన పంచాయతీరాజ్
ఇంజనీర్ ఇన్ చీఫ్

డీఈ బదిలీ కోసం రూ.50 వేలు డిమాండ్
సొమ్ము తీసుకుంటూ రెడ్‌హ్యాండెడ్‌గా పట్టివేత
ఈ ఏడాది మార్చిలోనే కనకరత్నం రిటైర్
ప్రస్తుతం ఏడాదిపాటు సర్వీసు పొడిగింపులో..

14

దళారుల పిన్‌కోడ్

స్టాప్లర్ పిన్ను రంగును బట్టే
అక్కడ పనులు
రవాణా కార్యాలయాల్లో
అవినీతి కొత్త పుంతలు
అధికార్లు, దళారుల ఎత్తుగడ
ప్రతి రోజు ఉదయం
పిన్ను రంగుపై నిర్ణయం

3

నిన్నటి ఆయుధాలతో.. నేటి యుద్ధం గెలవలేం!

» సీడీఎస్ జనరల్ అనిల్ చౌహాన్ వెల్లడి



న్యూఢిల్లీ, జూలై 16: భారత రక్షణ సామర్థ్యాన్ని తక్షణమే ఆధునికీకరించాల్సిన అవసరం ఉందని చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్(సీడీఎస్) జనరల్ అనిల్ చౌహాన్ అన్నారు. "నిన్నటి ఆయుధాలతో నేటి యుద్ధం గెలవలేం. రేపటి సాంకేతికతతో ఈ రోజు యుద్ధం చేయాలి. కాలం చెల్లిన వ్యవస్థలతో కాదు." అని వ్యాఖ్యానించారు. బుధవారం ఢిల్లీలో మానవ రహిత వైమానిక వాహనాలు(యూఏవీ), కౌంటర్ మానవ రహిత వైమానిక వ్యవస్థ స్వదేశీకరణపై జరిగిన వర్క్‌షాపులో సీడీఎస్ మాట్లాడారు. దేశం తన వ్యూహాత్మక లక్ష్యాలకు కీలకమైన సాంకేతిక పరిజ్ఞానంపై విదేశాలపై ఆధారపడటం తగ్గించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా పాకిస్థాన్‌ను ఉగ్రవాదులే లక్ష్యంగా మే నెలలో చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్'ను ప్రస్తావించారు. ఆ సమయంలో పాకిస్థాన్ మన సరిహద్దుల వెంబడి మానవ రహిత డ్రోన్లతో పాటు మందుగుండు సామాగ్రిని మోహరించిందని తెలిపారు. అయితే, పాక్ ప్రయోగించిన యూఏవీలో భారత సైన్యానికి, పౌరుల మౌలిక సదుపాయాలకు కానీ ఎలాంటి నష్టం వాటిల్లలేదని పేర్కొన్నారు.

వచ్చే నెలలో చైనాకు ప్రధాని మోదీ!

న్యూఢిల్లీ, జూలై 16: ప్రధాని నరేంద్ర మోదీ త్వరలో చైనాలో పర్యటించనున్నారు. ఆగస్టు 31 నుంచి సెప్టెంబరు 1 వరకు జరగబోయే షాంఘై సహకార సంస్థ (ఎస్‌సీవో) సదస్సుకు ఆయన హాజరుకానున్నట్లు సమాచారం. ఈ సదస్సులో చైనా అధ్యక్షుడు షి జిన్‌పింగ్‌తో ప్రధాని మోదీ చర్చలు జరిపే అవకాశం ఉంది. వీరిద్దరూ గతేడాది అక్టోబరులో రష్యాలో జరిగిన బ్రిక్స్ సదస్సులో చివరిసారిగా కలుసుకున్నారు. ఇరుదేశాల మధ్య ప్రస్తుతం ఉద్రిక్తంగా ఉన్న సంబంధాలను మోదీ పర్యటనతో మెరుగుపడతాయని నిపుణులు అంచనా వేస్తున్నారు. కాగా, 2020లో తూర్పు లద్దాఖ్‌లోని గల్వాన్ లోయలో సైనిక ఘర్షణల తర్వాత మోదీ చైనాను సందర్శించడం ఇదే మొదటిసారి కానుంది.

నిమిషప్రియకు క్షమాభిక్ష ప్రసక్తే లేదు..!

» యెమెన్ మృతుడి సోదరుడి స్పష్టీకరణ

న్యూఢిల్లీ, జూలై 16: కేరళ నర్సు నిమిషప్రియకు క్షమాభిక్ష ప్రసక్తే లేదని యెమెన్‌కు చెందిన మృతుడు తలాల్ మెహదీ సోదరుడు అబ్దుల్ ఫతా మెహదీ స్పష్టం చేశారు. 2017లో తలాల్ మెహదీని హత్య చేసిన కేసులో నిమిషప్రియను యెమెన్ ప్రభుత్వం మరణ శిక్ష విధించిన సంగతి తెలిసిందే. బుధవారం ఆమెకు శిక్షను అమలు చేయాల్సి ఉండగా.. దాన్ని వాయిదా వేశారు. ఈ క్రమంలో మృతుడి సోదరుడు స్పందిస్తూ.. నిమిషప్రియను క్షమించే ప్రసక్తే లేదన్నారు. ఆమెకు మరణ శిక్షను అమలు చేయాలని కోరారు. మరోవైపు నిమిషప్రియను కాపాడేందుకు భారత ప్రభుత్వం, కొన్ని సంస్థలు తీవ్ర ప్రయత్నాలు చేస్తూనే ఉన్నాయి. మృతుని కుటుంబ సభ్యులను ఒప్పించడమే మత పెద్దలకు, అధికారులకు సవాలుగా మారింది. వారు అంగీకరిస్తే ఎంత మొత్తంలో 'బ్లడ్ మనీ' ఇవ్వాలన్న దానిపై చర్చలు జరపనున్నారు.

అధిష్ఠానం నిర్ణయానికి నేను, డీకే కట్టుబడతాం

» సీఎం మార్పు వార్తలపై కర్ణాటక సీఎం సిద్దరామయ్య

బెంగళూరు, జూలై 16(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి పదవి విషయంలో అధిష్ఠానం తీసుకునే నిర్ణయానికి కట్టుబడి ఉంటానని కర్ణాటక సీఎం సిద్దరామయ్య అన్నారు. కాంగ్రెస్ ఓబీసీ సలహా మండలి సమావేశం ముగిసిన అనంతరం బెంగళూరులో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఐదేళ్లు తానే ముఖ్యమంత్రిగా ఉంటానని ఇటీవల ఢిల్లీ పర్యటనలో సిద్దరామయ్య ప్రకటించిన విషయం తెలిసిందే. అప్పటి నుంచి ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ మౌనంగా ఉంటున్నారు. ఈ నేపథ్యంలో మీడియాతో మాట్లాడిన సీఎం, అధిష్ఠానం తీసుకునే నిర్ణయాన్ని తాను, డీకే శివకుమార్ పాటిస్తామని అన్నారు.

ఎంపీలకు కేంద్రం కొత్త మెనూ

న్యూఢిల్లీ, జూలై 16: పార్లమెంట్ క్యాంటీన్‌లో ఇప్పుడు ఎంపీలు ఆరోగ్యకరమైన, తక్కువ క్యాలరీలతో కూడిన పోషకాహారాన్ని ఆస్వాదించనున్నారు. కొత్తగా ప్రవేశపెట్టిన హెల్దీ మెనూ లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా సూచనలతో రూపుదిద్దుకుంది. ఈ కొత్త జాబితాలో చిరుధాన్యాలతో చేసే వంటకాలకు ప్రాధాన్యం లభించింది. ఫిట్ ఇండియా మూవ్‌మెంట్, పోషణ్ అభియాన్, ఈట్ రైట్ ఇండియా వంటి జాతీయ ఆరోగ్య కార్యక్రమాలకు అనుగుణంగా ఈ మెనూను తయారుచేశారు. ప్రతి వంటకానికి సంబంధించిన క్యాలరీల వివరాలు అధికారులు మెనూలో పేర్కొన్నారు. ఈ జాబితాలో రాగి ఇడ్లీ, సాంబార్, చట్నీ, జొన్న ఉప్మా, చనా చాట్, మూంగ్ దాల్ చిల్లా, ఫైబర్ అధికంగా ఉండే జొన్న, బార్లీ సలాడ్, వెజిటబుల్ సూపులు ఉన్నాయి. అలాగే మాంసాహారుల కోసం గ్రిల్డ్ చికెన్, ఫిష్ అందుబాటులో ఉన్నాయి.

మీకు కావాల్సింది ఆయన కాదు.. నిఘంటువు

» అశోకా వర్సిటీ ప్రొఫెసర్ అలీఖాన్ వివాదాస్పద వ్యాఖ్యల కేసులో సిట్‌పై సుప్రీంకోర్టు ఆగ్రహం

న్యూఢిల్లీ, జూలై 16: 'ఆపరేషన్ సిందూర్'పై అశోకా యూనివర్సిటీ ప్రొఫెసర్ అలీ ఖాన్ మహ్మూదాబాద్ పెట్టిన పోస్టులపై దర్యాప్తు జరుపుతున్న సిట్‌పై సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. దర్యాప్తు బృందానికి కావాల్సింది ఆయన కాదని, (ఆయన పోస్టులను అర్థం చేసుకోవడానికి) నిఘంటువు అని వ్యాఖ్యానించింది. వివాదాస్పద పోస్టులకు సంబంధించి కోర్టు పరిధిలో ఉన్న అంశంపైనే దృష్టి సారించాలని సూచించింది. మిగతా ఏ అంశంపైనా ఆయనా ఆన్‌లైన్‌లో వ్యాసాలు రాసే హక్కు అలీ ఖాన్‌కు ఉందని తేల్చిచెప్పింది. ఈ కేసుపై దర్యాప్తు చేస్తున్న సిట్, అలీఖాన్‌కు సంబంధించిన ఎలక్ట్రానిక్ పరికరాలను స్వాధీనం చేసుకుందని, గత పదేళ్లగా ఆయన విదేశాలకు వెళ్లొచ్చిన వివరాలు ఇవ్వాల్సిందిగా అడుగుతోందని ఆయన తరఫు న్యాయవాది కపిల్ సిబల్ బుధవారం కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. సిట్ ఇప్పటికే ఆయన్ను నాలుగుసార్లు విచారణకు పిలిపించిందని తెలిపారు. దీంతో.. అలీ ఖాన్ పెట్టిన రెండు సోషల్ మీడియా పోస్టుల్లోని పదాల భావాలను సంపూర్ణంగా అర్థం చేసుకోవటానికి, ఆయా వ్యక్తీకరణలను సరిగ్గా అంచనా వేయడానికి మాత్రమే సిట్ ఏర్పాటైందని ధర్మాసనం గుర్తుచేసింది.

మొక్కల 'మాటలు' కీటకాలకు అర్థమవుతాయ్!

టెల్ అవీవ్ వర్సిటీ పరిశోధకుల వెల్లడి.. ఆడ చిమ్మటలపై ప్రయోగాల ద్వారా ఆవిష్కరణ

» ప్రకృతిలోని ధ్వని సమాచార వ్యవస్థల అధ్యయనంలో కొత్త పరిణామం

న్యూఢిల్లీ, జూలై 16: మొక్కల 'మాటలను' కీటకాలు అర్థం చేసుకోగలవని ఓ తాజా పరిశోధన వెల్లడించింది. ప్రకృతిలో ఉన్న ధ్వనిపరమైన సమాచార వ్యవస్థల అధ్యయనంలో ఇది ఒక కొత్త పరిణామం. ఇజ్రాయెల్‌లోని టెల్‌అవీవ్ యూనివర్సిటీకి చెందిన శాస్త్రవేత్తలు ఈ పరిశోధన జరిపారు. దీంట్లో భాగంగా ఆడ చిమ్మటల మీద వారు కొన్ని ప్రయోగాలు జరిపారు. సాధారణంగా, ఆడ చిమ్మటలు తమ గుడ్లను టమాటో మొక్కల మీద పొదుగుతుంటాయి. గుడ్ల నుంచి బయటకు వచ్చే లార్వాలకు అవసరమైన ఆహారం కోసం అవి ఆ పని చేస్తుంటాయి. అయితే, ఆరోగ్యవంతమైన టమాటో మొక్కను గుర్తించటానికి ఆడ చిమ్మటలు ధ్వనితరంగాల మీద ఆధారపడుతుంటాయి. నీళ్లు లేక అలమటించే టమాటో మొక్కలు తమ పరిస్థితిని అల్ట్రాసోనిక్ సంకేతాల ద్వారా తెలుపుతుంటాయి. ఈ సంకేతాలను అర్థం చేసుకోవటం ద్వారా ఆడ చిమ్మటలు.. నీళ్లు లేక ఎండిపోతున్న వాటి మీద కాకుండా.. ఆరోగ్యంగా ఉన్న టమాటో మొక్క మీద తమ గుడ్లను పొదుగుతాయని టెల్‌అవీవ్ వర్సిటీ పరిశోధకులు జరిపిన ప్రయోగాల ద్వారా తెలిసింది. ఈ పరిశోధనకు సారథ్యం వహించిన ప్రొఫెసర్ ర్యా సెల్జెర్, ప్రొఫెసర్ గ్యోజర్ ఎవల్ ఒక ప్రకటన విడుదల చేస్తూ.. మొక్కలకు, కీటకాలకు మధ్య ధ్వనిపరమైన కమ్యూనికేషన్ ఉంటుందని తొలిసారిగా రుజువైందన్నారు. వ్యవసాయం, కీటక నియంత్రణ, పంటల నాణ్యత తదితర రంగాల్లో ఈ పరిశోధన ఉపయోగపడవచ్చని భావిస్తున్నారు.

మెటా ఏఐ.. మెగా ప్లాన్

రూ.లక్షల కోట్ల వ్యయంతో ఏఐ సూపర్ క్లస్టర్లు.. 1341 మెగావాట్ల సామర్థ్యంతో తొలి క్లస్టర్ ప్రామెథియస్

» వచ్చే ఏడాది నాటికి అందుబాటులోకి: మార్క్ జుకర్‌బర్గ్

» తర్వాత మరిన్ని క్లస్టర్లు.. 5గిగావాట్లతో హైపరియన్ క్లస్టర్

» ఓపెన్ ఏఐ, యాపిల్, ఆంత్రోపిక్ వంటి పెద్ద సంస్థల నుంచి ప్రతిభావంతులకు వల

» నియామకాల కోసం స్కేల్ ఏఐతో రూ.1.2 లక్షల కోట్ల ఒప్పందం





'ఏఐ' రంగంలో ఇప్పటికే దూసుకుపోతున్న ఓపెన్ ఏఐ, డీప్‌సీక్ వంటివాటికి మరింత గట్టిపోటీ ఇచ్చేందుకు.. 'ఫేస్‌బుక్' వ్యవస్థాపకుడు, మెటా సీఈవో జుకెర్‌బెర్గ్ భారీ ప్రణాళికలు రచించారు! రూ.లక్షల కోట్ల ఖర్చుతో భారీ 'ఏఐ' సూపర్‌క్లస్టర్ల నిర్మాణానికి నడుం బిగించారు!! 'ప్రామెథియస్' పేరుతో.. వచ్చే ఏడాది నాటికి 1341 మెగావాట్ల ఏఐ సూపర్ క్లస్టర్‌ను ఏర్పాటు చేయనున్నట్టు ఆయన ప్రకటించారు. ఆ తర్వాత క్రమంగా ఆ శక్తిని పెంచుకుంటూ పోయి కొన్నేళ్ల తర్వాత 5 వేల గిగావాట్ల 'హైపరియన్ సూపర్‌క్లస్టర్'ను నిర్మించనున్నట్టు వెల్లడించారు. ఇంతకీ ఏమిటీ సూపర్ క్లస్టర్లు? వీటివల్ల ఉపయోగం ఏంటి? అంటే.. కృత్రిమ మేధ ఎలా పనిచేస్తుందో మనందరికీ తెలుసుకోవాలి. సాధారణంగా మనం గూగుల్‌లో ఏదైనా ప్రశ్నకు సమాధానం తెలుసుకోవాలంటే.. సెర్చ్ చేసి, వచ్చిన సమాచారాన్నంతటినీ ఒక్కొక్కటిగా స్క్రోల్ చేసి, పరికించి చూస్తే.. దేటాను తీసుకుని దాన్ని క్రోడీకరిస్తేగానీ మన పని పూర్తి కాదు. అదే పనిని చాట్‌జీపీటీ, డీప్‌సీక్ వంటి ఏఐలు క్షణమాత్రంలో తెలిసేలా చెబుతున్నాయి. విషయం తెలిసినది కదా! అవి అంత వేగంగా సమాచారాన్ని సేకరించడం వెనుక అసలు కిటుకు.. ఈ సూపర్ క్లస్టర్లే. ఇవి నేరుగా సమాచారాన్ని సేకరించడంలో ఉపయోగపడవుగానీ.. ఎలా సేకరించాలో ఏఐ మోడల్స్‌కు రోజులు, వారాలు, నెలల తరబడి శిక్షణ ఇస్తాయి. ఇంత శిక్షణ ఇవ్వడం మనుషులకు సాధ్యం కాదు కాబట్టి ఈ సూపర్ క్లస్టర్లను వినియోగిస్తారు. అలా.. డీప్‌సీక్ ఏఐ మోడల్‌కు శిక్షణ ఇవ్వడానికి ఉపయోగిస్తున్న సూపర్ క్లస్టర్ల సామర్థ్యం ఎంతో తెలుసా? కేవలం 12 నుంచి 14 మెగావాట్లు. చాట్‌జీపీటీకి శిక్షణ ఇవ్వడానికి ఉపయోగిస్తున్న సూపర్ క్లస్టర్ సామర్థ్యం 300 నుంచి 500 మెగావాట్లు! దానికి దాదాపు రెండున్నర రెట్లు అధిక సామర్థ్యంతో.. ఏకంగా 1341 మెగావాట్ల సామర్థ్యం కలిగిన సూపర్ క్లస్టర్ ఏర్పాటుకు మెటా సిద్ధమవుతోందంటే అది ఎంత శక్తిమంతమైనదో అర్థం చేసుకోవచ్చు. అందునా అది ఆరంభం మాత్రమే. మెటా ప్రణాళికలో తుది ప్రాజెక్టు.. అక్షరాలా 5 గిగావాట్ల సామర్థ్యం గల సూపర్ క్లస్టర్ నిర్మాణం. అంటే 'ప్రామెథియస్' కన్నా దాదాపు ఐదు రెట్లు అధిక సామర్థ్యం. అందుకే టెక్ ప్రపంచమంతా ఈ ప్రాజెక్టువైపు ఆసక్తిగా చూస్తోంది.

ఉద్యోగావకాశాలూ..

ఈ భారీ ప్రాజెక్టు కోసం భారీగా పెట్టుబడులు పెట్టడమొక్కటే కాదు.. అంతే భారీ స్థాయిలో ఏఐ రంగంలో ప్రతిభావంతులను నియమించుకోవడంపైనా మెటా దృష్టి సారించింది. నియామకాల కోసం ఆ సంస్థ ఇటీవలే 'స్కేల్ ఏఐ' సంస్థతో 14 బిలియన్ డాలర్ల (మన కరెన్సీలో రూ.1.2 లక్షల కోట్లు) ఒప్పందం కుదుర్చుకుంది. అలాగే.. ఈ ప్రాజెక్టు నిర్వహణ కోసం 'మెటా సూపర్ ఇంటెలిజెన్స్ ల్యాబ్స్' అనే సంస్థను స్థాపించింది. ప్రపంచ ప్రఖ్యాత ఏఐ పరిశోధకులు, ఇంజనీర్లను ఆ సంస్థలోకి తీసుకుంటోంది. స్కేల్ ఏఐ సీఈవో అలెగ్జాండర్ వాంగ్, గిట్‌హబ్ మాజీ సీఈవో నాట్ ఫ్రెడ్‌మన్ వంటివారిని ఇప్పటికే ఆ సంస్థలో నియమించుకున్నారు. యాపిల్, ఆంత్రోపిక్, ఓపెన్‌ఏఐ నుంచి పెద్ద సంఖ్యలో ప్రతిభావంతులను చేర్చుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. అత్యుత్తమ ప్రతిభావంతులకు రూ.850 కోట్ల దాకా ప్యాకేజీలు కూడా ఆఫర్ చేస్తున్నారు.

-సెంట్రల్ డెస్క్

1341 మెగావాట్లంటే...

మెటా అభివృద్ధి చేయనున్న సూపర్ క్లస్టర్ సామర్థ్యం 1341 మెగావాట్లు. అర్థమయ్యేలా చెప్పాలంటే.. మన ఇంట్లో తిరిగే సీలింగ్ ఫ్యాన్ సగటున 75 వాట్ల కరెంటును వినియోగించుకుంటుందనుకుంటే.. ఒకేసారి 1,80,00,000 (1.8 కోట్ల) ఫ్యాన్లు తిరిగితే ఎంత శక్తి ఖర్చవుతుందో అంత శక్తి! ఆ శక్తితో 1,34,10,000 టీవీలను ఒకేసారి చూడొచ్చు. 89 లక్షల 40 వేల రిఫ్రిజిరేటర్లను లేదా 6.7 కోట్ల ట్యూబ్‌లైట్లను పనిచేయించవచ్చు. దీనికే అంత శక్తి ఉందంటే.. 5 గిగావాట్ల సామర్థ్యం అంటే ఎంతో మీరే ఊహించుకోండి!!



అక్బర్ పాలనలో మత అసహనం

» పురెల్లపై విజయ సౌధాలు కట్టిన బాబర్

» 8వ తరగతి సాంఘిక శాస్త్ర పాఠ్యాంశంలో ఎన్‌సీఈఆర్టీ మార్పులు



న్యూఢిల్లీ, జూలై 16: ఎనిమిదో తరగతి విద్యార్థులకు బోధించే సాంఘిక శాస్త్రంలో 'ఎన్‌సీఈఆర్టీ' కీలకమార్పులు చేసింది. భారతదేశ చరిత్రలో 13 నుంచి 17వ శతాబ్దం వరకు పాలించిన ఢిల్లీ సుల్తానులు, విజయనగర రాజులు, మొఘల్ చక్రవర్తులు, మరాఠాలు, సిక్కు రాజుల చరిత్రలకు సంబంధించి, గతంలో చేర్చని పలు అంశాలను కొత్త పాఠ్యాంశంలో భాగం చేసింది. అక్బర్ పాలన మత అసహనంతో సాగిందని, మరో మొఘల్ చక్రవర్తి బాబర్, శత్రు సేనలను వధించి, వారి పుర్రెలపై విజయ సౌధాలు నిర్మించారని పేర్కొన్నారు. చిత్తోర్‌ను జయించినప్పుడు వేలాదిమందిని అక్బర్ వధించారని తెలిపారు. ఈ సందర్భంగా అక్బర్ తన సన్నిహితులతో మాట్లాడుతూ.. "అవిశ్వాసులకు చెందిన పలు కోటలు, నగరాలు జయించాం. ఇస్లాం రాజ్యాన్ని వ్యాపింపజేశాం" అని అన్నట్టు రాశారు. 'భారతదేశ రాజకీయ పటాన్ని తిరగరాసిన శకాలు' అనే శీర్షికతో ఇలాంటి అంశాలెన్నో పొందుపరిచారు. గతంలో జరిగిపోయిన ఘటనలకు ఎవరినీ బాధ్యులను చేయలేం.. అని ఒక అధ్యాయంలో 'ఎన్‌సీఈఆర్టీ' పేర్కొంది. అలాగే, 'చరిత్రలో కొన్ని చీకటి పుటలు' అనే పేరిట రాసిన ఉపోద్ఘాతంలో ఎందుకు సాంఘిక శాస్త్ర పాఠ్యాంశాన్ని సవరించాల్సి వచ్చిందో వివరించింది. శ్రీరంగం, చిదంబరం సహా పలు హిందూ ధార్మిక స్థలాలను అల్లావుద్దీన్ ఖిల్జీ దళపతి మాలిక్ కఫూర్ నాశనం చేశాడని ఎన్‌సీఈఆర్టీ పుస్తకంలో వివరించింది.

రేపు రైతుల ఖాతాల్లోకి పీఎం కిసాన్ నిధులు..!

న్యూఢిల్లీ, జూలై 16: పీఎం కిసాన్ సమ్మాన్ నిధి యోజన 20వ విడత నిధులను ప్రధాని మోదీ శుక్రవారం బిహార్‌లో జరగనున్న భారీ బహిరంగ సభలో విడుదల చేసే అవకాశముందని ఓ జాతీయ వార్తా సంస్థ నివేదిక పేర్కొంది. పీఎం కిసాన్ నిధులను ప్రతి నాలుగు నెలలకోసారి విడుదల చేస్తారు. చివర 19వ విడత నిధులను 2025 ఫిబ్రవరిలో విడుదల చేశారు. గతేడాది జూన్ ఆయనను నెల ముగియకముందే విడుదల చేశారు. అయితే ఈ సారి నిధుల విడుదలలో జాప్యం జరుగుతోంది. పీఎం కిసాన్ ద్వారా దేశవ్యాప్తంగా 9.8 కోట్ల మంది రైతులకు లబ్ధి చేకూరుతోంది.

పాఠశాలల్లో నూనె సూచికలు

» పిల్లల ఆరోగ్యం కోసం సీబీఎస్‌ఈ ఆదేశాలు

హైదరాబాద్, జూలై 16(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో ఆరోగ్యకరమైన జీవనశైలిని ప్రోత్సహించడానికి తమ పరిధిలోని అన్ని పాఠశాలల్లో నూనె సూచికలు(ఆయిల్ బోర్డు) ఏర్పాటు చేయాలని సీబీఎస్‌ఈ నిర్ణయించింది. ఈ మేరకు సీబీఎస్‌ఈ డైరెక్టర్ ప్రజ్ఞా ఎం.సింగ్ బుధవారం ఆదేశాలు జారీచేశారు. ఊబకాయానికి కారణమవుతున్న తీపికి దూరంగా ఉండాలంటూ గత మేలో మధుమేహ(షుగర్) బోర్డులు ఏర్పాటుచేయాలని ఆదేశించిన బోర్డు.. తాజాగా ఆయిల్ బోర్డులు ఏర్పాటుపై మార్గదర్శకాలు విడుదల చేసింది. ఆహార పదార్థాల్లో నూనెల వినియోగం వల్ల కలిగే హాని గురించి విద్యార్థులకు అవగాహన కల్పించేలా.. చిత్రాలతో కూడిన సూచికలను క్యాంటీన్లు, నోటీసు బోర్డులు, ఆట స్థలాల్లో ఏర్పాటు చేయాలని సూచించారు. తాజా ఆదేశాలతో విద్యార్థులకు ఆహార పదార్థాలపై అవగాహన పెరుగుతుందన్నారు.

వర్షాకాల సమావేశాల్లో 12 బిల్లులు

పార్లమెంటులో ప్రవేశపెట్టనున్న మోదీ సర్కారు.. భౌగోళిక వారసత్వ ప్రదేశాల పరిరక్షణ, క్రీడలు సహా 8 కొత్త బిల్లులు

» జస్టిస్ వర్మపైన అభిశంసన తీర్మానం కూడా

» 21 నుంచి ఆగస్టు 21దాకా సమావేశాలు

న్యూఢిల్లీ, జూలై 16: వచ్చేవారం మొదలవుతున్న పార్లమెంటు వర్షాకాల సమావేశాల్లో 12 బిల్లులకు ఆమోద ముద్ర వేయించుకోవాలని మోదీ ప్రభుత్వం భావిస్తోంది. వీటిలో కొన్ని ఇప్పటికే ప్రవేశపెట్టినవి కాగా.. సవరణల ద్వారా క్రీడల్లో నైతిక ఆదరణలు, భౌగోళిక వారసత్వ ప్రదేశాలు, అవశేషాల పరిరక్షణ బిల్లు సహా 8 బిల్లులు కొత్తగా రానున్నాయని లోక్‌సభ సచివాలయం అంతర్గత బులెటిన్‌లో పేర్కొంది. ఆదాయ పన్ను సవరణ బిల్లు, ప్రస్తుత సాంకేతిక శకానికి వర్తించని పురాతన నిబంధనల తొలగింపునకు జన విశ్వాస్ సవరణ బిల్లు(2025), వివిధ క్రీడాసంస్థల్లో జవాబుదారీతనం కోసం జాతీయ క్రీడల పరిపాలన బిల్లు(2025), 1908నాటి భారతీయ రేవుల చట్టం స్థానంలో నూతన బిల్లు (2025), మర్చెంట్ షిప్పింగ్ బిల్లు (2024), ప్రపంచ యాంటీ డోపింగ్ సంస్థ నియమాలకు అనుగుణంగా జాతీయ డోపింగ్ వ్యతిరేక సవరణ బిల్లు(2025), గనులు, ఖనిజాల అభివృద్ధి, క్రమబద్ధీకరణ బిల్లు (2025), ట్యాక్సేషన్ చట్టాల సవరణ బిల్లు(2025), గోవా అసెంబ్లీలో ఎస్టీలకు ప్రాతినిధ్యం కల్పించే బిల్లు, సముద్రమార్గాన వస్తు రవాణా బిల్లు (2024), గువాహటి ఐఐఎంను చట్టంలో చేర్చేందుకు ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ సవరణ బిల్లులను ఉభయసభల్లో చర్చించి ఆమోదం తీసుకోవాలని ప్రభుత్వం సంకల్పించింది. అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న అలహాబాద్ హైకోర్టు సిట్టింగ్ న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్‌వర్మను అభిశంసించే తీర్మానం కూడా పార్లమెంటు ముందుకు రానుంది. ఈ నెల 21న ఉభయ సభలు ప్రారంభం కానున్నాయి. ఆగస్టు 21న సమావేశాలు ముగుస్తాయి.

పహల్గాంపై సర్కారుతో కాంగ్రెస్ ఢీ

పహల్గాంలో ఉగ్రవాద దాడి, ఆపరేషన్ సిందూర్, సోమవారం నుంచి ప్రారంభం కానున్న ఓటర్ల జాబితా సవరణ వ్యవహారాలపై పార్లమెంటులో మోదీ ప్రభుత్వాన్ని ఇరుకునపెట్టేయాలని కాంగ్రెస్ భావిస్తోంది. ఈ పార్టీ పార్లమెంటరీ వ్యూహ కమిటీ గత మంగళవారం కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ (సీపీపీ) చైర్‌పర్సన్ సోనియాగాంధీ నివాసంలో జరిగిన సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. ఉభయసభల్లో ప్రతిపక్ష నేతలు రాహుల్‌గాంధీ, ఖర్గే, రాజ్యసభలో ఉపనేత ప్రమోద్ తివారీ, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ ఈ భేటీలో పాల్గొన్నారు. పహల్గాంలో పర్యాటకులపై కాల్పులు జరిపిన ఉగ్రవాదులను ఎందుకు పట్టుకోలేదో జవాబు చెప్పాలని.. ఆపరేషన్ సిందూర్ వివరాలు సమగ్రంగా తెలియజేయాలని తాము డిమాండ్ చేయనున్నట్లు తివారీ ఈ తర్వాత విలేకరులకు వెల్లడించారు.

పీఎం ధన ధాన్య కృషి యోజనకు ఆమోదం

» కేంద్ర క్యాబినెట్ కీలక నిర్ణయం



వ్యవసాయ, అనుబంధ రంగాల అభివృద్ధికి కేంద్ర క్యాబినెట్ బుధవారం కీలక నిర్ణయం తీసుకుంది. ప్రధాని మోదీ అధ్యక్షతన జరిగిన మంత్రివర్గ సమావేశం 'పీఎం ధన ధాన్య కృషి యోజన'కు ఆమోదం తెలిపింది. కేంద్ర బడ్జెట్‌లో ప్రకటించిన ఈ పథకానికి ఏడాది రూ.24 వేల కోట్లు కేటాయించింది. దేశవ్యాప్తంగా 100 జిల్లాల్లో ఆరేళ్ల పాటు అమలు చేయనున్నారు. ఉత్పాదకత పెంచడం, సుస్థిర వ్యవసాయ విధానాలు, ఎక్కువ మంది పంటల మార్పిడి విధానాన్ని అనుసరించేలా చూడడం ఈ పథకం లక్ష్యం. పీఎం ధన ధాన్య కృషి యోజన ద్వారా కోటి 70 లక్షల మంది రైతులకు ప్రయోజనం కలుగుతుందని కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్ చెప్పారు. అక్టోబరు నుంచి ఇది అమల్లోకి వస్తుందన్నారు. పంటల ఉత్పాదకత, రుణ లభ్యత అత్యంత తక్కువగా ఉన్న 100 జిల్లాలను ఈ పథకం అమలుకు ఎంపిక చేస్తారు. ఇందులో రాష్ట్రానికి ఒక జిల్లా తప్పనిసరిగా ఉంటుంది. కాగా, పునరుత్పాదక ఇంధన రంగంలో ఎన్టీపీసీ పెట్టుబడి పరిమితిని రూ.20 వేల కోట్లకు పెంచేందుకు కూడా క్యాబినెట్ ఆమోదం తెలిపింది. దీంతో 2032 నాటికి ఎన్టీపీసీ 60 గిగావాట్ల పునరుత్పాదక ఇంధన సామర్థ్యాన్ని సాధిస్తుందని అంచనా.

వీసా హక్కు కాదు.. ప్రత్యేక అధికారం మాత్రమే

» నిబంధనలు ఉల్లంఘిస్తే బహిష్కరణ తప్పదు

» యూఎస్ స్టేట్ డిపార్ట్‌మెంట్ హెచ్చరిక

న్యూఢిల్లీ, జూలై 16: తమ దేశ వీసా కలిగిన్నవారికి అమెరికా స్టేట్ డిపార్ట్‌మెంట్ గట్టి వార్నింగ్ ఇచ్చింది. వీసా హక్కు కాదని, అదొక ప్రత్యేక అధికారం మాత్రమేనని ఓ ప్రకటనలో స్పష్టం చేసింది. తమ దేశ చట్టాలను ఉల్లంఘించిన వారి వీసాను రద్దుచేస్తామని హెచ్చరించింది. అలాగే అమెరికాలో ఉన్న సమయంలో దొంగతనం, గృహహింస, ఇతర తీవ్రమైన నేరాల్లో ఎవరైనా అరెస్టు అయితే వెంటనే వారి వీసాను రద్దు చేస్తామని, భవిష్యత్‌లో కూడా వారికి వీసా అర్హత ఉండదని ఆ ప్రకటనలో తేల్చి చెప్పింది. గత శనివారం భారత్‌లోని అమెరికా ఎంబసీ కూడా ఇలాంటి హెచ్చరిక ఒకటి జారీ చేసింది. ఇదిలా ఉండగా, సామాజిక మాధ్యమాల ఖాతాలు పబ్లిక్‌లో ఉంచకపోతే వీసా దరఖాస్తులను అమెరికా అధికారులు తిరస్కరిస్తున్నారు. రెడిట్ ఖాతా వివరాలు ఇవ్వడంలో విఫలమైన ఓ భారతీయ విద్యార్థి దరఖాస్తును అమెరికా అధికారులు తిరస్కరించిన ఘటన ఇటీవల జరిగింది. ఆ వివరాలను ఆ విద్యార్థి సోషల్ మీడియా వేదికగా తన ఆవేదన వ్యక్తం చేశాడు. "ఇటీవలే ఎఫ్-1 వీసా ఇంటర్వ్యూకు వెళ్లాను. నా రెడిట్ ఖాతా వివరాలను డీఎస్-160 ఫామ్‌లో పేర్కొనలేదు. ఆ ఖాతా గురించి వీసా ఆఫీసర్ అడిగారు. ఆ ఖాతా పబ్లిక్‌లోనే ఉంది. దానిలో ఎలాంటి హింసాత్మక కంటెంట్ కూడా లేదు. అయినా దరఖాస్తుకు క్లియరెన్స్ ఇవ్వలేదు. 221(జి) స్లిప్పు ఇచ్చారు" అని వివరించాడు. అయితే తాత్కాలికంగా తిరస్కరించిన దరఖాస్తులకు 221 (జి) స్లిప్పులు ఇస్తారు. అంటే పూర్తిగా తిరస్కరించినట్లు కాదు. వీసా దరఖాస్తులకు అదనపు వివరాలు అవసరమని, వాటిని తొందరగా సమర్పించాల్సి ఉంటుందని, దీనివల్ల వీసా జారీ జాప్యం అవుతుందని నిపుణులు చెప్పారు.

మొత్తం 17 మంది జడ్జిలపై వేటు

వలసదారులను సామూహికంగా బహిష్కరిస్తున్న ట్రంప్ ప్రభుత్వం కారణాలేవీ లేకుండా ఇటీవల కాలంలో 17 మంది ఇమ్మిగ్రేషన్ కోర్టు జడ్జిలను తొలగించిందని ఓ యూనియన్ వెల్లడించింది. దేశవ్యాప్తంగా పది రాష్ట్రాల్లో శుక్రవారం 15 మంది జడ్జిలను, సోమవారం ఇద్దరిని విధుల నుంచి తొలగించారని జడ్జిలు, ఇతర నిపుణుల ప్రాతినిధ్యం వహించే అంతర్జాతీయ ప్రొఫెషనల్ అండ్ టెక్నికల్ ఇంజనీర్స్ సమాఖ్య ఓ ప్రకటనలో తెలిపింది.

సిరియాపై ఇజ్రాయెల్ వైమానిక దాడులు

» ముగ్గురు మృతి, 34 మందికి గాయాలు

టెల్ అవీవ్, డమాస్కస్, జూలై 16: పశ్చిమాసియా మరోసారి భగ్గుమంది. సిరియా రాజధాని డమాస్కస్‌లోని రక్షణ మంత్రిత్వ శాఖ కార్యాలయం, సైనిక ప్రధాన కార్యాలయంపై ఇజ్రాయెల్ వైమానిక దాడులు జరిపింది. ఈ దాడుల్లో ముగ్గురు మృతిచెందగా 34 మంది గాయపడ్డారు. సిరియా అధ్యక్ష భవనానికి అత్యంత సమీపంలోనే ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్స్ బలగాలు ఈ దాడులు జరపడంతో ఒక్కసారిగా కలకలం రేగింది. సిరియా సువేదా ప్రాంతంలోని మైనారిటీ షియా తెగకు చెందిన డ్రూజ్ జాతీయులకు మద్దతుగా ఈ దాడులు జరిపినట్లు ఐడీఎఫ్ ప్రకటించింది. వచ్చే వారానికి 4 రోజుల క్రితం డ్రూజ్ జాతీయులకు, సున్నీ బెడ్విన్ తెగ మధ్య సాయుధ ఘర్షణ ప్రారంభమైంది. ఈ ఘర్షణలో వంద మందికి పైగా ప్రాణాలు కోల్పోయారు. ఈ తరుణంలో డ్రూజ్ జాతీయులను కాపాడేందుకు ఈ దాడులు జరిపినట్టు ఇజ్రాయెల్ చెబుతోంది. ప్రపంచ వ్యాప్తంగా 10 లక్షల మంది డ్రూజ్ జాతీయులు ఉండగా సిరియాలో సగం మంది ఉన్నారు.

భారత్‌పై వంద శాతం సుంకాలు విధిస్తాం

» రష్యా చమురు కొనుగోలుపై నాటో హెచ్చరిక



వాషింగ్టన్, జూలై 16: రష్యా నుంచి చమురు, గ్యాస్ కొనుగోలు చేసే వంద శాతం టారిఫ్‌లు విధిస్తామని నాటో.. భారత్, చైనా, బ్రెజిల్ దేశాలను గట్టిగా హెచ్చరించింది. వాషింగ్టన్‌లో అమెరికా సెనేటర్లతో సమావేశం తర్వాత నాటో సెక్రెటరీ జనరల్ మార్క్ రుట్టె మాట్లాడారు. చైనా అధ్యక్షుడు, భారత ప్రధాని, బ్రెజిల్ అధ్యక్షుడు ఎవరైనా సరే రష్యా నుంచి చమురు, గ్యాస్ కొనుగోలు చేస్తే తీవ్రంగా పరిగణిస్తామన్నారు. వంద శాతం సుంకాలు విధిస్తామని హెచ్చరించారు. మాస్కోలోని వ్యక్తి (రష్యా అధ్యక్షుడు పుతిన్) శాంతి చర్చలకు రాకపోతే పరిస్థితి తీవ్రంగా ఉంటుందన్నారు. తాము తీసుకునే చర్యలతో ఏర్పడే పరిణామాలు భారత్, చైనా, బ్రెజిల్‌ను తీవ్రంగా దెబ్బతీస్తాయన్నారు. వెంటనే పుతిన్‌కు ఫోన్ చేసి శాంతి చర్చలను గట్టిగా పరిశీలించాలని ఒత్తిడి తీసుకురావాలని, లేకుంటే ఈ మూడు దేశాలకు భారీ ఎదురుదెబ్బలు తగులుతాయని రుట్టె హెచ్చరించారు. ఉక్రెయిన్-రష్యా యుద్ధం ముగియాలంటే రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తున్న దేశాలపై సుంకాలు విధించడమే అంతిమ మార్గమంటున్న అమెరికా నాటో వత్తాసు పలుకుతోంది. సుంకాలపై ట్రంప్ హెచ్చరించిన గంటల్లోనే మార్క్ రుట్టె వార్నింగ్ రావడం ప్రాధాన్యత సంతరించుకుంది. 50 రోజుల్లోగా ఉక్రెయిన్-రష్యా మధ్య శాంతి ఒప్పందం కుదరకపోతే రష్యాపై వంద శాతం సుంకాలు విధిస్తామని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఇప్పటికే హెచ్చరించారు. అలాగే రష్యాతో వ్యాపారం కొనసాగించే దేశాలపై 500% సుంకాలు విధిస్తామని కూడా అమెరికా హెచ్చరించింది. రష్యా నుంచి భారీగా చమురు కొనుగోలు చేస్తున్న దేశాల్లో భారత్, చైనా, బ్రెజిల్ ఉన్నాయి. మరోవైపు అమెరికా హెచ్చరికలను రష్యా కొట్టిపారేసింది. ఇప్పటికే తాము అనేక ఆంక్షలు ఎదుర్కొని నిలిచామని, మున్ముందూ ఎదుర్కోవటానికి సిద్ధంగా ఉన్నామని తెలిపింది.

నేడు, రేపు భారీ వర్షాలు

పలు జిల్లాలకు ఎల్లో అలెర్ట్

హైదరాబాద్, మహబూబ్‌నగర్, నాగార్జునసాగర్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలోని పలు జిల్లాల్లో గురు, శుక్రవారాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రకటించింది. ఆయా జిల్లాలకు ఎల్లో అలెర్ట్ జారీ చేసినట్లు పేర్కొంది. మిగిలిన జిల్లాల్లో అక్కడక్కడ ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో కూడిన తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. మంచిర్యాల, జగిత్యాల, సిరిసిల్ల, జనగాం, నల్గొండ, సూర్యాపేట, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, సిద్దిపేట జిల్లాలకు ఎల్లో అలెర్ట్ జారీ చేసింది.

ప్రాజెక్టులకు కొనసాగుతున్న వరద

శ్రీశైలం, నాగార్జునసాగర్ ప్రాజెక్టులకు వరద నిలకడగా కొనసాగుతోంది. శ్రీశైలం ప్రాజెక్టు వద్ద 48,143 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదవుతుండగా విద్యుదుత్పత్తి, పోతిరెడ్డిపాడు, ఎంజీకేఎల్‌ఐ ద్వారా 89,938 క్యూసెక్కుల నీటిని అధికారులు దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తి సామర్థ్యం 215.81 టీఎంసీలు కాగా ప్రస్తుతం 197.46 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఆల్మట్టి, నారాయణపూర్ నుంచి దిగువకు నీటి విడుదలను అధికారులు పెంచారు. జూరాల వద్ద 20 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదవుతుండగా 41 వేల క్యూసెక్కులను దిగువకు విడుదల చేస్తున్నారు. ఎగువ పరివాహకంలో వరద పెరుగుతుండటంతో దిగువ ప్రాజెక్టులను ఇన్‌ఫ్లోలు పెరిగే అవకాశం ఉంది. నాగార్జునసాగర్ ప్రాజెక్టు వద్ద ఇన్‌ఫ్లో 65,900 క్యూసెక్కులు కాగా నీటిమట్టం 558.70 అడుగులకు చేరింది.ప్రాజెక్టు పూర్తి సామర్థ్యం 312.0450 టీఎంసీలు కాగా బుధవారం నాటికి 229.3671 టీఎంసీల నీరు నిల్వ ఉంది. నాగార్జునసాగర్ ఎడమకాల్వకు ఈ నెల 18న నీరు విడుదల చేస్తామని మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి తెలిపారు. మూసీ ప్రాజెక్టు కుడి, ఎడమ కాల్వల ఆయకట్టులోని 30 వేల ఎకరాలకు ఈ నెల 18 నుంచి నీటిని విడుదల చేయనున్నట్లు ప్రాజెక్టు డీఈ చంద్రశేఖర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.



వరద నీటితో కళకళలాడుతున్న మూసీ ప్రాజెక్టు

హైదరాబాద్‌లో భూతల ఓజోన్ కాలుష్యం

» ఈ వేసవిలో నాలుగు నగరాల్లో భారీగా నమోదు

న్యూఢిల్లీ, జూలై 16: తెలంగాణ రాజధాని హైదరాబాద్ సహా దేశంలోని నాలుగు ప్రధాన నగరాల్లో భూతల కాలుష్యం భారీగా పెరిగిపోతోంది. హైదరాబాద్, కోల్‌కతా, బెంగళూరు, ముంబై నగరాల్లో ఈ ఏడాది వేసవిలో భారీగా ఓజోన్ కాలుష్యం నమోదైనట్లు సెంటర్ ఫర్ సైన్స్ అండ్ ఎన్విరాన్‌మెంట్ (సీఎస్ఈ) అనే సంస్థ పేర్కొంది. మార్చి 1 నుంచి మే 31వ తేదీ వరకు 92 రోజులపాటు చేపట్టిన అధ్యయనంలో.. హైదరాబాద్‌లో 22 రోజులు ఓజోన్ కాలుష్యం సురక్షిత స్థాయిని దాటి నమోదైనట్లు తెలిపింది. 2024 వేసవితో పోలిస్తే.. 55 శాతం నాణ్యత పడిపోయినట్లు, అత్యధికంగా 51 మైక్రోగ్రామ్స్ పర్ క్యూబిక్ మీటర్‌గా నమోదైనట్లు వెల్లడించింది. ఇక ముంబైలో 32 రోజులు సురక్షిత స్థాయిని దాటగా, గత ఏడాదితో పోలిస్తే 42 శాతం నాణ్యత పడిపోయింది. అత్యధికంగా 90 మైక్రోగ్రామ్స్ పర్ క్యూబిక్ మీటర్‌గా నమోదైంది. కోల్‌కతాలో 22 రోజులు సురక్షిత స్థాయిని దాటింది. గత ఏడాది కన్నా 45 శాతం తక్కువ నాణ్యత నమోదైంది. బెంగళూరులో ఏకంగా 45 రోజులపాటు సురక్షిత స్థాయిని మించిపోయింది. అయితే గత ఏడాదితో పోలిస్తే 29 శాతం నాణ్యత పెరిగింది. నైట్రోజన్ ఆక్సైడ్స్, వోలటైల్ ఆర్గానిక్ కాంపౌండ్స్, కార్బన్ మోనాక్సైడ్‌తో కూడి ఉండే ఓజోన్.. సాధారణంగా వాహనాలు, విద్యుత్తు ప్రాజెక్టులు, పరిశ్రమలు విడుదల చేసే కాలుష్యకారక వాయువులతో ఏర్పడుతుంది. దీనిని నియంత్రించకపోతే ప్రజల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపే ప్రమాదం ఉందని సీఎస్ఈ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అనుమితరాయ్ చౌదరి అన్నారు.

బ్యారేజీల పునరుద్ధరణకు డిజైన్లు ఇవ్వాల్సింది మీరే

» ఆ బాధ్యత నుంచి తప్పించుకోలేరు

» నీటిపారుదల శాఖలో సీడీవో అంతర్భాగం

» మీదేమీ కన్సల్టెంట్ సంస్థ కాదు

» సీడీవో చీఫ్ ఇంజనీర్‌కు ప్రభుత్వం స్పష్టీకరణ

హైదరాబాద్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల పునరుద్ధరణకు అవసరమైన డిజైన్ల తయారీ నైపుణ్యం, సామర్థ్యాలు తమకు లేవని సెంట్రల్ డిజైన్స్ ఆర్గనైజేషన్ (సీడీవో) చీఫ్ ఇంజనీర్(సీఈ) చెప్పడాన్ని నీటిపారుదల శాఖ తీవ్రంగా పరిగణించింది. బ్యారేజీల నిర్మాణానికి డిజైన్లు/డ్రాయింగ్‌లు తయారు చేసింది సీఈ(సీడీవో)నే అని, ఆ బ్యారేజీలు వైఫల్యం చెందినప్పుడు పునరుద్ధరణకు అవసరమైన డిజైన్లు/డ్రాయింగ్‌లు అందించాల్సిన బాధ్యతా వాళ్లదేనని తేల్చిచెప్పింది. డిజైన్లపై కేంద్ర జలవనరుల సంఘం(సీడబ్ల్యూసీ) సీడీవోకు అక్రిడేషన్ ఇచ్చిందని గుర్తు చేసింది. జాతీయ ఆనకట్టల భద్రత సంస్థ(ఎన్‌డీఎస్ఏ) సిఫారసుల మేరకు మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల పునరుద్ధరణకు డిజైన్లను తయారు చేసే బాధ్యత సీఈ(సీడీవో)దే అని పేర్కొంది. శాఖలో డిజైన్ల తయారీకి నోడల్ ఏజెన్సీ కావడంతో ఈ బాధ్యతల నుంచి సీడీవో తప్పించుకోలేదని స్పష్టం చేసింది. అవసరమైతే నిపుణులు, సాంకేతిక సంస్థలను సంప్రదించి, బ్యారేజీల పునరుద్ధరణ కోసం డిజైన్లు సరిగ్గానే ఉన్నట్లు ధ్రువీకరించుకోవచ్చని సూచించింది. ఇతర సంస్థలపై బాధ్యతను తోసేయడానికి సీడీవో విభాగం కన్సల్టెంట్ కాదని, నీటిపారుదల శాఖలో అంతర్భాగమని గుర్తు చేసింది. ఈ మేరకు నీటిపారుదల శాఖ ఈఎన్‌సీ(జనరల్) సీఈ(సీడీవో)కి లేఖ రాశారు. మేడిగడ్డ పునరుద్ధరణకు అవసరమైన డిజైన్ల కోసం నిర్దిష్ట గడువులు విధించుకుని పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. డిజైన్ల తయారీకి సాంకేతిక సహాయం కోసం జాప్యం చేయకుండా తక్షణమే ఆసక్తి వ్యక్తీకరణ(ఈవోఐ)ను ఆహ్వానించాలని స్పష్టం చేశారు. మేడిగడ్డ బ్యారేజీ 2023 అక్టోబర్ 21న కుంగిపోగా, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల్లో భారీగా సీపేజీలు బయటపడ్డాయి. బ్యారేజీల పునరుద్ధరణ కోసం తగిన చర్యలు తీసుకోవాలంటూ రాష్ట్ర ప్రభుత్వం అప్పుడే సీడీవోకు లేఖ రాసింది. తర్వాత ఎన్‌డీఎస్ఏ నివేదికను కూడా పంపించింది. ఈ అంశానికి సంబంధించి ఇప్పటివరకు మొత్తం 9 లేఖలు రాసింది.

ఆపరేషన్ కగార్‌తో భారీ నష్టమే

అంగీకరించిన మావోయిస్టులు.. ఫ్లెక్సిబుల్ యుద్ధానికి పిలుపు.. గత ఏడాది 357 మంది మృతి

» ఈ నెలాఖరు నుంచి అమర వీరుల వారోత్సవాలు

» మావోయిస్టుల నివేదికలో వెల్లడి

» పోలీసు లెక్కల్లో 217 మరణాలే?

హైదరాబాద్, జూలై 16: వచ్చే ఏడాది మార్చికల్లా మావోయిజాన్ని నిర్మూలించాలని కేంద్ర ప్రభుత్వం సంకల్పించింది. ఈ క్రమంలో ప్రారంభించిన 'ఆపరేషన్ కగార్'తో తమకు భారీ నష్టమే జరిగినట్లు మావోయిస్టు పార్టీ అంగీకరించింది. ఈ మేరకు సీపీఐ(మావోయిస్టు) పార్టీ కేంద్ర కమిటీ జూన్ 23న 22 పేజీల ఓ నివేదికను విడుదల చేసింది. ఈ నివేదిక ప్రకారం.. గత ఏడాది మొత్తం 357 మంది మావోయిస్టులు పోరాటంలో చనిపోయారు. మావోయిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావు అలియాస్ బస్వరాజ్ మే 20న ఛత్తీస్‌గఢ్ అడవుల్లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మృతిచెందిన నేపథ్యంలో.. ఇకపై అనుసరించాల్సిన కొత్త వ్యూహాలను ఈ నివేదికలో మావోయిస్టు నేతలు వివరించారు. 1967లో పశ్చిమబెంగాల్‌లోని నక్సల్బరీలో మొదలైన నక్సలిజం ఉద్య మం.. ఛత్తీస్‌గఢ్, ఝార్ఖండ్, బిహార్, ఒడిసా, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్రలకు విస్తరించిన విషయం తెలిసిం దే..! ఇది దేశానికి అతిపెద్ద అంతర్గత భద్రత సమస్యగా కేంద్రం భావించింది. ఈ క్రమంలో చేపట్టిన ఆపరేషన్లతో గత ఏడాది 357 మంది నక్సలైట్లు మరణించినట్లు, వీరిలో 136 మంది మహిళలున్నట్లు మావోయిస్టు పార్టీ తాజా నివేదిక స్పష్టం చేసింది. నలుగురు మావోయిస్టులు ఆరోగ్య సమస్యలతో, ఒకరు ప్రమాదంలో చనిపోయారని పేర్కొంది. "357 మందిలో.. 80 మందిని నకిలీ ఎన్‌కౌంటర్‌లో హతమార్చారు. మరో 269 మంది పోలీసు బలగాల ముట్టడిలో చనిపోయారు. వీరిలో బస్వరాజ్‌తో కలిపి.. నలుగురు కేంద్ర కమిటీ సభ్యులు, 16 మంది రాష్ట్ర స్థాయి నాయకులు, 17 పీఎల్‌జీఏ సభ్యులు, ఆరుగురు ప్రజా విభాగానికి చెందినవారు, 34 మంది



సాధారణ ప్రజలు ఉన్నారు. మరో 36 మందికి సంబంధించిన సమాచారం తెలియదు" అని ఆ నివేదిక స్పష్టం చేస్తోంది. అయితే.. పోలీసుల రికార్డులు మాత్రం గత ఏడాది 217 మంది మావోయిస్టులు చనిపోయినట్లు చెబుతున్నాయి. ఈ ఏడాది ప్రథమార్థానికి ఆ సంఖ్య 460కి చేరినట్లు వివరిస్తున్నాయి.

వైఫల్యాలకు కారణాలు..

ప్రభుత్వాలు నక్సల్స్ ఆపరేషన్లకు 20వేల మంది జవాన్లను మోహరించగా.. తమ గెరిల్లా యుద్ధ నియమాలు, రహస్య విధానాలు సరిగ్గా అమలవ్వకపోవడంతో దెబ్బతిన్నట్లు నివేదిక పేర్కొంది. "ఒకచోట ఉండొద్దు.. గాలిలా విస్తరించాలి. నీటిలా ప్రవహించాలి.. శత్రువు శక్తిమంతంగా ఉన్నప్పుడు .. బలగాన్ని కాపాడుకుంటూ పోవాలి" అనే వ్యూహాన్ని విస్మరించడం వల్ల నష్టం జరిగినట్లు విశ్లేషించింది.

ఫ్లెక్సిబుల్ యుద్ధమే మార్గం?

తమ పోరు కొనసాగుతుందని మావోయిస్టు పార్టీ తన తాజా నివేదికలో స్పష్టం చేయగా.. ఇకపై ఫ్లెక్సిబుల్ యుద్ధ పద్ధతులను అవలంబించాలని నిర్ణయించినట్లు తెలిపింది. అంటే.. బలగాలతో నేరుగా తలపడకుండా.. వీలు చిక్కినప్పుడు గెరిల్లా పోరాటాలు, లేదంటే.. మందుపాతరలతో నష్టం కలిగించడం వంటి చర్యలు ఉత్తమమని భావిస్తున్నట్లు తెలుస్తోంది. 'పీఎల్‌జీఏని బలోపేతం చేసి, పార్టీని రక్షించుకోవాలి. గత ఏడాది పీఎల్‌జీఏకి చెందిన 75 మంది చనిపోగా.. 130 మంది గాయపడ్డారు' అని ఆ నివేదిక వివరిస్తోంది. అమరులను స్మరించుకుంటూ.. ఈ నెల 28 నుంచి ఆగస్టు 3 వరకు 'అమరవీరుల వారోత్సవాల'ను నిర్వహించాలని మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ పిలుపునిచ్చింది.

పీఎల్‌జీఏ దాడుల్లో 75 మంది పోలీసుల మృతి

పీఎల్‌జీఏ దాడుల్లో 75 మంది పోలీసులు మృతి చెందారని నివేదిక స్పష్టం చేసింది. మరో 130 మంది పోలీసులు గాయపడ్డారని పేర్కొంది.

పోలీసులేమంటున్నారు?

ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టులకు భారీ నష్టం జరిగినట్లు ఆ రాష్ట్ర అదనపు డీజీ(యాంటీ నక్సలిజం) వివేకానంద సిన్హా తెలిపారు. మావోయిస్టుల కదలికలపై పటిష్ఠ నిఘాతో వారిని కట్టడి చేయగలిగామన్నారు. 'ప్రస్తుతం మావోయిస్టులు ప్రజలతో కలిసిపోయారు. అయితే.. ప్రజలను అనుమానంతో చూస్తుండడం వల్ల.. అమాయకుల హత్యలు పెరిగాయి. బస్తర్‌లో మావోయిస్టులు తమ యూనిట్లను చిన్నచిన్నగా విభజించారు. కొందరు దట్టమైన అడవుల్లోకి వెళ్లగా.. మరికొందరు ఆలీవ్ గ్రీన్ దుస్తులను వీడి, సాధారణ పౌరుల్లో కలిసిపోయారు' అని ఆయన వివరించారు. ప్రస్తుత పరిస్థితుల్లో తిరుగుబాటు సరికాదని మావోయిస్టు పొలిట్ బ్యూరో భావిస్తోందన్నారు. పౌరహక్కుల సంఘాల ద్వారా ప్రభుత్వాలపై చర్చలకు ఒత్తిడి తేవాలని మావోయిస్టులు నిర్ణయించినట్లు తెలుస్తోంది.

కురవని వానలు.. సగం భూముల్లోనే పంటలు

» 132లక్షల ఎకరాలకు గాను 61లక్షల ఎకరాల్లోనే సాగు

» రాష్ట్రంలో 28% లోటు వర్షపాతం.. వ్యవసాయ శాఖ నివేదిక

హైదరాబాద్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): సరైన వర్షాలు కురవక ఈ వానాకాలంలో పంటల సాగు ఇంకా పుంజుకోలేదు. సాధారణంతో పోలిస్తే వానాకాలంలో ఇప్పటివరకు 46% భూముల్లో మాత్రమే రైతులు పంటలు వేశారు. రాష్ట్రంలో 132లక్షల ఎకరాల సాగు విస్తీర్ణానికి గాను ప్రస్తుతం కేవలం 61లక్షల ఎకరాల్లోనే వివిధ రకాల పంటలు సాగవుతున్నాయి. ఈ మేరకు వ్యవసాయశాఖ బుధవారం నివేదిక విడుదల చేసింది. రాష్ట్రంలో ప్రధాన పంట అయిన వరి సాధారణ సాగు విస్తీర్ణం 62.78లక్షల ఎకరాలు కాగా.. 7.78 లక్షల ఎకరాల్లో(12.46%)మాత్రమే రైతులు వరి నాట్లు వేశారు. పత్తి సాధారణ సాగు విస్తీర్ణం 48.93 లక్షల ఎకరాలు కాగా.. 38.57 లక్షల ఎకరాల్లోనే రైతులు పత్తి పంట వేశారు. కంది సాధారణ విస్తీర్ణం 6.70 లక్షల ఎకరాలు కాగా.. 3.44 లక్షల ఎకరాల్లోనే వేశారు. మొక్కజొన్న సాధారణ విస్తీర్ణం 5.21 లక్షల ఎకరాలు కాగా 4.50 లక్షల ఎకరాల్లో రైతులు సాగుచేశారు. సోయాబీన్ సాధారణ విస్తీర్ణం 4.20 లక్షల ఎకరాలు కాగా.. 3.31 లక్షల ఎకరాల్లో పంట వేశారు. పప్పు ధాన్యాలు, నూనె గింజల సాగు ఇంకా పుంజుకోలేదు. జిల్లాల వారంగా చూస్తే ఆదిలాబాద్ జిల్లాలో 97% విస్తీర్ణంలో పంటలు సాగయ్యాయి. కాగా, వానాకాలం మొదలైనప్పటి నుంచి ఇప్పటివరకు రాష్ట్రంలో సాధారణంతో పోలిస్తే 28% లోటు వర్షపాతం నమోదైంది. జూన్ నెల సాధారణ వర్షపాతం 130.3 మి.మీ కాగా.. 104.2 మి.మీ నమోదైంది. జూలైలో ఇప్పటివరకు కేవలం 71.8 మి.మీ వర్షపాతం మాత్రమే నమోదైంది. రెండు నెలల్లో కలిపి 243.2 మి.మీ వర్షం కురవాల్సి ఉండగా కేవలం 176 మి.మీ వర్షపాతంమాత్రమే నమోదైంది.

చనిపోయిన వ్యక్తుల ఆధార్ తొలగింపు!

» 1.17 కోట్ల మందివి డీయాక్టివేట్ చేసిన యూఐడీఏఐ

న్యూఢిల్లీ, జూలై 16: చనిపోయిన వ్యక్తుల ఆధార్‌ను దుర్వినియోగం చేయకుండా వాటిని తొలగించేందుకు భారత విశిష్ట గుర్తింపు ప్రాధికార సంస్థ (యూఐడీఏఐ) ముందస్తు చర్యలు చేపట్టింది. ఇప్పటివరకు 1.17 కోట్లకు పైగా మంది ఆధార్‌లను డీయాక్టివేట్ చేసినట్లు వెల్లడించింది. ఈ నేపథ్యంలోనే 'మై ఆధార్' పోర్టల్‌లో కొత్త ఆప్షన్‌ను కూడా అందుబాటులోకి తీసుకొచ్చింది. దీని ద్వారా తమ కుటుంబీకులు చనిపోయిన విషయాన్ని మరణ ధ్రువీకరణ ప్రతంతో నివేదించవచ్చని.. 24 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో ఇది అందుబాటులో ఉంటుందని వివరించింది. మిగిలిన రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలతో పోర్టల్‌ను అనుసంధానించే ప్రక్రియ కొనసాగుతున్నట్లు తెలిపింది. 'చనిపోయిన వ్యక్తుల ఆధార్‌లను గుర్తించేందుకు రాష్ట్ర ప్రభుత్వాల సాయాన్ని కూడా తీసుకుంటున్నాం. పైలట్ ప్రాజెక్టు కింద 100 ఏళ్లు దాటిన వారి ఆధార్ వివరాలను తీసుకుని వారిలో ఎవరెవరు బతికున్నారో లేదో గుర్తిస్తున్నాం. మరణించిన వారి ఆధార్‌ను డీయాక్టివేట్ చేస్తున్నాం' యూఐడీఏఐ పేర్కొంది.

ఆకాశ్ ప్రైమ్ క్షిపణి ప్రయోగం విజయవంతం

» భారత గగనతలం మరింత సురక్షితం

న్యూఢిల్లీ, జూలై 16: భారత గగనతల రక్షణ వ్యవస్థను మరింత బలోపేతం చేసే లక్ష్యంతో ఆర్మీ చేపట్టిన ఆకాశ్ ప్రైమ్ క్షిపణి ప్రయోగం విజయవంతమైంది. పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించిన ఈ క్షిపణిని డీఆర్‌డీఓ అధికారుల సమక్షంలో లడఖ్‌లో 15వేల అడుగుల ఎత్తులో పరీక్షించారు. అత్యంత ప్రతికూల వాతావరణంలో, అతి వేగంగా వెళ్తున్న లక్ష్యాలను ఆకాశ్ ప్రైమ్ క్షిపణులు ఖచ్చితత్వంతో ఢీకొట్టాయని వారు వెల్లడించారు. ఆపరేషన్ సిందూర్ సమయంలో భారత గగనతలాన్ని కాపాడటంలో ఈ వ్యవస్థ కీలకపాత్ర పోషించింది.

కదులుతున్న బస్సులో ప్రసవం.. కిటికీలోంచి బిడ్డ విసిరివేత!

» కన్నతల్లి, ఆమె సహచరుడి ఘోరం.. శిశువు దుర్మరణం

» మహారాష్ట్రలో ఘటన.. పోలీసుల అదుపులో ఆ ఇద్దరు

ముంబై, జూలై 16: కదులుతున్న ఓ స్లీపర్ కోచ్ బస్సులో 19 ఏళ్ల యువతి ప్రసవించింది. ఆ యువతి, ఆమెతో పాటు ప్రయాణిస్తూ భర్తగా చెప్పుకొంటున్న యువకుడు కలిసి.. ఆ బిడ్డను కదులుతున్న వాహనంలోంచి బయటకు విసిరివేశారు. మహారాష్ట్రలోని పర్భణిలో మంగళవారం ఉదయం 6:30 గంటలకు ఈ ఘోరం జరిగింది. ఈ ఘటనలో తీవ్ర గాయాలతో ఆ నవజాత శిశువు మృతిచెందాడు. ఆ యువతిని రితికా ధేరేగా, ఆమె వెంట ఉన్న వ్యక్తిని అల్తాఫ్ షేక్‌గా గుర్తించారు. పర్భణికి చెందిన ఈ ఇద్దరు ఏడాదిన్నరగా పుణెలో కలిసి ఉంటున్నారు. ఓ ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులో పర్భణి నుంచి పుణె వెళుతున్నారు. బస్సులోంచి ఏదో వస్తువును బయటకు విసిరివేసినట్లుగా సైడ్ మిర్రర్ నుంచి గమనించిన డ్రైవర్, అల్తాఫ్‌ను ఆరా తీయగా.. బస్సు ప్రయాణం పడకపోవడంతో తన భార్య వాంతి చేసుకుందని చెప్పాడు. అయితే.. కదులుతున్న బస్సు కిటికీలోంచి ఏదో వస్తువు పడటాన్ని రోడ్డు నడుచుకుంటూ వెళుతున్న ఓ వ్యక్తి గమనించాడు. దగ్గరకు వెళ్లి చూడగా ఓ వస్త్రంలో చుట్టివున్న స్థితిలో మగ శిశువు కనిపించింది. తీవ్రగాయాలతో ఆ బిడ్డ అప్పటికే మృతిచెందాడు. అతడు వెంటనే ఫోన్ ద్వారా పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వారొచ్చి విచారణ జరిపారు. రితిక, అల్తాఫ్‌ను అదుపులోకి తీసుకున్నారు. శిశువును పోషించే స్తోమత తమకు లేకపోవడంతోనే బయటకు విసిరివేశామని విచారణలో రితిక, అల్తాఫ్ చెప్పారు. విచారణలో తాము భార్యాభర్తలుగా చెప్పుకొన్నా సంబంధిత ఆధారాలను వారు చూపలేకపోయారని పోలీసులు చెప్పారు. రితికను వైద్య చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.

30ఏళ్ల కిందటి డిగ్రీ నకిలీదని.. సౌదీలో తెలుగు ఇంజనీర్ అరెస్టు

» పన్నెండేళ్ల క్రితమే స్వదేశానికి వచ్చేసిన కరీంనగర్ వాసి

» ఇటీవల హాజ్ యాత్రకు వెళ్లొస్తుండగా అక్కడి విమానాశ్రయంలో అరెస్టు.. సౌదీ కోర్టులో విచారణ

(ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి)

ఆయన ఓ ఇంజనీర్. 30 ఏళ్ల క్రితం ఉద్యోగం కోసం సౌదీ అరేబియాకు వెళ్లారు.. 18 ఏళ్లు ఉద్యోగం చేశారు.. 12 ఏళ్ల కిందే స్వదేశానికి తిరిగి వచ్చేసి కుటుంబంతో గడుపుతున్నారు. ఇటీవలే హాజ్ యాత్రలో భాగంగా సౌదీ అరేబియాలోని మక్కా, మదీనాకు వెళ్లి వస్తుండగా.. అక్కడి అధికారులు విమానాశ్రయంలోనే అరెస్టు చేశారు. 30 ఏళ్ల కింద ఇంజనీర్‌గా ఉద్యోగంలో చేరినప్పుడు నకిలీ డిగ్రీ సర్టిఫికెట్ సమర్పించినట్టుగా కేసు నమోదై ఉందని చెప్పారు. ప్రస్తుతం ఆయన వయసు 66 ఏళ్లు. అనారోగ్యంతో బాధపడుతూ, నడవలేని స్థితిలో వీల్ చెయిర్ వినియోగిస్తున్నారు. విచారణ పూర్తయ్యే వరకు సౌదీ విడిచి వెళ్లడానికి వీల్లేదు. దీనితో వీల్ చెయిర్‌పైనే సౌదీలో విచారణకు హాజరవుతున్నారు. తాను బెంగళూరులోని ఒక ప్రముఖ కాలేజీలో 1990లో ఇంజనీరింగ్ పూర్తి చేశానని, ఎలాంటి ఫోర్జరీ చేయలేదని ఆయన పేర్కొంటున్నారు. అయితే ఇంజనీరింగ్ పట్టా అసలైనదే అయినా ఎంబసీ ధ్రువీకరణ తప్పుడు విధానంలో జరిగితే ఫోర్జరీ కింద పరిగణిస్తారని సౌదీ అధికారులు చెబుతున్నారు. అధికారిక విధానంలో మాత్రమే ధ్రువీకరణ చేయించుకోవాలని స్పష్టం చేస్తున్నారు.

ఎన్నికల కేసుల్లో మంత్రి ఉత్తమ్‌కు ఊరట

హైదరాబాద్, జూలై 16(ఆంధ్రజ్యోతి): ఎన్నికల కోడ్ ఉల్లంఘన కేసుల్లో మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డికి హైకోర్టులో ఊరట లభించింది. మూడు కేసుల్లో ఒక కేసును కొట్టేయగా.. మిగతా రెండు కేసుల్లో ట్రయల్ కోర్టులో ప్రత్యక్ష హాజరు నుంచి హైకోర్టు మినహాయింపు ఇచ్చింది. వాయిదా వేసిన రెండుకేసుల్లో వివరణ ఇవ్వాలంటూ పోలీసులకు నోటీసులు జారీ చేసింది. 2019 హుజూర్‌నగర్ ఉప ఎన్నికల్లో అనుమతి లేకుండా రోడ్ షోలు నిర్వహించడం, సభల్లో ప్రసంగించిన నేపథ్యంలో ఆయనపై నేరేడుచర్ల, మఠంపల్లి తదితర పోలీస్‌స్టేషన్లలో కేసులు నమోదయ్యాయి. రాజకీయ కక్షలో భాగంగా కేసులు నమోదు చేశారని, వాటిని కొట్టేయాలంటూ ఉత్తమ్ హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. వీటిపై జస్టిస్ కే లక్ష్మణ్ ధర్మాసనం విచారణ చేపట్టింది. తదుపరి విచారణ ఈనెల 18కి వాయిదా పడింది.

దళారుల పిన్ కోడ్!

స్టాప్లర్ పిన్ను రంగును బట్టే పనులు.. రవాణా కార్యాలయాల్లో అవినీతి కొత్త పుంతలు

» అధికారులు, దళారుల ఎత్తుగడలు

» ప్రతిరోజూ ఉదయమే పిన్ను రంగుపై నిర్ణయం

» రాష్ట్రంలో అవినీతిలో టాప్-5లో రవాణా శాఖ



హైదరాబాద్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): రవాణా శాఖలో అవినీతి దందాకు ఇప్పుడు స్టాప్లర్ పిన్ను కీలకంగా మారింది. దాన్నే కోడ్‌గా వాడుతూ అక్రమార్కులు యథేచ్ఛగా పనులు చక్కబెట్టేస్తున్నారు. డ్రైవింగ్ లైసెన్సు, ఆర్సీ, ఫిట్‌నెస్, వాహన బదిలీ తదితర సేవల కోసం వాహనదారుడు నేరుగా దరఖాస్తు చేసుకుంటే రోజులు, నెలల తరబడి కార్డు కోసం వేచి చూడాల్సిందే. నిత్యం రవాణా శాఖ కార్యాలయాలకు వందల సంఖ్యలో ప్రజలు వస్తుంటారు. నేరుగా వచ్చేవారు చాలా కొద్ది మంది మాత్రమే ఉంటారు. ఎక్కువశాతం ప్రజలు తప్పనిసరి పరిస్థితుల్లో దళారుల్ని ఆశ్రయిస్తుంటారు. దందా ఇక్కడే ప్రారంభమవుతుంది. డబ్బులు తీసుకునే దళారులు ఆ దరఖాస్తుపై స్టాప్లర్ పిన్నును కొడతారు. ఆ దరఖాస్తు ఎంతవేగంగా ముందుకు కదలాలనేది దానిపై ఉండే ఆ 'పిన్ను' నిర్ణయిస్తుంది. అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ)కు చిక్కకుండా ఉండేందుకు రవాణా శాఖలో కొందరు అధికారులు, దళారులు సరికొత్త ఆలోచనతో ఇలా స్టాప్లర్ పిన్‌ను కోడ్‌గా మార్చుకున్నారు. ఇదివరకు దరఖాస్తుపై పెన్సిల్‌తో కోడ్ రాసేవారు. కానీ, ఇటీవల ఏసీబీ నిఘా పెరగడంతో రూటు మార్చారు. రంగు రంగుల స్టాప్లర్ పిన్నుల్ని ఉపయోగించి పనులు చక్కబెట్టుకుంటున్నారు. పని పూర్తయిన తర్వాత కలర్ పిన్ను తొలగించి సాధారణ పిన్నును కొట్టేస్తున్నారు. దరఖాస్తుపై ఏ కలర్ స్టాప్లర్ పిన్ను వాడాలనేది దళారులు ఆ రోజు ఉదయమే నిర్ణయిస్తారు. ఆ రంగును ఆ రోజు కౌంటర్‌లో ఉండే సిబ్బంది, అధికారులకు చేరవేస్తారు. దరఖాస్తుపై ఉండే కలర్ పిన్ను ఆధారంగానే దరఖాస్తు ముందుకు వెళ్లడమో లేదా తిరస్కరించడమో జరుగుతుంది. డ్రైవింగ్ లైసెన్సు, రెన్యువల్, ఆర్సీ, వాహనం బదిలీ, ఫిట్‌నెస్ సర్టిఫికెట్.. పని ఏదైనా అడిగినంత ఇవ్వాల్సిందే. లేదు, కాదు అని నేరుగా దరఖాస్తు చేసుకుని అధికారుల వద్దకు వెళ్తే కొర్రీలు పెడుతూ దరఖాస్తుదారుడ్ని ఇబ్బందులకు గురిచేస్తుంటారు. ఇలా కౌంటర్ల చుట్టూ చక్కర్లు కొట్టడం ఎందుకని వినియోగదారులు దళారుల్ని ఆశ్రయిస్తున్నారు. ఒక్కో పనికి ఒక్కో ధర నిర్ణయిస్తున్న దళారులు తమ వాటా తము తీసుకుని మిగతా మొత్తాన్ని అధికారులు, సిబ్బందికి పంచుతుంటారు. కాగా, ప్రజల నుంచి లంచాలు తీసుకుంటున్న ప్రభుత్వ విభాగాల్లో రవాణా శాఖ టాప్-5లో ఉన్నట్లు ఏసీబీ తాజా నివేదికలో వెల్లడైంది. 'దరఖాస్తు ఫారాలకు రంగుల స్టాప్లర్ పిన్నులు ఉపయోగిస్తున్న అంశం మా దృష్టికి రాలేదు. ఎక్కడైనా ఎవరైనా ఈ తరహా చర్యలకు పాల్పడుతున్నట్లు తేలితే వారిపై చర్యలు తీసుకుంటాం' అని రవాణా శాఖ ఉన్నతాధికారి ఒకరు తెలిపారు.

డబ్బులు చేతులు మారేదిలా!

రవాణా శాఖ కార్యాలయాల్లో ఉదయం నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకే పని జరుగుతుంది. ఆ తర్వాత టీం లీడర్‌గా వ్యవహరించే ఒక దళారి... మిగతా దళారుల నుంచి డబ్బులు వసూలు చేస్తాడు. అధికారుల వాటా లంటూ కవర్‌లో భద్రపరుస్తాడు. కార్యాలయంలో కాకుండా అధికారులు ఇంటికి తిరిగి వెళ్లే సమయంలో రోడ్డు మార్గంలో ఎక్కడో ఒక పాయింట్‌లో ఈ మొత్తాన్ని వారికి అందజేస్తుంటారు. రోజూ ఒకే పాయింట్‌లో కాకుండా ముందుగా అనుకున్న ప్రకారం ఒక్కో రోజు ఒక్కో పాయింట్ నుంచి ఇలా డబ్బులు చేతులు మారుతుంటాయి.

ధిక్కరణ కేసులో ఐఏఎస్‌లపై హైకోర్టు ఆగ్రహం

» చేపల సీడ్ నగదు చెల్లింపులో జాప్యంపై స్వయంగా హాజరై వివరణ ఇవ్వాలని ఆదేశం



హైదరాబాద్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): చేపల సీడ్‌కు సంబంధించిన నగదు చెల్లింపులు చేయాలన్న ఉత్తర్వులను అమలు చేయని ప్రభుత్వ అధికారులపై హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. కోర్టు స్వయంగా హాజరై వివరణ ఇవ్వాలని పశుసంవర్ధకశాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ సవ్యసాచి ఘోష్, ఆర్థిక శాఖ ముఖ్యకార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా, మత్స్య శాఖ కమిషనర్ ప్రియాంక, డిప్యూటీ డైరెక్టర్ టీ శ్రీనివాస్, నాగర్‌కర్నూల్, వనపర్తి కలెక్టర్లకు ఫారం-1 నోటీసులు జారీచేసింది. 2023-24 ఏడాదికి తాము అందజేసిన చేపల సీడ్‌కు నగదు చెల్లింపుల్లో తీవ్ర జాప్యం చేస్తున్నారంటూ వనపర్తి జిల్లా పెబ్బేరు మండలం శాకాపురానికి చెందిన పుట్టా ఫిష్ సీడ్ ఫాం యజమాని బాలరాజు, ఇతర ఫాం యజమానులు గతంలో హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. దీనిపై మూడు వారాల్లో నిర్ణయం తీసుకుని, పిటిషనర్లకు తెలియజేయాలని అధికారులను కోర్టు ఆదేశించింది. ఈ ఆదేశాలను అమలు చేయడం లేదని పిటిషనర్లు కోర్టు ధిక్కరణ పిటిషన్‌లు దాఖలు చేశారు. వీటిపై బుధవారం జస్టిస్ ఎన్వీ శ్రవణ్‌కుమార్ ధర్మాసనం విచారణ చేపట్టింది. చెల్లింపుల కోసం పలుమార్లు విజ్ఞప్తి చేసినా అధికారులు పట్టించుకోవడం లేదని పిటిషనర్ల తరఫున న్యాయవాది డీఎల్ పాండు తెలిపారు. ప్రతివాదులైన అధికారులు నేరుగా తమ ఎదుట హాజరై వివరణ ఇవ్వాలని కోర్టు నోటీసులు జారీచేసింది. తదుపరి విచారణ ఈనెల 30కి వాయిదా పడింది.

హెచ్‌సీఏ కార్యదర్శి, సీఈవో హాజరవ్వాలని ఆదేశం

ఓ కోర్టు ధిక్కరణ కేసులో తమ ఎదుట హాజరై వివరణ ఇవ్వాలని హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) కార్యదర్శి ఆర్ దేవరాజ్, సీఈవో సునీల్ బోస్‌కు హైకోర్టు ఫారం-1 నోటీసులు జారీ చేసింది. వర్క్ ఆర్డర్ మేరకు పనులు పూర్తిచేసినా అంగీకరించిన మొత్తం రూ.19 లక్షలు చెల్లించడం లేదని గంజం డెకార్ సర్వీసెస్ సంస్థ హైకోర్టులో పిటిషన్ వేయగా ఆ మొత్తం చెల్లించాలని తీర్పు వెలువడింది. అయినా చెల్లించడం లేదంటూ పిటిషనర్ సంస్థ కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలు చేసింది. దీనిపై విచారణ చేపట్టిన ధర్మాసనం.. హెచ్‌సీఏ కార్యదర్శి, సీఈవో తమ ఎదుట ప్రత్యక్షంగా హాజరై వివరణ ఇవ్వాలని నోటీసులు జారీచేసింది. తదుపరి విచారణ ఈ నెల 18కి వాయిదా పడింది.

మానవత్వంతో తీర్పులిచ్చిన జస్టిస్ పాల్

» వీడ్కోలు సమావేశంలో జస్టిస్ శ్యాంకోషీ ప్రశంస

హైదరాబాద్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): కలకత్తా హైకోర్టుకు బదిలీ అయిన తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుజోయ్ పాల్‌కు హైకోర్టు న్యాయమూర్తులు, న్యాయవాదులు ఘనంగా వీడ్కోలు పలికారు. బుధవారం మొదటి కోర్టు హాల్‌లో నిర్వహించిన ఫుల్ కోర్టు సమావేశంలో జస్టిస్ సుజోయ్‌పాల్ సేవలను సీనియర్ న్యాయమూర్తి శ్యాంకోషీ, అడ్వకేట్ జనరల్ సుదర్శన్‌రెడ్డి ప్రస్తుతించారు. జస్టిస్ పాల్‌కు 15 నెలల వయస్సు ఉన్నప్పుడే తండ్రి చనిపోతే తల్లి అన్నీ తానై పెంచారన్నారు. ఆమె ఉత్తమ ఉపాధ్యాయురాలిగా రాష్ట్రపతి చేతులమీదుగా అవార్డు పొందారని కొనియాడారు. తల్లి తొలిగురువు అని చెప్తారని, జస్టిస్ పాల్‌కు ఇంట్లోనూ తరగతి గదిలోనూ ఆయన మాతృమూర్తే గురువుగా ఉండి మార్గదర్శనం చేశారన్నారు. చట్టంపరంగా కచ్చితత్వంతో ఉంటూనే మానవత్వంతో తీర్పులు రాసిన గొప్ప జడ్జి జస్టిస్ పాల్ అని పేర్కొన్నారు. 255 రోజుల సమయంలోనే 4,223 ప్రధాన కేసులు, 5వేలకు పైగా దరఖాస్తులను పరిష్కరించారని తెలిపారు. న్యాయవాదుల అసోసియేషన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో జస్టిస్ పాల్ మాట్లాడుతూ కొత్తగా న్యాయవాద వృత్తిలోకి వచ్చినవారు పూర్తిస్థాయిలో కష్టపడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమాల్లో హైకోర్టు న్యాయమూర్తులు, బార్ అధ్యక్షుడు ఏ జగన్, కార్యదర్శి విజారత్ అలీ పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

ట్రంప్ కొత్త ఎత్తు..!

మరో యాభైరోజుల్లోగా ఉక్రెయిన్‌మీద దాడులు ఆపని పక్షంలో భారీ సుంకాలతో ఊపిరాడనివ్వబోనని రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌ను అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ మహా గట్టిగా హెచ్చరించారు. మరో నెలన్నరపాటు ఎంచక్కా ఉక్రెయిన్‌ను బాదేసుకోవచ్చునని పుతిన్‌కు ట్రంప్ అవకాశమిచ్చారంటూ కొందరు దీనిని నిర్వచిస్తున్నారు. గడువు తరువాత రష్యాకు ఏమి జరగబోతున్నదో అటుంచితే, ఈ వేసవి నెలలను చక్కగా వాడుకొని భయానక దాడులతో పుతిన్ కోరుకుంటున్న ఉక్రెయిన్ ప్రాంతాలను ఆక్రమించుకోవడానికే ట్రంప్ ఈ అవకాశం ఇచ్చారని వారి వాదన.

గడువులోగా రష్యా తన యుద్ధాన్ని ఆపనిపక్షంలో మహా అయితే ఐదువందలశాతం సుంకాలతో రష్యాను ట్రంప్ శిక్షిస్తారంతే. రష్యా నుంచి దిగుమతులు చేసుకొనే దేశాలు కూడా ట్రంప్ ఆగ్రహానికి అంతే స్థాయిలో బలికావాల్సి రావచ్చు. అంతవరకూ ఉక్రెయిన్ పౌరుల మీద యథేచ్ఛగా దాడులు చేసుకోవచ్చునని ట్రంప్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్టుగా రష్యాకు అనిపిస్తున్నది. మాకే హెచ్చరికలు చేస్తావా అంటూ రష్యా పెద్దలు ఆగ్రహాన్ని నటిస్తున్నా, లోలోపల సంతోషిస్తున్నారట. ట్రంప్ తలుచుకుంటే ఈ హెచ్చరికలు చేసిన క్షణం నుంచే ఆంక్షలు అమలుచేయవచ్చును, సుంకాలు వెయ్యిరెట్లు విధించవచ్చును. కానీ, ఉక్రెయిన్‌కు మూడుదిక్కుల్లో ఉన్న కీలకప్రాంతాలు కొన్నింటిని రష్యా గెలుచుకొనేందుకు ఈ గడువు ఉపకరిస్తుంది. ఇప్పటికే రష్యామీద అత్యధికస్థాయి ఆంక్షలున్నందున, ట్రంప్ కొత్తగా దాని పీకనొక్కేదేమీ ఉండదు. ఆంక్షలతో రష్యాను దారికితేవడం అసాధ్యమన్నది కూడా ఇప్పటికే రుజువైంది. ఎన్ని ఆంక్షలున్నా చక్కగా చమురు అమ్ముకొని బతుకుతోంది, యుద్ధం బలంగా సాగిస్తోంది. ఒకవేళ ఈ యాభై రోజుల గడువులోగా పుతిన్ అనుకున్నది చేయలేనిపక్షంలో, దానిని సడలించడానికీ, పెంచడానికీ ట్రంప్ సిద్ధంగా ఉంటారని గిట్టనివాళ్ళ వాదన.

గడువు సంగతి అటుంచితే, పేట్రియాటిక్ వ్యవస్థ సహా అధునాతన ఆయుధాలను ఉక్రెయిన్‌కు అందివ్వాలన్న ట్రంప్ నిర్ణయం మాస్కోను ఇబ్బందుల్లో పడవేసేదే. రోజూ రాజధాని సహా ఉక్రెయిన్ నగరాలను దాడులతో దడదడలాడిస్తున్న రష్యాకు ఇకపై అది సులభం కాబోదు. ట్రంప్ నిజంగా శాంతిని కోరుకోవడం లేదని, పైకి అలా మాట్లాడుతూ, యుద్ధాన్ని కొనసాగించదల్చుకున్నాడని రష్యా నాయకులు ఘాటుగా విమర్శలు చేస్తున్నది అందుకే. ఉక్రెయిన్‌కు నిరవధికంగా ఆయుధాలు అందిస్తే, ఎట్టకేలకు మాస్కో దిగివస్తుందన్న భ్రమతో మూడున్నరేళ్ళు బైడెన్ వ్యవహరించారని, ఇప్పుడు ట్రంప్ కూడా అదేబాటలో నడుస్తున్నాడని రష్యా నాయకుల విమర్శ. కానీ, రోజూ వందలాది మిసైల్, డ్రోన్‌దాడులను ఎందుర్కొంటున్న ఉక్రెయిన్‌కు క్షిపణి రక్షణవ్యవస్థలు అందినందువల్ల కాస్త ఊపిరితీసుకోగలుగుతుంది. మూడువందల కిలోమీటర్ల వరకూ ప్రయాణించగలిగే మిసైళ్ళ వాడకానికి కూడా ట్రంప్ అనుమతించినపక్షంలో రష్యా సైనిక స్థావరాలకు, ఆయుధాగారాలకు భారీ నష్టాలు జరగవచ్చు.

ఇప్పుడు దాదాపు పదిబిలియన్ డాలర్ల విలువైన ఆయుధాలను నాటో దేశాలకు విక్రయించి, ఉక్రెయిన్‌కు అందించడం ద్వారా ట్రంప్ తన చేతికి మట్టి అంటకుండా జాగ్రత్తపడ్డారు. నేరుగా ఆయుధాలు అమ్మకుండా, రాబోయే నోబెల్‌కు ఇలా అడ్డం లేకుండా చూసుకుంటున్నారన్న ఆక్షేపణలను అటుంచితే, ఒకపక్క రష్యాకు నెలన్నర గడువు ఇవ్వడం, మరోపక్క పాశ్చాత్య దేశాలతో ఆయుధ వ్యాపారం చేసి ఖజానాను నింపుకోవడం ద్వారా ట్రంప్ కొత్త వ్యూహానికి దారులు తెరిచారు. యుద్ధానికి కారకుడివి నువ్వేనంటూ గతంలో ఉక్రెయిన్ అధ్యక్షుడిని తీవ్రంగా తప్పుబట్టి, ఓవల్ ఆఫీసులో కూడా ఘోరంగా అవమానించిన ట్రంప్ పుతిన్ విషయంలో మాత్రం స్పష్టమైన సానుకూలతతో వ్యవహరిస్తూ వచ్చారు. తాను అధికారంలోకి వచ్చిన ఇరవైనాలుగుగంటల్లోనే ఈ యుద్ధాన్ని ఆపేయగలనని నమ్మిన ట్రంప్‌కు పుతిన్ ఎంతకూ లొంగిరావడం లేదు. కనీసం అరడజను సార్లు గట్టి ప్రయత్నాలు చేసినా ఫలితం లేకపోయింది. ఇది ట్రంప్‌కు అవమానాన్ని కలిగించివుండవచ్చు. ఇప్పుడు ఉద్రిక్తతలను పెంచి, ఉపశమనాన్ని సాధించగలనని ఆయన నమ్ముతున్నట్టు ఉంది. ఈ ఎత్తుగడ ఫలిస్తే నోబెల్ శాంతి దక్కవచ్చునన్న ఆశ ఆయనలో ఉన్నా కూడా తప్పులేదు.

'సర్' సంకటంలో భారత ప్రజాస్వామ్యం



భారత ప్రజాస్వామ్యానికి ఉపశమనం, సందేహం లేదు. బిహార్‌లో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ –సర్)కు వ్యతిరేకంగా దాఖలైన పిటీషన్లపై విచారణలో సుప్రీంకోర్టు జారీ చేసిన ఆదేశాల గురించి నేను ప్రస్తావిస్తున్నాను. సర్వోన్నత న్యాయస్థానం నిర్ణయాలను స్వాగతించవలసిందే. అయితే అసలు సమస్యపై నుంచి మన దృష్టిని మళ్లించే ఒక తీవ్రప్రమాదమూ వాటిలో అంతర్భాగంగా ఉంది. వయోజనులను ఓటర్‌గా నమోదు చేసేందుకు ఆధార్ కార్డును ప్రామాణికంగా తీసుకోవాలని సుప్రీంకోర్టు నిర్దేశించింది. అలాగే సర్ ప్రక్రియ కేవలం నెల రోజులలో పూర్తి చేయడం ఎలా సాధ్యమవుతుందని ప్రశ్నించింది. బిహార్‌లోని కొన్ని ప్రత్యేక పరిస్థితుల దృష్ట్యా సమగ్ర సవరణకు ఎదురయ్యే అవరోధాలనూ ప్రస్తావించింది. నిజమే, అవన్నీ నిజమైన సమస్యలు, జరూరుగా పరిష్కరించవలసినవి. కానీ, ప్రస్తావిత అంశాలపైనే మన దృష్టి కేంద్రీకృతమైతే ప్రాథమిక ప్రాధాన్యమున్న అంశం ఉపేక్షితమయ్యే అవకాశమున్నది. అది బిహార్‌కు మాత్రమే కాదు, సమస్త భారతదేశాన్నీ ప్రభావితం చేసే అంశమది. మరింత కచ్చితంగా చెప్పాలంటే భారత ప్రజాస్వామిక గణతంత్ర రాజ్య భవిష్యత్తును ప్రతికూలంగా ప్రభావితం చేసే సమస్య అది.

ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణతో భారత ప్రజాస్వామ్యానికి దాపురించిన ప్రమాదమేమిటో మనం స్పష్టంగా గుర్తించాలి. అది కేవలం బిహార్‌కు మాత్రమే పరిమితమైనది కాదు. బిహార్ ఆరంభం మాత్రమే. ఆ రాష్ట్రంలో ఆ ప్రక్రియను పూర్తి చేసిన తరువాత అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న రాష్ట్రాలలోను, అనంతరం దేశ వ్యాప్తంగా ఆ ప్రక్రియను అమలుపరిచేందుకు భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) సమాయత్తమవుతోంది. ఇందులో భాగంగానే 'సర్' అమలుకు సన్నద్ధమవ్వాలని రాష్ట్ర ఎన్నికల సంఘాలను ఈసీఐ ఆదేశించింది. 'సర్' చట్టబద్ధతపై దేశ సర్వోన్నత న్యాయస్థానం విచారణ కొనసాగుతున్న సమయంలోనే ఈసీ ఆ ఆదేశం జారీ చేయడం గమనార్హం. 'సర్' కేవలం ఓటర్ల జాబితా సవరణ కాదు. అది ఓటర్ల జాబితాను సమూలంగా సరికొత్తగా రూపొందించడమే. మరింత స్పష్టంగా చెప్పాలంటే ఓటర్ల జాబితాను ఎలా సృష్టించాలనే విషయమై నియమాలు, విధానాలు, మార్గదర్శక సూత్రాలను తిరగరాయడమే. ఈ ప్రక్రియ వల్ల సార్వత్రిక వయోజన ఓటుహక్కు పునాది సూత్రమే ప్రమాదంలో పడుతుంది. బిహార్ విషయంలో ఉపశమనం లభించినప్పటికీ ఆ ప్రక్రియను పూర్తిగా రద్దు చేసి తీరాలని మనం డిమాండ్ చేయవలసిన అవసరమున్నది.

సార్వత్రిక వయోజన ఓటు హక్కు, మన స్వాతంత్ర్యోద్యమ ప్రధాన లక్ష్యాలలో ఒకటి. 1928లో మోతీలాల్ నెహ్రూ కమిటీ తొట్టతొలుత ఈ సమున్నత లక్ష్యాన్ని ప్రతిపాదించింది. 1929లో లాహోర్ కాంగ్రెస్‌లో ఆమోదించిన పూర్ణ స్వరాజ్ తీర్మానంలో ఆ లక్ష్యాన్ని పునరుద్ఘాటించారు. భారత రాజ్యాంగం 'వయోజన ఓటు హక్కు' సూత్రాన్ని అధికరణ 326 ద్వారా చేర్చుకున్నది : లోక్‌సభ, శాసనసభలకు వయోజన ఓటుహక్కు విధానంపై ఆధారపడి ఎన్నికలు జరుగుతాయి అనగా భారతీయులై ఉండి, నిర్దేశిత తేదీకి 18 సంవత్సరాలు నిండిన వారందరికీ ఓటుహక్కు ఉంటుంది'. భారతీయ పౌరసత్వానికి ప్రాతిపదిక భారతదేశంలో పుట్టుక, నివాసంపై ఆధారపడి ఉంటుందని అధికరణ 5 పేర్కొంది. ప్రతి పౌరుడి పౌరసత్వానికి అధికరణ 10 భద్రత కల్పించింది: 'భారత పౌరుడు అయిన వ్యక్తి, భారత పౌరుడుగా భావించబడే వ్యక్తి తన పౌరసత్వ హక్కును, పార్లమెంటు ఆమోదించే పౌరసత్వ హక్కు సంబంధిత చట్టాలకు లోబడి ఎన్నటికీ కోల్పోడు'. భారత పౌరసత్వానికి సంబంధించి ఈ రాజ్యాంగ బద్ధ హామీని వాస్తవం చేసేందుకు భారత గణతంత్ర రాజ్యం గత 75 ఏళ్లుగా పరిపూర్ణంగా నెరవేర్చింది. వయోజన ఓటుహక్కు ప్రతి ఒక్కరికీ లభించేందుకు, తద్వారా పౌర సత్వ హోదా ప్రతి ఒక్కరికీ కల్పించేందుకు భారత రాజ్య వ్యవస్థ కట్టుబడి ఉన్నదని అనుపమరాయ్ తన పుస్తకం 'మ్యాపింగ్ ఆఫ్ సిటిజెన్‌షిప్ ఇన్ ఇండియా'లో వివరించారు. 'అవశేష' పౌరులకు (వలస, పేదరికం లేదా సామాజిక విధానాలు ఇత్యాది కారణాల వల్ల సమాజంలో సంపూర్ణ భాగస్వామ్యం నుండి మినహాయింపబడిన వ్యక్తులు) సైతం ఓటింగ్ హక్కులు నిరాకరించడం జరగలేదు. కనుకనే స్వతంత్ర భారతదేశంలో ఓటు వేయడమనేది ఒక లౌకిక ఆచారంగా రూపొంది పవిత్ర హోదాను సంతరించుకున్నదని రాజకీయ మానవశాస్త్రవేత్త ముకూలికా బెనర్జీ వాదించారు. ఆమె వాదన విస్తృత ఆమోదం పొందింది.



■ యోగేంద్ర యాదవ్

ఈ శుభ పరిణామం యాదృచ్ఛికంగా సంభవించలేదు. ఏ ఒక్క వయోజనుడు మినహాయింపబడకుండా ఓటర్ల జాబితాలో స్థానం పొందేందుకు అవసరమైన చట్టాలు చేసి, వాటిని అమలుపరుస్తున్నారు. అమెరికా, ఇతర ప్రజాస్వామ్య దేశాలలో ఓటరుగా నమోదయేందుకు స్వయంగా ప్రతివ్యక్తి దరఖాస్తు చేసుకోవల్సి ఉంటుంది. అయితే భారత ప్రజాస్వామ్య వ్యవస్థ ఓటుహక్కుకు అర్హుడైన ప్రతి పౌరుడినీ ఓటరుగా నమోదు చేసే బాధ్యతను రాజ్య వ్యవస్థపై మోపింది. ఈ కారణంగా అమెరికాలో మొత్తం వయోజనులలో 74 శాతం మంది మాత్రమే ఓటర్ల జాబితాలో ఉండగా మన దేశంలో 96 శాతం మంది వయోజనులు ఓటర్ల జాబితాలో ఉంటున్నారు. ఓటర్ల జాబితాలో నమోదుకు వ్యక్తులు విడివిడిగా దరఖాస్తు చేసుకోవచ్చు. అయితే భారత పౌరుడు అయిన ప్రతి వయోజనుడి పేరు ఓటర్ల జాబితాలో ఉండేలా చూడాల్సిన బాధ్యత అంతిమంగా ఎన్నికల అధికారులపై ఉంచారు. ఓటు హక్కుకు అర్హుడైన ఏ వయోజనుడినీ ఓటర్ల జాబితాల చేర్చకుండా వదిలివేయకూడదు. నిర్దిష్ట ప్రాంతంలో నివాసముంటున్న ప్రతి వ్యక్తినీ పౌరుడుగా భావించి, అతని పేరు విధిగా ఓటర్ల జాబితాలో చేర్చాలి. అయితే నిర్దిష్ట ప్రదేశంలో నివాసం ఉండకపోవడం, మానసిక అస్వస్థత, నేరాలకు పాల్పడడం, అవినీతి, చట్ట వ్యతిరేక చర్యలు మొదలగు కారణాలపై రాజ్యాంగం క్రిందగానీ, మరేదైనా శాసనం క్రిందగానీ ఓటర్లుగా అనర్హులైనవారికి ఓటర్లుగా నమోదయ్యే అర్హత ఉండదు' అని రాజ్యాంగ అధికరణ 326 స్పష్టం చేసింది. ఒకసారి ఓటరుగా నమోదైన తరువాత సరైన ప్రక్రియను అనుసరించకుండా ఎవరి పేరునూ ఓటర్ల జాబితా నుంచి తొలగించకూడదు.

ఓటర్ల నమోదు ప్రక్రియలో వదిలివేయబడిన సంచార సామాజిక సమూహాలకు చెందినవారు, ఇల్లూ వాకిలి లేనివారు, సెక్స్ వర్కర్స్ ట్రాన్స్‌జెండర్ పర్సన్స్, అనాథలు, సరైన డాక్యుమెంట్లు లేనివారు, ప్రవాస భారతీయులను సైతం ఓటర్ల జాబితాలో చేర్చేందుకు ఈసీఐ కట్టుబడి, మార్గదర్శక సూత్రాలను రూపొందిస్తున్న నేపథ్యంలో, సర్ ప్రక్రియ ఆ సదాశయానికి పూర్తి వ్యతిరేకమైనది. పరిధిని విస్తరిస్తూ, విస్తృత చేర్పులతో సార్వత్రిక వయోజన ఓటుహక్కు పునాదిని బలోపేతం చేసే లక్ష్యం బలహీనపడుతుంది.

చెప్పవచ్చినదేమిటంటే 'సర్' ప్రక్రియ డాక్టర్ అంబేడ్కర్ పేర్కొన్న పౌరసత్వ క్రమానుగత అసమానత (Graded Inequality of Citizenship)లకు దారితీస్తుంది. ప్రతి పౌరుడినీ ఒక రాజకీయ సమూహంలో స్వేచ్ఛాయుత, సమాన భాగస్వామిగా చేయడంలో భారత రాజ్య వ్యవస్థ విఫలమయింది. రాజనీతి శాస్త్రవేత్త టిహెచ్ మార్షల్ మాటల్లో చెప్పాలంటే అధికారిక రాజకీయ రంగం నుండి ఒక ముఖ్యమైన సామాజిక రంగం వైపు పరివర్తన అనేది జరగలేదు. నీరజా గోపాల్ తన 'Citizenship Imperilled :Indias Fragile Democracy'లో రాజకీయ మార్పులు, సామాజిక ఉద్యమాల ప్రభావంతో పౌరసత్వ భావనను నిర్వచిస్తున్న, పౌరసత్వాన్ని పొందుతున్న పద్ధతులు, పౌరసత్వం రద్దు కావడమనే మార్పులను వివరంగా పేర్కొన్నారు. వీటి కారణంగా పౌరసత్వం పరిపూర్ణత పొందకపోగా అధికారిక పౌరసత్వం క్షీణించి పోతుందని ఆమె వ్యాఖ్యానించారు. ఈ తిరోగామి మార్పులు 'ప్రత్యేక సమగ్ర సవరణ' ప్రక్రియతో మరింత వేగవంతమవుతున్నాయి. ఫలితంగా పౌరసత్వ ప్రాతిపదిక జస్ సోలి (పుట్టుక నివాసం ఆధారంగా పౌరసత్వాన్ని పొందడం) అనే సూత్రం నుంచి జస్ సాంగులిన్ (తల్లిదండ్రుల వారసత్వం ఆధారంగా పౌరసత్వాన్ని ఇవ్వడం) అనే సూత్రానికి మారుతోందని నీరజా జయాల్ వ్యాఖ్యానించారు.

సార్వత్రిక వయోజన ఓటుహక్కు అమలయ్యేందుకు దోహదం చేస్తున్న ఆచరణలు అన్నిటినీ సర్ తలకిందులు చేస్తోంది. తొలుత ఓటర్ల జాబితాలో తమ పేరు ఉండేలా చేసుకునే బాధ్యతను ఓటుహక్కుకు అర్హులైనవారిపైనే మోపింది. ఎన్యూమరేషన్ ఫామ్‌లను సకల వివరాలతో నింపి, సంబంధిత ధ్రువీకరణ పత్రాలతో సహా సమర్పించాలని ఎటువంటి మినహాయింపు లేకుండా సంభావ్య ఓటర్లు అందరినీ సర్ నిర్దేశించింది. ఓటర్లకు ఇటువంటి పరిస్థితి కల్పించడం ఇదే మొదటిసారి. నిర్దేశించిన రీతిలో ఎన్యూమరేషన్ ఫామ్‌లను ఇవ్వనిపక్షంలో ముసాయిదా ఓటర్ల జాబితాలో సైతం సంబంధితుల పేర్లు చోటు చేసుకోవని ఎన్నికల సంఘం స్పష్టం చేసింది. 2003 నాటి ఓటర్ల జాబితాలో పేరు లేని పక్షంలో ఓటర్ల జాబితాలో ఉన్నప్పటికీ ప్రయోజనముండదు (అసలు 2003ను కటాఫ్ పాయింట్‌గా తీసుకోవడమే అర్థరహితం. ఆనాడు ఆ జాబితా తయారీలో కూడా పౌరసత్వ ధ్రువీకరణ డాక్యుమెంట్ల ద్వారా జరగనే లేదు. మరో ముఖ్యమైన బాధ్యత మీరు చట్టవిరుద్ధంగా దేశంలో నివసించడం లేదనే విషయాన్ని మీరు నిరూపించుకోవల్సిన అవసరమున్నది. ఇప్పుడు ప్రతి ఒక్కరూ, తమ పేరు ఉన్నట్టు రుజువు చేస్తున్న 2003 ఓటర్ల జాబితా కాపీని, బర్త్ సర్టిఫికెట్, నివాసానికి సంబంధించిన ధ్రువీకరణ పత్రాన్ని కూడా సమర్పించవలసి ఉంటుంది. ఇలా జరగడం కూడా ఇదే మొదటిసారి. గమనార్హమైన విషయమేమిటంటే ప్రభుత్వం వీటిని ఎవరికీ సమకూర్చలేదు. వాటిని విధిగా సమకూర్చుకోవల్సిన అవసరం అత్యధికులకు లేదు. బిహార్‌లో సర్ గందరగోళ పరిస్థితులను సృష్టిస్తోంది. ఏక కాలంలో విషాదమూ, ప్రహసనమూ చోటు చేసుకుంటున్నాయి. సర్‌ను అమలుపరుస్తోన్న అధికారుల అసమర్థతే అందుకు కారణమా? అదే కావచ్చు. అయితే అధికారుల అసమర్థత అసలు సమస్య కాదనే వాస్తవాన్ని మనం విస్మరించకూడదు. ఎన్నికల సంఘం అమలుపరుస్తున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ పథకమే దురుద్దేశపూరితమైనది, రాజ్యాంగ విరుద్ధమైనది, ప్రజాస్వామ్య వ్యతిరేకమైనది.


(వ్యాసకర్త 'స్వరాజ్ ఇండియా' అధ్యక్షుడు)

> బిహార్‌లో ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ వాస్తవానికి ఓటర్ల జాబితాను ఎలా రూపొందించాలన్న విషయమై నియమాలు, విధానాలు, మార్గదర్శక సూత్రాలను తిరగరాయడమే. దీనివల్ల సమున్నత ప్రజాస్వామిక సూత్రమైన సార్వత్రిక వయోజన ఓటుహక్కు పునాదే ప్రమాదంలో పడింది.

విశ్వ శాస్త్రవేత్త

ఆధునిక భారతీయ ఖగోళశాస్త్రవేత్తలలో ప్రథమగణ్యుడు జయంత్ విష్ణు నార్లికర్. ఆయన ఈ ఏడాది మే 20న తనువు చాలించారు. అదేం కాకతాళీయమో.. ఆయన తన చివరి బ్లాగ్‌లో తాను స్థాపించిన ఐయూసీఏఏ గురించి ప్రస్తావిస్తూ, 'కర్మయోగి భగవద్గీతలో చెప్పినట్టుగా.. వీడ్కోలు. ఇక్కడితో నా ప్రయాణం సమాప్తమైనట్టుగా భావిస్తున్నాను' అంటూ రాసుకొచ్చారు!

'శాంతంగానే మాట్లాడండి. అయినా ఓ దుడ్డుకర్రను వెంటే ఉంచుకోండి' (Speak softly and carry a big stick) అనే అమెరికన్ సామెతను నార్లికర్ అనుసరించారు. ఆల్బర్ట్ ఐన్‌స్టీన్, ఎర్నెస్ట్ మాక్ వంటి దిగ్గజాలు ప్రతిపాదించిన సిద్ధాంతాలను ఇరవై ఏళ్ల వయసులోనే తన 'హోయల్ నార్లికర్ గురుత్వాకర్షణ సిద్ధాంతం' ద్వారా సవాలు చేసే మేధో ధైర్యాన్ని ప్రదర్శించారు. ప్రఖ్యాత బిగ్ బ్యాంగ్ సిద్ధాంతాన్ని సవాలు చేస్తూ 'స్థిర స్థితి సిద్ధాంతం' (Steady State Theory) ప్రతిపాదించి సంచలనం సృష్టించారు. ఈ సిద్ధాంతం ప్రకారం ఈ విశ్వం ఆది, అంతాలు లేని ఒక నిరంతరాయ ప్రక్రియ. విశ్వం విస్తరిస్తున్న కొద్దీ, కొత్త పదార్థం నిరంతరం ఏర్పడుతుంది. తద్వారా విశ్వం సాంద్రత స్థిరంగా ఉంటుంది. కానీ స్థిర స్థితి సిద్ధాంతం క్రమేణా ప్రాబల్యం కోల్పోయింది. విశ్వ పురోగతికి సంబంధించిన సాక్ష్యాలు, ముఖ్యంగా కాస్మిక్ మైక్రోవేవ్ నేపథ్య వికిరణాన్ని కనుగొనడం బిగ్‌బ్యాంగ్ నమూనాకు బలమైన మద్దతునిచ్చాయి. దీనికి సమాధానంగా 1993లో ఫ్రెడ్ హోయిల్, జియోఫ్రీ బర్బిడ్జ్‌తో కలసి క్వాసీ–స్థిర స్థితి సిద్ధాంతాన్ని (QSS) కొన్ని సవరణలతో ప్రతిపాదించారు. ఈ సిద్ధాంతం ప్రకారం.. విశ్వంలో అక్కడక్కడా పదార్థం ఎప్పటికప్పుడు ఏర్పడుతూ ఉంటుంది. ఈ సృష్టిని మినీ–బ్యాంగ్స్ లేదా మినీ–క్రియేషన్ ఈవెంట్స్ అంటారు. మాక్ సూత్రం, క్వాంటం విశ్వోద్భవ శాస్త్రం, క్వాసార్‌లు, బ్లాక్ హోల్స్‌కు సంబంధించిన అంశాలపై కూడా నార్లికర్ పరిశోధనలు చేశారు. ఇస్రో శాస్త్రవేత్తతో కలిసి అనేక అంతరిక్ష పరిశోధనలు చేశారు. ఈ పరిశోధనల ఫలితంగా సేకరించిన నమూనాల్లో ప్రత్యక్ష కణాలు, బ్యాక్టీరియాను, గ్రహాంతరాలకు చెందిన సూక్ష్మ జీవులను కనుగొన్నారు. దీంతో గ్రహాంతరాల్లో జీవం ఉందనే వాదనకు ఈ ప్రయోగం బలం చేకూర్చింది. ఈ ప్రయోగంలో నార్లికర్ కనుగొన్న సూక్ష్మజీవుల్లో ఒక జాతికి తన గురువైన ఫ్రెడ్ హోయల్, ఇంకో జాతికి ఇస్రో, మరో జాతికి ఆర్యభట్ట పేర్లను పెట్టటం విశేషం.



> 'అన్నీ మన వేదాల్లో ఉన్నాయ్' అనే వాదనలను నార్లికర్ తిరస్కరించారు. 'విజ్ఞాన సంబంధమైన విషయాలన్నీ బలమైన ప్రమాణాలు, తర్కం మీదే ఆధారపడి ఉంటాయి తప్ప ఊహలు, ఊసుపోని కబుర్ల మీద కాద'ని ఆయన ప్రకటించారు. తన పుస్తకం 'సైంటిఫిక్ ఎడ్జ్'లో మూఢభక్తికి, శాస్త్రీయ విజ్ఞానానికి మధ్య ఉన్న తేడాను విపులంగా వివరించారు.

సైన్స్‌ను జనబాహుళ్యంలోకి తీసుకెళ్లడానికి నార్లికర్ విశేష కృషి చేశారు. బొమ్మలు, ఇతర బోధనా సాధనాల ద్వారా తన ఐయూసీఏఏ విద్యార్థుల సాయంతో సైన్స్‌ను ప్రతినెలా పాఠశాల విద్యార్థులకు బోధించారు. ఇది దాదాపు నాలుగు దశాబ్దాల పాటు కొనసాగింది. కష్టమైన సైన్స్ సిద్ధాంతాలను సులభమైన భాషలో ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చేందుకు తమిళం, హిందీ, మరాఠీ, ఇంగ్లీష్ భాషల్లో పుస్తకాలు, కథలు, నవలలు, వ్యాసాలు రాశారు. టీవీ, రేడియో, బుక్స్, బ్లాగుల ద్వారా విస్తృతంగా విజ్ఞానాన్ని పంచారు. తన మాతృభాష మరాఠీలో ఆయన రాసిన సైన్స్ ఫిక్షన్ కథ అనంతర కాలంలో 'ధూమకేతు' సినిమాగా రూపొందింది. నార్లికర్ ఆత్మకథ 'చార్ నగరాంతలే మాజే విశ్వ' (మై టేల్ ఆఫ్ ఫోర్ సిటీస్)కు జాతీయ సాహిత్య అకాడమీ పురస్కారం లభించింది. ఖగోళ శాస్త్రంలో ఆయన చేసిన విశేష కృషికి గాను 1965లో పద్మభూషణ్, 2004లో పద్మ విభూషణ్, ఫ్రెంచ్ ఖగోళ సంఘం అందజేసే 'ప్రిక్స్ జూల్స్ జంస్సెన్' అవార్డు, 2011లో మహారాష్ట్ర భూషణ్ పురస్కార్ లభించాయి.

'అన్నీ మన వేదాల్లో ఉన్నాయ్' అనే వాదనలను ఆయన తిరస్కరించారు. 'విజ్ఞాన సంబంధమైన విషయాలన్నీ బలమైన ప్రమాణాలు, తర్కం మీదే ఆధారపడి ఉంటాయి తప్ప ఊహలు, ఊసుపోని కబుర్ల మీద కాద'ని ఆయన ప్రకటించారు. ఛాందసపు సిద్ధాంతాలను ఖండించేవారు. అదే సమయంలో మన పూర్వీకుల విజయాలైన 'సున్నా ఆవిష్కరణ' వంటి నిజంగా గుర్తింపు దక్కాల్సిన మన గత శాస్త్రీయ విజయాలకు ప్రోత్సాహం అందించాలని మన శాస్త్రవేత్తలకు నార్లికర్ పిలుపునిచ్చారు. తన పుస్తకం 'సైంటిఫిక్ ఎడ్జ్'లో మూఢభక్తికి, శాస్త్రీయ విజ్ఞానానికి మధ్య ఉన్న తేడాను విపులంగా వివరించారు. యువ శాస్త్రవేత్తలకు ఆయన 'పబ్లిష్ ఆర్ పెరిష్' (ప్రచురించు లేదా నశించు)' అనే పిలుపునిచ్చారు. ఆయన రచించిన 'ది కామెట్', 'ది అడ్వెంచర్' అధ్యాయాలను NCERT 8, 9 తరగతుల సైన్స్ పుస్తకాల్లో చేర్చారు. అత్యంత సాధారణ జీవితాన్ని ఇష్టపడి, ఆచరించిన నార్లికర్ తన 87వ ఏట పూణెలోని తన నివాసంలో తుదిశ్వాస విడిచారు. మూఢత్వాన్ని వదిలి తర్కం, హేతువు ఆధారంగా మనమంతా వైజ్ఞానిక దృక్పథాన్ని అలవర్చుకోవాలి. అదే నార్లికర్‌కు మనం ఇచ్చే అసలైన నివాళి.

• డి. శాంతిప్రియ (డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఆస్ట్రానమి, ఓయూ)
• నెక్కంటి అంత్రివేది (సామాజిక శాస్త్రవేత్త)

(జూలై 19: నార్లికర్ జయంతి)

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన చిరునామా
ఎడిట్‌పేజీ, ఆంధ్రజ్యోతి, ప్లాట్–76, అశ్వినీ లే ఔట్, హుడా హైట్స్, రోడ్ నంబరు–70, జూబ్లీహిల్స్, హైదరాబాద్–500033.
మెయిల్: editpage@andhrajyothy.com

గణితానికి సమయమేదీ?!

పాఠశాల విద్యలో అత్యంత ప్రాధాన్యం కలిగిన సబ్జెక్టులు గణితం, ఆంగ్లం. ప్రస్తుత సమాజంలో విద్యార్థులు రాణించాలంటే వారికి ఈ సబ్జెక్టులపై అవగాహన తప్పనిసరి. కానీ ఉన్నత పాఠశాలల్లో గణితానికి సరైన ప్రాధాన్యం దక్కడం లేదు. విద్యార్థులకు ఈ సబ్జెక్టుపై పూర్తి అవగాహన కల్గించాలన్నా, సిలబస్‌ను సకాలంలో పూర్తి చేయాలన్నా గణిత ఉపాధ్యాయునికి అదనపు పీరియడ్స్ అవసరం. కానీ విద్యాశాఖ తగిన స్థాయిలో గణితానికి పీరియడ్స్ కేటాయించడం లేదు. ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో గణితానికి ఎక్కువ పీరియడ్స్ కేటాయించిన పాఠశాలల్లో విద్యార్థులు లెక్కల్లో గణనీయమైన ప్రగతి సాధించినట్లు పలు నివేదికలు చెబుతున్నాయి.

విద్యా క్యాలెండర్ ప్రకారం.. ఉన్నత పాఠశాలల్లో (వారానికి) ప్రథమ భాషకు–6, ద్వితీయ భాషకు–4, తృతీయ భాషకు–6, గణితం–8, సామాన్య శాస్త్రం–6, భౌతిక శాస్త్రం–5, జీవశాస్త్రం–4, సాంఘిక శాస్త్రం–6 ఇలా 'సబ్జెక్టుల ప్రాధాన్యాన్ని బట్టి' పీరియడ్స్‌ను కేటాయించాలి. కానీ అలా జరగడం లేదు. అన్ని సబ్జెక్టులకూ వారానికి 6 పీరియడ్స్‌ను కేటాయిస్తున్నారు. దీంతో గణితశాస్త్ర ఉపాధ్యాయులు ఒత్తిడిని ఎదుర్కొంటున్నారు. సమయాభావం వల్ల విద్యార్థులకు గణితం పట్ల సరైన అవగాహన కలిగించలేకపోతున్నామన్న బాధతో పాటు, సిలబస్‌ను సకాలంలో పూర్తి చేయలేకపోతుండడంతో తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటున్నారు. ఫలితంగా ప్రతి ఏడాది ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి ఫలితాల్లో గణితంలో ఉత్తీర్ణులు కాని విద్యార్థుల సంఖ్య అధికంగా ఉంటోంది. ఉత్తీర్ణులైన విద్యార్థుల మార్కులను చూసినా గణితంలో అవి తక్కువగా ఉండడాన్ని గమనించవచ్చు. మరో విషయమేమంటే.. 6 నుంచి 10 తరగతుల వరకూ గణితశాస్త్ర ఉపాధ్యాయుడే గణితాన్ని బోధించాల్సి వస్తోంది. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం 6, 7 తరగతులకు భౌతికశాస్త్ర ఉపాధ్యాయుడు గణితాన్ని బోధించడంలో సహకారం అందించాలి. కేవలం 8, 9, 10 తరగతులకు మాత్రమే గణితశాస్త్ర ఉపాధ్యాయుడు గణితాన్ని బోధించాలి. కానీ అలా జరగడం లేదు.

విద్యార్థులకు సహపాఠ్య కార్యక్రమాలైన ఆరోగ్య, వ్యాయామ విద్య, కంప్యూటర్ విద్య వంటి వాటికి తగు స్థాయిలో ఉపాధ్యాయులు ఉండడం లేదు. వాటికి సంబంధించిన పుస్తకాలూ విద్యార్థులకు అందుబాటులో లేవు. బోధించని సహపాఠ్య కార్యక్రమాలకుగానూ 1–10 తరగతులకు మార్కులు కేటాయించడం, వాటికి అధికారులు ఆమోదం తెలపడం ప్రతి ఏడాదీ జరిగిపోతున్న ప్రక్రియ! ఇప్పటికైనా విద్యాశాఖ, ప్రభుత్వం స్పందించి గణితశాస్త్రానికి ఎక్కువ పీరియడ్స్‌ను కేటాయించాలి. విద్యార్థుల భవిష్యత్తుకు ఎంతో అవసరమైన ఈ సబ్జెక్టుపై దృష్టి పెట్టాలి.

– కాంచనపల్లి విజయ్‌కుమార్, తెలంగాణ గణిత ఫోరం

అన్నదాతలకు ఆసరాతోనే మంచి ఫలితాలు

తెలంగాణ రాష్ట్రం వ్యవసాయానికి సంబంధించిన అనేక అంశాలకు అనుకూలంగా ఉంది. కానీ చేయూత కరువవ్వడంతో రైతన్నలు పంట రుణాలు, సాగు, ఉత్పత్తి, పంట నిల్వ, మార్కెటింగ్, ఎగుమతులు వంటి అనేక విషయాల్లో వెనుకబడి ఉన్నారు. వారికి ప్రభుత్వం ఆసరానందిస్తే మెరుగైన ఫలితాలను సాధించవచ్చు.

రాష్ట్ర వాతావరణం విత్తనోత్పత్తికి అనుకూలంగా ఉంది. సమశీతోష్ణ వాతావరణం ఉండడం వల్ల రాష్ట్రంలో ఉత్పత్తి చేసిన విత్తనాలు ప్రపంచంలోని ఏ వాతావరణంలోనైనా మొలకెత్తుతాయి. ఉత్తర భారతదేశంలోని పలు ప్రాంతాలకు అవసరమైన కూరగాయల విత్తనాలు, పశువుల మేత కోసం ఎర్రజొన్నలు మొదట తెలంగాణలోనే ఉత్పత్తి చేశారు. అనంతరం అనేక విత్తన కంపెనీలు స్థానిక రైతులకు ఆడ, మగ విత్తనాలు ఇచ్చి వాణిజ్యపరంగా విత్తనోత్పత్తి చేయిస్తున్నాయి. విత్తన కంపెనీలు, రైతుల మధ్య ఎలాంటి రాతపూర్వక అగ్రిమెంట్ లేదు. దీంతో కంపెనీలకు రైతులకు మధ్య ఉండే ప్రమోటర్స్ రైతులను మోసగించి కంపెనీలకు లాభం చేకూరుస్తున్నారు. రాష్ట్రంలో నేటికీ విత్తన చట్టం లేదు. 2004లో విత్తన చట్టం రూపొందించి, పార్లమెంట్‌లో ప్రవేశపెట్టారు. కానీ కార్పొరేట్ల ఒత్తిళ్ల కారణంగా నేటికీ అది పెండింగ్‌లోనే ఉండిపోయింది. విత్తనచట్టం లేకపోవడం వల్లనే నాసిరకం విత్తనాల వ్యాపారం వ్యవస్థీకృతంగా సాగుతున్నది. ఈ సమస్యలను నివారించేందుకు తెలంగాణ ప్రభుత్వం విత్తనచట్టం తేవాలి.



రాష్ట్రంలోని 125 లక్షల ఎకరాల సాగుభూమిలో రైతులు ఇప్పటికే 25 శాతం పంటలు వేశారు. కానీ రాష్ట్రస్థాయి బ్యాంకర్ల కమిటీ నేటికీ 'రుణ ప్రణాళిక'ను విడుదల చేయలేదు. బీఆర్ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాలు రుణ మాఫీలు ప్రకటించడంతో బ్యాంకులు, సహకార సంఘాలు రుణ ప్రణాళికలు రూపొందించడంలో అలక్ష్యం ప్రదర్శిస్తున్నాయి. స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం చిన్న, సన్నకారు రైతులకు మొత్తం పంట రుణాలల్లో 8.3శాతం ఇవ్వాలని రిజర్వ్ బ్యాంక్ ఆదేశించినా బ్యాంకులు ఆ ఆదేశాలను పాటించడం లేదు. దాంతో రైతులు ప్రైవేట్ రుణాలపై ఆధారపడాల్సి వస్తోంది. రైతు బీమా, పంటల బీమా ప్రీమియంలను ప్రభుత్వం ఇంత వరకూ చెల్లించలేదు. పంటల బీమా, ప్రీమియంను జూలై 30లోపు కేంద్రానికి రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాలి. అప్పుడే ప్రధాని ఫసల్ బీమా పథకం రైతులకు వర్తిస్తుంది.

గ్రామీణ ప్రాంతంలోని కూలీలు పట్టణాలకు వలస వెళ్లడంతో, వ్యవసాయ పనులకు కూలీలు దొరకడం లేదు. ఈ సమస్యకు పరిష్కారంగా... ప్రభుత్వం మండల స్థాయిలో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి, వ్యవసాయానికి అవసరమైన చిన్న చిన్న యంత్రాలను రైతులకు అందుబాటులో ఉంచాలి. సబ్సిడీతో పాటు రుణసౌకర్యం కల్పించి యంత్రాల కొనుగోలుకు రైతులను ప్రోత్సహించాలి. ప్రభుత్వం పలు పంటల ప్రదర్శనా క్షేత్రాలను ఏర్పాటు చేసి, రైతులను వాటి పర్యటనకు తీసుకెళ్లాలి. మెట్టపంటలతో పాటు ప్రధానంగా హార్టికల్చర్ పంటల ప్రదర్శన క్షేత్రాలను విరివిగా ఏర్పాటు చేయాలి. ఎగుమతి ఆధారిత పంటలను ప్రదర్శించాలి. నర్సరీలను ఏర్పాటు చేసి, రైతులకు అవసరమైన పంటల మొక్కలను అందించాలి.

రాష్ట్ర ప్రభుత్వం రైతుల ఆదాయాన్ని పెంచడానికి వ్యవసాయోత్పత్తుల ప్రాసెసింగ్ యూనిట్లను ఏర్పాటు చేయాలి. ముడి ఉత్పత్తులకు బదులు బియ్యం, పప్పులు, నూనెలు, పండ్ల రసాలు, మిరప, పత్తి ఉప ఉత్పత్తులు, పాల ఉప ఉత్పత్తులు తయారు చేయడానికి అవసరమైన ప్రాసెసింగ్ యూనిట్లను ఏర్పాటు చేయాలి. ఈ యూనిట్లకు బ్యాంకులు, కార్పొరేషన్‌లు సహకరించాలి. రాష్ట్ర అవసరాలకు పోగా మిగిలిన ప్రాసెసింగ్ చేసిన ఉత్పత్తులను ఎగుమతి చేయాలి. వ్యవసాయోత్పత్తులు పెరగాలంటే రైతులకు భూములపై హక్కులు చట్టబద్ధంగా ఉండాలి. నేటికి 15 లక్షల మందికి పాస్ పుస్తకాలు లేవు. భూభారతి చట్టం ద్వారా రైతుల భూ సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలి.

రాష్ట్రంలో అన్ని రకాల పంటలు కలిపి ఏడాదికి దాదాపు 3.8 కోట్ల టన్నుల పంట ఉత్పత్తి అవుతోంది. ఇందులో కొన్ని పంటలకు శీతల గిడ్డంగులు అవసరం. మార్కెట్ మాంద్యంలో ఉన్నప్పుడు పంటను నిల్వ చేసుకుని, ధర పెరిగినప్పుడు అమ్ముకోవడానికి వీలుగా రైతులకు గోదాముల సౌకర్యం కల్పించాలి. రాష్ట్ర అవసరాలకు మించిన పంట ఉత్పత్తులను ఎగుమతి చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం ఒక మార్కెటింగ్ శాఖను ఏర్పాటు చేయాలి. పంట ఉత్పత్తుల్లో క్రిమి సంహారక మందుల మోతాదు పెరగకుండా శాస్త్రవేత్తలతో రైతులకు సలహాలు ఇప్పించాలి. నాణ్యమైన పంటను ఉత్పత్తి చేసేలా రైతులను చైతన్యవంతం చేయాలి. రైతే రాజు కాబట్టి రైతు సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి చేయాలి.

■ మూడ్ శోభన్
రాష్ట్ర సహాయ కార్యదర్శి, తెలంగాణ రైతు సంఘం

బడాబాబుల్ని వదిలి, సామాన్యులకా శిక్ష?

ఈ మధ్య వార్తాపత్రికలలో తెలంగాణలో రిజిస్ట్రేషన్ శాఖ ద్వారా అనుకొన్నంత ఆదాయం రావట్లేదని, భూమి, ఇళ్ల కొనుగోళ్లు తగ్గిపోతున్నాయనే వార్త ప్రచురితమైంది. దీనికి కారణం కాంగ్రెస్ ప్రభుత్వ విధానాలు అనే భావన ప్రజలలో కలుగుతున్నది. కాంగ్రెస్ ప్రభుత్వం మహిళా సాధికారత, ఉపాధి కల్పన, ప్రభుత్వ భూముల ఆక్రమణ నిలువరించేందుకు ముఖ్యంగా హైదరాబాదులో హైడ్రా వంటి వ్యవస్థ ఏర్పాటు, నైపుణ్యాల అభివృద్ధి, రైతులను ఆదుకోవడం, సంక్షేమ కార్యక్రమాల విషయాలలో మంచి పేరు తెచ్చుకుంది. కానీ ఈ మధ్య కష్టార్జితంతో ప్లాట్లు కొనుక్కుని రిజిస్ట్రేషన్ చేసుకున్నవారు, వారి ఆస్తుల్ని పిల్లల పెళ్లి, చదువుల నిమిత్తం అమ్ముకుందామంటే, ఆ భూములు ప్రభుత్వ భూమి అని రిజిస్ట్రేషన్ నిరాకరిస్తున్నారు. ఈ విధానంతో ఎంతోమంది మళ్లీ ఆత్మహత్యలకు పాల్పడే అవకాశం ఉంది.

గతంలో కొందరు రాజకీయ నాయకులు లేదా బడాబాబులు ప్రభుత్వ భూమిని ఆక్రమించుకొని సామాన్యులకు అమ్మారు. ప్రభుత్వ భూమి అన్న విషయం తెలియక పైసాపైసా కూడబెట్టి ఈ ఆస్తుల్ని కొన్నారు. అవి ప్రభుత్వ భూములు అవునా, కాదా అనే విచారణ చేయకుండా రిజిస్ట్రార్లు రిజిస్ట్రేషన్ చేశారు. ఇప్పుడు ఆ భూములు ప్రభుత్వానివని, వాటిమీద కొనుక్కున్న వారికి ఎలాంటి హక్కూ లేదని, వాటిని అమ్మకోవడానికి నిరాకరిస్తున్నారు. ఈ ప్రభుత్వం ఎన్ని మంచి పనులు చేసినా, కొన్ని లక్షల మందికి వారి కష్టార్జితాన్ని అనుభవించకుండా చేస్తున్నదన్న అపవాదు మూటకట్టుకుంటున్నది. అంతేకాకుండా ప్రభుత్వానికి కూడా ఆస్తుల లావాదేవీల ద్వారా రావలసిన ఆదాయం తగ్గుతోంది. ఎప్పుడో ఒక అవినీతిపరుడు ప్రభుత్వ భూమిని ఆక్రమించుకొని వాటిని సామాన్యులకు అమ్మి డబ్బు సంపాదించుకున్నాడు. అతడిని శిక్షించకుండా, ఆస్తులు కొన్నవాళ్లను శిక్షించడం న్యాయమా? అంటే నేరస్తుడికి తప్పించుకొనే అవకాశమిచ్చి, అమాయకులను బలి చేయడమనే విధానం శ్రేయస్కరం కాదు. బడాబాబులు, రియల్ ఎస్టేట్ వ్యాపారస్తులు కాకుండా... సామాన్యులు, ఉద్యోగస్తులు, చిన్న చిన్న వ్యాపారస్తులు కొన్న ప్లాట్‌లు రిజిస్ట్రేషన్ అయితే, అటువంటి వాటికి ప్రభుత్వం మినహాయింపు నివ్వాలి. గత ప్రభుత్వంలో ధరణిలో జరిగిన అన్యాయాలకు ఎంతోమంది రైతులు ఆత్మహత్య చేసుకున్నప్పుడు కాంగ్రెస్ పార్టీ నిరసన వ్యక్తం చేసింది. వారికి న్యాయం చేస్తామని చెప్పింది. కానీ ప్రస్తుత ప్రభుత్వ విధానాలతో అలాంటివారికి కాంగ్రెస్ ప్రభుత్వమే అన్యాయం చేస్తున్నట్టుగా ఉంది. ఇకనైనా చిన్నాచితక ఆస్తిపరులు వారి ఆస్తుల్ని అమ్ముకునేందుకు అడ్డంకులు లేకుండా త్వరితగతిన నిర్ణయాలు తీసుకుంటే ఈ ప్రభుత్వం చేసే మంచి పనులకు ఇంకొకటి తోడవుతుంది.

– హనుమంత ప్రసాద్‌రావు, హైదరాబాద్

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

రాంనగర్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): నగరంలోని పలు ఏరియాల్లో గురువారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి తెలిపారు. నక్కలగుట్ట సర్కిల్ పరిధిలోని భవానినగర్, భవానిమాత టెంపుల్, హౌసింగ్ బోర్డు, ఇందిరానగర్ ఏరియాలో ఉదయం 9 గంటల నుంచి 11 వరకు, వడ్డేపల్లి సబ్ స్టేషన్ పరిధిలోని వడ్డేపల్లి ఓల్డు విలేజ్, పింగిళి డ్రిగీ కాలేజ్, ముదిరాజ్ వాడ, విజయ్‌పాల్ కాలనీ, రాఘవేంద్రనగర్ ఫేస్-2లో ఉదయం 9 గంటల నుంచి 11వరకు విద్యుత్ సరఫరా ఉండదని డీఈ తెలిపారు.

మళ్లీ 'ఇచ్చంపల్లి'...

తెరపైకి బహుళార్థ సాధక ప్రాజెక్టు అంశం

శతాబ్దిన్నర కిందటి ఇచ్చంపల్లి ప్రాజెక్టు నిర్మాణ అంశం మళ్లీ తెరపైకి వచ్చింది. వైఎస్ హయాంలో ప్రతిపాదనలకు నోచుకున్న ఈ ప్రాజెక్టు... 17 ఏళ్ల తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వం మళ్లీ ఇప్పుడు ప్రస్తావించడం చర్చనీయాంశమైంది. గోదావరి-కావేరి నదుల అనుసంధానం కోసం రిజర్వాయర్ కడతామంటున్న కేంద్రానికి రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి లేఖ రాయడం, ఇచ్చంపల్లి ప్రాజెక్టు నిర్మాణ అంశాన్ని పరిశీలించాలని కోరడంతో ఇది తెరపైకి వచ్చింది. బనకచర్ల వివాదం నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చంపల్లి వద్ద గోదావరి-కావేరి నదుల అనుసంధానానికి ఈ మేరకు ప్రతిపాదించింది. అయితే.. ఇచ్చంపల్లి ప్రాజెక్టు వల్ల కాళేశ్వరం భవిష్యత్తు ప్రశ్నార్థకం కానుందని తెలుస్తోంది. కేంద్రానికి రాష్ట్ర ప్రభుత్వం చేసిన ఈ ప్రతిపాదనలకు ఆమోదముద్ర వేస్తే ఇచ్చంపల్లి వద్ద 100మీటర్ల ఎత్తుతో జలాశయ నిర్మాణం జరుగుతుంది. దీంతో లక్ష కోట్లు ఖర్చు చేసి నిర్మించిన మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల భవిష్యత్తు ఏమిటనే చర్చ మొదలైంది.

- ఆంధ్రజ్యోతి, భూపాలపల్లి


ఇచ్చంపల్లి వద్ద గోదావరి నదిలో గత ప్రాజెక్టు ఆనవాళ్లు


ఇచ్చంపల్లి వద్ద గోదావరి నదిలో ఫ్రెంచ్ అధికారులు నిర్మించిన తాత్కాలిక రోడ్డు

- 17 ఏళ్ల తర్వాత మరోసారి ప్రతిపాదన
- కేంద్రానికి మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి లేఖ
- బనకచర్ల ప్రాజెక్టు వివాదం నేపథ్యంలో సర్కారు చర్యలు
- మేడిగడ్డ బ్యారేజీ ఉనికి ప్రశ్నార్థకమే..?
- 159 ఏళ్ల క్రితం నిజాం కాలంలోనే ఇచ్చంపల్లి ప్రాజెక్టుకు పునాది

7


కొత్తపేటలో అభివృద్ధి పనులు పరిశీలిస్తున్న కమిషనర్ చహత్ బాజ్‌పాయ్

పనుల్లో నాణ్యత తప్పనిసరి..

- అలా ఉంటేనే బిల్లుల చెల్లిస్తాం
- జీడబ్ల్యూఎంసీ కమిషనర్ చహత్ బాజ్‌పాయ్

వరంగల్ కార్పొరేషన్, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ పరిధిలో జరుగుతున్న అబివృద్ధి పనుల్లో నాణ్యత ఉంటేనే బిల్లుల చెల్లింపు జరుగుతుందని జీడబ్ల్యూఎంసీ కమిషనర్ చహత్ బాజ్‌పాయ్ అన్నారు. బుధవారం గ్రేటర్ పరిధి 3వ డివిజన్ కొత్త పేట, పైడిపెల్లి, నవభారత్ కాలనీలలో జరుగుతున్న అభివృద్ధి పనులను కమిషనర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. కాంట్రాక్టర్లు చేసిన పనులను పూర్తి స్థాయిలో నాణ్యతా ప్రమాణాలను అధికారులు పరిశీలించారు. ఎంబీ రికార్డుల ప్రకారమే అనంతరం సీసీ రోడ్డు పనులను కొలతలతో పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఈఈ సంతోష్ బాబు, స్మార్ట్‌సిటీ అధికారులు ఆనందం, డీఈ రవికిరణ్‌తో పాటు ఏఈలు పాల్గొన్నారు.

22 మంది విద్యార్థులు.. రూ. 4.58 లక్షలు..

- నిట్‌లో ఇంపాక్ట్-1999 స్కాలర్‌షిప్‌ల పంపిణీ
- పూర్వ విద్యార్థుల ఆర్థిక సాయం


విద్యార్థినికి స్కాలర్‌షిప్ చెక్కును అందచేస్తున్న నిట్ డైరెక్టర్ బిద్యాధర్ సుబుధి

హనుమకొండ, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : వరంగల్ నిట్‌లో ఇంపాక్ట్-1999 స్కాలర్‌షిప్‌లో భాగంగా బుధవారం 22 మంది విద్యార్థులకు రూ.4.58 లక్షల స్కాలర్ షిప్పులను నిట్ డైరెక్టర్ ప్రొఫెసర్ బిద్యాధర్ సుబుధి పంపిణీ చేశారు. వరంగల్ నిట్, పూర్వ విద్యార్థుల సంఘం సంయుక్తంగా చేపట్టిన ఇంపాక్ట్ -1999 స్కాలర్‌షిప్ కార్యక్రమం కింద ఈ మొత్తాన్ని అందజేశారు. నిట్ క్యాంపస్‌లో బోస్ సెమినార్ హాల్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో డైరెక్టర్ సుబుధి మాట్లాడుతూ విద్యార్థులను ఆదుకోవడంలో పూర్వవిద్యార్థుల సంఘం ఆర్థిక సహాయాన్ని అందచేసినందుకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమం వల్ల పూర్వ విద్యార్థులకు, ప్రస్తుత విద్యార్థులకు మధ్య బలమైన సంబంధాలు ఏర్పడతాయన్నారు. పూర్వ విద్యార్థులు తమ వంతు విరాళాలను అందజేయడం ద్వారా విద్యార్థుల అభ్యున్నతికి మద్దతుగా నిలబడడం హర్షణీయం అన్నారు. 1999 బ్యాచ్ తరుపున ప్రతినిధులుగా పి.స్వర్ణలత (బీటెక్-ఈసీఈ), జె.జాన్ (బీటెక్-కెమికల్) కార్యక్రమానికి హాజరయ్యారు. ఎన్ఐటీ పూర్వ విద్యార్థుల సంఘం వెల్ఫేర్, బెనోవలెంట్ కమిటీ, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ విభాగానికి చెందిన బీటెక్ మూడవ సంవత్సరం విద్యార్థికి రూ. 72 వేల ఆర్థిక సహాయాన్ని అందించింది.

వడ్డీ బకాయిలకు మోక్షం

మహిళా సంఘాలకు రూ.22.23 కోట్లు చెల్లింపు



- ఇందిర మహిళా శక్తి సంబరాల్లో పంపిణీ
- తొమ్మిదేళ్ల తర్వాత ఎస్‌హెచ్‌జీలకు వడ్డీలేని రుణాలు
- మహిళా సంఘాల్లో హర్షాతిరేకాలు

హనుమకొండ, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : మహిళా సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. ఇందిర మహిళా శక్తి సంబరాల్లో భాగంగా స్వయం సహాయక సంఘాలకు (ఎస్‌హెచ్‌జీ) వడ్డీలేని రుణాల పథకం అమలుకు శ్రీకారం చుట్టింది. సంఘాల రుణాలకు వడ్డీని ప్రభుత్వమే చెల్లించేందుకు వీలుగా ఈ పథకాన్ని అమలు చేస్తోంది. ఈ డబ్బులను బుధవారం నుంచి ప్రారంభమైన సంబరాల్లో మహిళా సంఘాలకు చెక్కుల రూపంలో పంపిణీ చేయడం ప్రారంభించారు. ఇందులో భాగంగా జిల్లాకు 2024-25 సంవత్సరానికి, ఈ సంవత్సరం ఫిబ్రవరి మార్చి నెలలకు సంబంధించి మొత్తం రూ.22.23 కోట్లను ప్రభుత్వం జిల్లా గ్రామీణ పేదరిక నిర్మూలనా సంస్థ (సెర్ప్)కు విడుదల చేసింది. ఇందులో 2024-25 సంవత్సరానికి సంబంధించిన మొత్తం రూ. 22.23 కోట్ల బకాయిల్లో సంఘాల అర్హతను బట్టి రూ. 18.35 కోట్లను, అలాగే ఈ సంవత్సరం ఫిబ్రవరి, మార్చి నెలలకు సంబంధించి రూ.3.86 కోట్లు ఉన్నాయి. ఈ నెల 18 వరకు ఆయా సంఘాల బ్యాంకు ఖాతాల్లో జమచేయనున్నారు.

తొమ్మిదేళ్ల తర్వాత..

ఉమ్మడి ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో (2005) వడ్డీలేని రుణం పథకం అమల్లోకి వచ్చింది. బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి ద్వారా రుణాలు తీసుకునే సభ్యులకు ఇది వర్తింప చేస్తారు. రుణాలను నెలవారీగా సభ్యులు చెల్లించేవారు. ఆరు. నెలలకోసారి బ్యాంకులకు ప్రభుత్వం వడ్డీ సొమ్ము చెల్లించేది. మహిళా సంఘాలు చెల్లించిన వడ్డీ తిరిగి ఆయా సంఘాల ఖాతాల్లో బ్యాంకులు జమ చేసేవి. తెలంగాణ ఏర్పాటు తర్వాత 2016 వరకు ఈ విధానం కొనసాగింది. 2017 నుంచి నిలిచిపోయింది. తొమ్మిదేళ్ల తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వం దీనిని పునరుద్ధరించింది. గత ప్రభుత్వం హయాంలోని వడ్డీ బకాయిల జోలికి వెళ్లకుండా తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఉన్న బకాయిలను ఇటీవల విడుదల చేసింది. రుణాలు చెల్లించిన మహిళా సంఘాలకు ప్రభుత్వం వడ్డీ సొమ్ము తిరిగిచ్చేలా ఆదేశాలు జారీ చేసింది. ఇందులో భాగంగా రూ. 22.33 కోట్లు విడుదల చేసింది. మొత్తం 8600 ఎస్‌హెచ్‌జీలకు ఈ మొత్తం అందుతుంది. గతంలో వడ్డీ భారం మోయలేని మహిళలు రుణాలు తీసుకోలేక స్వయం ఉపాధికి దూరమయ్యారు. ఇప్పుడా పరిస్థితి ఉండదు.

మండలాల వారీగా..

మహిళా సంఘాలకు విడుదలైన వడ్డీ బకాయిల మొత్తంలో మండలాలవారీగా హసన్‌పర్తికి రూ.137 కోట్లు, ఐనవోలుకు రూ. 1.96 కోట్లు, ధర్మసాగర్‌కు రూ.2.22 కోట్లు, వేలేరుకు రూ. 1.32 కో ట్లు, ఆత్మకూరుకు రూ. 1.37 కోట్లు, దామెరకు రూ. 1.44 కోట్లు, నడికూడకు రూ. 1.10 కోట్లు, పరకాలకు రూ. 0.76 కోట్లు, కమలాపూర్‌కు రూ. 3.71 కోట్లు, భీమదేవరపల్లికి రూ.2.76 కోట్లు, ఎల్కతుర్తికి రూ. 2.29 కోట్లు శాయంపేటకు రూ. 1.93 కోట్లు విడుదలయ్యాయి. మంత్రి సీతక్క చొరవతో వడ్డీ బకాయిలు విడుదల కావడం పట్ల మహిళా సంఘాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి. వడ్డీ బకాయిలు (మిగతా 8లో...)



ఉద్యమాల యోధుడు ప్రభంజన్ కన్నుమూత

- ఐఏఎస్ ఉద్యోగానికి రాజీనామా చేసి తెలంగాణ ఉద్యమంలోకి...
- బీసీ కులాల హక్కుల కోసం నిరంతర పోరాటం
- విద్యావేత్తగా, రచయితగా, జర్నలిస్టుగా తనదైన ముద్ర
- తెలంగాణ వర్సిటీలో జర్నలిజం ప్రొఫెసర్‌గా కొంతకాలం విధులు
- స్వస్థలం పాలకుర్తి మండలం గూడూరు గ్రామం
- సంతాపం తెలిపిన మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్
- పార్థివదేహం జనగామ వైద్య కళాశాలకు అప్పగింత

7

మహిళా నాయకత్వానికి ప్రోత్సాహం

- కాంగ్రెస్‌లో సర్పంచ్ నుంచి ప్రధాన మంత్రి వరకు పరిపాలించారు...
- ఈ ఘనత మరే ఇతర పార్టీలకు లేదు
- రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో మహిళలకు 60 సీట్లు...
- రాష్ట్ర ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్, మాజీ మంత్రి జి.చిన్నారెడ్డి
- నగరంలో 'అధినేత్రి' శిక్షణ కార్యక్రమం


శిక్షణ శిబిరంలో మాట్లాడుతున్న చిన్నారెడ్డి, హాజరైన ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, మహిళా కాంగ్రెస్ నేతలు

హనుమకొండ సిటీ, జూలై 16 (ఆంధ్రజ్యోతి): పార్టీ ఆవిర్భావం నుంచి మహిళా నాయకత్వాన్ని కాంగ్రెస్ ప్రోత్సహిస్తోందని తెలంగాణ ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్, మాజీ మంత్రి జి.చిన్నారెడ్డి వెల్లడించారు. మహిళా నాయకత్వానికి ప్రాముఖ్యత ఇవ్వడంలో కాంగ్రెస్‌కు మరే పార్టీ సాటి రాదన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు, సర్పంచ్ వ్యవస్థ, పరిపాలన, మహిళా నాయకత్వం, నిధులు, గ్రామ స్థాయి నుంచి జిల్లా పరిషత్ వరకు పాలన వ్యవస్థ, మూడంచెల విధానం, భారత రాజ్యాంగం, సవరణలు, గ్రామ పరిపాలన నిధులు తదితర అంశాలపై 'అధినేత్రి' పేరుతో ఏఐసీసీ శిక్షణ శిబిరాల నిర్వహణ చేపట్టింది. ఇందులో భాగంగా హనుమకొండ హంటర్‌రోడ్డులోని డి-కన్వెన్షన్ హాలులో బుధవారం శిక్షణ శిబిరాన్ని నిర్వహించారు. గ్రామ నుంచి (మిగతా 8లో...)


ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతున్న ప్రొఫెసర్ కూరపాటి వెంకటనారాయణ

హనుమకొండ-వరంగల్ జిల్లాలను కలపాలి

- వరంగల్ నగరాన్ని ఒకే జిల్లా కేంద్రంగా మార్చాలి
- నగరాన్ని రెండు ముక్కలు చేసి అభివృద్ధికి విఘాతం కల్గించారు
- కేసీఆర్ ఏకపక్ష పోకడలతో వరంగల్‌కు తీవ్ర నష్టం
- తెలంగాణ ఉద్యమకారుల వేదిక రాష్ట్ర చైర్మన్ కె.వెంకటనారాయణ

6

రైల్వే మంత్రి పర్యటన ఖరారు

- 19న కాజీపేటకు రాక



కాజీపేట, జూలై 16 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 19న రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ కాజీపేటకు రానున్నారు. ఆయన పర్యటన అధికారికంగా ఖరారైనట్టు రైల్వే అధికారులు తెలిపారు. శనివారం ఆయన సికింద్రాబాద్ నుంచి ప్రత్యేక రైలులో కాజీపేటకు 12 గంటలకు చేరుకుంటారు. అక్కడి నుంచి ప్రత్యేక వాహనాల్లో అయోధ్యపురం వద్ద నిర్మిస్తున్న రైల్వే కోచ్ ఫ్యాక్టరీని సందర్శిస్తారు. మధ్యాహ్నం 2.45గంటలకు తిరిగి కాజీపేటకు చేరుకుని ప్రత్యేక రైలులో సికింద్రాబాద్‌కు చేరుకుంటారని రైల్వే అధికారులు తెలిపారు. రైల్వే మంత్రి వెంట రైల్వే జీఎం సంజయ్‌కుమార్ శ్రీవాత్సవ, కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌తోపాటు రైల్వే డిపార్ట్‌మెంట్ హెచ్‌వోడీలు ఉంటారని చెప్పారు.

జీఎం సాబ్.. జర దేఖో..



- డివిజన్ కోసం ముప్పై ఏళ్లుగా పోరాటం
- నిరుపయోగంగా కాజీపేట టౌన్ స్టేషన్
- అసౌకర్యాలకు నిలయంగా డివిజన్ ఆస్పత్రి
- నేడు కాజీపేటకు రానున్న దక్షిణ మధ్య రైల్వే జీఎం సంజయ్‌కుమార్ శ్రీవాత్సవ

కాజీపేట, జూలై 16 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో రెండవ అత్యంత ప్రాధాన్యం కలిగిన కాజీపేట జంక్షన్‌కు రైల్వే పరంగా పెద్దగా ప్రాధాన్యం దక్కట్లేదనే విమర్శలు తలెత్తుతున్నాయి. అమృత్ భారత్ స్కీంలో స్టేషన్ సుందరీకరణ పనులైనా, రైల్వే ప్లాట్‌ఫారాల పెంపు, టౌన్ స్టేషన్‌లో పలు రైళ్ల నిలిపివేతపై నిర్లక్ష్యం, నిత్యం సమస్యల్లో కొట్టుమిట్టాడుతున్న రైల్వే సబ్ డివిజన్ ఆసుపత్రి, రైల్వే ఉద్యోగుల సమస్యలు, క్రూ లాబీ ఉనికి, ఇలా కాజీపేట జంక్షన్‌కు రైల్వే పరంగా పలు సమస్యల కేంద్రానికి నిలయంగా మారుతోంది. కొందరు అధికారులు కావాలనే కాజీపేటు అభివృద్ధిని పట్టించుకోవడం లేదనే పలువురి వాదన అయినప్పటీ.. ఏది ఏమైనా సికింద్రాబాద్ డివిజన్‌లోనే ఎక్కువ మొత్తంలో లాభాలు తెచ్చిపెట్టే కాజీపేట జంక్షన్ మాత్రం పూర్తిగా నిర్లక్ష్యానికి గురవుతోందనేది వాస్తవం. గురువారం కాజీపేట పర్యటనకు వస్తున్న రైల్వే జీఎం సంజయ్‌కుమార్ శ్రీవాత్సవ కాజీపేటపై (మిగతా 8లో...)



ఇళ్ల లబ్ధిదారులకు మంజూరి పత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే

రాంపూర్‌ను అన్ని రకాలుగా అభివృద్ధి చేస్తా

●ఎమ్మెల్యే కడియం శ్రీహరి ●అభివృద్ధి పనులకు శంకుస్థాపన

మడికొండ, జూలై 16 (ఆంధ్రజ్యోతి): రాంపూర్ గ్రామాన్ని అన్ని రకాలుగా అభివృద్ధి చేస్తానని స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి హామీ ఇచ్చారు. గ్రేటర్ వరంగల్ 46వ డివిజన్ రాంపూర్‌లో బుధవారం గ్రేటర్ వరంగల్ మేయర్ గుండు సుధారాణితో కలిసి రూ.6.34కోట్ల నిధులతో సీసీ రోడ్లు, సైడ్ డ్రెయినేజీలు, తాగునీటి పైప్‌లైన్, వాటర్ సంప్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, హిందూ శ్మశానవాటిక అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు మంజూరు పత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కడియం శ్రీహరి మాట్లాడుతూ రాంపూర్ అభివృద్ధికి అత్యధిక నిధులు కేటాయిస్తున్నట్లు తెలిపారు. గ్రామంలో ప్రతీ గల్లీలో సీసీ రోడ్లు, డ్రెయినేజీలు నిర్మాణం చేస్తామన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు ఇప్పించే బాధ్యత తనదని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అంటేనే సంక్షేమ ప్రభుత్వం అని, పేద వర్గాల ప్రభుత్వంగా పనిచేస్తుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ మునిగాల సరోజన కరుణాకర్, అధికారులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

హనుమకొండ-వరంగల్ జిల్లాలను కలపాలి

వరంగల్ నగరాన్ని ఒకే జిల్లా కేంద్రంగా మార్చాలి

తెలంగాణ ఉద్యమకారుల వేదిక రాష్ట్ర చైర్మన్ వెంకటనారాయణ

వడ్డేపల్లి, జూలై 16 (ఆంధ్రజ్యోతి): చారిత్రక నగరంగా పేరొందిన వరంగల్‌ను హనుమకొండ, వరంగల్ జిల్లాలుగా విభజించి అభివృద్ధిని గత పాలకులు కుంగదీశారని తెలంగాణ ఉద్యమకారుల వేదిక రాష్ట్ర చైర్మన్ కూరపాటి వెంకటనారాయణ అన్నారు. రెండు జిల్లాల అభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని హనుమకొండ, వరంగల్ జిల్లాలను కలిపి వరంగల్ జిల్లాగా మార్చాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. హనుమకొండ బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

వరంగల్ నగరాన్ని ఒకే జిల్లాగా ఏర్పాటు చేస్తే అభివృద్ధి ఆశించిన మేర జరుగుతుందని అన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడితే వరంగల్ నగరం అభివృద్ధి కేంద్రంగా హైదరాబాద్ మహా నగరం వలె ఎదిగి అతి పెద్ద అభివృద్ధి కేంద్రంగా ఏర్పడుతుందని నిరుద్యోగులు, విద్యార్థులు, ఉద్యోగులు ఆశించారని తెలిపారు. ప్రత్యేక రాష్ట్ర ఉద్యమ సమయంలో వరంగల్ కేంద్రంగా ఉద్యమకారులు, వ్యాపారస్తులు, పారిశ్రామిక వేత్తలు, యువత ఆశలు పెంచుకున్నారని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రం సిద్ధించిన తర్వాత కేసీఆర్ పాలనలో వరంగల్‌ను చెక్కలు ముక్కలు చేసి ఆరు ముక్కలుగా విడదీశారని ఆరోపించారు. చారిత్రక నేపథ్యాన్ని, భౌగోళిక ఐక్యతను, అభివృద్ధి క్రమాన్ని, రాజకీయ చైతన్యాన్ని, సాంస్కృతిక గంభీరత్వాన్ని ధ్వంసం చేసి అశాస్త్రీయ చర్యలకు కేసీఆర్ పాల్పడ్డారని దుయ్యబట్టారు. వరంగల్ నగరాన్ని విభజించకూడదని 2017లో ఉద్యమకారులు, మేధావులు, విద్యార్థులు ర్యాలీలు, నిరసనలు నిర్వహించినప్పటికీ అప్పటి సీఎం కేసీఆర్ అహంకారంతో లెక్కచేయలేదని వెంకటనారాయణ ధ్వజమెత్తారు. ప్రజలకు ఇష్టం లేని వరంగల్ విభజనను అప్పటి ప్రజా ప్రతినిధులు సైతం ప్రశ్నించలేకపోయారని ఆవేదన వ్యక్తం చేశారు.

ఫోరం ఫర్ బెటర్ వరంగల్ అధ్యక్షుడు పుల్లూరి సుధాకర్ మాట్లాడుతూ సకల అభివృద్ధి రంగాలను సమ ఉజ్జీగా అభివృద్ధి జరిగినప్పుడే సమగ్ర అభివృద్ధి జరుగుతుందని తెలిపారు. కాకతీయ యూనివర్సిటీ, ఎల్బీ కళాశాల, సీకేఎం వంటి విద్యా కేంద్రాలు నిర్లక్ష్యానికి గురయ్యాయని విమర్శించారు. తెలంగాణ ఉద్యమకారుల వేదిక రాష్ట్ర కన్వీనర్ సోమ రామమూర్తి మాట్లాడుతూ వరంగల్ ఉమ్మడి జిల్లాను గత పాలకులు నిర్లక్ష్యం చేయడం వల్లనే శాసన సభ ఎన్నికల్లో ప్రజలు ఓడించారని అన్నారు. ఈ సమావేశంలో ఆల్ ఇండియా ఓబీసీ జాక్ చైర్మన్ సాయిని నరేందర్, ప్రజా సంఘాల నాయకులు బొమ్మినేని బాపిరెడ్డి, బుట్టి శ్యామ్ యాదవ్, వీరమల్ల బాబురావు, యాదగిరి పాల్గొన్నారు.

యూరియా పంపిణీలో గందరగోళం

• సొసైటీ వద్ద రోజంతా రైతుల పడిగాపులు • తోపులాటతో ఉద్రిక్తత • అధికారులపై రైతుల తీవ్ర ఆగ్రహం

శాయంపేట, జూలై 16 (ఆంధ్రజ్యోతి): శాయంపేట ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో యూరియా పంపిణీలో బుధవారం గందరగోళం చోటుచేసుకుంది. ప్రైవేటు దుకాణాలలో యూరియా అధిక ధరలకు విక్రయిస్తున్న నేపథ్యంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో నిర్ణీత ధరలకు యూరియా బస్తాలు విక్రయిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఈనెల 14న మొత్తం 320 బస్తాలు దిగుమతి చేశారు. దీంతో బుధవారం సుమారు 300 మంది రైతులు ఉదయం నుంచే గోదాం వద్ద క్యూలో ఉన్నారు. కానీ, పంపిణీ చేయాలంటే సీఈవో బయోమెట్రిక్ పెట్టాల్సి ఉంటుంది. ఈ మేరకు సస్పెండ్‌లో ఉన్న సీఈవో మోహన్ వేలిముద్ర పెట్టియ్యడంలో సొసైటీ సిబ్బంది ఆలస్యం చేయడం, అలాగే పంపిణీలో సాంకేతిక ప్రక్రియ వల్ల తీవ్ర జాప్యం జరిగింది.

ఈక్రమంలో రోజంతా క్యూలో పడిగాపులు కాసిన రైతుల మధ్య తోపులాట జరిగి స్వల్ప ఉద్రిక్తత చోటుచేసుకుంది. దీంతో పోలీసులు ప్రవేశించి రైతులను శాంతింపజేశారు. ఈ క్రమంలోనే సొసైటీ అధికారులు సరిగా పంపిణీ చేయక రోజంతా ఇబ్బంది పడ్డామని అధికారుల తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ముఖ్యంగా లైన్‌లో రోజంతా నిలబడలేక మహిళా రైతులు తీవ్ర ఇబ్బంది పడ్డారు. సిబ్బంది 300 బస్తాలు పంపిణీ చేసి, అదనంగా స్టాక్ తెప్పిస్తామని చేతులు దులుపుకున్నారు. దీంతో అసహనంతో మిగతా రైతులు వెనుదిరిగారు.

సస్పెండ్‌లో ఉన్నాడా.. విధులు నిర్వహిస్తున్నాడా..?

సొసైటీలో అవినీతికి పాల్పడిన ఇన్‌చార్జి సీఈవో శంకర్‌పై విచారణ అనంతరం ఇటీవల డీసీవో సంజీవ్‌రెడ్డి సస్పెన్షన్ విధించారు. అయినప్పటికీ శంకర్ సీఈవోగా విధులు నిర్వహిస్తున్నారని, బ్యాంకు లావాదేవీలతో అన్ని లావాదేవీలు తానే చేస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. దీనిపై అధికారులు సైతం పట్టించుకోవడం లేదని అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలో బుధవారం యూరియా పంపిణీలో అన్నీ తానై ముందుండి నడిపించడంతో పంపిణీలో అవినీతి జరిగే అవకాశం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



శాయంపేటలో సొసైటీ గోదాం వద్ద యూరియా కోసం పడిగాపులు కాస్తున్న రైతులు

మహిళలు ఆత్మగౌరవంతో జీవించాలి

వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు

వడ్డేపల్లి, జూలై 16 (ఆంధ్రజ్యోతి): మహిళలు స్వయంకృషితో ఆర్థికంగా ఎదిగి ఆత్మగౌరవంతో జీవించాలని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు అన్నారు. బుధవారం హనుమకొండలోని అంబేద్కర్ భవన్‌లో వర్ధన్నపేట నియోజకవర్గ పరిధిలోని పర్వతగిరి, వర్ధన్నపేట, ఐనవోలు, హసన్‌పర్తి మండలాల ఇందిరా మహిళా శక్తి సంబరాలను ఘనంగా నిర్వహించారు. తొలుత వరంగల్ కలెక్టర్ సత్యశారదతో కలిసి ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి సారథ్యంలో తెలంగాణ ప్రజా ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా చేసేందుకు ఇందిరా మహిళా శక్తి క్యాంటిన్లు, సోలార్ విద్యుత్ కేంద్రాలు, ఆర్టీసీ బస్సులు ఇస్తున్నట్లు తెలిపారు. మహిళా సంఘాలకు రూ.10లక్షల ప్రమాద బీమా, రూ.22లక్షల రుణబీమా, రూ.40కోట్ల 45 లక్షల బ్యాంకు లింకేజీ, రూ.7కోట్ల 76లక్షల వడ్డీ లేని రుణాలు పంపిణీ చేసినట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఇప్పటి వర కు నియోజకవర్గంలో 1,010 నూతన రేషన్ కార్డులు మంజూరి చేయడంతోపాటు 3,850 మంది పేర్లను అదనంగా రేషన్ కార్డుల్లో నమోదు చేసినట్లు తెలిపారు.

కలెక్టర్ సత్యశారద మాట్లాడుతూ మహిళా సంఘాల ద్వారా ఇందిరా మహిళా క్యాంటిన్లు, వడ్డీలేని రుణాలు, ధాన్యం కొనుగోలు కేంద్రాలు, యూనిఫామ్స్ కుట్టు పనులతోపాటు త్వరలోనే వర్ధన్నపేట మండలంలోని కట్ర్యాల గ్రామంలో మహిళా సంఘాల ద్వారా పెట్రోల్ బంకులు ఏర్పాటు చేస్తామని అన్నారు. మహిళా సాధికారతకు టీమ్ వర్క్ చేయాలని కలెక్టర్ మహిళా సంఘాలకు పిలుపునిచ్చారు. అనంతరం స్వయం సహాయక సంఘాలతో ఏర్పాటు చేసిన ఉత్పత్తుల ప్రదర్శనను ఎమ్మెల్యేతో పాటు కలెక్టర్ తిలకించారు. ఈ సదస్సులో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, సెర్ప్ డైరెక్టర్ నవీన్, జడ్పీ సీఈవో రామిరెడ్డి, డీఆర్‌డీవోలు కౌసల్యాదేవి, మేన శ్రీను, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, సింగిల్ విండో చైర్మన్లు తదితరులు పాల్గొన్నారు.



జ్యోతిప్రజ్వలన చేస్తున్న కలెక్టర్ సత్యశారద, ఎమ్మెల్యే నాగరాజు

మెరుగైన వైద్య సేవలు అందించాలి

డీఎంహెచ్‌వో అప్పయ్య

వరంగల్ మెడికల్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని హనుమకొండ డీఎంహెచ్‌వో అప్పయ్య అన్నారు. బుధవారం రాయపర్తి పీహెచ్‌సీ పరిధిలోని నార్లాపూర్, చర్లపల్లి ఆరోగ్య ఉప కేంద్రాలను సందర్శించారు. ఈ సందర్భంగా ప్రజలకు అందుతున్న సేవలను అడిగి తెలుసుకొని రికార్డులను పరిశీలించారు. సీజనల్ వ్యాధుల పట్ల సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, ఆశ కార్యకర్తలు, హెల్త్ అసిస్టెంట్లు, ఏఎన్‌ఎంలు ప్రతీ రోజు గృహ సందర్శన చేయాలని ఆదేశించారు. కంఠాత్మకూరు గ్రామంలో ఎక్కువగా ఫీవర్ కేసులు వస్తున్నాయని వెంటనే స్పెషల్ ఫీవర్ సర్వే చేపట్టి చికిత్స అందించాలన్నారు. పరకాల సివిల్ ఆస్పత్రిలో మూడు రోజుల పాటు నిర్వహించే టీబీ పరీక్షలను క్యాంపులను ప్రజలు వినియోగించుకోవాలన్నారు. అవసరం ఉన్న వారికి ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రుల్లో ఎక్స్‌రే పరీక్షలు చేసేందుకు సిద్ధం చేశామన్నారు. రాయపర్తి పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ కొక్కొండ దివ్య, పల్లె దవాఖానా డాక్టర్లు, సూపర్‌వైజ ర్లు, ఏఎన్‌ఎంలు, హెల్త్ అసిస్టెంట్లు, ఆశాలు పాల్గొన్నారు.

కళాకారుల సమస్యలు సీఎం దృష్టికి తీసుకెళ్తా..

సాంస్కృతిక మండలి రాష్ట్ర చైర్‌పర్సన్ డాక్టర్ జీవీ వెన్నెల



రాష్ట్ర సదస్సులో మాట్లాడుతున్న వెన్నెల

వడ్డేపల్లి, జూలై 16 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర సాధనలో కవులు, కళాకారులే కీలక పాత్ర పోషించారని సాంస్కృతిక మండలి రాష్ట్ర చైర్‌పర్సన్ డాక్టర్ జీవీ వెన్నెల అన్నారు. బుధవారం హనుమకొండ బొక్కలగడ్డలోని సిటిజన్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన బ్యాండ్ వాయిద్య కళాకారుల సంఘం రాష్ట్ర సదస్సుకు రాష్ట్ర అధ్యక్షుడు గుమ్మడిరాజుల నాగరాజు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన జీవీ వెన్నెల మాట్లాడుతూ.. బ్యాండ్, వాయిద్య కళాకారులు, ఒగ్గు, జానపద కళాకారుల సమస్యలను సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని అన్నారు. కళాకారుల కుటుంబంలో పురుడు పోసుకున్న తనకు వారి సమస్యలు తెలుసునని, రెక్కాడితే గాని డొక్కాడని పరిస్థితులు కళాకారులవని స్పష్టం చేశారు. చేతి వృత్తిదారుల సమన్వయ కమిటీ రాష్ట్ర కన్వీనర్ ఎంవీ రమణ మాట్లాడుతూ.. రాష్ట్రంలో బ్యాండ్ వాయిద్య కళావృత్తినే జీవనాధారంగా చేసుకొని లక్షలాది మంది జీవిస్తున్నారని అన్నారు.

బ్యాండ్ వాయిద్య కళాకారుల సంఘం రాష్ట్ర కన్వీనర్ గుమ్మడిరాజుల నాగరాజు మాట్లాడుతూ బ్యాండ్ వాయిద్య ఫెడరేషన్ ఏర్పాటు చేసి నిధులు కేటాయించాలని అన్నారు. బ్యాండ్ వాయిద్య బృందానికి పూర్తి సబ్సిడీతో రూ.2లక్షల చొప్పున ఆర్థిక సహకారం అందించాలని, గుర్తింపు కార్డులు జారీ చేయాలని, 50 సంవత్సరాలు పైబడిన కళాకారులకు పెన్షన్ సౌకర్యం కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఒగ్గు, జానపద కళాకారుల సమస్యలను పరిష్కరించాలని ఆ సంఘం జిల్లా సలహాదారుడు కాడబోయిన లింగయ్య రాష్ట్ర చైర్మన్ జీవీ వెన్నెలకు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సదస్సులో బ్యాండ్ వాయిద్య కళాకారుల సంఘం రాష్ట్ర, జిల్లా నాయకులు ఎండి.రాజాసాహెబ్, ఎండి.చాంద్‌పాషా, కుక్కముడి శంకర్, ఎస్‌కే.రసూల్, దస్తగిరి, ఎండి.హుస్సేన్, మడిపెద్ది వెంకన్న, ఎండి.అంకూస్, ఎండి.బషీర్, డబ్బా శ్రీను, పొనగంటి మొగిలి, అరబండి తార, అంజయ్య పాల్గొన్నారు.

పురాతన వస్తువులు, కళాఖండాలు అందజేయండి

వరంగల్ ఎడ్యుకేషన్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): చరిత్రను అర్థం చేసుకోవడానికి, సంరక్షించడానికి, ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు గతం గురించి లోతైన అధ్యయనం చేయడానికి ఉపయోగపడే పునాతన వస్తువులు, కళాఖండాలు విజ్ఞాన పీఠానికి అందజేయాలని జానపద గిరిజన విజ్ఞానపీఠం పీఠాధిపతి గడ్డం వెంకన్న కోరారు. బుధవారం హంటర్‌రోడ్‌లోని సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం జానపద గిరిజన విజ్ఞానపీఠంలో జరిగిన సమావేశంలో గడ్డం వెంకన్న మాట్లాడుతూ జానపద గిరిజన విజ్ఞానపీఠం స్థాపించి 30 సంవత్సరాలు పూర్తయిందని, పీఠంలో అరుదైన వస్తువులతో మ్యూజియం ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. "ఉమ్మడి వరంగల్ జిల్లా వాసులు తమ దగ్గర ఉన్న ఉపయోగంలో ఉన్నా లేకపోయిన పురాతనమైన చరిత్రక వస్తువులను, కళాఖండాలను, పూర్వ కాలంలో ఉపయోగించిన రాతి, లోహ, చెక్క సంబంధమైన వంటసామాను, ఇంటి సామాను పనిముట్లు తదితర విలువైన వస్తువులను అందజేయాలని కోరారు.

మా భూములకు పట్టాలివ్వండి

మహబూబాబాద్ టౌన్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): మహబూబాబాద్ కలెక్టర్ కార్యాలయం ఎదుట బుధవారం కేసముద్రం మండలం నారాయణపురం రైతులు తమ భూములకు పట్టాలివ్వాలని ఆందోళన చేపట్టారు. 'తమ పట్టా భూములకు పట్టాలివ్వండి పొంగులేటి సారు.. అంటూ' ఫ్లెక్సీలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ నారాయణపురం రైతులకు ఏనిమిదేళ్లుగా పట్టేదారు పాస్‌పుస్తకాలు లేక రైతుబంధు, రైతు బీమా, రుణమాఫీ, పంట రుణాలకు దూరమయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే తమ భూములకు పట్టాలిచ్చి ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల వరకు తమ భూములకు పట్టాలివ్వకుంటే గ్రామంలో ఆ ఎన్నికలను బహిష్కరిస్తామని స్పష్టం చేశారు. మాజీ ఎంపీటీసీ ధారవత్ రవి, బీమా, వీరన్న, విరసింగ్, లచ్చు, లక్‌పతి, వెంకన్న, రవి, బాస్కర్, దేవా పాల్గొన్నారు.

వ్యక్తి మృతికి కారణమైన ఆరుగురి అరెస్టు

ఆత్మహత్యగా చిత్రీకరించిన నిందితులు

వివరాలు వెల్లడించిన ఏసీపీ పింగిళి ప్రశాంత్‌రెడ్డి

ఎల్కతుర్తి, జూలై 16 (ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతానికి గురై మృతి చెందిన వ్యక్తి మృతదేహాన్ని వ్యవసాయ బావిలో పడేసి ఆత్మహత్యగా చిత్రీకరించబోయిన ఆరుగురు నిందితులను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు కాజీపేట ఏసీపీ పింగిళి ప్రశాంత్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఎల్కతుర్తి పోలీస్ సర్కిల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిందితుల అరెస్టు చూపిన ఏసీపీ ఘటన వివరాలను వెల్లడించారు.

ఎల్కతుర్తి మండలం గోపాల్‌పూర్‌కు చెందిన గండికోట సాంబయ్య అలియాస్ సాంబరాజు(32) అదే గ్రామానికి చెందిన శీలం బాలరాజు అలియాస్ బాలు, ఊదరి రాజులతో కలిసి గత శనివారం అర్ధరాత్రి గ్రామ శివారులోని వచ్చునూరి ప్రవీణ్ పొలం వైపు పావురాల షికారుకు వెళ్లారు. అప్పటికే అక్కడ అడవి పందుల కోసం గోపాల్‌పూర్‌కు చెందిన తక్కళ్లపెల్లి చందర్‌రావు ప్రోద్బలంతో అదే గ్రామానికి చెందిన పెండ్యాల తిరుపతి, ఎల్కతుర్తికి చెందిన బొజ్జ స్వామి, బొజ్జ సతీష్‌లు అడవి పందుల కోసం ప్రవీణ్ పొలంలో ఉన్న విద్యుత్ పోలు నుంచి తక్కళ్లపెల్లి నర్సింగారావు చేను మీదుగా చందర్‌రావు పొలం వరకు విద్యుత్ వైర్లను అమర్చారు. ఈ క్రమంలో సాంబరాజు కాలుకు విద్యుత్ వైర్లు తగలగా షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. భయభ్రాంతులకు గురైన బాలరాజు, రాజులు అక్కడి నుంచి పారిపోయారు.

ఆదివారం తెల్లవారు జామున పెండ్యాల తిరుపతి, బొజ్జ స్వామి, బొజ్జ సతీష్‌లు తాము బిగించిన ఉచ్చులకు ఏమైనా జంతువులు పడి ఉంటాయని భావించి సంఘటన స్థలానికి చేరుకున్నారు. అక్కడ విద్యుదాఘాతానికి గురై మృతి చెందిన సాంబరాజు మృతదేహం కనిపించడంతో నేరం వారిపైకి రాకుండా ఉండేందుకు మృతదేహాన్ని పక్కనే ఉన్న గ్రామ మాజీ సర్పంచ్ మాసిపెద్ది భాస్కర్‌రావు వ్యవసాయ బావిలో పడేసి ప్రమాదానికి కారణమైన ఆనవాళ్లను తొలగించారు. గ్రామస్థుల సమాచారం మేరకు సంఘటన స్థలానికి చేరుకున్న సీఐ పులి రమేష్, ఎస్సై ప్రవీణ్‌కుమార్ మృతదేహాన్ని బావిలో నుంచి బయటకు తీసి శవ పంచనామా నిర్వహించారు. దీంతో మృతుడి కాలికి విద్యుత్ షాక్ తగిలి ఏర్పడిన గాయాన్ని గుర్తించి దర్యాప్తును వేగవంతం చేయగా నిందితుల ఆచూకీ లభ్యమైనట్లు ఏసీపీ తెలిపారు. మృతుడి భార్య మమత ఫిర్యాదు మేరకు నేరాన్ని కప్పిపుచ్చే ప్రయత్నం చేయడంతో పాటు విద్యుత్ చౌర్యానికి పాల్పడినందుకు చందర్‌రావు, తిరుపతి, స్వామి, సతీష్, బాలరాజు, రాజులపై కేసు నమోదు చేసినట్లు ఏసీపీ పేర్కొన్నారు.

నిందితులు పరారీలో ఉండగా.. బుధవారం ఎస్సై ప్రవీణ్‌కుమార్ గోపాల్‌పూర్ క్రాస్ రోడ్డు వద్ద వాహనాల తనిఖీ చేస్తుండగా మూడు ద్విచక్ర వాహనాలపై గోపాల్‌పూర్ వైపు వెళ్లున్న ఆరుగురిని గుర్తించి అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. వీరి వద్ద నుంచి మూడు ద్విచక్ర వాహనాలు, అడవి పందులను చంపడానికి ఉపయోగించిన విద్యుత్ వైర్లు, ఉచ్చులకు బిగించిన కంకబద్ధలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కొద్ది గంటల్లోనే మృతి మిస్టరీని ఛేదించిన సీఐ పులి రమేష్, ఎస్సై ప్రవీణ్‌కుమార్, హెడ్‌కానిస్టేబుల్ మల్లేశం, విఠల్‌రావు, బుచ్చిలింగం, కానిస్టేబుళ్లు భాస్కర్‌రెడ్డి, బక్కయ్య, రాజయ్య, సుమన్, రంజిత్, సదానందంలను ఏసీపీ అభినందించారు. సమావేశంలో భీమదేవరపల్లి, వంగర ఎస్సైలు దివ్య, సాయిబాబు, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.



నిందితులను అరెస్టు చూపుతున్న ఖాజీపేట ఏసీపీ ప్రశాంత్‌రెడ్డి

కారోబార్ సంఘం జిల్లా చైర్మన్‌గా పడాల రాజు



నల్లబెల్లి, జూలై 16 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీల కారోబార్‌ల సంఘం జిల్లా చైర్మన్‌గా పడాల రాజును ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు రాష్ట్ర జేఏసీ ప్రచార కార్యదర్శి మహ్మద్ యాకూబ్ పాషా తెలిపారు. బుధవారం వరంగల్‌లోని ఏకశిలా పార్కులో జరిగిన సమావేశంలో నూతన కారోబార్‌ల జేఏసీ కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా పడాల రాజు మాట్లాడుతూ.. కారోబార్, బిల్‌కలెక్టర్‌లను 51 జీవో నంచి మినహాయించాలన్నారు. అర్హులైన కారోబార్, బిల్ కలెక్టర్‌లను పంచాయతీ సహాయ కార్యదర్శులుగా నియమించాలన్నారు. ప్రతీ నెల గ్రీన్ చానల్ ద్వారా ఎంపీడబ్ల్యూ వర్కర్లులకు వేతనాలు చెల్లించాలన్నారు. గ్రామ పంచాయతీలో పనిచేసే ఎంపీడబ్ల్యూ వర్కర్లులకు ఇన్సూరెన్స్ ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని కోరారు.

గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో

ఏసీబీ అధికారుల సోదాలు

● రికార్డులు పరిశీలన, పలురకాల సరుకుల శాంపిల్స్ సేకరణ

మహబూబాబాద్ క్రైం, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని గిరిజన బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలో ఏసీబీ డీఎస్పీ సాంబయ్య పర్యవేక్షణలో ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు, లీగల్‌మెట్రాలజీ, రాష్ట్ర ఆడిట్ అధికారుల బృందం బుధవారం తనిఖీలు చేపట్టింది. పాఠశాల ప్రిన్సిపాల్ అనిత అందజేసిన రికార్డులను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఏసీబీ డీఎస్పీ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలను వరంగల్ ఏసీబీ వారి ఆధ్వర్యంలో జిల్లా ఫుడ్ ఇన్‌స్పెక్టర్, లీగల్‌మెట్రాలజీ, రాష్ట్ర ఆడిట్ అధికారుల బృందం సమన్వయంతో పాఠశాలను సందర్శించి, సోదాలు నిర్వహించినట్లు తెలిపారు. అన్ని రకాల రికార్డులను పరిశీలించినట్లు తెలిపారు. మౌలిక వసతులు, పరిసరాల పరిశుభ్రత, బిల్డింగ్ వసతి, ప్రభుత్వం నుంచి సరఫరా అయ్యే అన్ని రకాల సరుకుల్లో నాణ్యతను పరిశీలించినట్లు తెలిపారు. కారం, పసుపు, చింతపండుతో పాటు పలు రకాల సరుకుల శాంపిల్స్‌ను సేకరించామని, క్షేత్రస్థాయి నివేదిక, సరుకుల శాంపిల్స్‌ను ప్రభుత్వ ఉన్నతాధికారులకు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో ఏసీబీ ఇనిస్పెక్టర్లు ఎస్.రాజు, ఎల్.రాజు, అధికారులు ఉన్నారు.



గిరిజన బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలో రికార్డులు పరిశీలిస్తున్న అధికారుల బృందం

వరంగల్ మార్కెట్ ధరలు

(రూ. వేలల్లో)

పంట	క్వింటా గరిష్ఠం	క్వింటా కనిష్ఠం
మక్కలు	2456	1521
పల్లికాయ (సూక)	6110	3450
పల్లికాయ (పచ్చిది)	4550	1575
కందులు	5889	3022
పెసళ్లు	8001	3022
పత్తి	7750	5300
పసుపు (కాడి)	11555	9534
పసుపు (గోల)	10259	9700
తేజ మిర్చి	12000	8500
తేజ ఏసీ	13300	11500
వండర్‌హాట్	11000	6000
వండర్‌హాట్ ఏసీ	14500	11500
యూఎస్341ఏసీ	12500	7000
దీపిక	9000	8000
సింగిల్‌పట్టి ఏసీ	-	-
తాలు మిర్చి	6500	3000

- వరంగల్ వ్యవసాయం

మళ్లీ 'ఇచ్చంపల్లి'..

- తెరపైకి బహుళార్థ సాధక ప్రాజెక్టు అంశం
- 17 ఏళ్ల తర్వాత మరోసారి ప్రతిపాదన
- కేంద్రానికి మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి లేఖ


ఇచ్చంపల్లి వద్ద గోదావరి నదిలో గత ప్రాజెక్టు ఆనవాళ్లు

భూపాలపల్లి, జూలై 16 (ఆంధ్రజ్యోతి): శతాబ్దాల చారిత్రక నేపథ్యం కలిగి ఉన్న ఇచ్చంపల్లి బహుళార్థక ప్రాజెక్టు నిర్మాణ అంశం మరోసారి తెరపైకి వచ్చింది. భూపాలపల్లి జిల్లా పలిమెల మండలం ఇచ్చంపల్లి వద్ద గోదావరి, ఇంద్రావతి నదులు కలిసే చోట రిజర్వాయర్ నిర్మించడం ద్వారా గోదావరి-కావేరి నదుల అనుసంధానం చేయాలని ప్రతిష్ఠాత్మకంగా చేపట్టనున్న కార్యక్రమంలో ఈ ప్రతిపాదనలు చేర్చాలంటూ రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కేంద్ర జనవరుల మంత్రిత్వ శాఖకు లేఖ రాయడం చర్చనీయాంశమైంది.

వాస్తవానికి 2008లో అప్పటి ముఖ్యమంత్రి వై.ఎస్.రాజశేఖర రెడ్డి హయాంలోనే ఇచ్చంపల్లి, ప్రాణహిత, కంతనపల్లి ప్రాజెక్టులను నిర్మించాలని నిర్ణయించారు. ఈ క్రమంలో మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలను ఒప్పించే ప్రయత్నాలు కూడా అప్పట్లో జరిగాయి. మహారాష్ట్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించినా ఛత్తీస్‌గఢ్ వైపు అత్యధికంగా 9,500 ఎకరాలకు పైగా ముంపు ప్రాంతం ఉండటంతో ఆ రాష్ట్ర ప్రభుత్వం అనుమతులకు మోకాలడ్డింది. దీంతో ఆ ప్రతిపాదనలు మరుగున పడ్డాయి.

వై.ఎస్.రాజశేఖరరెడ్డి మరణించడం, రాష్ట్ర విభజన జరగడం లాంటి పరిణామాల క్రమంలో అధికారం చేపట్టిన టీఆర్ఎస్ మహాదేవపూర్ మండలం మేడిగడ్డ వద్ద కాళేశ్వరం ఎత్తిపోతల ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టింది. ఈ పరిస్థితుల్లో ఇచ్చంపల్లి అంశం దాదాపు తెరమరుగైంది. అంతకుముందు ఈ ప్రాజెక్టు నిర్మాణం కోసం నాటి కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి చెన్నమనేని విద్యాసాగర్‌రావు నేతృత్వంలో ప్రాజెక్టు సాధన సమితి ప్రతిపాదిత స్థలం వరకు పాదయాత్ర చేసి ఇచ్చంపల్లి వద్ద గోదావరి మాత విగ్రహాన్ని కూడా ఏర్పాటు చేశారు. అంతే కాదు.. ఇచ్చంపల్లి ప్రాజెక్టును నిర్మించడం ద్వారా నాసిక్ నుంచి ధవళేశ్వరం దాకా జల రవాణాకు వీలుగా వాటర్ వే కూడా ఏర్పాటు చేసే అవకాశం ఉన్నందున కేంద్రం పరిశీలించాలని అప్పట్లో డిమాండ్ చేశారు. బీజేపీతోపాటు సీపీఎం నేతలు కూడా ప్రాజెక్టు సాధన కోసం ఇచ్చంపల్లి దాకా పాదయాత్ర చేశారు. గోదావరి వరదతోపాటు మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ మీదుగా ప్రవహించే ఇంద్రావతి ద్వారా జల లభ్యత అధికంగా ఉన్న దృష్ట్యా ఇక్కడ ప్రాజెక్టు నిర్మించడం ద్వారా అటు విద్యుత్తు ఉత్పాదనతో పాటు నీటిని ఎత్తిపోసే దాదాపు 7లక్షల ఎకరాల భూములకు సాగునీటిని కూడా అందించే అవకాశం ఉంటుందని అంచనా వేశారు.

ఇచ్చంపల్లికి 159 ఏళ్ల చరిత్ర

ఇచ్చంపల్లి ప్రాజెక్టు చరిత్ర చాలా పురాతనమైనది. నిజాం కాలంలోనే అంటే.. 1866లో ఫ్రెంచ్ ఇంజనీర్ల సలహాతో ప్రాజెక్టు నిర్మాణానికి బీజం పడింది. అప్పట్లో ఈ ప్రాజెక్టు నిర్మాణానికి అవసరమైన అన్ని ఏర్పాట్లు జరిగాయి. నిర్మాణ పనులు ప్రారంభించారు. అయితే 1869లో ప్రబలిన ప్లేగు వ్యాధి కారణంగా నిర్మాణం అర్ధంతరంగా ఆగిపోయింది.

ఈ ప్రాజెక్టు నిర్మాణంలో క్రియాశీలకంగా పనిచేసిన ఫ్రెంచి ఇంజనీర్ కుటుంబ సభ్యులు ప్లేగు వ్యాధికి బలైపోవడంతో కార్మికులు ఇంజనీర్లు పనులను వదిలేసి ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని అక్కడ నుంచి వెళ్లిపోయారని చెబుతుంటారు. ఆ ఫ్రెంచ్ ఇంజనీర్ కుటుంబ సభ్యుల సమాధులు, నిర్మాణ సామగ్రి, సున్నపు బట్టీల ఆనవాళ్లు ఇప్పటికీ ఇచ్చంపల్లి ప్రాజెక్టు పరిసరాల్లో చెక్కుచెదరకుండా ఉన్నాయి. అప్పట్లో గోదావరికి అడ్డుగా ఇంద్రావతి కలిసే చోట బట్టి సున్నం, రాళ్లతో కట్టిన నిర్మాణాలు 159 ఏళ్లయినా చెక్కుచెదరకుండా కనిపించడం విశేషం.

మేడిగడ్డ ఉనికి ప్రశ్నార్థకం..

బనకచర్ల వివాదం నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చంపల్లి వద్ద గోదావరి-కావేరి నదుల అనుసంధానానికి గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం ద్వారా కాళేశ్వరం భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారింది. కేంద్ర ప్రభుత్వం ఈ ప్రతిపాదనలకు ఆమోదముద్ర వేస్తే ఇచ్చంపల్లి వద్ద 100మీటర్ల ఎత్తుతో జలాశయ నిర్మాణం జరుగుతుంది. దీంతో లక్ష కోట్లు ఖర్చు చేసి నిర్మించిన మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల భవిష్యత్తు ఏమిటనే చర్చ మొదలైంది.

2023లో మేడిగడ్డ, అన్నారం బ్యారేజీలు దెబ్బతినడంతో నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ నీటిని నిల్వ చేయకుండా ఆదేశాలు జారీ చేసింది. రాష్ట్ర ప్రభుత్వ తాజా ప్రతిపాదనల ప్రకారం మేడిగడ్డకు ప్రత్యామ్నాయంగా ఇచ్చంపల్లి ప్రాజెక్టు చేపడితే బ్యాక్ వాటర్ ద్వారా నీటిని వాడుకునే వెసులుబాటు ఉంటుందని, అలాంటప్పుడు ఇక మేడిగడ్డతో పనేముంటుందని నిపుణులు అంటున్నారు.

బనకచర్ల వివాదం నేపథ్యంలో..

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గోదావరి జలాలను బనకచర్లకు అనుసంధానం చేయడం ద్వారా రాయలసీమలోని ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు జిల్లాలకు సాగునీటిని అందించే ఉద్దేశంతో బనకచర్లకు అనుమతులను కోరుతూ కేంద్రానికి ప్రతిపాదనలు సిద్ధం చేసిన నేపథ్యంలో గోదావరి జలాల తరలింపుపై తెలంగాణ అభ్యంతరాలు లేవనెత్తింది. దీంతో వివాదం రాజుకుంది. ఈ నేపథ్యంలో నిన్న మొన్నటి వరకు ఇచ్చంపల్లి నుంచి దక్షిణాది రాష్ట్రాలకు గోదావరి జలాలను తరలించడంపై అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ వచ్చిన రాష్ట్రం తాజా పరిణామాల్లో గోదావరి-కావేరి నదుల అనుసంధాన ప్రక్రియకు సూత్రప్రాయ అంగీకారం తెలపడం చర్చనీయాంశంగా మారింది. తద్వారా ఇచ్చంపల్లి వద్ద 100 మీటర్ల ఎత్తుతో డ్యామ్‌ను నిర్మించడం ద్వారా అటు 975 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తితో పాటు దాదాపు 200 టీఎంసీల వరకు నీటిని ఎత్తిపోసే అవకాశం ఉందంటూ రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కేంద్రానికి ప్రతిపాదించారు. ఈ ప్రాజెక్టును ప్రధాన మంత్రి కృషిసంచాయి యోజన పథకంలో చేర్చి నిధులు కేటాయించాలని కేంద్రానికి ప్రతిపాదించడం ఆసక్తిని రేకెత్తిస్తోంది.


ఇచ్చంపల్లి వద్ద గోదావరి నదిలో ఫ్రెంచ్ అధికారులు నిర్మించిన కట్టడం


డీఐజీకి గౌరవ వందనం చేస్తున్న బెటాలియన్ సిబ్బంది


బెటాలియన్ సిబ్బందికి సూచనలు ఇస్తున్న డీఐజీ సి.సన్నీ

విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలి..

టీజీఎస్పీ బెటాలియన్ డీఐజీ సి.సన్నీ

మామునూరు, జూలై 16 (ఆంధ్రజ్యోతి): విధినిర్వహణలో పోలీసులు అప్రమత్తంగా ఉండాలని, తగిన జాగ్రత్తలు పాటించి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని టీజీఎస్పీ బెటాలియన్ డీఐజీ సి.సన్నీ సూచించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా బుధవారం ఆయన మామునూరు బెటాలియన్‌ను సందర్శించారు. బెటాలియన్ కమాండెంట్ బి.రామ్ ప్రకాశ్ ఆధ్వర్యంలో డీఐజీకి ఘనస్వాగతం పలికారు. బెటాలియన్ సిబ్బంది గౌరవ వందనం సమర్పించారు. అనంతరం బెటాలియన్‌లోని మోటర్ ట్రాన్స్‌పోర్టు, హెడ్‌క్వాటర్ యూనిట్ హాస్పిటల్, క్యాంప్ ఆఫీసులను తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిత్యం క్రమశిక్షణతో మెలగాలని, బాధ్యతగల ఉద్యోగులుగా ప్రజలకు సేవలు అందించాలని సూచించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్‌లు కృష్ణ ప్రసాద్, శ్రీనివాస రావు, వీరన్న, ఆర్ఐలు ఆర్ఎస్ఐలు, బెటాలియన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలు అందించాలి

డీఎంహెచ్‌వో డాక్టర్ అప్పయ్య


మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో డాక్టర్ అప్పయ్య

వరంగల్ మెడికల్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని హనుమకొండ డీఎంహెచ్‌వో డాక్టర్ అప్పయ్య అన్నారు. బుధవారం రాయపర్తి పీహెచ్‌సీ పరిధిలోని నార్లాపూర్, చర్లపల్లి ఆరోగ్య ఉప కేంద్రాలను సందర్శించారు. ఈ సందర్భంగా ప్రజలకు అందుతున్న సేవలను అడిగి తెలుసుకొని రికార్డులను పరిశీలించారు. సీజనల్ వ్యాధుల పట్ల సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, ఆశ కార్యకర్తలు, హెల్త్ అసిస్టెంట్లు, ఏఎన్ఎంలు ప్రతీ రోజు గృహ సందర్శన చేయాలని ఆదేశించారు. కంఠాత్మకూరు గ్రామంలో ఎక్కువగా ఫీవర్ కేసులు వస్తున్నాయని వెంటనే స్పెషల్ ఫీవర్ సర్వే చేపట్టి చికిత్స అందించాలన్నారు. పరకాల సివిల్ ఆస్పత్రిలో వచ్చే మూడు రోజులు నిర్వహించే టీబీ పరీక్షలను క్యాంపులను ప్రజలు వినియోగించుకోవాలన్నారు.అవసరం ఉన్న వారికి ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రుల్లో ఎక్స్‌రే పరీక్షలు చేసేందుకు సిద్ధం చేశామన్నారు. ఈ కార్యక్రమంలో రాయపర్తి పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ కొక్కొండ దివ్య, పల్లె దవాఖానా డాక్టర్లు, సూపర్‌వైజర్లు, ఏఎన్ఎంలు, హెల్త్ అసిస్టెంట్లు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.


కస్తూరీనగరంలో నీళ్ల బిందెతో వరి నారు తడుపుతున్న రైతు రాంబాబు

హలధారి.. అరిగోస

నారుమడులు కాపాడుకునేందుకు భగీరథ ప్రయత్నం..

బయ్యారం, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : వరుణుడు ముఖం చాటే శాడు. రైతన్న అరిగోస పడుతున్నాడు. పంటను కాపాడుకోవడానికి భగీరథ ప్రయత్నం చేస్తున్నాడు. వానాకాలం ప్రారంభమై రెండునెలలు కావస్తున్నా.. సరిపడా వానలు పడిన దాఖలాలు లేవు. ఖరీఫ్ పంట సాగుకు ఆదిలోనే వరుణుడు శాపంగా మారాడు. ఎప్పటిలాగానే ఈ ఏడాది కూడా రైతన్నలు పక్షం రోజుల క్రితం సాగు పనులు ప్రారంభించారు. అందులో భాగంగా పలువురు రైతులు వరి నారుమడి సిద్ధం చేసి విత్తనాలు చల్లారు. అనంతరం అరకొర చిరు జల్లులు మినహా పెద్దగా వర్షాలు కురవకపోవడంతో చాలా మంది రైతుల వరి నారు ఎండిపోయే దశకు చేరుకుటుంది. ఈ క్రమంలోనే బుధవారం మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండలం కస్తూరీనగరం గ్రామానికి చెందిన మాలోత్ రాంబాబు, దరావత్ బాబులాల్ అనే రైతులు వరి నారును బతికించుకునేందుకు ఎన్నో వ్యయప్రయాసలకోర్చుతున్నారు.ట్యాంకర్ల సహాయంతో నీటిని తీసుకొచ్చి బిందెలు, క్యాన్లతో వరి నారుమడులను తడుపుతున్నారు.

ఖరారైన జడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాలు

- జడ్పీటీసీలు 75, ఎంపీటీసీలు 778
- జారీ అయిన అధికారిక ఉత్తర్వులు

హనుమకొండ, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి జిల్లాలో జడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాలను ప్రభుత్వం ఖరారు చేసింది. ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. మొత్తం జడ్పీటీసీ స్థానాలు 75 కాగా, ఎంసీటీసీ స్థానాలు 778. నాలుగు కొత్త మండలాలు కేజే మల్లంపల్లి, ఇనుగుర్తి, సీరోలు, గోరికొత్తపల్లి ఏర్పాటు కావడంతో జడ్పీటీసీల సంఖ్య 71 నుంచి 75కు పెరిగింది. 3 కొత్త మున్సిపాలిటీలు- కేసముద్రం, ములుగు, స్టేషన్‌ఘనపూర్ ఏర్పాటు కావడంతో కొన్ని గ్రామాలు వాటిలో విలీనం అయినందు వల్ల ఎంపీటీసీ స్థానాలు 792 నుంచి 778కు తగ్గాయి. త్వరలో స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ వెలువడనున్న నేపథ్యంలో ప్రభుత్వం జడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాలను ఖరారు చేస్తూ ప్రకటన చేసింది.

జిల్లాలు	జడ్పీటీసీలు	ఎంపీటీసీలు
వరంగల్	11	130
హనుమకొండ	12	129
జయశంకర్ భూపాలపల్లి	12	109
మహబూబాబాద్	18	193
జనగామ	12	134
ములుగు	10	83
మొత్తం	75	778

ఉద్యమాల యోధుడు ప్రభంజన్ కన్నుమూత

- విద్యావేత్తగా, రచయితగా, జర్నలిస్టుగా తనదైన ముద్ర
- సంతాపం తెలిపిన మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్
- పార్థివదేహం జనగామ వైద్య కళాశాలకు అప్పగింత


పాలకుర్తిలో ప్రభంజన్ మృతదేహం వద్ద గద్దర్ కూతురు వెన్నెల, జర్నలిస్టు కదిరే కృష్ణ


ప్రభంజన్ అంతిమయాత్ర

పాలకుర్తి, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : బీసీ కులాల ఉద్యమ నాయకుడు, విద్యావేత్త, రచయిత, జర్నలిస్టు యాదనాల ప్రభంజన్ కుమార్ యాదవ్ (62) బుధవారం హైదరాబాద్‌లో కన్నుమూశారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ప్రభంజన్ ఆస్పత్రిలో చికిత్స పొందారు. అనంతరం హైదరాబాద్‌లోని తన నివాసంలో విశ్రాంతి తీసుకుంటుండగా బుధవారం మరణించారు. ఆయనకు భార్య రేఖ, ఇద్దరు కుమారులు వున్నారు. ఆయన భౌతికకాయాన్ని స్వస్థలం పాలకుర్తి మండలంలోని గూడూరు గ్రామానికి తీసుకురాగా, భిన్న రంగాల ప్రముఖులు నివాళులర్పించారు. గ్రామంలో అంతిమయాత్ర నిర్వహించిన అనంతరం, పార్థివదేహాన్ని జనగామ ప్రభుత్వ వైద్య కళాశాలకు అప్పగించారు.

బహుముఖ ప్రజ్ఞాశాలి

విద్యార్థి దశ నుంచే ఉద్యమ స్వభావం కలిగిన ప్రభంజన్ కుమార్ బలహీనవర్గాల కులాలు, బహుజన హక్కుల కోసం ఉద్యమ బాటపట్టారు. సామాజిక న్యాయం కోసం జర్నలిజాన్ని ఆయుధంగా ఉపయోగించారు. పలు పత్రికలతో పాటు విద్యారంగానికీ సేవలందించారు. కాకతీయ, తెలంగాణ యూనివర్సిటీల్లో జర్నలిజం విభాగాలను స్థాపించడంలో ముఖ్య భూమిక పోషించారు. ప్రభంజన్ స్వస్థలం జనగామ జిల్లా పాలకుర్తి మండలంలోని గూడూరు గ్రామం. యాదనాల కొంరమ్మ, సోమయ్య దంపతులకు 1963 మార్చి 21న ప్రథమ సంతానంగా జన్మించాడు. ప్రభంజన్‌కు ముగ్గురు సోదరులు, ఇద్దరు చెల్లెల్లు ఉన్నారు. తండ్రి సోమయ్య పదేండ్ల క్రితం మృతి చెందారు.

ప్రభంజన్ ఒకటో తరగతి నుంచి టెన్త్ వరకు అమ్మమ్మ ఊరిలోని జఫర్‌గడ్ మండలం కూనురులో చదివారు. ఇంటర్ నిజామాబాద్, డిగ్రీ, పీజీ ఉస్మానియా వర్సిటీలో పూర్తి చేశారు. విద్యార్థి దశనుంచే ఉద్యమాల్లో పాల్గొన్నారు. ఉన్నత విద్య తర్వాత యూపీఎస్సీ ద్వారా ఇండియన్ ఇన్ఫర్మేషన్ సర్వీస్ (ఐఐఎస్) సాధించారు. 1998లో ఐఐఎస్ అధికారిగా ఆలిండియా రేడియోలో డిప్యూటీ ఎడిటర్‌గా విధులు నిర్వర్తించారు. ఆ తర్వాత జాతీయ ప్లానింగ్ కమిషన్‌లో పీఆర్‌వోగా కొద్దిరోజులు పని చేసి ఉద్యోగానికి రాజీనామా చేశారు. అనంతరం తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో చురుకుగా పాల్గొన్నారు. డోలు దెబ్బ, యాదవ ఇంటలెక్చువల్ ఫోరం స్థాపనలో పాల్గొన్నారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు దొడ్డి కొమురయ్య రూపురేఖలను ప్రపంచానికి పరిచయం చేసిన వ్యక్తి ప్రభంజన్ కుమారే. గద్దర్ నడిపించిన జననాట్య మండలిపై ఎంఫిల్ థీసిస్ ప్రజంటేషన్ చేశారు. తెలంగాణ వర్సిటీలో జర్నలిజం విభాగంలో ప్రొఫెసర్‌గా పని చేసి 2017లో వీఆర్ఎస్ తీసుకున్నారు. ప్రభంజన్ కుమార్ అంతర్యం, ప్రభంజన పథం, గొల్ల కుర్మల సంస్కృతి గొప్ప సంస్కృతి, డోలుదెబ్బ, దండోరా, నడుస్తున్న చరిత్ర, కాసుల జ్ఞానం, బహుజన మీడియా లాంటి పుస్తకాలు రాశారు. కొన్ని నెలల క్రితం క్యాన్సర్ బారినపడ్డారు. ప్రముఖ రచయిత, కవి గూడ అంజయ్య సోదరుని కూతురు డాక్టర్ రేఖను వివాహం చేసుకున్నారు. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. ఆయన భౌతిక కాయాన్ని కుటుంబసభ్యులు జనగామ వైద్య కళాశాలకు అప్పగించారు. అంతకుముందు గూడూరు గ్రామంలో బుధవారం అంతిమయాత్ర నిర్వహించారు.

పలువురు ప్రముఖుల నివాళి

ప్రభంజన్ మృతి పట్ల మాజీ సీఎం కేసీఆర్ సంతాపం ప్రకటించారు. ఆయన మరణం సామాజిక ఉద్యమాలకు తీరని లోటన్నారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ప్రభంజన్ భౌతికకాయానికి తెలంగాణ సాంస్కృతిక సారథి చైర్ పర్సన్ జి.వి. వెన్నెల పూలమాల వేసి నివాళులర్పించారు. మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ప్రగాఢ సానుభూతిని ప్రకటించారు. మాజీ ఎంపీ రాపోలు ఆనంద భాస్కర్, చెరుకు సుధాకర్, జర్నలిస్టు కదిరే కృష్ణ, బత్తుల సిద్ధేశ్వర్, కవి, రచయిత శంకరమంచి శ్యాంప్రసాద్, రచయిత రాపోలు సత్యనారాయణ, జర్నలిస్టు మార్గం లక్ష్మీనారాయణ, గుమ్మడిరాజుల సాంబయ్య తదితరులు ప్రభంజన్ భౌతికకాయానికి నివాళులర్పించారు.


డీఈవో వాసంతికి వినతిపత్రం అందజేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు

'భోజన' కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

వరంగల్ ఎడ్యుకేషన్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ బుధవారం తెలంగాణ మధ్యాహ్న భోజనకార్మికుల యూనియన్, సీఐటీయూ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో డీఈవో కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా యూనియన్ గౌరవ అధ్యక్షురాలు నిడిగొండ రజిత మాట్లాడుతూ గత 20 సంవత్సరాలుగా పని చేస్తున్న కార్మికులకు పని భద్రత కల్పించాలని డిమాండ్‌చేశారు. ఐదు నెలల నుంచి బకాయి వేతనాలు ఇవ్వకుంటే ఏ విధంగా పని చేయాలో చెప్పాలన్నారు. ప్రభుత్వం గ్యాస్ సబ్సిడీ అందజేయాలని, కోడి గుడ్ల బకాయిలు సైతం తక్షణమే అందించాలన్నారు.కార్మికులకు కనీస వేతనంగా రూ. 26 వేలు అందించి ప్రభుత్వ గుర్తింపు కార్డు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని డీఈఓ వాసంతికి అందజేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ ప్రధానకార్యదర్శి కె.శాంత, ఎండి.పర్వీన్, జి.లక్ష్మి, సునీత, మమత, రేవతి, జిజియా తదితరులు పాల్గొన్నారు.


కళాశాలలో నిరసన చేస్తున్న విద్యార్థులు

ఎడ్యుకేషన్ కళాశాలలో విద్యార్థుల నిరసన

సమస్యలు పరిష్కరించాలి డిమాండ్

కేయూ క్యాంపస్ జూలై 16, (ఆంధ్రజ్యోతి) : కేయూ క్యాంపస్ ఎడ్యుకేషన్ కళాశాలలోని విద్యార్థులు కళాశాలలో నెలకున్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ బీఈడీ, ఎంఈడీ విద్యార్థులు నిరసన చేపట్టారు. కళాశాల వద్ద బైఠాయించారు ప్లకార్డులు ప్రదర్శిస్తూ పెద్ద పెట్టున నినాదాలు చేశారు. గత కొన్ని రోజులుగా కళాశాలలో సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తున్నప్పటికీ సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. కళాశాలకు రెగ్యులర్ అధికారులు లేరని ఆందోళన వ్యక్తం చేశారు. తమ వద్దకు వర్సిటీ ఉన్నతాధికారులు వచ్చి సరైన హామీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఈడీ, ఎంఈడీ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో మైసమ్మ బోనాలు



రాయపుర లోని మైసమ్మ ఆలయానికి బోనాలతో తరలి వచ్చిన మహిళలు, భక్తులు

హనుమకొండ చౌరస్తా, జూలై 16(ఆంధ్రజ్యోతి) : హనుమకొండ 9వ డివిజన్ రాయపురలోని మైసమ్మ తల్లికి స్థానిక మహిళలు, ప్రజలు భక్తి శ్రద్ధలతో పెద్ద ఎత్తున బోనాలను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. బుధవారం ఉదయం స్థానిక మహిళతో పాటు నగరంలోని వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు తండోపతండాలుగా అమ్మ వారి ఆలయానికి చేరుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు పెద్ద ఎత్తున డప్పు చప్పుళ్లతో తాము కోరిన కోర్కెలు తీర్చే కొంగు బంగారమైన మైసమ్మ ఆలయానికి చేరుకొని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు బైరి శ్రావణ్, నవీన్, ఆలయ కమిటీ సభ్యులు కట్ల కిషన్, మంచాల శ్రీనివాస్, దొడ్డపాటి శేఖర్, కొత్తగట్టు పవన్, వడ్డెమానుకోట చేరాలు, వేల్పుల బిక్షపతి, కట్ల రాజు, నటరాజ్, పెద్ది వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



ఎంవోయూ చేసుకుంటున్న వర్సిటీ అధికారులు

యూనైటెడ్ వే ఆఫ్ హైదరాబాద్‌తో కేయూ ఎంవోయూ

కేయూ క్యాంపస్ జూలై 16, (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని యూనైటెడ్ వే ఆఫ్ హైదరాబాద్ సంస్థతో కేయూ కో ఎడ్యుకేషన్ ఇంజనీరింగ్ కళాశాల కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి సమక్షంలో ఎంవోయూ చేసుకున్నారు.. బుధవారం కేయూలో జరిగిన ఎంవోయూలో సాఫ్ట్‌స్కిల్స్, డేటా సైన్స్ అంశాలలో విద్యార్థులకు శిక్షణ అందించనున్నారు. ఈ కార్యక్రమంలో కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం, భరత్, సౌమ్య రెడ్డి, ప్రిన్సిపాల్ రమణ, వి.మహేందర్, ప్లేస్‌మెంట్ అధికారి సంతోష్‌కుమార్‌లు పాల్గొన్నారు .

కె-హబ్‌ను పరిశీలించిన హైదరాబాద్ అధికారులు

హైదరాబాద్‌లోని టీహబ్ ప్రతినిధులు బుధవారం కేయూలోని కే-హబ్ కార్యాలయాన్ని పరిశీలించారు. కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రంలు హబ్ విశేషాలను హైదరాబాద్‌లోనిన టీ హబ్ ప్రతినిధులు శ్రీనివాస్, బెంజమేన్‌లకు వివరించారు.

సీపీని కలిసిన సైబర్ క్రైం ఏసీపీ



సీపీకి మొక్క అందజేస్తున్న ఏసీపీ గిరికుమార్

వరంగల్ క్రైం, జూలై 16 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ సైబర్ సెక్యూరిటీ వరంగల్ విభాగం నూతన ఏసీపీగా బాధ్యతలు స్వీకరించిన గిరి కుమార్ బుధవారం వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. పెండింగ్‌లో ఉన్న సైబర్ క్రైం కేసులను సత్వరమే పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలని సూచించారు.

కాజీపేట పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేసిన సీపీ



సీపీకి స్వాగతం పలుకుతున్న ఇన్‌స్పెక్టర్

కాజీపేట, జూలై 16 (ఆంధ్రజ్యోతి): కాజీపేట పోలీస్‌స్టేషన్‌ను బుధవారం సీపీ సన్‌ప్రీత్ సింగ్ తనిఖీ చేశారు. వార్షిక తనిఖీల్లో భాగంగా స్టేషన్‌కు వచ్చిన సీపీకి స్థానిక ఇన్‌స్పెక్టర్ వై.సుధాకర్ రెడ్డి పూలమొక్క అందజేసి స్వాగతం పలికారు. అనంతరం సీపీ స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్ల వివరాలు, పెండింగ్ కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. రికార్డులను పరిశీలించారు. అలాగే శాఖాపరమైన సమస్యలు తెలుసుకున్నారు. సీపీ వెంట సెంట్రల్ జోన్ డీసీపీ షేక్ సలీమా, ఏసీపీ పి.ప్రశాంత్‌రెడ్డి ఎస్సైలు నవీన్‌కుమార్, లవన్‌కుమార్, శివ ఉన్నారు.

మన సంప్రదాయాలను కాపాడుకోవాలి

ఐపీఎస్ ప్లే స్కూల్ చైర్మన్ భరత్‌గౌడ్



బోనాల పండుగలో పాల్గొన్న చిన్నారులు

హసన్‌పర్తి, జూలై 16 (ఆంధ్రజ్యోతి): పూర్వీకులు మనకు అందించిన సంస్కృతి, సంప్రదాయాలు గొప్పవని, వాటిని కాపాడుకుని భవిష్యత్ తరాలకు అందించాలని ఐపీఎస్ ప్లే స్కూల్ చైర్మన్ తీగల భరత్‌గౌడ్ అన్నారు. భీమారం ఐపీఎస్ ప్లే స్కూల్‌లో బుధవారం బోనాల పండుగ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన హాజరై మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలలో బోనాల పండుగకు అత్యంత ప్రాధాన్యత ఉందన్నారు. ప్రతి సంవత్సరం విద్యార్థులకు బోనాల పండుగ విశిష్టతను తెలియజేస్తూ ఉత్సవాలను నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ప్రదానోపాధ్యాయురాలు తీగల సరిత, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

కార్మికులు ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలి

వరంగల్ కార్పొరేషన్, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ వరంగల్ మునిసిపల్ కార్పొరేషన్‌లో పని చేస్తున్న కార్మికులు ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలని మేయర్ గుండు సుధారాణి అన్నారు. బుధవారం గ్రేటర్ వరంగల్ ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో కమిషనర్ చహత్ బాజ్‌పాయ్‌తో పాటు డిస్లడ్జింగ్ ఆపరేటర్లు, డీఆర్‌సీసీ రాక్ పిక్కర్స్‌తో ' నమస్తే' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. రాక్ పిక్కర్స్ సెప్టిక్ ట్యాంక్ క్లీనర్స్ కష్టపడి పని చేసి పిల్లలను ఉన్నత చదువులు చదివించాలని అన్నారు. అనంతరం రాక్‌పిక్కర్స్‌కు రూ. 5 లక్షల ఆయుష్మాన్ ఆరోగ్య కార్డులు, పీపీ కిట్లు అందించారు.

వడ్డీ బకాయిలకు మోక్షం

(5వ పేజీ తరువాయి)

విడుదల కావడంతో మహిళా సంఘాల సభ్యులు ఊరట చెందుతున్నారు. జిల్లాలో 12 మండల సమాఖ్యలు, 397 గ్రామ సంఘాలు (వీవోలు), 10,359 స్వయం సహాయక సంఘాలు, వీటిలో 1,16,216 సభ్యులు ఉన్నారు. ఇందిర శక్తి సంబరాల్లో వడ్డీ బకాయిలతో పాటు రుణ బీమా, ప్రమాద బీమ చెక్కులను కూడా అందజేస్తారు.రుణ బీమాకింద97 క్లేములకు సంబంధించి రూ. 78,77,926, ప్రమాద బీమా కింద 8 క్లేములకు గాను రూ. 80 లక్షలు అందచేస్తారు.

సంబరాలు

ఇందిర మహిళా శక్తి సంబరాలు బుధవారం నుంచి ప్రారంభమయ్యాయి. ఈనెల 18 వరకు జరుగుతాయి. బుధవారం వర్ధన్నపేట నియోజకవర్గ పరిధిలోని హసన్‌పర్తి, ఐనవోలు మండలాలకు మహిళా శక్తి సంబరాలు హనుమకొండ అంబేద్కర్ భవన్‌లో జరిగాయి. ఈ రెండు మండలాల నుంచి 75 సభ్యుల చొప్పున హాజరయ్యారు. గురువారం హుస్నాబాద్ నియోజకవర్గం పరిధిలోని భీమదేవరపల్లి, ఎల్కతుర్తి మండలాల సంబరాలకు సంబంధించి సిద్దిపేట జిల్లా కొహెడలో, పరకాల నియోజకవర్గం పరిధిలోని ఆత్మకూరు, దామెర, నడికుడ, పర కాల సంఘాల సంబరాలు పరకాల వెల్లంపల్లి రోడ్డులోని మహదేవ ఫంక్షన్ హాల్‌లో జరుగుతాయి. ప్రతీ మండలం నుంచి 500 మంది చొప్పున సభ్యులు హాజరవుతారు. ఈనెల 18న స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకరవ్గం పరిధిలోని ధర్మసాగర్, వేలేరు మండలాల సంబరాలు సరిపురం ఫంక్షన్ హాల్‌లో హుజురాబాద్ నియోజకవర్గం పరిధిలోనికమలాపూర్ మండల సంబరాలు ఇల్లంతకుంటలో,భూపాలపల్లి నియోజకవర్గం పరిధిలోని శాయంపేట మండల సంబరాలు చిట్యాలలో జరుగుతాయి.

జవాన్‌లు అంకిత భావంతో విధులు నిర్వర్తించాలి

నగర మేయర్ గుండు సుధారాణి



జవాన్లతో మాట్లాడుతున్న మేయర్ సుధారాణి

వరంగల్ కార్పొరేషన్, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : నగరంలో పని చేసే పారిశుధ్య జవాన్లు అంకిత భావంతో విధులు నిర్వర్తించాలని వరంగల్ నగర మేయర్ గుండు సుధారాణి అన్నారు. బుధవారం బల్దియా ప్రధాన కార్యాలయంలో కమిషనర్ చహత్ బాజపాయ్‌తో పాటు పారిశుధ్య కార్మికులతో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. పారిశుధ్య జవాన్ల సేవలు వెలకట్టలేనివని, వారు లేనిదే ప్రజారోగ్యం లేదని అన్నారు. డివిజన్‌లలో ప్రతీ కాలనీ పరిశుభ్రంగా ఉండేందుకు ప్రణాళికాబద్ధంగా విధులు నిర్వర్తించాలన్నారు. జవాన్‌లు ప్రతీ రోజు నాలుగు సార్లు బయోమెట్రిక్ హాజరు వేయాలన్నారు. ఇకపై మ్యాన్యువల్ హాజరు పరిగణలోకి తీసుకోరని గుర్తు చేశారు. నగరంలో ప్రతీ ఇంటి నుంచి 100 శాతం చెత్త సేకరణ జరగాలని అన్నారు. స్వచ్ఛ ఆటోలు తడి, పొడి చెత్తను వేరు వేరుగా స్వీకరించాలన్నారు.

కమిషనర్ చహత్ బాజ్‌పాయ్ మాట్లాడుతూ.. తడి, పొడి చెత్తపై నగరవాసులకు అవగాహన కల్పించాలన్నారు. ప్రతీ డివిజన్‌కు ఇద్దరు జవాన్‌లు మాత్రమే పని చేయాలన్నారు. ప్రభుత్వ ఉద్యోగుల స్థానంలో బదిలీ వర్కర్లు హాజరు పలికితే చర్యలు తప్పవని హెచ్చరించారు. 15 రోజులు విధులకు గైర్హాజరైన జవాన్‌లను విధుల నుంచి శాశ్వతంగా తొలగించడం జరుగుతుందని హెచ్చరించారు. విధుల పట్ల అలసత్వం వహిస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. అనంతరం కొందరు శానిటరి సూపర్‌వైజర్లను లేపి డ్యూటీ చాట్ అడిగారు. వారికి ఏ మాత్రం అవగాహన లేక పోవడంతో మందలించారు. ఈ కార్యక్రమంలో సీఎంహెచ్‌వో డాక్టర్ రాజారెడ్డి, ఎంహెచ్‌వో డాక్టర్ మల్లం రాజేశ్, శానిటరి సూపర్‌వైజర్లు, శానిటరి ఇన్‌స్పెక్టర్లు, జవాన్‌లు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే నాగరాజుకు వినతిపత్రం అందజేస్తున్న కాలనీవాసులు

సమస్యలు పరిష్కరించండి

ఎమ్మెల్యేకు ఛత్రపతి శివాజీ కాలనీవాసుల వినతి

హసన్‌పర్తి, జూలై 16 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ 66వ డివిజన్ పరిధి ఛత్రపతి శివాజీ కాలనీలో సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కాలనీవాసులు ఎమ్మెల్యే కేఆర్.నాగరాజును కలిసి వినతిపత్రం అందజేశారు. సీసీ రోడ్డు, డ్రెయినేజీ వ్యవస్థ లేకపోవడంతో కాలనీ ప్రధాన రోడ్డు గుండా సుమారు 600 మంది విద్యార్థులు, స్థానిక ప్రజలు నిత్యం రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కాలనీవాసులు ఉపయోగించే వృథానీరు వీధిలోకి చేరి మురికి గుంటలు ఏర్పడి దోమల బారిన పడి అనారోగ్యానికి గురవుతన్నారని తెలిపారు. తమ ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని సైడ్‌డ్రెయిన్, సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టి సమస్యలను పరిష్కరించాలని కాలనీవాసులు ఆ వినతిలో కోరారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో సట్యూరి సంతోష్‌రాజ్‌తో పాటు కాలనీవాసులు ఉన్నారు.

శానిటరీ ఇన్‌స్పెక్టర్లకు పదోన్నతులు

సూపర్‌వైజర్లుగా ఇతర జోన్‌లకు బదిలీ

వరంగల్ కార్పొరేషన్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థ శానిటేషన్ విభాగంలో పని చేస్తున్న సీనియర్ శానిటరీ ఇన్‌స్పెక్టర్లకు శానిటరీ సూపర్‌వైజర్లుగా పదోన్నతులు కల్పిస్తూ కమిషనర్ అండ్ డైరెక్టర్ మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్ (సీడీఎంఏ) డాక్టర్ టీకే శ్రీదేవి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. వరంగల్ మునిసిపల్ కార్పొరేషన్‌లో పని చేస్తున్న నలుగురికి ఇతర జిల్లాలకు శానిటరీ సూపర్‌వైజర్లుగా పోస్టింగ్ ఇస్తూ ఇతర జిల్లాలో పని చేస్తున్న ఇద్దరికి వరంగల్ కార్పొరేషన్‌కు కేటాయిస్తూ ఆదేశాలు జారీ చేశారు. పదోన్నతులు పొందిన వారిలో రాజన్న సిరిసిల్ల జిల్లా జోన్ - 3 నుంచి చెన్నూరి శ్యాంరాజ్, పోలెపాక అనిల్‌కుమార్ (కరీంనగర్ మునిసిపల్ కార్పొరేషన్) కు, భద్రాద్రి కొత్తగూడెం జోన్ - 4 నుంచి గొల్కోండ శ్రీను, పి. సురేష్ (వరంగల్ కార్పొరేషన్)కు, భాసర జోన్ - 1 నుంచి శ్యాంసుందర్ (మంచిర్యాల) లింగాల కుమార్ (రామగుండం)కు బదిలీపై వెళ్లారు. ఒకటి, రెండు రోజుల్లో ఆయా ప్రాంతాల్లో రిపోర్టు చేయాలని శ్రీదేవి ఆదేశించారు.

కాగా, పదోన్నతులు పొందిన అధికారులను సీఎంహెచ్‌వో డాక్టర్ రాజారెడ్డి, ఎంహెచ్‌వో డాక్టర్ మల్లం రాజేశ్‌తో పాటు సిబ్బంది అభినందనలు తెలిపారు.

వృత్తి నైపుణ్యాల శిక్షణకు కేయూ ఉద్యోగులు



సర్టిఫికేట్లు తీసుకుంటున్న కేయూ ఉద్యోగులు

కేయూ క్యాంపస్ జూలై 16 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్ మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల విభాగంలో ఈ నెల 14 నుంచి 16 వరకు జరిగిన వృత్తి నైపుణ్యాల శిక్షణకు వర్సిటీ ఉద్యోగులు రాము బన్నుకర్, డి. ప్రవీణ్‌కుమార్‌లు పాల్గొని శిక్షణను పూర్తి చేశారు. ఎమర్జింగ్ టెక్నాలజీస్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్, మెషిన్ లర్నింగ్, క్లౌడ్ కంప్యూటింగ్ వంటి అంశాలపై శిక్షణ పొందారు. ఐటీ ఫ్యాకల్టీ శిరీష, కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ వల్లూరి రామచంద్రంలు అభినందించారు.

రైల్వే జీఎం సాబ్.. జర దేఖో..

(5వ పేజీ తరువాయి)

ప్రత్యేక దృష్టి సారించాలని, అభివృద్ధిలో పరుగులు పెట్టించాలని కాజీపేట ప్రజలు కోరుతున్నారు.

డివిజన్ ఆవశ్యకత..

తెలంగాణలో రెండవ అతిపెద్ద నగరమైన వరంగల్ జిల్లాలోని కాజీపేట జంక్షన్ ఉత్తర, దక్షిణ రైల్వే మార్గాలను కలుపుతోంది. ప్రతి రోజు సుమారు 100 వరకు రైళ్ల రాకపోకలు, 15వేల మంది రైల్వే ప్రయాణీకుల రాకపోకలు, రోజుకు రూ.17లక్షల ఆదాయం, సింగరేణి, కొత్తగూడెం, బెల్లంపల్లి, బల్లార్షా గనుల నుంచి బొగ్గు రవాణాలో 40 శాతం ఆదాయంతోపాటు కాజీపేటలో ఎలక్ట్రిక్ లోకో షెడ్, డీజిల్ లోకో షెడ్‌తో పాటు నూతనంగా కోచ్ ఫ్యాక్టరీ నిర్మాణం కూడా జరుగుతోంది. కావల్సిన భూమి, నీటి సౌకర్యం, రోడ్డు రవాణా సౌకర్యం కూడా ఉంది. ఇంతటి ప్రాధాన్యం కలిగిన కాజీపేటను డివిజన్‌గా ఉన్నతీకరించాల్సిన ఆవశ్యకత ఉంది. ఈ మధ్యనే నూతనంగా విశాఖ జోన్ ఏర్పాటుతో కాజీపేట డివిజన్ ఏర్పాటు ఆవశ్యకత ఏర్పడింది.

కాజీపేట డివిజన్ పరిధిలు, హద్దులు కూడా రైల్వే ఉన్నతాధికారులు నిర్ణయించినట్లు సమాచారం. భువనగిరి నుంచి న్యూఢిల్లీ వైపు బల్లార్షా వరకు, వరంగల్ మీదుగా కొండపల్లి వరకు, రామగుండం మీదుగా మణుగూరు, మేడారంతోపాటు నూతనంగా నిర్మించే డోర్నకల్-గద్వాల, నష్కల్-హసన్‌పర్తి, నష్కల్-చింతల్‌పల్లి రైల్వేలైన్‌లు కలిపే నైసర్గిక స్వరూపంతో డివిజన్ హద్దులు నిర్ణయించినట్లు సమాచారం. విశాఖ జోన్ ప్రకటతోనే కాజీపేట డివిజన్ ప్రకటిస్తారని అందరూ ఊహించినప్పటికి ఎందుకో కార్యరూపం దాల్చలేదు. డివిజన్ ఏర్పాటుతో పరిపాలన సౌలభ్యం కూడా ఉంటుంది. రైల్వే జీఎం చొరవ చూపితే అన్ని అర్హతలు ఉన్న డివిజన్ ఏర్పాటు పెద్ద విషయమేమి కాదని చర్చించుకుంటునారు.

నిరుపయోగంగా టౌన్ స్టేషన్..

కాజీపేట టౌన్ సమీపంలో బైపాస్‌లో ఆర్వోబీ కింద 2007లో టౌన్ స్టేషన్ నిర్మించారు. కానీ, ఇక్కడ కేవలం భద్రాచలం రోడ్ - బల్లార్ష వెళ్లే సింగరేణి రైలుకు మాత్రమే హాల్టింగ్ సౌకర్యం కల్పించారు. ఢిల్లీ నుంచి చెన్నై వైపు వెళ్లే అన్ని రైళ్లకు హాల్టింగ్ సౌకర్యం కల్పిస్తే మంచి సౌకర్యం ఉంటుందనేది స్థానికులు వాదన. మెడికల్ కాలేజీ, నిట్, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు చెన్నై, ఢిల్లీ వైపు ప్రయాణించడానికి మంచి సౌకర్యంగా ఉంటుంది. కేవలం ఒక్క సింగరేణి కోసమే స్టేషన్ అన్నట్లు ఒకే రైలుకు హాల్టింగ్ సౌకర్యం కల్పించడంతో పలు విమర్శలు వస్తున్నాయి. ఇదే కాకుండా ఈ టౌన్ స్టేషన్‌ను ఆధునీకరించి అన్ని అవకాశాలు ఉన్న ట్రయాంగిల్ ప్లాట్‌ఫారం నిర్మిస్తే ఢిల్లీ, చెన్నై రైళ్ల రాకపోకలకు మంచి సౌకర్యం ఉంటుందని స్థానికులు అంటున్నారు. ఇదే కాకుండా రైల్వే కార్మికుల కోసం నిర్మించిన రైల్వే ఆసుపత్రి కేవలం సబ్ డివిజన్ ఆసుపత్రి మాత్రమే నిర్మించారు.. కాని సౌకర్యాలు మాత్రం కల్పించలేదు. రైల్వే కార్మికులకు మానసిక ఉల్లాసానికి మంచి క్లబ్ కావాలని డిమాండ్ చేస్తున్నారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన రైల్వే జీఎం సంజయ్‌కుమార్ శ్రీవాత్సవ చొరవ చూపి కాజీపేటను రైల్వే పరంగా అభివృద్ధి చేయాలని రైల్వే కార్మికులు, స్థానికులు కోరుతున్నారు.

రైల్వే జీఎం పర్యటన ఇలా..

జీఎం గురువారం ఉదయం స్పెషల్ రైలులో సికింద్రాబాద్‌లో ఉదయం 9.15 గంటలకు బయలుదేరి 11 గంటలకు కాజీపేట రైల్వేస్టేషన్‌కు చేరకుంటారు. అనంతరం ప్రత్యేక వాహనాల్లో రైల్వే ఉన్నతాధికారులతో కలిసి కోచ్‌ఫ్యాక్టరీ నిర్మాణం జరిగే అయోధ్యపురానికి వెళ్లనున్నారు. కోచ్‌ఫ్యాక్టరీ పనులు, మిషనరీల ఏర్పాటు, వ్యాగన్, కోచ్, ఎలక్ట్రిక్ ఇంజన్‌లు, మెమో రైలు కోచ్‌ల విడిభాగాలు ఏర్పాటు స్థలాలు, ప్లాట్‌ఫారాలు, రైల్వే ట్రాక్‌ల నిర్మాణం తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించనున్నారు.

పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలి

టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యుడు కిరణ్‌కుమార్

హసన్‌పర్తి, జూలై 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఉద్యోగ, ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యుడు డి.కిరణ్‌కుమార్ డిమాండ్ చేశారు. బుధవారం హసన్‌పర్తి మండలంలోని వివిధ పాఠశాలల్లో జరిగిన టీఎస్‌యూటీఎఫ్ సభ్యత్వ నమోదులో ఆయన పాల్గొని మాట్లాడారు.

కాంగ్రెస్ ప్రభుత్వం మేనిఫెస్టోలో పెట్టిన విధంగా వెంటనే పెండింగ్ బిల్లులు క్లియర్ చేయాలన్నారు. రిటైర్డ్ ఉపాధ్యాయుల పెన్షన్ బెనిఫిట్స్, ఐదు విడతల కరువు భత్యం చెల్లించాలని కోరారు. జిల్లా ప్రధాన కార్యదర్శి పెండెం రాజు మాట్లాడుతూ సీపీఎస్ విధానాన్ని వెంటనే రద్దు చేయాలని, గురుకుల పాఠశాలల పనివేళలు మార్చాలని, కేజీబీవీ మహిళా ఉపాధ్యాయులకు 010 హెడ్ కింద వేతనాలు చెల్లించాలన్నారు. కార్యక్రమంలో టీఎస్‌యూటీఎఫ్ మండల శాఖ అధ్యక్షురాలు ఎ.శోభారాణి, మండల ప్రధాన కార్యదర్శి టి.నరేష్, మండల ఉపాధ్యక్షురాలు పి.రమాదేవి, మండల కార్యదర్శి కె.వెంకటరమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహిళా నాయకత్వానికి ప్రోత్సాహం

(5వ పేజీ తరువాయి)

జిల్లా స్థాయి వరకు మహిళా కాంగ్రెస్ నాయకులు శిక్షణ శిబిరంలో పాల్గొన్నారు. యూత్ కాంగ్రెస్ జాతీయ నాయకురాలు తక్కళ్లపల్లి సాగరిక రావు ఆధ్వర్యంలో జరిగిన శిబిరానికి ముఖ్య అతిథిగా చిన్నారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.

మహిళా నాయకత్వాన్ని బలపరిచే ముఖ్య ఉద్దేశంతోనే ఏఐసీసీ అధినేత్రి శిక్షణ శిబిరాలను చేపట్టిందన్నారు. పార్టీలోని మహిళా శ్రేణులకు సంపూర్ణ అవగాహన కల్పించడం ద్వారా రానున్న స్థానిక ఎన్నికల ప్రాధాన్యత, పార్టీ గెలుపు, మహిళా నేతల పాత్ర, సర్పంచ్‌ల ఎన్నిక, పరిపాలన విధానం తదితర అంశాలను వివరిస్తూ చిన్నారెడ్డి ప్రసంగాన్ని సాగించారు. సర్పంచ్ నుంచి ప్రధాన మంత్రి వరకు మహిళలు పరిపాలించన ఏకైక పార్టీగా కాంగ్రెస్‌కు గుర్తింపు ఉందన్నారు. మరే ఇతర రాజకీయ పార్టీ మహిళా నాయకత్వాన్ని ప్రోత్సహించలేదన్నారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల నాటికి మహిళలకు 60 అసెంబ్లీ స్థానాల కేటాయింపు ఉంటుందని వెల్లడించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ మేరకు ప్రకటించారని పేర్కొన్నారు. గ్రామ స్థాయి నుంచి అసెంబ్లీ, పార్లమెంట్ స్థానాల్లో మహిళలకే ప్రాధాన్యత ఉంటుందన్నారు. మహిళా సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వ పాలన సాగుతోందని ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్‌రెడ్డి, నాగరాజు, యశస్వినిరెడ్డి, మేయర్ గుండు సుధారాణి, వరంగల్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు బంక సరళాదేవి, టీపీసీసీ నాయకులు ఈవీ శ్రీనివాస్, జీవీయస్ శ్రీనివాసాచారి పేర్కొన్నారు. మహిళా సంక్షేమ పథకాలు, మహిళా సంఘాల ఆర్థిక ప్రగతి, ఉపాధి మార్గాల విస్తరణకు ప్రభుత్వం ప్రాముఖ్యత ఇస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐసీసీ ప్రతినిధులు కిరణ్ మోగ బాసా, జావిద్, జాతీయ, రాష్ట్ర, జిల్లా యూత్ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

మ్యారేజ్ బ్యూరో నూతన కమిటీ ఎన్నిక

రాష్ట్ర అధ్యక్షుడిగా కాసు శ్రీనివాస్‌రెడ్డి



హనుమకొండ కలెక్టరేట్, జూలై 16(ఆంధ్రజ్యోతి) : తెలంగాణ స్వశక్తి మ్యారేజ్ బ్యూరో వెల్ఫేర్ అసోసియేషన్ నూతన రాష్ట్ర కమిటీని హనుమకొండలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. హనుమకొండలోని పద్మాక్షిటెంపుల్ పరిసర ప్రాంతంలో బుధవారం స్వశక్తి మ్యారేజ్ బ్యూరో వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆషాడమాస వనభోజన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నూతన రాష్ట్ర కమిటీని ఎన్నుకున్నారు. రాష్ట్ర అధ్యక్షుడిగా కాసు శ్రీనివాస్‌రెడ్డిని(కేఎస్ఆర్)ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. దీంతో 3వసారి రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికై శ్రీనివాస్‌రెడ్డి హ్యాట్రిక్ సాధించారు. ఈ సందర్భంగా కాసు శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. అసోసియేషన్ అభివృద్ధికి కృషి చేస్తూ సభ్యులకు ఎళ్లవేళలా అందుబాటులో ఉంటానన్నారు. కార్యక్రమంలో మల్లయ్య, రామస్వామి, కుశకుమార్, ఓంకార్‌తో పాటు మ్యారేజ్ బ్యూరో ప్రతినిధులు పాల్గొన్నారు.

జీపీ ఉద్యోగుల కమిటీ

హనుమకొండ టౌన్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ బాలసముద్రంలోని ఏకశిలా పార్కులో వరంగల్ జిల్లా జీపీ ఉద్యోగుల జాక్‌కమిటీని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు మాజీ జిల్లా అధ్యక్షుడు కంజర్ల భాస్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. చైర్మన్‌గా పడాల రాజు, వైస్ చైర్మన్‌గా పున్నం ఆనంద్, ప్రధాన కార్యదర్శిగా ఎండి అలీ, కోశాధికారిగా ముప్పిడి రమేష్, ఇతర కమిటీ సభ్యులుగా వేల్పుల కృష్ణ, చిర్రు సుధాకర్, దామెర నరేందర్, పొన్నం రమేష్ గౌడ్, చెమ్మ రాజు, శామకూరి అజేయుడు, గర్నపెల్లి రాజు, చెన్నూరి మంజుల కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నట్లు తెలిపారు.

కార్మికులకు పీపీ కిట్ల పంపిణీ

హనుమకొండ చౌరస్తా, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : హనుమకొండ 10వ డివిజన్‌లో విధులు నిర్వహిస్తున్న పారిశుధ్య కార్మికులకు స్థానిక డివిజన్ కార్పొరేటర్, జీడబ్ల్యూఎంసీ ఫ్లోర్ లీడర్ తోట వెంకటేశ్వర్లు బుధవారం పీపీ కిట్లను పంపిణీ చేశారు.



న్యూట్రిషన్ కిట్లు పంపిణీ చేస్తున్న కలెక్టర్ స్నేహ శబరీష్

న్యూట్రిషన్ కిట్ల పంపిణీ

హనుమకొండ కలెక్టరేట్, జూలై16(ఆంధ్రజ్యోతి): టీబీ ముక్త్ కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టరేట్‌లో బుధవారం టీబీ పేషంట్లకు కలెక్టర్ స్నేహ శబరీష్ న్యూట్రిషన్ కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ క్షయవ్యాధితో బాధపడే వారు సమయానుకూలంగా మందులను వేసుకోవాలని, చక్కటి పోషక విలువలతో కూడిన ఆహారం తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా క్షయ వ్యాధి నివారణ అధికారి హిమబిందు, మాస్ మీడియా అధికారి అశోక్, ప్రసన్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.

కేయూ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి

కేయూ క్యాంపస్ జూలై 16, (ఆంధ్రజ్యోతి) : కాకతీయ యూనివర్సిటీలో పనిచేస్తున్న కాంట్రాక్టు, పార్టుటైమ్, ఇతర ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కేయూ దూరవిద్య కేంద్రం ఎస్సీఎస్టీ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు డాక్టర్ కొట్టే భాస్కర్ కోరారు. ఈ మేరకు బుధవారం హనుమకొండకు వచ్చిన రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డిని కలిసి వర్సిటీ సమస్యలను విన్నవించారు. సీఎం దృష్టికి సమస్యలను తీసుకువెళ్లి పరిష్కరిస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, సీనియర్ కాంగ్రెస్ నేత శ్రీనివాసచారి, కార్పొరేటర్లు శ్రీనివాస్, మామిడ్ల రాజు, బండ సంపత్, లక్ష్మణ్, డాక్టర్ ఎడ్ల ప్రభాకర్ పాల్గొన్నారు.



నాణ్యమైన విద్య, ఆంగ్ల భాషా పరిజ్ఞానం... ఇవి లేకుండా ఆధునిక ప్రపంచంలో నెగ్గుకురావడం ఎంత కష్టమో అనుభవ పూర్వకంగా తెలుసుకున్నారు **జనావఫా బెహ్లాట్.** తను పడిన కష్టాలు కొత్త తరానికి ఎదురుకాకూడదనే లక్ష్యంతో ఆమె చేపట్టిన ప్రయత్నం... వందలాది గ్రామీణ బాలల్లో నైపుణ్యాన్ని పెంచి, ఆత్మవిశ్వాసాన్ని నింపుతోంది.

నైపుణ్యం పెంచి... ఆత్మవిశ్వాసం నింపుతూ..

"ఇది పాతికేళ్ళ క్రితం సంగతి. షిల్లాంగ్‌లోని ఒక ఆసుపత్రిలో ఉద్యోగం కోసం ఇంటర్వ్యూకు వెళ్ళాను. ఆసుపత్రి అడ్మినిస్ట్రేటర్ నన్ను కొన్ని ప్రశ్నలు అడిగారు. వాటికి నాకు సాధ్యమైనంతమేరకు సమాధానాలు చెబుతున్నాను. "మీరు బీయే చదివారు. ఇంగ్లీష్ అర్థం కాదు, మాట్లాడలేరు. నన్ను ఉద్యోగం ఎలా ఇవ్వమంటారు?" అని అన్నారాయన గట్టిగా. ఏం చెప్పాలో నాకు అర్థం కాలేదు. అయితే... ఇంటర్వ్యూకు వచ్చిన అందరికన్నా విద్యాపరమైన అర్హతలు నాకే ఎక్కువగా ఉన్నాయి. నా ఇంగ్లీష్‌ను మెరుగుపరుచుకుంటాననే హామీ తీసుకొని... వార్డ్ అటెండెంట్‌గా ఉద్యోగం ఇచ్చారు. బయటికి వస్తూ అనుకున్నాను... ఎంత కష్టమైనా సరే... ఇంగ్లీష్‌లో పట్టు సాధించాలని.

సవాల్‌గా తీసుకున్నా...

మేఘాలయ రాష్ట్రంలోని నోంగ్‌స్పెన్ అనే మారుమూల గ్రామం మాది. బంగ్లాదేశ్ సరిహద్దుల్లో ఉండే మా ఊరులో విద్యాసదుపాయాలు అంతంతమాత్రం. అక్కడ హైస్కూల్ చదువు పూర్తి చేశాక... షిల్లాంగ్ నగరంలోని ఒక కాలేజీలో చేరాను. అప్పటివరకూ ఇంగ్లీష్ పాఠాలను బట్టీ పట్టి రాయడమే తప్ప కనీస పరిజ్ఞానం కూడా నాకు లేదు. కాలేజీలో బోధన అంతా ఆంగ్లంలోనే ఉండేది. ఎలాగో కష్టపడి డిగ్రీ పూర్తి చేశాను. ఆ తరువాత... ఇంటర్వ్యూ సమయంలో నాకు ఎదురైన అనుభవం తరువాత... ఇంగ్లీష్ నేర్చుకోవడాన్ని ఒక సవాలుగా తీసుకున్నాను. రీడింగ్ మెటీరియల్ తెప్పించుకొని చదివేదాన్ని. ఎవరైనా మాట్లాడుతూ ఉంటే వినేదాన్ని. తోటి సిబ్బందితో తప్పో ఒప్పో నాకు వచ్చింది మాట్లాడేదాన్ని. దీనికి నేను ఏనాడూ సిగ్గు పడలేదు. ఈ క్రమంలో ఎన్నో అవమానాలు, వెక్కిరింపులు... నా వెనకాలే కాదు, నా ముందు కూడా ఎగతాళి చేసేవారు. కానీ అన్నీ భరించాను. నా తపనను ఆసుపత్రి యాజమాన్యం గమనించింది. రెండేళ్ళ తరువాత రిసెప్షనిస్ట్‌గా ప్రమోట్ చేసింది. అయితే నేను ఇంగ్లీష్ చక్కగా మాట్లాడుతున్నాననే ఆత్మవిశ్వాసం రావడానికి అయిదేళ్ళు పట్టింది. ఆ తరువాత ఒక ఇంగ్లీష్ మీడియం స్కూల్లో టీచర్‌గా చేరాను. నేను పాఠాలు బాగా చెబుతున్నానని, ఇంగ్లీష్ బాగా మాట్లాడుతున్నానని ప్రిన్సిపాల్ మెచ్చుకొనేవారు. అదే సమయంలో... గ్రామీణ ప్రాంతాల్లో విద్యాభివృద్ధి కోసం కృషి చేస్తున్న కొన్ని సంస్థలతో కలిసి పలు ప్రాంతాల్లో తిరిగాను. శిక్షణ తరగతులను నిర్వహించాను. ఒక వ్యక్తి జీవితంలో సరైన విద్య ఎంత ప్రభావం చూపిస్తుందో నాకు పూర్తిగా అర్థమయింది. 'హైస్కూల్‌లో చదువుతున్నప్పుడే ఇలాంటి అవకాశం ఉంటే ఎంతో బాగుండేది కదా!' అనిపించేది. మా ఊర్లోనే సొంతంగా ఒక సంస్థను ఏర్పాటు చేయాలనుకున్నాను. 2013లో 'ఫౌండేషన్ ఫర్ ఎంపవర్‌మెంట్ అండ్ ఇంక్లూజివ్ డెవలప్‌మెంట్' అనే పేరుతో ఒక సంస్థను రిజిస్టర్ చేశాను. మా గ్రామంలో, ఆ చుట్టుపక్కల ఉన్న పిల్లలకు ఇంగ్లీష్ బోధించి, వారు నగరాలకు వెళ్ళినప్పుడు ఇబ్బంది పడకుండా చూడాలనే ధ్యేయంతో తరగతులు మొదలుపెట్టాను.

వ్యతిరేకత రావడంతో...

ప్రతివారం చివర్లో మా ఊరు వచ్చి... ఎనిమిది నుంచి పదోతరగతి పిల్లలకు ఇంగ్లీషు పాఠాలు చెప్పేదాన్ని. విద్యార్థుల నుంచి, వారి తల్లితండ్రుల నుంచి మంచి ప్రోత్సాహం లభించింది. అప్పుడే వివిధ ప్రభుత్వ సంస్థలు యువత కోసం నిర్వహిస్తున్న కార్యక్రమాల గురించి తెలిసింది. నేను చేస్తున్న పనుల్ని వివరిస్తే... ఒక కమ్యూనిటీ లైబ్రరీ ఏర్పాటుకు అధికారులు నిధులు మంజూరు చేశారు. నాకు పరిచయం ఉన్న సంస్థల ద్వారా పుస్తకాలు విరాళంగా వచ్చాయి. దాంతో... రీడింగ్ సెషన్స్ కూడా ప్రవేశపెట్టాను. అయితే... స్థానిక పాఠశాలల ఉపాధ్యాయుల నుంచి వ్యతిరేకత వచ్చింది. వారు బోధించే తీరును అవమానిస్తున్నానని ఆరోపించారు. దాంతో నేనే ఒక స్కూల్ ఏర్పాటు చేయాలని నిర్ణయించాను. కల్లోలంగా ఉండే ప్రాంతాల్లో పాఠశాలల సర్వతోముఖాభివృద్ధికి దోహదం చేస్తున్న 'ఎస్‌టిపి' అనే సంస్థ సహకారంతో 'డ్యూ డ్రాప్ అకాడమీ' పేరుతో 2019లో ఒక స్కూల్‌ను... 15 మంది పిల్లలతో ప్రారంభించాను. 2020 నాటికి వారి సంఖ్య 80కి చేరింది. మా అమ్మ విరాళంగా ఇచ్చిన స్థలంలో... 'ఎస్‌టిపి సంస్థ సాయంతో పూర్తి స్థాయి పాఠశాల ఏర్పాటైంది. ప్రస్తుతం 250 మంది విద్యార్థులు చదువుతున్నారు. నా సోదరి, మరో బంధువు గ్రాడ్యుయేషన్ పూర్తి చేసుకొని... మా బడిలో టీచర్లుగా చేరారు. ముంబయికి చెందిన ఒక ఎన్జీవో ఒక బస్సును సమకూర్చింది. విద్యార్థుల నుంచి నామమాత్రపు రుసుముతో... స్వచ్ఛంద సంస్థల సహకారంతో మా స్కూల్ నడుస్తోంది..





ఆ నమ్మకం ఉంది...

మా స్కూల్ నుంచి నేను ఎలాంటి వేతనం తీసుకోవడం లేదు. ఒక స్వచ్ఛంద సంస్థకు నోడల్ అధికారిగా నాకు వస్తున్న జీతంతోనే గడుపుతున్నాను. వివిధ వక్తృత్వ, వ్యాసరచన పోటీల్లో మా విద్యార్థులు బహుమతులు గెలుచుకుంటున్నారు. వారిలో కనిపిస్తున్న ఆత్మవిశ్వాసం చూస్తున్నప్పుడు... నా లక్ష్యం నెరవేరుతోందన్న సంతృప్తి కలుగుతోంది. వారు ఎలాంటి జంకు లేకుండా... భాష, నైపుణ్యాల పరంగా నగర విద్యార్థులను మించి రాణిస్తారనే నమ్మకం నాకుంది."

కౌన్సెలింగ్

మోకీళ్లు అరిగితే?

Q A

డాక్టర్! నా వయసు 60. మోకీళ్ల అరుగుదల మొదలైనట్టు వైద్యులు చెప్పారు. కీళ్ల మరింత అరగకుండా ఉండాలంటే ఎలాంటి జాగ్రత్తలు పాటించాలో వివరిస్తారా?

- ఓ సోదరి, హైదరాబాద్.

కీళ్ల అరగడం మొదలైన వెంటనే, అవి మరింత అరిగిపోకుండా కొన్ని జాగ్రత్తలు పాటించాలి. అందుకోసం...

- మెత్తని సోఫాల్లో కూర్చోకూడదు. సోఫాలో కూర్చున్నప్పుడు మోకాలు 90 డిగ్రీల కోణంలో ముడుచుకుంటుంది. ఈ కోణంలో, మోకాళ్ల మీద భారం మోపుతూ లేచే ప్రయత్నం చేస్తే కీళ్ల అరుగుదల పెరుగుతుంది. కాబట్టి సోఫా బదులు, వెన్నుకు ఆసరాను అందించే కుర్చీలు వాడుకోవాలి.
- ట్రెడ్‌మిల్, జుంబా, ఏరోబిక్స్‌కు బదులు మెత్తని పచ్చిక మీద నడక, సైకిల్ తొక్కడం, క్రాస్ ట్రైనర్ మొదలైన వ్యాయామాలు చేయాలి.
- మెత్తని బూట్లు వాడాలి.
- నేల మీద కూర్చోకూడదు, పడుకోకూడదు.
- బరువును అదుపులో ఉంచుకోవాలి.
- వైద్యులు సూచించిన ఫిజియోథెరపీ చేయాలి.
- వైద్యులు సూచించే సప్లిమెంట్లు వాడుకోవాలి.
- మెట్లు ఎక్కడం తగ్గించాలి.
- క్యాల్షియం కలిగి ఉండే ఆహారం తినాలి.
- కండరాలను దృఢపరిచే నడకతో కీళ్ల అరుగుదల అదుపులోకొస్తుంది. కాబట్టి రోజుకు కనీసం 20 నిమిషాల పాటు నడవాలి.



లిగమెంట్లు ఎంతో కీలకం!

కారు సాఫీగా నడవడానికి నాలుగు చక్రాలు ఎంత అవసరమో, కీళ్లు సాఫీగా కదలడానికి లిగమెంట్లు అంత అవసరం. ఎముకలను సరైన కోణంలో కదిలే ఆసరాను లిగమెంట్లు అందిస్తాయి. వీటిలో చీరికలు ఏర్పడితే ప్రమాదం జరిగిన కొద్ది రోజుల వరకూ నొప్పి వేధించి తగ్గిపోయినా, ఆ నష్టం దీర్ఘకాలంలో ఆర్థ్రయిటిస్‌కు దారి తీస్తుంది. కాబట్టి లిగమెంట్ గాయం కారణంగా మోకీళ్లలో సమస్యలు తలెత్తే వీల్లేకుండా వెంటనే సర్జరీతో సరి చేయించుకోవాలి.

- డాక్టర్ దశరథరామ రెడ్డి
ఆర్థోపెడిక్ సర్జన్, హైదరాబాద్.

వినూత్నం

కొన్ని సంఘటనలు జీవితాన్ని అనుకోని మలుపులు తిప్పుతాయి. ఆ పరిస్థితులకు కొందరు కుంగిపోతే.. మరికొందరు ధైర్యంగా ఎదుర్కొని ఇతరులకు మార్గదర్శులుగా మారతారు. అలాంటి వ్యక్తే మహారాష్ట్రకు చెందిన ఫిజియోథెరపిస్ట్, అనుజా లునియా. ఒత్తిడి కారణంగా జీర్ణసంబంధ వ్యాధి, ఐబిడికి గురైన అనుజా.. స్ట్రెస్ స్ట్రాటజిస్ట్‌గా మారి ఎంతో మందికి ఒత్తిడిని దూరం చేస్తున్నారు. ఆ ప్రయాణం ఆమె మాటల్లోనే...



ఒత్తిడిని చిత్తు చేసేలా...

"మాది మహారాష్ట్రలోని థానే! అమ్మానాన్న ఇద్దరూ డాక్టర్లు. వాళ్లను చూస్తూ పెరగడం వలన నేనూ డాక్టర్‌ను అవ్వాలనుకున్నా! అనుకున్నట్లే ఫిజియోథెరపిస్ట్‌ను అయ్యాను. సంతోషంగా వృత్తి జీవితం ప్రారంభించాను. అంతా ఆనందంగా సాగిపోతున్న సమయంలో జీవితం అనుకోని మలుపు తిరిగింది. ఇన్‌ఫ్లమేటరీ బోవెల్ డిసీజ్(ఐబిడి) బారిన పడ్డాను. ఎన్నో మందులు వాడాను. కానీ వాటి ఫలితం తాత్కాలికమే! జీవనశైలి మారితేనే ఆరోగ్య పరిస్థితి మెరుగుపడుందని అనిపించింది. ఈ ఆలోచనకు కార్యరూపం ఇవ్వడంతో పరిస్థితిలో మార్పు కనిపించింది. దాంతో ఓవైపు ఆరోగ్యాన్ని కాపాడుకుంటూనే మరో పక్క కెరీర్ మీద దృష్టి సారించా. మళ్లీ జీవితం సాధారణ స్థితికి వచ్చింది. కొత్త జీవితం మొదలైనట్టు అనిపించింది. కానీ ఆ సంతోషం ఎన్నో రోజులు నిలవలేదు. కొన్నాళ్లకే ఐబీడీ తిరగబెట్టింది. ఏమీ తినకలేక పోయేదాన్ని. తీవ్రమైన కడుపు నొప్పి, నీరసంతో బాధపడ్డాను. దాదాపు 16 కిలోల బరువు కోల్పోయాను. యోగా, ధ్యానం ప్రయత్నించినా కోలుకోలేకపోయా! అప్పుడే ఈ సమస్యకు ప్రధాన కారణం ఒత్తిడేనని గుర్తించాను. ఎంతో పరిశోధన చేసి ఒత్తిడిని తగ్గించుకునేందుకు ఓ ప్రణాళికను సిద్ధం చేసుకుని పాటించాను. ఆ సమయంలో మా అమ్మానాన్నలు కొండంత అండగా నిలిచారు. దాంతో ఒత్తిడిని, నా అనారోగ్యాన్ని కూడా జయించగలిగాను.



ఒత్తిడితో చాలా ప్రమాదం

ఈ రోజుల్లో ఒత్తిడి ఓ సాధారణ సమస్యగా మారిపోయింది. కానీ ఒత్తిడి.. మధుమేహం, హైపర్ టెన్షన్, పీసీఓఎస్ వంటి అనేక అనేక రోగాలకు మూలం. నాడీ వ్యవస్థను ఒత్తిడి తీవ్రంగా ప్రభావితం చేస్తుంది. మా అమ్మానాన్నలు వైద్య వృత్తిలో ఉండడం వలన ఒత్తిడి నియంత్రణలో ఎంతో సహకారం అందించారు. కానీ అందరికీ అలాంటి పరిస్థితులు ఉండవు.

> ఒత్తిడి వ్యక్తిగత సమస్య మాత్రమే కాదు సామాజిక సమస్య. మన దేశంలో 77 శాతం జనాభా ఒత్తిడితో బాధపడుతోంది. అందుకే ఒత్తిడి నియంత్రణపై అనేక వర్క్‌షాప్‌లు నిర్వహిస్తున్నా! ఇప్పటికే ప్రపంచవ్యాప్తంగా 125 పైగా వర్క్‌షాప్‌లు నిర్వహించాను. భారత దేశాన్ని ప్రపంచంలోనే ఒత్తిడి తక్కువ ఉన్న దేశంగా మార్చాలన్నదే నా లక్ష్యం."

అందుకే నాలా ఒత్తిడి వల్ల ఎవరూ ఇబ్బంది పడకూడదని 'రిలాక్స్... ప్లే... థ్రైవ్' అనే పుస్తకం రాశాను. ఇందులో ఒత్తిడిని నియంత్రించడానికి యాక్టివిటీస్, పజిల్స్ వంటివి ఉంటాయి. అలాగే ఇందులోని క్యూఆర్ కోడ్‌ల ద్వారా గైడెడ్ ఆడియో, వీడియో కంటెంట్ అందుబాటులో ఉంటుంది. ఒత్తిడి వ్యక్తిగత సమస్య మాత్రమే కాదు సామాజిక సమస్య. మన దేశంలో 77 శాతం జనాభా ఒత్తిడితో బాధపడుతోంది. అందుకే ఒత్తిడి నియంత్రణపై అనేక వర్క్‌షాప్‌లు నిర్వహిస్తున్నా! కొవిడ్ సమయంలో కార్పొరేట్ కంపెనీల్లో వర్క్‌షాప్‌లు నిర్వహించా! ఇప్పటికే ప్రపంచవ్యాప్తంగా 125 పైగా వర్క్‌షాప్‌లు నిర్వహించాను. భారత దేశాన్ని ప్రపంచంలోనే ఒత్తిడి తక్కువ ఉన్న దేశంగా మార్చాలన్నదే నా లక్ష్యం."

స్ఫూర్తి

అభిరుచి ఎప్పుడెలా ఉన్నత శిఖరాలకు చేరుస్తుందో ఎవరూ ఊహించలేరు. సూరత్‌కు చెందిన 27 ఏళ్ల అనుజ వైద్య కథ ఇలాంటిదే! పర్వతారోహణతో మొదలైన ఆమె క్రీడాసక్తి, జలక్రీడల మీదకు మళ్లి, అంతర్జాతీయ జలక్రీడా పోటీల్లో పాల్గొనే స్థాయికి ఎదిగేలా చేసింది. 2025 ఆసియా వాటర్ స్కీ అండ్ వేక్‌బోర్డ్ ఛాంపియన్‌షిప్‌కు భారత్ తరపున ప్రాతినిధ్యం వహించిన తొలి యువతిగా పేరు పొందిన 27 ఏళ్ల అనుజ ప్రస్థానమిది.



పర్వతారోహణ నుంచి జలక్రీడల్లోకి...

వజ్రాల నగరం సూరత్‌కు చెందిన అనుజ, సాహసోపేతమైన క్రీడా ఔత్సాహికురాలు. తన చెల్లెలితో కలిసి 2019లో ఎవరెస్టు పర్వతాన్ని అధిరోహించిందామె. తాజాగా జూన్ 24 నుంచి 29 వరకూ థాయిల్యాండ్‌లో జరిగిన ఆసియా వాటర్‌స్కీ అండ్ వేక్‌బోర్డ్ ఛాంపియన్‌షిప్‌లో పాల్గొని ఫైనల్స్‌కు చేరుకుంది. ఈ అనుభవం గురించి వివరిస్తూ.. 'దాదాపు ఏడేళ్లుగా నాన్నతో కలిసి తాపి నదిలో వాటర్‌స్కీయింగ్ సాధన చేస్తున్నాను. ఈ ఏడేళ్ల కాలంలో నాకున్న సామర్థ్యాన్ని అంచనా వేయగలిగాను. అంతర్జాతీయ పోటీల్లో పాల్గొనే స్థాయికి ఎదిగిన విషయాన్ని కూడా గ్రహించాను. కాబట్టి అంతర్జాతీయ క్రీడాకారులతో పోటీ పడి, స్వీయ సామర్థ్యాన్ని పరీక్షించుకోవడంలో తప్పేముందని అనిపించింది. కాబట్టే ఈ పోటీలో పాల్గొన్నాను. నిజానికి నాకు ఇదొక అద్భుతమైన అనుభవం. అంతకు ముందు వరకూ స్థానిక జలాల్లో, పరిమిత వనరులతో సాధన చేశాను కాబట్టి అంతర్జాతీయ ప్రమాణాలను అందుకోవడం కోసం, ముందుగానే థాయిల్యాండ్ చేరుకుని, వేర్వేరు పరికరాలతో, వేర్వేరు క్రీడాకారులతో కలిసి సాధన చేశాను' అంటూ చెప్పుకొచ్చింది అనుజ. తాపి నదిలో సాధన చేసే సమయంలో సాదాసీదా దుస్తులు, పరికరాలను ఉపయోగించినప్పటికీ, అంతర్జాతీయ వేదిక మీద, తన కూతురు ప్రతిభ కనబరచడం గర్వంగా ఉందని అనుజ తండ్రి ఆనంద్ కూడా చెప్పుకొచ్చారు. ఆసియా వాటర్‌స్కీయింగ్ అండ్ వేక్‌బోర్డింగ్ ఛాంపియన్‌షిప్స్ 2025ను, థాయిల్యాండ్ ఎక్స్‌ట్రీమ్ స్పోర్ట్స్ అసోసియేషన్ నిర్వహించింది. ఈ పోటీల్లో అనుజతో పాటు భారతీయ అథ్లెట్లు, విలాస్ థాకరే, అరవింద్ రతూరిలు కూడా పాల్గొన్నారు. అయితే ఈ అంతర్జాతీయ పోటీలో ఒక భారతీయ మహిళ పాల్గొనడం ఇదే మొదటిసారి కావడం విశేషం.

> అంతర్జాతీయ క్రీడాకారులతో పోటీ పడి, స్వీయ సామర్థ్యాన్ని పరీక్షించుకోవడంలో తప్పేముందని అనిపించింది. కాబట్టే ఈ పోటీలో పాల్గొన్నాను. నిజానికి నాకు ఇదొక అద్భుతమైన అనుభవం. అంతకు ముందు వరకూ స్థానిక జలాల్లో, పరిమిత వనరులతోనే సాధన చేశాను.
>
> - అనుజ వైద్య

పర్వతారోహణతో మొదలై...

చిన్నప్పటి నుంచి అనుజ వైద్య ఎన్నో క్రీడల్లో పాల్గొంది. ట్రెక్కింగ్, ఈత ఆమెకిష్టమైన క్రీడలు. ఉత్తరాఖండ్‌కు చెందిన తన తల్లి నుంచి క్రీడా స్ఫూర్తిని పొందిన అనుజ, చెల్లెలు అదితితో కలిసి, చిన్న వయసులోనే పర్వతారోహణ కూడా మొదలుపెట్టింది. ఆ క్రమంలో ఏడు పర్వత శిఖరాలను అధిరోహించింది. గుజరాత్‌లోని మౌంట్ విన్సన్ మాసిఫ్, కార్‌స్టెన్స్ పిరమిడ్‌లను అధిరోహించిన తొలి యువతిగా కూడా అనుజ చరిత్ర సృష్టించింది. అనుజ, ఆమె చెల్లెలు అదితి, ఎవరెస్టు పర్వతాన్ని అధిరోహించి, గుజరాత్‌కు చెందిన ఎవరెస్టు సిస్టర్స్‌గా పేరు పొందారు. ప్రపంచంలోని అత్యంత ఎత్తైన శిఖరాన్ని అధిరోహించిన రెండవ అక్కాచెల్లెళ్ల జంట కూడా తమదేనని అనుజ ఇన్‌స్టాలో కూడా ప్రకటించుకుంది. ఈ అక్కాచెల్లెళ్లు, గెట్ సెట్ అడ్వెంచర్స్ అనే అడ్వెంచర్ స్పోర్ట్స్ కంపెనీని స్థాపించి క్రీడల పట్ల తమకున్న మక్కువను కూడా చాటుకున్నారు. అలాగే తమ లాంటి సాహసికులకు ఆశ్రయం కల్పించడం కోసం ఉత్తరాఖండ్‌లో యాయవర్స్ అనే హోమ్‌స్టేను కూడా నెలకొల్పారు.

తొలి ప్రయత్నంలోనే ఫైనల్స్‌కు చేరుకుని...

తొలి అంతర్జాతీయ వాటర్‌స్కీయింగ్ పోటీల్లో అనుజ క్వాలిఫైయింగ్ రౌండ్‌ను విజయవంతంగా పూర్తి చేసుకుని, ఫైనల్స్‌కు చేరుకోగలిగింది. పూర్వానుభవం కలిగిన మలేషియా, జపాన్‌కు చెందిన అభ్యర్థులు అంతిమంగా ఈ పోటీల్లో విజయం సాధించారు. అయితే అత్యంత శారీరక దారుఢ్యంతో పాటు మెరుపు వేగంతో కదిలే నైపుణ్యం ఉండవలసిన ఈ జలక్రీడల్లో ప్రతిభ కనబరచడం ఆషామాషీ వ్యవహారం కాదు. మోటార్‌బోటు వేగంగా లాక్కెళ్లే స్కీ మీద కదులుతూ విన్యాసాలు ప్రదర్శించడానికి, బలంతో పాటు సంతులనం, టైమింగ్ కూడా అవసరమే! సవాలుతో కూడిన ఈ క్రీడలో అంతర్జాతీయ వేదిక మీద భారతదేశానికి ప్రాతినిధ్యం వహించే స్థాయికి ఎదగడం కచ్చితంగా గర్వించదగిన విషయమే! అనుజ, మున్ముందు మరిన్ని విజయాలను సొంతం చేసుకోవాలని కోరుకుందాం!

ఆత్మవిశ్వాసాన్ని ఇలా పెంచుకోవాలి..!

వ్యక్తిగత విషయాలతోపాటు ఉద్యోగం, వ్యాపారాలకు సంబంధించి... ఆత్మవిశ్వాసంతో తీసుకున్న నిర్ణయాలు మంచి ఫలితాలనిస్తాయి. దీంతో ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కోగలమన్న ధీమా వస్తుంది. అలా ఆత్మవిశ్వాసంతో మెలగాలంటే కొన్ని అలవాట్లు పాటించాల్సిందే... అవి...

- రోజూ ఓ కొత్త అంశం గురించి తెలుసుకోవాలి. వ్యక్తిగత సామర్థ్యం, నైపుణ్యాలపై నమ్మకంతో ఉండాలి. సానుకూల దృక్పథాన్ని అలవాటు చేసుకోవాలి.
- ప్రతి ఒక్కరికీ ఏదో ఒక రంగంలో ప్రావీణ్యం ఉంటుంది. దానికి తగ్గట్టు లక్ష్యాన్ని నిర్ధేశించుకోవాలి. ఆ లక్ష్యాన్ని చిన్న చిన్న భాగాలుగా విభజించుకుని ఒక్కోదాన్ని సాధిస్తూ ఉంటే క్రమంగా ఆత్మవిశ్వాసం పెరుగుతుంది.
- సుఖంగా, సౌకర్యవంతంగా ఉండే భద్రతా వలయం నుంచి బయటికి రావాలి. కొత్త నిర్ణయాలు, ఆలోచనల పట్ల దృష్టి సారించాలి. స్వీయ ప్రేరణ అలవాటు చేసుకోవాలి. 'ఇది నా వల్ల కాదు' అనుకోకుండా 'ఒకసారి ప్రయత్నించి చూద్దాం' అనే ధోరణి పెంచుకోవాలి.
- మానసికంగా, శారీరకంగా కష్టపడడానికి సిద్ధంగా ఉండాలి. లక్ష్య సాధనలో ఎన్ని సమస్యలు ఎదురైనప్పటికీ వెనుకడుగు వేయకూడదు.
- భవిష్యత్తులో ఎలా ఉండాలి? ఏం సాధించాలి? అనే అంశాలను నిత్యం గుర్తుచేసుకుంటూ ఉండాలి. వాటి కోసం తగిన ప్రయత్నాలు చేస్తూ ముందుకు సాగాలి.
- అనవసరమైన ఆలోచనలు చేస్తూ భయాందోళనలకు గురికాకూడదు. ఒకసారి చేసిన తప్పులు పునరావృతం కాకుండా చూసుకోవాలి. ఎప్పటికప్పుడు లోపాలను సరిదిద్దుకుంటూ సవాళ్లను ఎదుర్కొనే నేర్పరితనాన్ని పెంచుకోవాలి.
- పోషకాహారం తీసుకోవడంతో పాటు సమయానుసారం నిద్రిస్తూ ఒత్తిడిని జయించాలి. రోజూ వ్యాయామం, ధ్యానం, యోగ చేస్తూ శరీర దారుఢ్యాన్ని పెంచుకోవాలి. నచ్చిన పనులు చేయడానికి కొంత సమయాన్ని వినియోగించాలి.
- హుందాగా కనిపించే దుస్తులు ధరించడం, తేలికపాటి మేకప్, వ్యక్తిగత శ్రద్ధ, మంచి స్నేహం అనేవి ఆత్మవిశ్వాసాన్ని పెంచుతాయి.



రోజూ శంఖుపువ్వు టీ తాగితే..



శంఖు పువ్వుల(అపరాజిత పూలు)ను దేవుడి పూజకు వాడుతుంటాం. అయితే ఈ పువ్వులతో చేసిన టీని రోజూ తాగడం వలన అనేక ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయని నిపుణులు చెబుతున్నారు. వాటి గురించి తెలుసుకుందాం..

- శంఖు పువ్వులతో చేసిన టీలో కెఫిన్ ఉండదు. వీటిలో ఉండే ఫ్లేవనాయిడ్లు శరీరంలోని చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గిస్తాయి. ఒత్తిడికి కారణమయ్యే కార్టిసాల్ హార్మోన్ ఉత్పత్తిని తగ్గిస్తాయి.
- ఈ టీ శరీరాన్ని నిర్విషీకరణ చేయడంలో సహాయపడుతుంది.
- ఇందులోని యాంటీఆక్సిడెంట్లు జ్ఞాపక శక్తిని మెరుగుపరచడంతో ఉపకరిస్తాయి.. ఏకాగ్రతను పెంచుతాయి.
- ఈ టీలోని ఫ్లేవనాయిడ్లు, పాలిఫినాయిల్స్ మంట, వాపులను తగ్గిస్తాయి.
- ఈ టీ ఇన్సులిన్ ఉత్పత్తిని ప్రోత్సహించి చక్కెర స్థాయులను నియంత్రిస్తుంది.
- శంఖుపువ్వు టీలో యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఇవి ఫ్రీరాడికల్స్‌తో పోరాడతాయి. అలాగే వృద్ధాప్య ఛాయలను కలిగించే హానికర అణువులతో పోరాడి చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచుతాయి.

ఎలా తయారు చేయాలి?:

స్టవ్ మీద గిన్నె పెట్టి రెండు కప్పుల నీరు పోసి మరిగించాలి. తరువాత 5-7 శంఖుపువ్వులను ఆ నీటిలో వేసి అయిదు నిమిషాలు మరగనివ్వాలి. స్టవ్ ఆపేసి ఆ నీటిని వడకట్టి అందులో తేనె, నిమ్మరసం కలుపుకుని తాగాలి. ఈ టీతో ఆరోగ్య ప్రయోజనాలు పొందాలంటే ఇందులో పంచదార వేయకూడదు.

నిర్మాణ వ్యర్థాల ప్రణాళిక ఉంటేనే..
భవనాలకు అనుమతుల జారీ!

- కాలుష్యం నియంత్రణ, అక్రమ డంపింగ్‌కు చెక్ పెట్టేలా కేంద్రం కొత్త నిబంధనలు

హైదరాబాద్ సిటీ, జూలై 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో భవన నిర్మాణ అనుమతుల జారీలో కొత్త నిబంధనలు అమల్లోకి రానున్నాయి. నిర్ణీత నిర్మాణ విస్తీర్ణం దాటిన భవనాలకు సంబంధించి నిర్మాణ వ్యర్థాల నిర్వహణ ప్రణాళిక కూడా తప్పనిసరి కానుంది. భవనం ప్లాన్‌తోపాటు నిర్మాణం ప్రారంభం నుంచి పూర్తయ్యే వరకు ఎంతమేర వ్యర్థాలు వెలువడే అవకాశముంది? వాటిని ఎక్కడికి తరలిస్తారు? ఎలా వినియోగించుకుంటారు? లేదా ఎవరికైనా అప్పగిస్తారా? అన్న వివరాలతో ప్రణాళిక సమర్పించాల్సి ఉంటుంది. నిర్మాణ వ్యర్థాలతో పర్యావరణంపై ప్రభావం పడటంతోపాటు అక్రమ డంపింగ్‌తో చెరువులు, నాలాల ఆక్రమణలకు దారితీస్తున్న పరిస్థితుల్లో కేంద్రం ఈ అంశంపై దృష్టి సారించింది. కేంద్ర అటవీ, పర్యావరణ, వాతావరణ శాఖల ఆదేశాల మేరకు.. పురపాలక శాఖ, రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి ఈ మార్గదర్శకాలపై కసరత్తు చేస్తున్నాయని జీహెచ్ఎంసీ అధికారి ఒకరు తెలిపారు. కొత్త నిబంధనలు వచ్చే ఏడాది ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి వస్తాయని వెల్లడించారు.

'ఆక్యుపెన్సీ'తో లింకు?

నిర్మాణ సమయంలో వెలువడే సిమెంట్, ఇసుక, ఇటుకల ముక్కలు, రాళ్లు, కాంక్రీట్, టైల్స్, సెరామిక్ తదితర వ్యర్థాలను సాధారణ బిల్డర్లతోపాటు ప్రముఖ సంస్థలు కూడా చెరువులు, నాలాలు, ఖాళీ స్థలాలు, రోడ్ల పక్కన అక్రమంగా డంప్ చేస్తున్నాయి. క్రమంగా చెరువులు, నాలాలు పూడుకుపోయి ఆక్రమణలు సులువు అవుతున్నాయి. పర్యావరణంపైనా ప్రభావం పడుతోంది. ఈ క్రమంలోనే కొత్త నిబంధన తెరపైకి వచ్చింది. ప్రస్తుతం 20 వేల చదరపు మీటర్ల కంటే ఎక్కువ విస్తీర్ణంలో నిర్మిస్తున్న ప్రాజెక్టులకు పర్యావరణ అనుమతులు తప్పనిసరి. అందులో నిర్మాణరంగ వ్యర్థాల నిర్వహణ అంశమూ ఉంది. ఇకపై తక్కువ విస్తీర్ణమున్నా ఈ నిబంధన వర్తింపజేయాలని భావిస్తున్నారు. ఎంత స్థలాన్ని పరిగణనలోకి తీసుకుంటారన్న దానిపై స్పష్టత రావాల్సి ఉంది. ఇక భవన నిర్మాణం పూర్తయ్యాక ఇచ్చే నివాసయోగ్య పత్రం (ఆక్యుపెన్సీ సర్టిఫికెట్)కు నిర్మాణ వ్యర్థాల నిర్వహణనూ ముడిపెట్టనున్నారు. నిర్మాణ వ్యర్థాలు తీసుకెళ్లిన ఏజెన్సీ నుంచి సంబంధిత పత్రాలు తీసుకుని సమర్పించాల్సి ఉంటుంది. ఇక పాత నిర్మాణాలు కూల్చి కొత్త భవనాలు నిర్మించాలనుకుంటే.. పాత నిర్మాణాల వ్యర్థాలకు సంబంధించి ఏజెన్సీల సర్టిఫికెట్ సమర్పించాలి.

తాటి చెట్టే లేదు.. లక్షల లీటర్ల కల్లా?

హైదరాబాద్‌లో ఇదీ పరిస్థితి.. 148 కల్లు కాంపౌండ్లకు అనుమతి.. రంగారెడ్డి జిల్లాలో మరీ దారుణం

- చెట్ల కంటే.. కేటాయింపులే ఎక్కువ
- ఆగస్టు నుంచి నవంబరు వరకు సీజన్ లేకున్నా కల్లు విక్రయాలు ఎలా?



హైదరాబాద్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ నగరంలో మచ్చుకైనా ఒక్కటంటే ఒక్క తాటి చెట్టు కనిపించదు! కానీ, హైదరాబాద్ జిల్లాలో ఏకంగా 148 కల్లు కాంపౌండ్లు ఉన్నాయి! చెట్లు లేని చోట కల్లు కాంపౌండ్లు ఎలా సాధ్యం?? అంటే.. రోజూ విక్రయిస్తున్న లక్షల లీటర్ల కల్లు కల్తీయేనా? ఉమ్మడి రంగారెడ్డి జిల్లా పరిస్థితి ఇంకా దారుణంగా ఉంది..! ఉమ్మడి(రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి) జిల్లాలో 1.89 లక్షల తాటి, ఈత చెట్లు ఉంటే.. కేటాయింపులు 1.94 లక్షల చెట్ల మేర ఉన్నట్లు అబ్కారీ శాఖ గణాంకాలు చెబుతున్నాయి. ఇక్కడ 478 కల్లు డిపోలకు అనుమతులిచ్చారు. సర్కారు ఖజానాను నింపడంలో కీలకంగా వ్యవహరించే అబ్కారీ శాఖ.. రాబడే ధ్యేయంగా అడ్డంగా కల్లు దుకాణాలకు అనుమతులిస్తుండడం కల్తీ కల్లు తయారీకి కారణమవుతోంది. ఫలితంగా కల్తీ కల్లు బాధితులు పెరగడమే కాక.. మరణాలూ చోటు చేసుకుంటున్నాయి.

రాష్ట్రంలో 77.78 లక్షల చెట్లు

రాష్ట్రంలో 77.78 లక్షల ఈత, తాటి చెట్లు ఉన్నట్లు ఎక్సైజ్ శాఖ గణాంకాలు చెబుతున్నాయి. అత్యధిక చెట్లు ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ఉన్నాయి. ఇక్కడ 15,36,361 తాటి చెట్లు, 4,08,552 ఈత చెట్లు ఉన్నాయి! 13,13,266 తాటి చెట్లతో ఉమ్మడి మెదక్ జిల్లా రెండో స్థానంలో ఉంది. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో అత్యధికంగా 7,33,253 ఈత చెట్లున్నాయి. ఇక్కడ తాటిచెట్ల సంఖ్య 2,49,680. రాష్ట్రంలో 4,064 తాడి సహకార సంఘాలు(టీసీఎస్) ఉన్నాయి. వాటి పరిధిలో 4,697 కల్లు తయారీ కేంద్రాలున్నాయి. వీటిలో 1,95,391 మంది సభ్యులున్నారు. తాటిచెట్టు ఎక్కి కల్లు తీసి.. ఆ చెట్టుకిందనే విక్రయించుకోవడానికి ప్రభుత్వం ట్రీ ఫర్ ట్రేడ్‌లైసెన్స్‌లు ఇస్తుంది. ఇలాంటి లైసెన్స్‌లు పొందిన వాళ్లు రాష్ట్రంలో 29,272 మంది ఉండగా.. వాళ్లు 3,541 దుకాణాలను నడుపుతున్నారు. అధికారికంగా ఎక్సైజ్‌శాఖ ఈ లెక్కలు చెబుతున్నా.. అనుమతుల్లేని కల్లు దుకాణాలు అంతకు రెండింతలు ఉంటాయని అంచనా. రెండ్రోజులుగా జరుగుతున్న దాడుల్లోనూ హైదరాబాద్‌లో అనుమతి లేని కల్లు దుకాణాలు వెలుగులోకి వస్తున్నాయి. కల్తీకల్లు తయారీదారులు ఎక్సైజ్ సిబ్బందిని మామూళ్ల మత్తులో.. ప్రజలను క్లోరల్ హైడ్రేడ్ మత్తులో దింపేస్తున్నారనే ఆరోపణలున్నాయి.

గీత కార్మికులేరి?

గతంతో పోలిస్తే.. రాష్ట్ర వ్యాప్తంగా తాటి చెట్టు ఎక్కి.. కల్లు గీసే గీత కార్మికులు తగ్గిపోతున్నారు. ఉదాహరణకు.. ఖమ్మం జిల్లా చింతకాని మండలం అనంతసాగర్‌లో పదేళ్ల క్రితం 110 మంది గీత కార్మికులు ఉండగా.. ప్రస్తుతం వారి సంఖ్య 3కు పడిపోయిందని స్థానిక గీత కార్మికుడు బంధం కొండలు తెలిపారు. అలాంటి పరిస్థితే రాష్ట్ర వ్యాప్తంగా ఉన్నట్లు ఎక్సైజ్‌శాఖ అధికారుల గణాంకాలు వివరిస్తున్నాయి. 2023-24లో గీత కార్మికులకు 53 లక్షల తాటి, ఈత చెట్లు కేటాయించగా.. 2024-25లో కేటాయింపుల సంఖ్య 50 లక్షలకు పడిపోయింది. అంటే.. నిజాయితీగా కల్లు విక్రయించే వాళ్లకు పెద్దగా లాభాలు లేకపోవడంతో గీతకార్మికులు ప్రత్యామ్నాయాల వైపు దృష్టిసారిస్తున్నారు. కానీ, చెట్లే లేని చోట విచ్చలవిడిగా కల్లు కాంపౌండ్లు కొనసాగుతూ.. రూ.కోట్లలో వ్యాపారం సాగుతుండడాన్ని బట్టి.. కల్తీకల్లు ఏ స్థాయిలో విజృంభిస్తోందో అర్థం చేసుకోవచ్చు.

సీజన్ లేకున్నా.. కల్లు ఎక్కడిది..!

తాటి, ఈత చెట్ల నుంచి సీజన్ వారీగా మాత్రమే కల్లు వస్తుంది. ఒక్కో చెట్టు నుంచి గరిష్ఠంగా 12 లీటర్ల కల్లు తయారవుతుంది. వాస్తవానికి డిసెంబరు నుంచి కల్లు తీయడం మొదలు పెడతారు. జనవరి, ఫిబ్రవరి, మార్చి, ఏప్రిల్ నెలల్లో కల్లు ఉత్పత్తి బాగా ఉంటుంది. మే, జూన్ నెలల్లో కల్లు ఉత్పత్తి తగ్గుతుంది. ఆగస్టు, సెప్టెంబరు, అక్టోబరు, నవంబరు నెలల్లో కల్లు ఉత్పత్తి ఉండదు. ఆ నాలుగు నెలల్లో గీత కార్మికులు తాటి, ఈత చెట్లను ఎక్కరు. కానీ.. కల్లు డిపోల్లో మాత్రం అన్ని సీజన్‌లలోనూ నిరంతరాయంగా కల్లు అమ్మకాలు జరుగుతున్నాయి. సీజన్ లేనప్పుడు.. కల్లు ఉత్పత్తి కాకున్నా.. విక్రయాలు ఎలా సాధ్యమనేది ఎక్సైజ్ అధికారులకే తెలియాలి..!

ఎంబీబీఎస్ ప్రవేశాల్లో ఎన్‌సీసీ కోటా అమలయ్యేనా ?

- 2023లో ఆ రిజర్వేషన్ ఎత్తేసిన రాష్ట్ర సర్కారు
- బదులుగా అభ్యర్థికి అదనపు మార్కులు
- రిజర్వేషన్ కోసం ప్రజావాణిలో వినతులు
- ఈ ఏడాది మొదలైన కౌన్సెలింగ్ ప్రక్రియ
- సర్కారు స్పందించాలంటున్న విద్యార్థులు

హైదరాబాద్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని వైద్య కళాశాలల్లో ప్రవేశానికి సంబంధించిన కౌన్సెలింగ్ ప్రక్రియ బుధవారం నుంచి ప్రారంభమైంది. అయితే, ఎన్‌సీసీ(నేషనల్ క్యాడెట్ కార్ప్) కోటాకు అర్హులైన అభ్యర్థులు మాత్రం తమ రిజర్వేషన్ అంశంపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించాలని కోరుతున్నారు. వైద్య విద్య ప్రవేశాల్లో ఎన్‌సీసీ అభ్యర్థులకు ఒక శాతం రిజర్వేషన్ ఉంటుంది. అయితే, తెలంగాణలో 2023 నుంచి ఆపేశారు. ఈ రిజర్వేషన్ కోసం కొందరు అడ్డదారుల తొక్కి ఎంబీబీఎస్ సీట్లు పొందినట్టు తేలడంతో అప్పటి ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ఎన్‌సీసీ క్యాడెట్‌లకు యూజీ సీట్లలో ఉన్న 1 శాతం రిజర్వేషన్‌ను ఎత్తేసింది. రిజర్వేషన్‌కు బదులుగా అర్హులైన ఎన్‌సీసీ క్యాడెట్లకు అదనంగా 6 లేదా 7 మార్కులు కలుపుతున్నారు. అంటే, ఎన్‌సీసీ క్యాడెట్ అర్హత ఉన్న ఓ విద్యార్థి నీట్‌లో 450 మార్కులు సాధిస్తే.. ఏడు మార్కులు కలుపుతారు. దీంతో ఆ అభ్యర్థి స్కోరు 457 అయ్యేది. ప్రస్తుతం ఇదే విధానం అమలులో ఉంది. అయితే, అదనపు మార్కుల కేటాయింపు కాకుండా ఎన్‌సీసీ కోటాను అమలు చేయాలని విద్యార్థులు డిమాండ్ చేస్తున్నారు. ఈ మేరకు కొందరు ప్రజావాణిలో వినతి పత్రాలు కూడా ఇచ్చారు. వైద్య విద్య ప్రవేశాల్లో మాత్రమే ఎన్‌సీసీ కోటా అమలు చేయడం లేదని వాపోయారు. దీంతో ఎన్ఎస్‌సీ కోటా అంశంపై వివరణ ఇవ్వాలని ఆరోగ్య విశ్వవిద్యాలయం ఉపకులపతి(వీసీ)ని వైద్య ఆరోగ్య శాఖ కార్యదర్శి కోరారు. కానీ, వీసీ నుంచి సమాధానం రాలేదని వైద్యవర్గాలు పేర్కొన్నాయి. ప్రస్తుతం కౌన్సెలింగ్ ప్రక్రియ ప్రారంభమవ్వగా.. ప్రభుత్వం స్పందించి ఎన్‌సీసీ క్యాడెట్లకు 1 శాతం రిజర్వేషన్‌ను అమలు చేయాలని విద్యార్థులు కోరుతున్నారు.

699 లీటర్ల కల్తీ కల్లు ధ్వంసం

- గ్రేటర్ పరిధిలో కల్లు కాంపౌండ్లపై.. కొనసాగుతున్న ఎక్సైజ్ శాఖ దాడులు
- 3 దుకాణాలపై కేసులు.. ముగ్గురి అరెస్టు

హైదరాబాద్ సిటీ, జూలై 16 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ సహా రాష్ట్రవ్యాప్తంగా కల్లు కాంపౌండ్‌లపై ఎక్సైజ్ దాడులు కొనసాగుతున్నాయి. సోమవారం ప్రారంభమైన ప్రత్యేక తనిఖీలను ఎక్సైజ్ స్టేషన్ల సిబ్బందితో కలిసి నిర్వహిస్తున్నారు. రెండు రోజుల క్రితం ఉప్పల్ నల్లచెరువు, ఘట్‌కేసర్, సరూర్‌నగర్, రామంతాపూర్, ముషీరాబాద్, కాచిగూడ తదితర ప్రాంతాల్లో 420 లీటర్ల కల్తీ కల్లును ఎక్సైజ్ సిబ్బంది స్వాధీనం చేసుకుని ధ్వంసం చేశారు. తాజాగా బుధవారం గ్రేటర్ పరిధిలోని మల్లాకుంట, మంగళ్‌హాట్, గుడిమల్కాపూర్‌లో నిర్వహించిన దాడుల్లో 699 లీటర్ల కల్తీ కల్లును స్వాధీనం చేసుకొని పారబోశారు. మూడు దుకాణాలపై కేసులు నమోదు చేసి, ముగ్గురు నిందితులను అరెస్టు చేశారు. మల్లాకుంట ప్రాంతంలో 70 లీటర్ల కల్తీ కల్లును ధ్వంసం చేసి నిందితుడు మల్లప్పను అరెస్టు చేశారు. మరో నిందితుడు ఎస్.బసవరాజ్‌పై కేసు నమోదు చేశారు. మంగళ్‌హాట్ ప్రాంతంలోని ఓ దుకాణంలో అనుమతి లేకుండా విక్రయిస్తున్న 247 లీటర్ల కల్లును ఎక్సైజ్ అధికారులు పారబోశారు. దుకాణ నిర్వాహకుడు బి.అనిల్‌గౌడ్‌ను అరెస్టు చేశారు. రామచంద్రయ్య అనే మరో వ్యక్తిపై కేసు నమోదు చేశారు. కాగా, గుడిమల్కాపూర్‌లోని హీరానగర్‌లో అనుమతి లేని కల్లు డిపోలో 382 లీటర్ల కల్లును పారబోశారు. నిర్వాహకుడు గోదా రాఘవేందర్ గౌడ్‌ను అరెస్టు చేశారు. రామకృష్ణగౌడ్ అనే మరో వ్యక్తిపై కేసు నమోదు చేశారు. ఈ మూడు కేసులను ధూల్‌పేట్ ఎక్సైజ్ స్టేషన్‌లో అప్పగించారు. శేరిలింగంపల్లిలోని పలు కల్లు డిపోలపై సీఐ నాగరాజు ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు.

నిరంతరం శాంపిల్స్ సేకరణ..

కల్లు కాంపౌండ్‌లపై ఇక నుంచి నిరంతరం దాడులు నిర్వహించి శాంపిల్స్ సేకరించాలని, కల్తీ కల్లు విక్రయిస్తున్నట్లు తేలితే వెంటనే కేసులు నమోదు చేసి, దుకాణాలు సీజ్ చేయాలని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ షానవాజ్ ఖాసిం ఎక్సైజ్ అధికారులను ఆదేశించారు. కూకట్‌పల్లి పరిధిలో జరిగిన కల్తీకల్లు ఘటనలు మరెక్కడా పునరావృతం కాకుండా పటిష్ఠమైన చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎన్ని సొసైటీలు ఉన్నాయి? వాటి పరిధిలో నడిచే కల్లు దుకాణాలు ఎన్ని? ఆ దుకాణాల్లో అమ్మకాలు జరుపుతున్న కల్లు ఎక్కడి నుంచి సేకరిస్తున్నారు? అనే డేటాతో పాటు అమ్మకాలు జరుపుతున్న దుకాణాల నుంచి కల్లు శాంపిళ్లను సేకరించి కచ్చితంగా పరీక్షల నిమిత్తం ల్యాబ్‌కు పంపించాలని అన్నారు. అనుమతులు లేకుండా నడుపుతున్న కల్లు దుకాణాలను సీజ్ చేయడంతో పాటు వారిపై కేసులు నమోదు చేయాలని ఆదేశించారు.


మంగళ్‌హాట్‌లోని ఓ కల్లు దుకాణంలో ఎక్సైజ్ అధికారులు ధ్వంసం చేసిన కల్తీ కల్లు సీసాలు

ఎర్రగడ్డ ఆస్పత్రికి క్యూ కడుతున్న బాధితులు

ఎర్రగడ్డ: కల్తీ కల్లు బాధితులు ఎర్రగడ్డ మానసిక ఆస్పత్రికి క్యూ కడుతున్నారు. ఎక్సైజ్ శాఖ అధికారుల దాడులతో కొన్ని ప్రాంతాల్లో కల్లు కాంపౌండ్లను మూసివేశారు. దాంతో కల్తీ కల్లుకు అలవాటుపడ్డ కొందరు.. ఎక్కడా కల్లు దొరక్కపోవడంతో పిచ్చిపిచ్చిగా ప్రవర్తిస్తున్నారు. వారిని కుటుంబ సభ్యులు ఎర్రగడ్డ మానసిక ఆస్పత్రికి తీసుకువస్తున్నారు. బుధవారం అవుట్ పేషెంట్ (ఓపీ) బ్లాకుకు సుమారు 100 మంది రోగులు రాగా, వారిలో 30 మంది కల్లు బాధితులే ఉన్నారని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అనిత రాయిరాల తెలిపారు. కాగా, మంగళవారం ఆస్పత్రికి వచ్చిన 40 మంది కల్లు బాధితుల్లో ముగ్గురిని అడ్మిట్ చేసుకుని, మిగతా 37 మందికి మందులు ఇచ్చి పంపించి వేశామని పేర్కొన్నారు. బుధవారం వచ్చిన వారిలో కూడా వ్యాధి అంత తీవ్రంగా ఏమీ లేదని, వారికి శుక్రవారం పరీక్షలు నిర్వహించి మందులు ఇచ్చి పంపిస్తామని అన్నారు.

చిత్రజ్యోతి
SINCE 1965

మనసులో నిలిచిపోతుంది



'పల్లెటూరి నేపథ్యంలో వస్తున్న పూర్తి వినోదాత్మక చిత్రం 'కొత్తపల్లిలో ఒకప్పుడు'. ఈ సినిమాలోని పాత్రల తాలూకు భావోద్వేగాలకు ప్రేక్షకులు అనుభూతి చెందుతారు. విభిన్నమైన.. విలక్షణమైన సినిమాలతో టాలీవుడ్‌లో మంచి పేరు తెచ్చుకున్నారు ప్రవీణ. ఆమె గొప్ప విజన్‌తో ఈ సినిమాను తెరకెక్కించారు. ప్రతి సన్నివేశం మనసులో నిలిచిపోయేలా ఉంటుంది. ప్రేక్షకులు ఈ సినిమాను ఆదరించాలి' అని నటుడు రానా కోరారు. ఆయన సమర్పణలో ప్రవీణ పరుచూరి దర్శకత్వం వహించిన చిత్రమిది. ఈ శుక్రవారం విడుదలవుతోంది. ఈ సందర్భంగా చిత్రబృందం నిర్వహించిన ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో ప్రవీణ మాట్లాడుతూ 'ఇది నాకు నిర్మాతగా మూడో సినిమా. దర్శకురాలిగా తొలి సినిమా. మీకు నచ్చితే మరో నలుగురికి చెప్పి మమ్మల్ని ప్రోత్సహించండి' అని కోరారు. 'నా సినీ గమనాన్నే మార్చే పాత్రను ఈ సినిమాలో చేశాను. మా టీమ్ అంతా చాలా కష్టపడి మీ ముందుకు మంచి సినిమాతో వస్తున్నాం. అన్ని వర్గాల ప్రేక్షకుల్ని మెప్పించే చిత్రమిది' అని హీరో మనోజ్ చంద్ర చెప్పారు.

రజనీని కలసిన కమల్



తన స్నేహితుడు, తమిళ సూపర్‌స్టార్ రజనీకాంత్‌ను అగ్ర నటుడు కమల్ హాసన్ బుధవారం కలుసుకున్నారు. చెన్నై పోయెస్ గార్డెన్‌లో ఉన్న రజనీకాంత్ నివాసంలో వీరిద్దరి భేటీ జరిగింది. డీఎంకే కూటమి తరఫున రాజ్యసభకు ఎంపికైన కమల్ హాసన్.. ఈ నెల 25వ తేదీన ప్రమాణం చేయనున్నారు. ఈ నేపథ్యంలో తన మిత్రుడు రజనీకాంత్‌ను కలిశారు. ఈ మేరకు కమల్ హాసన్ ఓ ట్వీట్ చేస్తూ, "నూతన ప్రయాణాన్ని ప్రారంభించే ముందు నా ఆనందాన్ని నాకెంతో ఇష్టమైన స్నేహితుడితో పంచుకున్నా. ఈ క్షణం నాకెంతో సంతోషంగా ఉంది' అంటూ పేర్కొన్నారు. కాగా, గత 2018లో మక్కల్ నీది మయ్యం పేరుతో రాజకీయ పార్టీని ప్రారంభించిన కమల్ హాసన్... డీఎంకే కూటమిలో ఉన్న అవగాహనా ఒప్పందం మేరకు తమిళనాడు నుంచి పెద్దల సభకు నామినేట్ చేసింది. ఆయనతో పాటు మరో ఇద్దరు డీఎంకే సభ్యులు రాజ్యసభ సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

చెన్నై (ఆంధ్రజ్యోతి)

రవితేజకు పితృవియోగం



రవితేజ ఇంట్లో విషాదం నెలకొంది. ఆయన తండ్రి రాజగోపాల్ రాజు(90) కన్నుమూశారు. ఆయనకు ముగ్గురు సంతానం. వారిలో రవితేజ పెద్ద కుమారుడు. రెండో కుమారుడు భరత్ కారు ప్రమాదంలో మరణించారు. మూడో కుమారుడు రఘు ఇండస్ట్రీలోనే ఉన్నారు. ఆయన ఫార్మసిస్టుగా ఉద్యోగం చేశారు. ఆయన మృతి పట్ల చిరంజీవి, పవన్‌కల్యాణ్‌తో సహా పలువురు సినీ ప్రముఖులు సంతాపం తెలిపారు.




వారిద్దరూ చెబితే తిరుగుండదు

రాజమౌళి

వ్యాపారవేత్త గాలి జనార్దన్ రెడ్డి తనయుడు కిరీటి రెడ్డి హీరోగా రాధాకృష్ణ తెరకెక్కించిన చిత్రం 'జూనియర్'. శ్రీలీల హీరోయిన్. జెనీలియా, రావు రమేశ్ కీలక పాత్రలు పోషించారు. సాయి శివానీ సమర్పణలో రజనీ కొర్రపాటి నిర్మించారు. ఈ శుక్రవారం సినిమా విడుదలవుతున్న సందర్భంగా ప్రీ రిలీజ్ వేడుక నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన దర్శకుడు రాజమౌళి మాట్లాడుతూ "సాయి ఈ సినిమాను ప్రారంభించినప్పుడు మొదట చిన్న ప్రాజెక్ట్ అనుకున్నాను. కానీ ఇప్పుడు దీనిని ఇంత పెద్ద చిత్రంగా మార్చారు. 'ఈ అబ్బాయి బాగా చేశాడు' అని పీటర్ హెయిన్స్ కె.కె.సెంథిల్‌కుమార్ చెప్పేవారు. వారిద్దరూ అలా ఒకరి గురించి చెప్పారంటే ఆ వ్యక్తికి ఇండస్ట్రీలో తిరుగుండదు. దర్శకుడు రాధాకృష్ణ ఎంతో కష్టపడి ఈ సినిమా తెరకెక్కించారు. ఆయన గొప్ప విజయం అందుకుంటారని ఆశిస్తున్నాను. ఇది ఓ పైసా వసూల్ ఎంటర్టైనర్ అవుతుంది" అని అన్నారు. "ఈ సినిమాలో ఒక యాక్షన్ సన్నివేశం ఉంటుంది. అలాంటిది భారతీయ సినిమాల్లో ఇంతవరకూ చూసి ఉండరు" అని కిరీటి రెడ్డి తెలిపారు.

భక్తి ప్రతిఘటనగా మారితే..



మరాఠీ నటుడు సుబోధ్ భావే టైటిల్ రోల్ పోషించిన చిత్రం 'సంత్ తుకారామ్'. ఆదిత్య ఓం దర్శకత్వం వహించారు. ఈ శుక్రవారం సినిమా విడుదలవుతోంది. ఈ సందర్భంగా చిత్ర యూనిట్ రిలీజ్ డేట్ పోస్టర్‌ని ఆవిష్కరించింది. తన భక్తిని ప్రతిఘటనగా మార్చిన 17వ శతాబ్దపు మరాఠీ సాధువు, కవి సంత్ తుకారామ్ జీవితం, వారసత్వం, సాహిత్య విప్లవం ఆధారంగా ఈ చిత్రాన్ని రూపొందించారు. శివ సూర్యవంశీ, షీనా చోహన్, సంజయ్ మిశ్రా, అరుణ్ గోవిల్ తదితరులు కీలక పాత్రలు పోషించారు. ప్రముఖ నటుడు ముకేశ్ ఖన్నా వాయిస్ ఓవర్ ఈ చిత్రానికి హైలెట్ కానుంది. నిఖిల్ కామత్, రవి త్రిపాఠి, వీరల్, లావన్ స్వరపరచిన పాటలు అందర్నీ ఆకట్టుకుంటాయని చిత్ర యూనిట్ తెలిపింది.

మనసుకు హత్తుకునే భావోద్వేగాలతో



నరసింహ నంది దర్శకత్వం వహిస్తున్న తాజా చిత్రం 'ప్రభుత్వ సారాయి దుకాణం'. విక్రమ్, అదితి జంటగా నటించారు. దైవ నరేశ్ గౌడ్, పరిగి స్రవంతి మల్లిక్ నిర్మించారు. ఇటీవలె నిర్వహించిన కార్యక్రమంలో చిత్రబృందం ఫస్ట్‌లుక్‌ను విడుదల చేసింది. ఈ సందర్భంగా నరసింహ నంది మాట్లాడుతూ '1980ల నాటి ఓ తెలంగాణ గ్రామంలో జరిగిన అనూహ్య సంఘటనల సమాహారంగా ఈ చిత్రం తెరకెక్కుతోంది. మనసుకు హత్తుకునే భావోద్వేగాలున్న కథ ఇది' అని అన్నారు. 'పల్లెటూరి నేపథ్యంలో వస్తున్న పూర్తి వినోదాత్మక చిత్రమిది. వాణిజ్య, సామాజిక అంశాలను కలిపి నరసింహ నంది మంచి కథతో ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు' అని నిర్మాతలు తెలిపారు.

బిజినెస్

టెక్ మహీంద్రా లాభం రూ.1,140 కోట్లు

క్యూ1లో 34 శాతం వృద్ధి నమోదు

న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025-26)లో జూన్‌తో ముగిసిన మొదటి త్రైమాసికం (క్యూ1)లో టెక్ మహీంద్రా ఏకీకృత నికర లాభం రూ.1,140.60 కోట్లుగా నమోదైంది. గత ఆర్థిక సంవత్సరం (2024-25)లో ఇదే కాలానికి ఆర్జించిన రూ.851.5 కోట్ల లాభంతో పోలిస్తే దాదాపు 34 శాతం వృద్ధి కనబరిచింది. కమ్యూనికేషన్స్, రిటైల్, బీఎఫ్ఎస్ఐ విభాగాలు మెరుగైన వృద్ధి సాధించడం ఇందుకు దోహదపడింది. ఈ క్యూ1లో కంపెనీ ఆదాయం వార్షిక ప్రాతిపదికన 2.7 శాతం వృద్ధి చెంది రూ.13,351.2 కోట్లకు పెరిగింది. మార్చితో ముగిసిన త్రైమాసికంతో పోలిస్తే మాత్రం కంపెనీ లాభం 2.2 శాతం, ఆదాయం 0.2 శాతం తగ్గింది. ప్రస్తుతం ఐటీ రంగంలో నెలకొన్న అస్థిర వాతావరణంలో కంపెనీ ప్రణాళికలకు అనుగుణమైన పురోగతిని జూన్ త్రైమాసిక పని తీరు ప్రతిబింబిస్తోందని టెక్ మహీంద్రా సీఈఓ, ఎండీ మోహిత్ జోషి అన్నారు. మరిన్ని ముఖ్యాంశాలు..

- గడిచిన మూడు నెలల్లో 80.9 కోట్ల డాలర్ల విలువైన కొత్త కాంట్రాక్టులను కంపెనీ దక్కించుకుంది.
- ఈ క్యూ1లో బీఎఫ్ఎస్ఐ విభాగం నుంచి ఆదాయంలో వార్షిక ప్రాతిపదికన 4.7 శాతం వృద్ధి నమోదైంది. రిటైల్, లాజిస్టిక్స్, ట్రాన్స్‌పోర్ట్ 3.8 శాతం, కమ్యూనికేషన్స్ 2.5 శాతం వృద్ధి చెందాయి. మాన్యుఫాక్చరింగ్ విభాగ రెవెన్యూ మాత్రం 4 శాతం తగ్గగా.. టెక్నాలజీ, మీడియా, ఎంటర్‌టైన్‌మెంట్ రెవెన్యూ 3.3 శాతం తగ్గింది.



- ప్రాంతాల వారీగా చూస్తే, యూరప్ మార్కెట్ నుంచి ఆదాయం 11.7 శాతం పెరగగా.. అమెరికా నుంచి రెవెన్యూ 5.9 శాతం తగ్గింది.
- ఈ జూన్ 30 నాటికి టెక్ మహీంద్రాలో మొత్తం 1,48,517 మంది పనిచేస్తున్నారు. ఏడాది క్రితంతో పోలిస్తే ఉద్యోగులు నికరంగా 897 మంది పెరిగారు. ఐటీ విభాగ సిబ్బంది సంఖ్య మాత్రం 622 తగ్గుదలతో 79,987గా నమోదైంది. ఐటీ విభాగంలో ఉద్యోగుల వలసల (అట్రిషన్) రేటు 12.6 శాతానికి పెరిగింది.
- బుధవారం బీఎస్ఈలో కంపెనీ షేరు 1.94 శాతం పెరిగి రూ.1,609 వద్ద ముగిసింది. కంపెనీ త్రైమాసిక ఫలితాలను మార్కెట్ ట్రేడింగ్ ముగిసిన తర్వాత ప్రకటించింది.

ఇక గోల్డ్, సిల్వర్ ఈటీఎఫ్‌లకు దేశీయ కమోడిటీ ఎక్స్ఛేంజ్ రేట్లే ప్రామాణికం

● ఈ విలువైన లోహాల విలువ లెక్కింపు విధానాన్ని మార్చే యోచనలో సెబీ

న్యూఢిల్లీ: బంగారం, వెండి ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్ల (ఈటీఎఫ్) ద్వారా మ్యూచువల్ ఫండ్స్ కలిగి ఉన్న భౌతిక బంగారం, వెండి విలువ లెక్కింపు విధానాన్ని పునఃసమీక్షించాలని మార్కెట్ నియంత్రణ మండలి సెబీ యోచిస్తోంది. ఇందుకోసం మ్యూచువల్ ఫండ్ కంపెనీలు దేశీయ కమోడిటీ ఎక్స్ఛేంజ్‌లు ప్రకటించే స్పాట్ ధరలను ప్రామాణికంగా తీసుకోవాలని సెబీ ప్రతిపాదించింది. ప్రస్తుతం మ్యూచువల్ ఫండ్స్.. లండన్ బులియన్ మార్కెట్ అసోసియేషన్ (ఎల్ఎంబీఏ) ధరలను ప్రామాణికంగా తీసుకుంటున్నాయని బుధవారం విడుదల చేసిన చర్చాపత్రంలో నియంత్రణ సంస్థ పేర్కొంది. గోల్డ్, సిల్వర్ ఈటీఎఫ్‌ల్లో మరింత స్థిరత్వంతో పాటు దేశీయ మార్కెట్ ధరలతో వీటిని అనుసంధానించేందుకు సెబీ తాజా ప్రతిపాదన దోహదపడనుంది. అంతేకాదు, దేశీయంగా ఒకే ప్రామాణిక ధరను ఏర్పాటు చేయడంతో పాటు ప్రజలకు అందుబాటులో ఉంచే స్పాట్ ధరను నిర్ణయించేందుకు సమగ్ర పోలింగ్ విధానాన్ని కూడా రూపొందించాలని ఆలోచిస్తోంది. తాజా ప్రతిపాదనలపై ఆగస్టు 9లోగా అభిప్రాయాలు తెలపాలని సెబీ ప్రజలను కోరింది.

జియోబ్లాక్‌రాక్ నుంచి 5 కొత్త ఫండ్స్

న్యూఢిల్లీ: కొత్తగా ఐదు మ్యూచువల్ ఫండ్ పథకాలు ప్రారంభించేందుకు క్యాపిటల్ మార్కెట్ నియంత్రణ సంస్థ సెబీ ఆమోదం లభించిందని జియోబ్లాక్‌రాక్ అసెట్ మేనేజ్‌మెంట్ బుధవారం వెల్లడించింది. జియోబ్లాక్‌రాక్ నిఫ్టీ 50 ఇండెక్స్ ఫండ్, జియోబ్లాక్‌రాక్ నిఫ్టీ 8-13 ఇయర్ జీ-సెక్ ఇండెక్స్ ఫండ్, జియోబ్లాక్‌రాక్ నిఫ్టీ స్మాల్‌క్యాప్ 250 ఇండెక్స్ ఫండ్, జియోబ్లాక్‌రాక్ నిఫ్టీ నెక్స్ట్ 50 ఇండెక్స్ ఫండ్, జియోబ్లాక్‌రాక్ నిఫ్టీ మిడ్‌క్యాప్ 150 ఇండెక్స్ ఫండ్ ఈ జాబితాలో ఉన్నాయి. ఇందులో నాలుగు ఈక్విటీ ఫండ్లు కాగా.. ఒకటి డెట్ ఫండ్. ఈ నెల 7న సంస్థ 3 న్యూ ఫండ్ ఆఫర్ల (ఎన్ఎఫ్ఓ) ద్వారా మొత్తం రూ.17,800 కోట్లు సమీకరించింది. ముకేశ్ అంబానీకి చెందిన జియో ఫైనాన్షియల్ సర్వీసెస్ లిమిటెడ్ (జేఎఫ్ఎస్ఎల్), అమెరికా చెందిన బ్లాక్‌రాక్‌తో కలిసి సమ భాగస్వామ్యంలో ఏర్పాటు చేసిన కంపెనీయే జియోబ్లాక్‌రాక్ అసెట్ మేనేజ్‌మెంట్.

ఈక్విటీ, బాండ్ల జారీ ద్వారా రూ.45,000 కోట్ల సమీకరణ

ఎస్‌బీఐ

న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025-26)లో ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ దిగ్గజం ఎస్‌బీఐ.. ఈక్విటీ, బాండ్ల జారీ ద్వారా మొత్తం రూ.45,000 కోట్ల వరకు నిధులు సమీకరించనుంది. అందులో రూ.25,000 కోట్ల వరకు ఈక్విటీ షేర్ల విక్రయం ద్వారా సేకరించనున్నట్లు బ్యాంక్ బుధవారం ప్రకటించింది. క్వాలిఫైడ్ ఇన్‌స్టిట్యూషనల్ ప్లేస్‌మెంట్ (క్యూఐపీ) పద్ధతిలో సంస్థాగత ఇన్వెస్టర్లకు షేర్ల కేటాయింపు ద్వారా ఈ నిధులు సమీకరించనున్నట్లు తెలిపింది. షేరు కనీస ధరను రూ.811.05గా నిర్ణయించింది. బుధవారం బీఎస్ఈలో బ్యాంక్ షేరు ముగింపు ధర రూ.831.55తో పోలిస్తే 2.46 శాతం తక్కువ ఇది. క్యూఐపీ ద్వారా నిధుల సమీకరణకు బ్యాంక్ బోర్డు మే నెలలోనే ఆమోదం తెలపగా..షేర్‌హోల్డర్లు గత నెలలోనే గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. కాగా, దేశీయ ఇన్వెస్టర్లకు బాండ్ల జారీ ద్వారా మరో రూ.20,000 కోట్లు సమీకరించనున్నట్లు, ఇందుకు బోర్డు కూడా అంగీకారం లభించిందని తెలిపింది. ఎస్‌బీఐ చివరిసారి 2017-18లో క్యూఐపీ ద్వారా రూ.15,000 కోట్లు పోగేసింది.

ఎన్ఐఆర్ఎంతో సిబీ మైనింగ్ జట్టు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): హైదరాబాద్‌కు చెందిన సిబీ మైనింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రైవేట్ లిమిటెడ్.. కేంద్ర ప్రభుత్వ నిర్వహణలోని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ రాక్ మెకానిక్స్ (ఎన్ఐఆర్ఎం)తో ఒక అవగాహనా ఒప్పందం (ఎంఓయూ) కుదుర్చుకుంది. ఈ ఒప్పందం ద్వారా రెండు సంస్థలు గనులు, మౌలిక ప్రాజెక్టుల నిర్మాణంలో అవసరమయ్యే అధునాతన నియంత్రిత పేలుళ్ల టెక్నాలజీలో సహకరించుకుంటాయి. సిబీ మైనింగ్.. ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీ సత్యసాయి జిల్లా పెద్దకోట వద్ద అదానీ గ్రీన్ ఎనర్జీ ఏర్పాటు చేసే చిత్రావతి పంప్డ్ స్టోరేజీ ప్రాజెక్టు నిర్మాణంలో ఈ టెక్నాలజీని ఉపయోగించనుంది.

ఎర్టిగా, బాలెనో ధరల పెంపు

మారుతి సుజుకీ

న్యూఢిల్లీ:మారుతీ సుజుకీ ఇండియా (ఎంఎస్ఐ).. ఎర్టిగా, బాలెనో కార్ల ధరలను స్వల్పంగా పెంచింది. ఎర్టిగా మోడల్ ధర 1.4 శాతం, ప్రీమియం హ్యాచ్‌బ్యాక్ బాలెనో ధర 0.5 శాతం పెంచినట్లు వెల్లడించింది. ఈ మోడళ్లలో ఆరు ఎయిర్‌బ్యాగ్‌లను స్టాండర్డ్ ఫీచర్‌గా చేర్చడం ఈ పెంపునకు ప్రధాన కారణమని తెలిపింది. పెంచిన ధరలు తక్షణమే అమల్లోకి వస్తాయని పేర్కొంది. కాగా ప్రస్తుతం బాలెనో ధర రూ.6.7 లక్షల నుంచి రూ. 9.92 లక్షల మధ్య ఉండగా ఎర్టిగా ధర రూ. 8.97 లక్షల నుంచి రూ.13.25 లక్షల మధ్యన ఉంది.

కాకినాడ ఎల్ఎన్‌జీ టెర్మినల్ ప్రాజెక్టులో కదలిక

పైప్‌లైన్ కోసం క్రౌన్ ఎల్ఎన్‌జీ–పీఐఎల్ మధ్య ఎంఓయూ

న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్‌లోని కాకినాడ వద్ద క్రౌన్ ఎల్ఎన్‌జీ హోల్డింగ్స్ లిమిటెడ్ కంపెనీ ఏర్పాటు చేసే ఎల్ఎన్‌జీ టెర్మినల్ ప్రాజెక్టుకు సంబంధించి మరో అడుగు ముందుకు పడింది. ఈ టెర్మినల్‌ను అనుసంధానం చేస్తూ పైప్‌లైన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ (పీఐఎల్) పైప్‌లైన్ ఏర్పాటు చేయనుంది. దీనికి సంబంధించిన అవగాహనా ఒప్పందం (ఎంఓయూ)పై ఇటీవల క్రౌన్ ఎల్ఎన్‌జీ హోల్డింగ్స్ సీఈఓ స్వపన్ కటారియా, పీఐఎల్ ఎండీ అఖిల్ మెహరోత్రా సంతకాలు చేశారు. క్రౌన్ ఎల్ఎన్‌జీ.. విదేశాల నుంచి దిగుమతి చేసుకున్న ఎల్ఎన్‌జీని రీగ్యాసిఫికేషన్ చేసి దేశ ఉత్తర, పశ్చిమ ప్రాంతాల్లోని వినియోగదారులకు ఈ పైప్‌లైన్ ద్వారా సరఫరా చేస్తుంది.

రూ.9,000 కోట్ల ప్రాజెక్టు: కాకినాడ ఎల్ఎన్‌జీ ప్లాంట్ కోసం క్రౌన్ ఎల్ఎన్‌జీ హోల్డింగ్స్ రూ.9,000 కోట్ల వరకు ఖర్చు చేయనుంది. వచ్చే ఏడాది నిర్మాణం ప్రారంభించి నాలుగేళ్లలో ప్రాజెక్టు పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఏటా 72 లక్షల టన్నుల ఎల్ఎన్‌జీ దిగుమతి సామర్థ్యంతో ఏర్పాటు చేసే కాకినాడ ఎల్ఎన్‌జీ టెర్మినల్ కోసం కృష్ణ గోదావరి ఎల్ఎన్‌జీ టెర్మినల్ ప్రైవేట్ లిమిటెడ్ పేరుతో ప్రత్యేక అనుబంధ కంపెనీని కూడా ఏర్పాటు చేసింది. కాగా ఎనర్జీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ట్రస్ట్ (ఇన్విట్).. స్పెషల్ పర్పస్ వెహికల్‌గా పీఐఎల్ ఉంది. ఈ సంస్థ గుజరాత్‌లోని బరూచ్ నుంచి కాకినాడ వరకు దాదాపు 1,400 కిలోమీటర్ల పైప్‌లైన్‌ను నిర్వహిస్తోంది. రిలయన్స్ ఇండస్ట్రీస్ సహా మరికొన్ని సంస్థలు ఇక్కడ క్షేత్రాల నుంచి సహజ వాయువును రవాణా చేసేందుకు ఈ పైప్‌లైన్‌ను ఉపయోగిస్తున్నాయి.

హెచ్‌పీసీఎల్ విశాఖ రిఫైనరీలో గ్రీన్ హైడ్రోజన్ ప్లాంట్

కాంట్రాక్ట్ దక్కించుకున్న ఓసియర్ ఎనర్జీ

ముంబై:ప్రభుత్వ రంగంలోని హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (హెచ్‌పీసీఎల్) కూడా హరిత బాట పట్టింది. ఇందులో భాగంగా విశాఖపట్నంలోని తన రిఫైనరీ వద్ద ఏటా 5,000 టన్నుల ఉత్పత్తి సామర్థ్యం ఉన్న హరిత ఉదజని (హైడ్రోజన్) ప్లాంటు ఏర్పాటు చేస్తోంది. అబుదాబీ కేంద్రంగా పనిచేసే ఓసియర్ ఎనర్జీ ఈ ప్లాంటు ఏర్పాటు చేయనుంది. ఈ ప్లాంటు ఏర్పాటు కోసం ఎనిమిది కంటే ఎక్కువ కంపెనీలు ముందుకు వచ్చాయి. అయితే ఓసియర్ ఎనర్జీ కంపెనీ కిలో హరిత ఉదజనికి తక్కువలో తక్కువగా రూ.328 కోట్ చేయడం ద్వారా ఈ కాంట్రాక్టును దక్కించుకుంది. విశాఖ హెచ్‌పీసీఎల్ వద్ద ఏర్పాటు చేసే హరిత ఉదజని ప్లాంటును ఓసియర్ ఎనర్జీయే ఏర్పాటు చేసి పాతికేళ్ల పాటు నిర్వహిస్తుంది. కాగా ఓసియర్ ఇప్పటికే గుజరాత్, ఒడిశాల్లో హరిత ఉదజని, అమ్మోనియా ప్లాంట్లు దక్కించుకుంది.

వడ్డీ రేట్ల తగ్గింపుపై ఆచితూచి నిర్ణయం

ఆర్‌బీఐ గవర్నర్ మల్హోత్రా

న్యూఢిల్లీ: వడ్డీ రేట్లు మరింత తగ్గించడంపై తొందర లేదని భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) గవర్నర్ సంజయ్ మల్హోత్రా స్పష్టం చేశారు. మారుతున్న ఆర్థిక పరిస్థితులకు అనుగుణంగా దీనిపై నిర్ణయం తీసుకుంటామన్నారు. జూన్ నెల రిటైల్ ద్రవ్యోల్బణం ఆరేళ్ల కనిష్ఠ స్థాయికి తగ్గడంతో ఆర్‌బీఐ తదుపరి ఎంపీసీ సమావేశంలోనూ రెపో రేటు మరో పావు శాతం తగ్గిస్తుందని అంచనాలు వెలువడ్డాయి. ఈ నేపథ్యంలో మల్హోత్రా వడ్డీ రేట్ల కోతలపై తొందరపడటం లేదని చెప్పడం విశేషం. ధరల స్థిరత్వంతో పాటు జీడీపీ వృద్ధి రేటు కూడా తమకు అత్యంత ముఖ్యమని మల్హోత్రా చెప్పారు. జీడీపీ వృద్ధి రేటు కంటే ద్రవ్యోల్బణ కట్టడే ఆర్‌బీఐ ముఖ్య కర్తవ్యమని చెప్పడం సరికాదన్నారు.

స్వల్ప లాభాలతో సరి

సెన్సెక్స్ 64 పాయింట్లు అప్

ముంబై: ట్రంప్ సుంకాల అనిశ్చితి ఇంకా వీడకపోవడంతో పాటు అంతర్జాతీయ మార్కెట్లో ట్రేడింగ్ ట్రెండ్ బలహీనంగా ఉండటంతో దేశీయ ఈక్విటీ ఇన్వెస్టర్లు వేచి చూసే ధోరణిని ప్రదర్శించారు. దాంతో పరిమిత శ్రేణిలోనే కదలాడిన ప్రామాణిక సూచీలు చివరికి స్వల్ప లాభంతో సరిపెట్టుకున్నాయి. బుధవారం ట్రేడింగ్ నిలిచేసరికి సెన్సెక్స్ 63.57 పాయింట్ల వృద్ధితో 82,634.48 వద్ద స్థిరపడింది. ఇంట్రాడేలో సూచీ 82,784 వద్ద గరిష్ఠాన్ని, 82,342 వద్ద కనిష్ఠాన్ని నమోదు చేసింది. కాగా, నిఫ్టీ 16.25 పాయింట్ల పెరుగుదలతో 25,212.05 వద్ద ముగిసింది. సెన్సెక్స్‌లోని 30 నమోదిత కంపెనీల్లో సగమే రాణించాయి.

హైదరాబాద్‌లో బ్రిగేడ్ గ్రూప్ కొత్త 'కో-వర్కింగ్ సెంటర్'

రియల్టీ సంస్థ బ్రిగేడ్ ఎంటర్‌ప్రైజెస్ లిమిటెడ్.. హైదరాబాద్‌లో మరో ప్రతిష్ఠాత్మక ప్రాజెక్ట్‌ను ప్రారంభించింది. హైటెక్ సమీపంలోని మైండ్ స్పేస్ బిజినెస్ పార్క్ వద్ద 50,000 చదరపు అడుగుల విస్తీర్ణంలో కో-వర్కింగ్ కేంద్రాన్ని అందుబాటులోకి తీసుకువచ్చింది. తన అనుబంధ సంస్థ బజ్‌వర్క్స్ ద్వారా బ్రిగేడ్ ఎంటర్‌ప్రైజెస్ ఈ ప్రాజెక్ట్ చేపట్టింది. ఈ కో వర్కింగ్ కేంద్రంలో 1,000 మంది పని చేయవచ్చని ప్రకటించింది. కాగా కంపెనీ ఇప్పటికే హైటెక్ సిటీ సమీపంలోనే కో వర్కింగ్ సెంటర్‌ను నిర్వహిస్తోంది.

ఫాంగేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

17వ తేదీ			
హైదరాబాద్	510	విజయవాడ	515
వరంగల్	512	గోదావరి	496
చిత్తూరు	583	విశాఖపట్నం	540
		డజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	93	విజయవాడ	97
వరంగల్	93	గుంటూరు	102
కరీంనగర్	93	ఒంగోలు	105
మహబూబ్‌నగర్	93	చిత్తూరు	100
కర్నూలు	93	నెల్లూరు	105
విశాఖపట్నం	83	అనంతపురం	105
గోదావరి	97		

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	99,280 ▼	91,000 ▼	1,24,000 ▼
విజయవాడ	1,00,530 ▼	94,500 ▼	1,14,500 ▼
విశాఖపట్నం	1,00,460 ▼	91,000 ▼	1,24,000 ▼
రాజమండ్రి	99,270 ▼	91,000 ▼	1,15,600 ▲
ప్రొద్దుటూరు	97,800 ▼	89,980 ▼	1,12,800 ▲
ముంబై	97,500 ▼	89,310 ▼	1,11,200 ▼

స్పోర్ట్స్

ఇంగ్లండ్‌కు రెండు పాయింట్ల కోత

● స్లో ఓవర్ రేట్ జరిమానా కూడా..

లండన్: లార్డ్స్‌లో భారత్‌తో జరిగిన టెస్ట్ మ్యాచ్‌లో స్లో ఓవర్ రేట్‌కు పాల్పడిన ఇంగ్లండ్‌పై ఐసీసీ చర్యలు తీసుకుంది. రెండు వరల్డ్ టెస్ట్ చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) పాయింట్లు కోత విధించడంతోపాటు ఇంగ్లండ్ జట్టు మ్యాచ్ ఫీజులో 10 శాతం జరిమానాగా విధించింది. నిర్ణీత సమయంలో బౌల్ చేయాల్సిన ఓవర్ల కంటే రెండు ఓవర్లు తక్కువగా వేయడంతో మ్యాచ్ రెఫరీ చర్యలు తీసుకొన్నాడు. దీంతో డబ్ల్యూటీసీ పాయింట్ల పట్టికలో ఇంగ్లండ్ మూడో స్థానానికి పడిపోయింది. మూడో టెస్ట్‌లో టీమిండియాపై ఇంగ్లండ్ 22 పరుగుల తేడాతో గెలిచింది. కాగా, ఐసీసీ పక్షపాత ధోరణితో వ్యవహరిస్తోందని ఇంగ్లండ్ మాజీ కెప్టెన్ మైకేల్ వాన్ అసంతృప్తి వ్యక్తం చేశాడు. 'ఇరుజట్లూ ఈ తప్పిదం చేశాయి. కానీ, ఒక్క టీమ్‌పైనే చర్యలు తీసుకోవడమేంటో నాకు అర్థం కావడం లేదు' అని వాన్ ఎక్స్‌లో పోస్టు చేశాడు.

హంపి, హారిక గేమ్‌లు డ్రా

బటూమి (జార్జియా): చెస్ వరల్డ్ కప్ ప్రీక్వార్టర్ ఫైనల్ తొలి గేమ్‌ను గ్రాండ్‌మాస్టర్లు హంపి, హారిక డ్రా చేశారు. కోస్టెన్యూక్‌తో హంపి, లగ్నోతో హారిక పాయింటు పంచుకున్నారు. అలాగే గ్రాండ్‌మాస్టర్ వైశాలి కూడా కమలిదెనోవాతో గేమ్‌ను డ్రాగా ముగించింది. మరో గేమ్‌లో దివ్యా దేశ్‌ముఖ్.. చైనాకు చెందిన ఝు జినెర్‌పై విజయంతో పూర్తి పాయింటు సాధించింది.

'లార్డ్స్' ఓటమికి గిల్ తీరే కారణం



న్యూఢిల్లీ: లార్డ్స్ టెస్ట్‌లో భారత కెప్టెన్ శుభ్‌మన్ గిల్ వ్యవహార శైలిని మాజీ ఆటగాడు మహ్మద్ కైఫ్ తీవ్రంగా తప్పుబట్టాడు. మూడో రోజు ఆట చివర్లో ఇంగ్లండ్ రెండో ఇన్నింగ్స్‌లో బ్యాటింగ్‌కు రాగా.. సమయం వృథా చేస్తున్నావంటూ ఓపెనర్ క్రాలేతో గిల్ గొడవకు దిగడం ఆ జట్టును రెచ్చగొట్టిందన్నాడు. అది మనసులో పెట్టుకొని స్టోక్స్ కసిగా బౌలింగ్ చేసి టీమిండియాను దెబ్బతీశాడని కైఫ్ విశ్లేషించాడు. తన తత్వానికి తగిన విధంగా గిల్ నడుచుకోవాలని హితవు పలికాడు. కాగా, కోహ్లీని గిల్ అనుకరించే ప్రయత్నం చేస్తున్నాడని మాజీ ఆటగాడు సంజయ్ మంజ్రేకర్ విమర్శించాడు. అందరి దృష్టిని ఆకర్షించడం కోసమే ఇలా చేస్తున్నాడన్నాడు.

బరిలో అర్జున్, ప్రజ్ఞానంద

ఫ్రీస్టయిల్ చెస్ గ్రాండ్‌స్లామ్ నేటినుంచి

లాస్ వెగాస్ (యూఎస్ఏ): తెలుగు గ్రాండ్‌మాస్టర్ అర్జున్ ఇరిగేసి, తమిళ స్టార్ ప్రజ్ఞానంద, విదిత్ గుజరాతి.. బుధవారం నుంచి జరిగే లాస్ వెగాస్ ఫ్రీస్టయిల్ చెస్ గ్రాండ్‌స్లామ్ టోర్నమెంట్‌లో పోటీపడుతున్నారు. ఈ మెగా టోర్నీలో ప్రపంచ చాంపియన్ గుకేశ్ ఆడడం లేదు. టోర్నీలో మొత్తం 16 మంది క్రీడాకారులు రెండు గ్రూపులుగా విడిపోయి తలపడనున్నారు. వైట్ గ్రూప్‌లో కార్ల్‌సన్, ప్రజ్ఞానంద ఉండగా, బ్లాక్ గ్రూప్ నుంచి అర్జున్, విదిత్ బరిలో ఉన్నారు. ప్రతి గ్రూప్‌లో తొలి నాలుగు స్థానాల్లో నిలిచిన ఆటగాళ్లు క్వార్టర్స్‌కు చేరతారు. ఈనెల 21న ఫైనల్ జరగనుంది. టోర్నీ విజేతకు రూ. 1.71 కోట్లు ప్రైజ్‌మనీగా దక్కనుంది.



పేస్ పిచ్‌లపై స్పిన్ మాయ!

ఇంగ్లండ్‌లో తెలుగమ్మాయి శ్రీచరణి జోరు

ఇంగ్లండ్ పిచ్‌లు పేసర్లకు స్వర్గధామం. అలాంటి వికెట్‌పై ఓ స్పిన్నర్ ఏకంగా నాలుగు వికెట్లు పడగొట్టిందంటే అది ఆమెలోని అసాధారణ ప్రతిభకు నిదర్శనమే. ఆ అద్భుత నైపుణ్యంతోనే అందరి దృష్టినీ ఆకర్షించింది ఆంధ్రప్రదేశ్‌కు చెందిన యువ లెఫ్టామ్ స్పిన్నర్ శ్రీచరణి. క్లిష్టమైన ఇంగ్లండ్ పర్యటనకు జట్టులో చోటు కల్పిస్తూ సెలెక్టర్లు తనపై ఉంచిన నమ్మకానికి ఆమె పూర్తిగా న్యాయం చేసింది. ఇంగ్లండ్‌తో తొలి టీ20లో 210 పరుగుల భారీ లక్ష్య ఛేదనలో శ్రీచరణి స్పిన్ మాయాజాలానికి ఇంగ్లండ్ కుదేలైంది. కెప్టెన్ నాట్ సివర్ బ్రంట్, ఎకెల్‌స్టోన్ వంటి సత్తా కలిగిన బ్యాటర్లు సైతం శ్రీచరణి స్పిన్ బంతులను ఎదుర్కోలేకపోయారు.

(ఆంధ్రజ్యోతి క్రీడా విభాగం)

ఆంధ్రప్రదేశ్‌లోని కడప జిల్లాకు చెందిన నల్లపురెడ్డి శ్రీచరణి క్రికెట్ అరంగేట్రం ఎంతో ఆసక్తికరం. క్రికెట్‌కు ముందు ఆమె ఎన్నో ఆటలాడింది. ఖోఖో, కబడ్డీ, అథ్లెటిక్స్‌లో రాణించింది. కానీ క్రికెట్‌లోకి అడుగుపెట్టేందుకు మాత్రం ఆమె మామయ్య కిశోర్‌కుమార్ రెడ్డే కారణం. అయితే ఈ ఆటలో ప్రొఫెషనల్ అవుతానని మాత్రం శ్రీచరణి అస్సలు అనుకోలేదు. మొదట పేస్ బౌలింగ్‌లో ప్రయత్నించింది. కానీ వికెట్లు సాధించలేకపోయింది. దాంతో స్పిన్ బౌలింగ్‌ను ఎంచుకుంది. వాస్తవంగా..శ్రీచరణిని బ్యాడ్మింటన్ ప్లేయర్‌గా చూడాలనేది తండ్రి చంద్రశేఖర్‌రెడ్డి కోరిక. క్రికెట్‌కు మారతానంటే ఆయన ఓ పట్టాన అంగీకరించలేదు. శ్రీచరణి మాత్రం తాను క్రికెట్ మాత్రమే ఆడతానని భీష్మించింది. కుమార్తె పట్టుదలను చూసిన ఆయన సంవత్సరం తర్వాత తన అంగీకారాన్ని తెలిపారు. క్రికెట్ ఆటంటే మాటలా! బాగా ఖర్చుతో కూడుకున్నది. శ్రీచరణి తండ్రి అప్పటికే ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నాడు.. కుమార్తెను క్రికెటర్‌గా తీర్చిదిద్దేందుకు ఆయన మరిన్ని ఆర్థిక ఇబ్బందులకూ వెరవలేదు. అలా తండ్రితోపాటు తల్లి ఇచ్చిన ప్రోత్సాహంతో కొద్దికాలంలోనే ఆమె రాష్ట్రస్థాయిలో సత్తా చాటడంతో జాతీయ సెలెక్టర్ల దృష్టిలో పడింది.

ఐపీఎల్‌లో..: గత ఏడాది డిసెంబరులో జరిగిన మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) వేలంలో ముంబై ఇండియన్స్‌తో పోటీపడిన ఢిల్లీ క్యాపిటల్స్ శ్రీచరణిని రూ. 55 లక్షలకు సొంతం చేసుకుంది. వేలానికి ముందు శ్రీచరణితో పాటు ఆమె తల్లిదండ్రులు బాగా టెన్షన్‌కు లోనయ్యారు. మొదటిసారి వేలంలో నిలిచిన తనను అసలు ఏ జట్టయినా కొనుగోలు చేస్తుందా..అనే అనుమానం ఆమెను బాగా పీడించింది. కానీ ఏకంగా అరకోటిపైగా మొత్తంతో ఢిల్లీ క్యాపిటల్ దక్కించుకోవడంతో శ్రీచరణి కుటుంబం అవధుల్లేని ఆనందానికి లోనైంది. ఆర్‌సీబీ ప్లేయర్ రాఘవి బిస్త్‌ను అవుట్ చేసి సాధించిన తొలి ఐపీఎల్ వికెట్‌ను ఎప్పటికీ మరిచిపోలేనని శ్రీచరణి అంటుంది. అది తాను వేసిన అత్యుత్తమ బంతిగా తెలిపింది.

అరంగేట్రంలోనే అదరగొట్టి..

గత ఏప్రిల్‌లో శ్రీచరణి మొదటిసారి జాతీయ జట్టుకు ఎంపికైంది. శ్రీలంకలో..దక్షిణాఫ్రికా, శ్రీలంక జట్లతో జరిగిన ముక్కోణపు వన్డే టోర్నీకి టీమిండియాలో ఆమెకు చోటు లభించింది. శ్రీలంకతో టోర్నీ ఆరంభ మ్యాచ్ ద్వారా వన్డే అరంగేట్రం చేసింది. సీనియర్ స్పిన్నర్ స్నేహ్ రాణా ద్వారా 'క్యాప్' అందుకోవడం జీవితంలో మరిచిపోలేని అనుభూతిగా శ్రీచరణి పేర్కొంది. మొదటి మ్యాచ్‌లో రెండు వికెట్లతో ఆమె సత్తా చాటింది. మొత్తంగా ఆ టోర్నీలో ఆరు వికెట్లు పడగొట్టిన శ్రీచరణి భారత జట్టు టైటిల్ గెలవడంలో కీలక భూమిక పోషించింది. శ్రీచరణి బౌలింగ్‌కు ఫిదా అయిన సెలెక్టర్లు ప్రస్తుతం ఇంగ్లండ్‌తో సిరీస్‌కూ ఆమెను ఎంపిక చేశారు. వారి నమ్మకాన్ని మరోసారి నిలబెడుతూ నాలుగు టీ20 మ్యాచ్‌ల్లో ఆమె పది వికెట్లు తీసి భళా అనిపించింది. ఇదే ఉత్సాహంతో వన్డే సిరీస్‌లోనూ శ్రీచరణి రాణించి..భారత జట్టులో విడదీయరాని భాగమవ్వాలని ఆశిద్దాం.

సింధు తొలి రౌండ్లోనే..

» జపాన్ ఓపెన్‌లో భారత స్టార్ పరాజయం

» సాత్విక్ జోడీ, లక్ష్య, అనుపమ ముందంజ



టోక్యో: భారత స్టార్ పీవీ సింధు జపాన్ ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీ ఆరంభ రౌండ్లోనే పరాజయం పాలైంది. కొరియా షట్లర్ సిమ్ యు జిన్‌తో బుధవారం జరిగిన పోరులో మాజీ ప్రపంచ చాంపియన్ సింధు 15-21, 14-21తో చిత్తయింది. ఇలా.. తొలి రౌండ్లోనే ఓడడం ఈ ఏడాదిలో సింధుకిది ఐదోసారి కావడం గమనార్హం. మిగతా భారత అమ్మాయిల్లో అనుపమ ఉపాధ్యాయ 21-15, 18-21, 21-18తో సహచర షట్లర్ రక్షితపై నెగ్గగా, ఉన్నతి హుడా 8-21, 12-21తో పోర్న్ చోచువాంగ్ (థాయ్‌లాండ్) చేతిలో ఓటమి పాలైంది. పురుషుల సింగిల్స్‌లో లక్ష్య సేన్ 21-11, 21-18తో వాంగ్ జెంగ్ (చైనా)ను ఓడించి రెండో రౌండ్ చేరాడు. డబుల్స్‌లో ప్రపంచ 15వ ర్యాంక్ జోడీ సాత్విక్ సాయిరాజ్/చిరాగ్ శెట్టి 21-18, 21-10తో కొరియా జంట కాంగ్ మిన్/కిమ్ డోంగ్‌ను చిత్తుచేసి టోర్నీలో శుభారంభం చేసింది. డబుల్స్‌లో హరిహరణ్/రూబన్ కుమార్ జోడీ, మహిళల డబుల్స్‌లో కవిప్రియ/సిమ్రన్ ద్వయం ప్రత్యర్థుల చేతిలో ఓడి ఆదిలోనే ఇంటిబాట పట్టారు.



దీపికదే మ్యాజిక్ స్కిల్ అవార్డు

న్యూఢిల్లీ: భారత మహిళల హాకీ జట్టు స్ట్రయికర్ దీపిక అంతర్జాతీయ వేదికపై మెరిసింది. అంతర్జాతీయ హాకీ సమాఖ్య (ఎఫ్ఐహెచ్) పాలిగ్రాస్ మ్యాజిక్ స్కిల్ అవార్డును 21 ఏళ్ల దీపిక గెలుచుకుంది. ఎఫ్ఐహెచ్ ప్రొ లీగ్‌లో అత్యంత సృజనాత్మకత, నైపుణ్యవంతమైన ప్రదర్శన కనబరచిన ఆటగాళ్లకు మ్యాజిక్ స్కిల్ అవార్డును అందజేస్తారు. ప్రపంచవ్యాప్తంగా హాకీ అభిమానులు ఓటింగ్ ద్వారా అవార్డు విజేతను నిర్ణయిస్తారు. ఈ సీజన్ ప్రొ లీగ్‌లో భాగంగా భువనేశ్వర్‌లో నెదర్లాండ్స్‌తో జరిగిన మ్యాచ్‌లో భారత్ తరఫున దీపిక కళ్లు చెదిరే ఫీల్డ్ గోల్ చేసింది. ఈ ప్రదర్శనే దీపికకు అవార్డు తీసుకొచ్చింది. ఈ అవార్డు నామినేషన్స్‌లో స్పెయిన్ క్రీడాకారిణి పాట్రిసియా, ఆస్ట్రేలియా మహిళల జట్టును అధిగమించి దీపిక విజేతగా నిలిచింది.

ఇంగ్లండ్ 258/6

భారత మహిళలతో తొలి వన్డే

సౌతాంప్టన్: సోఫియా డంక్లే (83), అలిస్ డేవిడ్‌సన్ రిచర్డ్స్ (53) అర్ధ శతకాలతో ఆదుకోవడంతో.. ఇంగ్లండ్ మహిళల జట్టు తడబడి నిలబడింది. భారత్‌తో బుధవారం జరిగిన తొలి వన్డేలో ఇంగ్లండ్ 50 ఓవర్లలో 6 వికెట్లకు 258 పరుగులు చేసింది. కెప్టెన్ నాట్ సివర్ బ్రంట్ (41) ఫర్వాలేదనిపించింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ఇంగ్లండ్.. పేసర్ క్రాంతి దెబ్బకు ఓపెనర్లు అమీ జోన్స్ (1), టామీ బ్యూమాంట్ (5) వికెట్లను చేజార్చుకొంది. అయితే, ఎమ్మా ల్యాంబ్ (39), బ్రంట్ రెండో వికెట్‌కు 71 పరుగులు జోడించడంతో ఇంగ్లండ్ కోలుకొంది. నిలకడగా సాగుతున్న సమయంలో స్పిన్నర్ రాణా తన వరుస ఓవర్లలో వీరిద్దరినీ పెవిలియన్ చేర్చడంతో ఇంగ్లండ్ 97/4తో ఇబ్బందుల్లో పడినట్టుగా కనిపించింది. ఈ దశలో అలిస్ సహకారంతో డంక్లే స్కోరు బోర్డును నడిపించింది. అయితే, అలిస్‌ను అవుట్ చేసిన శ్రీచరణి.. ఐదో వికెట్‌కు 106 పరుగుల భాగస్వామ్యాన్ని బ్రేక్ చేసింది. డెత్ ఓవర్లలో డంక్లేకు ఎకెల్‌స్టోన్ (23 నాటౌట్) జత కలవడంతో.. స్కోరు సునాయాసంగా 250 మార్క్ దాటింది. ఇన్నింగ్స్ చివరి బంతికి డంక్లేను అమన్‌జోత్ బౌల్డ్ చేసింది.

బంగ్లాదే టీ20 సిరీస్

కొలంబో: ఆతిథ్య శ్రీలంకతో టీ20 సిరీస్‌ను బంగ్లాదేశ్ 2-1తో గెలుచుకుంది. బుధవారం జరిగిన ఆఖరిదైన మూడో టీ20లో బంగ్లా 8 వికెట్లతో లంకను ఓడించింది. మొదట శ్రీలంక 20 ఓవర్లలో 7 వికెట్లకు 132 పరుగులు చేసింది. ఓపెనర్ నిస్సాంక (46) టాప్ స్కోరర్. 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' మెహ్దీ హసన్ (4/11) నాలుగు వికెట్లతో లంక బ్యాటింగ్ పతనాన్ని శాసించాడు. ఛేదనలో బంగ్లా.. ఓపెనర్ తన్జిద్ హసన్ (73) అర్ధ సెంచరీకి తోడు కెప్టెన్ లిట్టన్ దాస్ (32) రాణించడంతో 16.3 ఓవర్లలోనే 133/2 స్కోరు చేసి గెలిచింది.

రూట్ 'నెం. 1' రికార్డు

● బౌలర్లలో టాప్‌లోనే బుమ్రా ● టెస్టు ర్యాంకింగ్స్



దుబాయ్: ఇంగ్లండ్ స్టార్ బ్యాటర్ జో రూట్ ర్యాంకింగ్స్‌లో మళ్లీ అగ్రస్థానానికి చేరుకున్నాడు. బ్యాటర్ల జాబితాలో గతవారం హ్యారీ బ్రూక్‌కు టాప్ ర్యాంక్‌ను కోల్పోయిన రూట్.. బుధవారం ప్రకటించిన తాజా టెస్టు ర్యాంకింగ్స్‌లో అగ్రపీఠాన నిలిచాడు. ఈ క్రమంలో 2014 డిసెంబరులో సంగక్కర (37 ఏళ్ల వయసులో) తర్వాత టెస్టుల్లో నెంబర్‌వన్‌గా నిలిచిన పెద్ద వయసు బ్యాటర్‌గా 34 ఏళ్ల రూట్ రికార్డుకెక్కాడు. ఇక, ఇప్పటిదాకా టాప్‌లో ఉన్న బ్రూక్ మూడో స్థానానికి పడిపోయాడు. కేన్ విలియమ్సన్ మూడు నుంచి రెండో ర్యాంక్‌కు ఎగబాకాడు. భారత బ్యాటర్లలో యశస్వీ జైస్వాల్ 5, పంత్ 8, గిల్ 9వ ర్యాంకుల్లో ఉన్నారు. కేఎల్ రాహుల్ ఐదు స్థానాలు మెరుగై 35వ ర్యాంక్‌కు చేరాడు. ఇక, లార్డ్స్ టెస్టులో ఇంగ్లండ్ బౌలర్లు ఆధిపత్యం చెలాయించినా, ర్యాంకింగ్స్‌లో మాత్రం టీమిండియా స్టార్ జస్‌ప్రీత్ బుమ్రా అగ్రస్థానం చెక్కు చెదరలేదు. బుమ్రా బౌలర్ల జాబితాలో నెంబర్‌వన్‌గా తన స్థానాన్ని నిలబెట్టుకున్నాడు. రబాడ రెండో ర్యాంక్‌లో ఉన్నాడు.

గౌరవప్రదంగా సీట్లు ఇస్తేనే 'స్థానికం'లో పొత్తు

» కాంగ్రెస్ ప్రభుత్వమైనా తప్పులు చేస్తే ఊరుకోం: కూనంనేని

హుస్నాబాద్, జులై 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో గౌరవ ప్రదంగా సీట్లు ఇస్తేనే కాంగ్రెస్‌తో పొత్తు కొనసాగుతుందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు స్పష్టం చేశారు. కాంగ్రెస్‌తో తాము పొత్తులో ఉన్నామని, అలాగని ప్రభుత్వం తప్పులు చేస్తుంటే.. చూస్తూ ఊరుకోబోమని స్పష్టం చేశారు. ఇప్పటిదాకా పేదలకు రేషన్ కార్డులు ఇవ్వాలని, ఇళ్లు ఇవ్వాలని, రైతులను కాపాడుకోవాలని అడిగామని... ప్రభుత్వం స్పందించని పక్షంలో ఆయా వర్గాల పక్షాన పోరాటాలు చేస్తామన్నారు. సిద్దిపేట జిల్లాలోని హుస్నాబాద్‌లో బుధవారం జరిగిన సీపీఐ జిల్లా మహాసభల సమావేశంలో ఆయన మాట్లాడారు. జైళ్లలో ఉండాల్సిన వారు అసెంబ్లీ, పార్లమెంట్‌లో ఉంటున్నారని, ప్రజల కోసం జీవించే వారు అడవుల్లో, జనం మధ్య ఉంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. "ప్రజల కోసం ఉన్నోళ్లు దేశ ద్రోహులు.. వేల కోట్ల సంపాదన ఉన్నోళ్లు దేశ భక్తులా? ఈ రాజ్యానికి జాలి లేదా? తుపాకీ మడమతో గుద్ది నంబాల కేశవరావును ఎందుకు చంపారు? బీజేపీకి ఎరుపు అంటే భయం. అందుకే కమ్యూనిస్టులను లేకుండా తుడిచేస్తామని అమిత్‌షా విర్రవీగుతున్నాడు. అయితే, కమ్యూనిస్టు పార్టీని ఎవరూ చంపలేరు" అని వ్యాఖ్యానించారు. కమ్యూనిస్టులు లేకుండా తెలంగాణ చరిత్ర లేదని వ్యాఖ్యానించారు.

మాకు ఇంజనీర్లను పంపండి: హౌసింగ్ బోర్డు

"మాకు ఇంజనీర్లు అవసరం ఉన్నది.. మీ శాఖ నుంచి ఒకరిద్దరిని మాకు పంపండి" అంటూ రాష్ట్ర గృహ నిర్మాణ మండలి పలు శాఖలకు లేఖలు రాస్తోంది. ప్రస్తుతం హౌసింగ్ బోర్డు పరిధిలో ఉన్న ఆస్తుల వేలం ప్రక్రియ వేగంగా నడుస్తుండడంతో.. అందుకు సంబంధించిన పలు వ్యవహారాలను ఇంజనీర్లు పర్యవేక్షించాల్సి ఉంది. అదే సమయంలో.. ఇటీవల ఈ శాఖలో పలువురు పదవీ విరమణ చేయడంతో బోర్డుకు అధికారుల కొరత ఏర్పడింది. ఈ క్రమంలోనే అత్యవసరంగా 14 మంది అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, ఆరుగురు డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు అవసరమని తేలింది. దాని ప్రకారం అధికారులను పంపాలని కోరుతూ ఆర్ అండ్ బీ, పంచాయతీ రాజ్, రూరల్ వాటర్ సప్లై (మిషన్ భగీరథ)తో పాటు మరికొన్ని శాఖలకు హౌజింగ్ బోర్డు అధికారులు లేఖలు రాస్తున్నారు.

సొంత ఊళ్లో రేషన్ కార్డులు ఇచ్చావా?

» మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డిపై టీపీసీసీ ధ్వజం

పదేళ్లు మంత్రిగా పని చేసిన జగదీశ్‌రెడ్డి.. తన సొంత ఊళ్లో రేషన్ కార్డు ఇచ్చారా? అని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి చనగాని దయాకర్, అధికార ప్రతినిధి పున్న కైలాశ్ నేత ప్రశ్నించారు. సీఎం రేవంత్‌రెడ్డిపై చిల్లర మాటలు మానుకోవాలని హితవు పలికారు. ఉమ్మడి జిల్లా అభివృద్ధిపై మంత్రి హోదాలో జగదీశ్‌రెడ్డి ఏనాడూ సమీక్ష చేయలేదని, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక మంత్రి ఉత్తమ్ 12సార్లు సమీక్ష చేశారని తెలిపారు.

యాదగిరిగుట్ట రైల్వే ప్రాజెక్టుకు రూ.100 కోట్లు

» కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు ఎంపీ చామల కృతజ్ఞతలు

న్యూఢిల్లీ, జులై 16 (ఆంధ్రజ్యోతి): ఘట్‌కేసర్- యాదగిరి గుట్ట ఎంఎంటీఎస్ రైలు ప్రాజెక్టు పనుల నిమిత్తం రూ.100 కోట్లు కేటాయించినట్టు కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ ప్రకటించారు. ఈ మేరకు భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్ రెడ్డికి బుధవారం లేఖ ద్వారా తెలిపారు. సుమారు 33 కి.మీ మేర ఉన్న మూడో లైన్ మార్గం కోసం కేటాయించిన రూ.412 కోట్లు విడుదల చేయాలని గత పార్లమెంట్ సమావేశాల్లో జీరో అవర్‌లో ఎంపీ చామల కేంద్రం దృష్టికి తీసుకెళ్లారు. ఆ తర్వాత రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ నేపథ్యంలో చామలకు కేంద్ర మంత్రి లేఖ రాశారు. 'ఏప్రిల్ 3న జీరో అవర్ సందర్భంగా ఘట్‌కేసర్- యాదగిరి గుట్ట రైలు మార్గం కోసం రూ.412 కోట్లు విడుదల చేయాలని మీరు కోరారు. 2016లో ఎంఎంటీఎస్ కింద ఖర్చు భాగస్వామ్య ప్రాతిపదికకు ఆమోదం లభించింది. కానీ.. రాష్ట్ర ప్రభుత్వ వాటా నిధులు డిపాజిట్ చేయకపోవడంతో ప్రాజెక్టు ప్రారంభించలేకపోయాం. ప్రస్తుతం ఈ ప్రాజెక్టు పూర్తిగా రైల్వే శాఖ నిధులతో చేపడుతున్నాం. ఈ ఆర్థిక సంవత్సరంలో ప్రాజెక్టు కోసం రూ.100 కోట్లు కేటాయిస్తున్నాం' అని కేంద్రమంత్రి లేఖలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా అశ్వినీ వైష్ణవ్, కేంద్ర రైల్వే సహాయ మంత్రి రవనీత్ సింగ్‌కు ఎంపీ చామల కృతజ్ఞతలు తెలిపారు.

రికార్డింగ్ కల..కళ!

» రూ.250కే ఆడియో, రూ.1250కే వీడియో గంటపాటు రికార్డింగ్ చేసుకోవొచ్చు

» గ్రీన్‌మ్యాట్‌తో తెలుగు వర్సిటీలో స్టూడియోల ఏర్పాటు

» ఔత్సాహిక కళాకారులకు గొప్ప అవకాశం

హైదరాబాద్ సిటీ, జులై16 (ఆంధ్రజ్యోతి): ఆడియో గీతాల రూపకల్పన, వీడియోల చిత్రీకరణ ద్వారా అభిమానగణాన్ని సంపాదించుకోవాలనుకునే ఔత్సాహిక కళాకారులకు మహదవకాశం! ఆడియో రికార్డింగ్‌లు, డబ్బింగ్‌లు, సినిమాలు, నాటికలు, నృత్యాలు, ఇంటర్వ్యూలు, ఉపన్యాసాల కోసం ఖరీదైన స్టూడియోలకు వెళ్లి జేబు ఖాళీ చేసుకోవాల్సిన అగత్యం లేదు. నామమాత్రపు ఖర్చుతో ఈ రికార్డింగ్‌లు పూర్తి చేసుకునే అవకాశాన్ని నాంపల్లిలోని సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం కల్పిస్తోంది. ఈ మేరకు హై రెసెల్యూషన్ కెమెరాలు, టెలిప్రాంప్టర్లు, ఎడిటింగ్ కోసం అధునాతన సాంకేతిక వ్యవస్థతో పూర్తిస్థాయి గ్రీన్‌మ్యాట్ కలిగిన రెండు స్టూడియోలను విశ్వవిద్యాలయం అందుబాటులోకి తెచ్చింది. యూజీసీ నిధులతో వీటిని ఏర్పాటు చేశారు. రూ.1250 చెల్లిస్తే గంటపాటు వీడియోలు చిత్రీకరించుకోవొచ్చు. అలాగే రూ.250 చెల్లిస్తే గంటపాటు ఆడియో రికార్డింగ్ చేసుకోవొచ్చు. రికార్డింగ్‌ల కోసం అవసరమైన సాంకేతిక నిపుణులూ అక్కడ అందుబాటులో ఉన్నారు. సాహిత్యాభిమానులు, జానపద కళాకారులు తమ పాటలను, కవితలను రికార్డింగ్ చేసుకునేందుకు.. రికార్డింగుల కోసం భారీస్థాయిలో వెచ్చించలేకపోతున్న సినీ కళాకారులకు ఈ వేదిక చక్కని అవకాశం అనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. బుకింగ్ చేసుకోవాలనే వారు 72880 71111 ఫోన్ నంబరులో సంప్రదించాలని యూనివర్సిటీ అధికారులు పేర్కొన్నారు.

ఎస్సీ విద్యార్థులకు విదేశీ విద్యా సీట్ల పెంపు

» 500కు పెంచుతూ ప్రభుత్వ ఉత్తర్వులు

హైదరాబాద్, జులై 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ఎస్సీ విద్యార్థులకు ప్రభుత్వం శుభవార్త చెప్పింది. విదేశాల్లో ఉన్నత విద్య అభ్యసించాలనుకునే వారికి అంబేడ్కర్ ఓవర్సీస్ విద్యా నిధి పథకం కింద కేటాయించే సీట్ల సంఖ్యను 210 నుంచి 500లకు పెంచుతూ ఉత్తర్వులు జారీ చేసింది. ప్రభుత్వం విడుదల చేసిన జీవో ఎంఎస్ నంబరు 15 ప్రకారం.. ప్రతి సంవత్సరం విదేశీ విద్య కోసం దరఖాస్తు చేసుకునే ఎస్సీ విద్యార్థుల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకుంది. ఒక్కో సీజన్‌కు (స్ప్రింగ్, ఫాల్) 360కి పైగా దరఖాస్తులు వస్తున్నాయని అధికారిక వర్గాలు వెల్లడించాయి. విద్యార్థుల నుంచి వస్తున్న డిమాండ్‌ను పరిగణనలోకి తీసుకుని, ఎస్సీ సంక్షేమ శాఖ కమిషనర్ చేసిన ప్రతిపాదనలను ప్రభుత్వం ఆమోదించింది. ఈ సీట్ల పెంపుతో మరింత మంది ఎస్సీ విద్యార్థులకు విదేశాల్లో చదువుకునే అవకాశం లభిస్తుంది.

రాజీవ్ స్వగృహ ఫ్లాట్ల కొనుగోలుకు ఆసక్తి

హైదరాబాద్, జులై 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ పరిధిలోని రాజీవ్ స్వగృహ కార్పొరేషన్ పలు టవర్లలో ఫ్లాట్లను విక్రయించేందుకు ఇచ్చిన ప్రకటనకు భారీ స్పందన లభిస్తోంది. బండ్లగూడ, పోచారంలోని ఈ ఫ్లాట్లను చూసి, వివరాలు తెలుసుకునేందుకు ప్రజలు వస్తున్నారు. మార్కెట్ ధర కంటే తక్కువ ధరకే సింగిల్, డబుల్, ట్రిపుల్ బెడ్ రూమ్ ఫ్లాట్లు ఉండడంతో గత రెండు, మూడు రోజుల్లో 2 వేల మందికి పైగా రావడం గమనార్హం. నాగోల్ బండ్లగూడలోని 159 ఫ్లాట్లకు, పోచారంలోని 601 ఫ్లాట్ల విక్రయానికి ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ప్రకటన ఇచ్చిన విషయం తెలిసిందే. లాభాపేక్ష లేకుండా వీటిని విక్రయించనుంది. చదరపు అడుగు ధరను రూ.2,500- రూ.3,000 వరకు నిర్ణయించింది. బండ్లగూడ ప్రాజెక్టులోని ఫ్లాట్లకు ఈ నెల 29 వరకు దరఖాస్తులు స్వీకరిస్తామని, 30న లాటరీ ద్వారా కేటాయిస్తామని సూపరింటెండెంట్ ఇంజనీర్ (ఎస్ఈ) సీ భాస్కర్‌రెడ్డి తెలిపారు. పోచారం ప్రాజెక్టులో ఫ్లాట్లకు ఈ నెల 31 వరకు దరఖాస్తులు స్వీకరించి, ఆగస్టు 1న లాటరీ ద్వారా కేటాయిస్తామన్నారు. తక్కువ ధరకే సొంతింటి కల నెరవేరేలా ప్రభుత్వం కల్పించిన ఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఈ రేతిగ అగ్గువా!



ఇసుక బజార్లలో ఇసుక చౌక

» దొడ్డు ఇసుక రూ.1600, సన్నది 1800

» బహిరంగ మార్కెట్‌తో పోల్చితే తక్కువే

» టన్నుకు రూ.300 నుంచి 500 తగ్గింపు

» పదిరోజులుగా పెరిగిన కొనుగోళ్లు

» బజార్లలో కొని బయట విక్రయాలు

హైదరాబాద్ సిటీ, జులై16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (టీజీఎండీసీ) ఆధ్వర్యంలో నడుస్తున్న ఇసుక బజార్లలో ఇసుక అగ్గువకే దొరుకుతోంది. బహిరంగ మార్కెట్‌తో పోల్చితే టన్నుకు రూ.300 నుంచి రూ.500 వరకు తక్కువకే లభిస్తోంది. ఫలితంగా అవసరమైన వాళ్లు పెద్ద ఎత్తున కొనుగోళ్లు చేస్తుండటంతో ఆన్‌లైన్‌లో ఉంచగానే సరుకును హాట్‌కేకుల్లా బుక్ అవుతోంది. గత నెలలతో పోల్చితే పది రోజులుగా పెద్దఎత్తున ఇసుక బజార్లలో కొనుగోళ్లు జరుగుతున్నాయి. గ్రేటర్ హైదరాబాద్‌తో పాటు శివారు ప్రాంతాల ప్రజలకు సరసమైన ధరకు ఇసుక సరఫరా చేయాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఇసుక బజార్లను తెచ్చింది. అబ్దుల్లాపూర్‌మెట్, వట్టినాగులపల్లి, బౌరంపేట, ఆదిభట్లలో ఇసుక బజార్లను ఏర్పాటు చేశారు. దొడ్డు ఇసుకకు టన్ను ధర రూ.1600, సన్న ఇసుకకు టన్ను ధర రూ.1800 నిర్ణయించారు. ఇసుక బజార్ల నుంచి నేరుగా ఇసుక కొనుగోలుకు అవకాశం లేదు. టీజీఎండీసీ వెబ్‌సైట్‌లో రిజిస్టర్ చేసుకుని బుకింగ్ చేసుకోవాల్సి ఉంటుంది. ఇసుక కొనుగోలు ధరకు జీఎస్టీ, రవాణా చార్జీలు అదనం. ఉదాహరణకు పది టన్నుల సన్న ఇసుకను బుకింగ్ చేసుకుంటే టన్నుకు రూ.1800ల చొప్పున 10 టన్నులకు రూ.18వేలతో పాటు జీఎస్టీ 2.5శాతం, సర్వీసు చార్జీలతో కలిపి రూ.18,960 బిల్లు వస్తుంది. బుకింగ్ సమయంలోనే ట్రక్కు వివరాలను పొందుపర్చాల్సి ఉంటుంది. బుకింగ్ పూర్తయ్యాక కొనుగోలుదారులే బుకింగ్‌లో పొందుపరిచిన వాహనాన్ని పంపిస్తే ఇసుకను లోడ్ చేస్తున్నారు. ఇసుకతో వచ్చిన లారీని ఖాళీ చేసుకునే (అన్‌లోడింగ్) బాధ్యత కొనుగోలుదారులదే. జీఎస్టీ చార్జీలు, రవాణా చార్జీలు, ఖాళీ చేసే కార్మికుల కూలీతో కలిపి టన్ను ఇసుకను అదనంగా రూ.150 నుంచి రూ.200 వరకు ఖర్చవుతోంది.

బయట రూ.2,300 వరకు ధర

నగరంలో ఆటోనగర్, ఉప్పల్, సంతోష్‌నగర్, చింతల్, తిరుమలగిరి, కాప్రా ఇలా దాదాపు 30 ప్రాంతాల్లో ఇసుక అడ్డాలున్నాయి. అక్కడ ప్రతిరోజు వివిధ ప్రాంతాల నుంచి వందల లారీలతో ఇసుకను తీసుకొచ్చి విక్రయిస్తున్నారు. ప్రస్తుతం నగరంలో బహిరంగ మార్కెట్‌లో దొడ్డు ఇసుక టన్ను ధర రూ.1900 నుంచి రూ.2వేల వరకు ఉండగా.. సన్న ఇసుక టన్ను ధర రూ.2వేల నుంచి 2300 వరకు ఉంది. ఇందులోనే రవాణా, అన్‌లోడింగ్ చార్జీలన్నీ ఉంటాయి. కొంత మంది లారీ యజమానులు ఇసుక బజార్‌లో బుకింగ్ చేసుకొని కూడా బహిరంగ మార్కెట్‌లో విక్రయిస్తున్నారు.

హాట్ కేకుల్లా ఆన్‌లైన్‌లో బుకింగ్

నగర శివారులో అందుబాటులో ఉన్న అబ్దుల్లాపూర్‌మెట్, వట్టినాగులపల్లి, బౌరంపేట, ఆదిభట్లలో గల ఇసుక బజార్లలో సన్న ఇసుక, దొడ్డు ఇసుకను ఆన్‌లైన్‌లో ప్రతిరోజు పది గంటలకు అమ్మకానికి పెడుతున్నారు. ప్రస్తుతం ఒక్కో ఇసుక బజార్‌లో సన్న, దొడ్డు ఇసుకను వెయ్యి టన్నుల చొప్పున విక్రయానికి ఉంచుతున్నారు. నాలుగు ఇసుక బజార్ల నుంచి రోజుకు 8వేల మెట్రిక్ టన్నులు విక్రయానికి ఉంచుతున్నారు. జూన్ నెల మొత్తంలో నాలుగు ఇసుక బజార్లలో కలిపి 192 బుకింగ్‌లకు 1642 మెట్రిక్ టన్నుల ఇసుకను విక్రయించారు. జూలైలో ఒకటో తేదీ నుంచి పదో తేదీ వరకు 739 బుకింగ్‌ల ద్వారా 13,591 మెట్రిక్ టన్నులు విక్రయించారు. కృష్ణా, గోదావరి నదుల్లో వరద ప్రవాహం పెరుగుతుండటంతో అక్కడ ఇసుక రీచ్‌లు మూతపడుతున్నాయి. ప్రస్తుతం ఇసుక రీచ్‌ల్లో దొడ్డు ఇసుక దొరకడం లేదు. సన్న ఇసుక కూడా కొంత మేరే దొరుకుతోంది. దాంతో సన్న, దొడ్డు ఇసుకలకు డిమాండ్ పెరిగింది. గతంలో రోజుకు వందలాది లారీలు నగరానికి ఇసుక లోడ్‌తో వచ్చేవి. ప్రస్తుతం వర్షాలు, రీచ్‌ల్లో లోడింగ్ సమస్యలతో మునుపటి స్థాయిలో ఇసుక రావడం లేదు. దీంతో నగరంలో నిర్మాణ రంగానికి అవసరమైన మేరకు రీచ్‌ల నుంచి సరుకు రాకపోవడంతో.. ఇసుక బజార్లకు డిమాండ్ పెరిగింది.

డిమాండ్‌కు అనుగుణంగా విద్యుత్ సరఫరా చేయాలి

» విద్యుత్ శాఖ ఉన్నతాధికారుల సమీక్షలో డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క



హైదరాబాద్, జులై 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పెరుగుతున్న డిమాండ్‌కు అనుగుణంగా విద్యుత్ సరఫరా చేయాలని, భవిష్యత్తులో పెరిగే విద్యుత్ డిమాండ్‌ను అధిగమించడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క విద్యుత్ అధికారులను ఆదేశించారు. బుధవారం విద్యుత్ శాఖల ఉన్నతాధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్ 2024 నుంచి 9.8 శాతం చొప్పున పెరుగుతోందని.. 2034 నాటికి అది 33,773 మెగావాట్లకు చేరుకునే అవకాశం ఉందని కేంద్ర సంస్థలు విశ్లేషించినట్టు తెలిపారు. కొత్త సబ్ స్టేషన్లను నిర్మించాలని, వాటి నిర్మాణ ప్రాంతంలో భూమి కోల్పోయిన వారికి ఉద్యోగావకాశాలు కల్పించే విషయంపై దృష్టి సారించాలని సూచించారు. హైదరాబాద్‌లో అండర్ గ్రౌండ్ ఎలక్ట్రిసిటీ కేబుల్స్ నిర్మాణం కోసం పూర్తిస్థాయిలో డీపీఆర్ సిద్ధం చేయాలని ఆదేశించారు. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటుకు స్థలం కొరత ఏర్పడుతున్న నేపథ్యంలో ప్రస్తుతం ఉన్న 12.5 మిలియన్ యూనిట్ల ట్రాన్స్‌ఫార్మర్ల స్థానంలో 16 మిలియన్ యూనిట్ల పవర్ ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. రెన్యూవబుల్ ఎనర్జీపై దృష్టి సారించాలన్నారు.

ప్రాజెక్టుల కింద సాగునీటి విడుదలకు వారాబందీ విధానం

హైదరాబాద్, జులై 16(ఆంధ్రజ్యోతి): వానాకాలంలో సాగునీటి ప్రాజెక్టుల కింద ఆయకట్టుకు నీటి విడుదలలో వారాబందీ(ఒక్కో తూములకు నిర్దిష్ట రోజులకు నీటిని విడుదల చేయడం) విధానం అమలు చేయాలని నీటిపారుదల శాఖ నిర్ణయించింది. రానున్న 15 రోజుల పాటు కచ్చితంగా ఈ విధానం అమలు చేయాలని నీటిపారుదల శాఖ ఈఎన్‌సీ(జనరల్) మహ్మద్ అంజద్ హుస్సేన్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈనెల 11వ తేదీన రాష్ట్ర స్థాయి సమగ్ర నీటి ప్రణాళిక, యాజమాన్య కమిటీ సమావేశమై కృష్ణా, గోదావరి బేసిన్‌లోని జలాశయాల్లో నీటి నిల్వలు, వస్తున్న ప్రవాహాలను సమీక్షించి ప్రస్తుత వానాకాలంలో భారీ, మధ్య తరహా ప్రాజెక్టులతో పాటు చెరువులు, చిన్న ఎత్తిపోతల పథకాల కింద మొత్తం 38,76,849 ఎకరాల ఆయకట్టుకు, 339.11 టీఎంసీల జలాలను సరఫరా చేయాలని నిర్ణయం తీసుకుంది. ఎగువ గోదావరి పరీవాహకంలోని శ్రీరామ్‌సాగర్, నిజాంసాగర్, కడెం, సింగూరు, ఎల్లంపల్లి, మిడ్‌మానేరు, అప్పర్, లోయర్‌మానేరు తదితర జలాశయాలకు ఇంకా ఆశించిన రీతిలో వరదలు ప్రారంభం కాలేదు. దాంతో ఆయా ప్రాజెక్టుల్లో ఉన్న నీటి నిల్వల ఆధారంగా వాటి కింద ఉన్న ఆయకట్టుకు ప్రస్తుతం పాక్షికంగానే సాగునీటి సరఫరా చేయాలని స్కివమ్ కమిటీ నిర్ణయం తీసుకుంది.

సీఎంఆర్ఎఫ్‌చెక్కుల గోల్ మాల్ వ్యవహారం..

హరీశ్ కార్యాలయ మాజీ సిబ్బంది మళ్లీ అరెస్టు

జూబ్లీహిల్స్/ఆదిలాబాద్, జులై 16 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ హయాంలో మాజీ మంత్రి హరీశ్‌రావు కార్యాలయంలో చోటుచేసుకున్న సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల గోల్‌మాల్ విషయంలో అప్పటి సిబ్బందిని పోలీసులు మరోసారి అరెస్టు చేశారు. ఇందులో మాజీ ఉద్యోగి జోగుల నరేశ్ కుమార్‌తో పాటు మరొకరిని అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించగా.. మరో ముగ్గురు పరారీలో ఉన్నారు. తాజాగా మరో ఇద్దరు బాధితుల ఫిర్యాదుతో పోలీసులు దర్యాప్తు చేపట్టారు. సిద్దిపేటకు చెందిన రాళ్లబండి వెంకటేశ్ 2022లో అనారోగ్యం బారిన పడగా.. కుటుంబ సభ్యులు ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పగా వైద్యులు శస్త్ర చికిత్స చేశారు. ఈ నేపథ్యంలోనే వెంకటేశ్ మాజీ మంత్రి హరీశ్‌రావు లెటర్‌పై సీఎం రిలీఫ్ ఫండ్‌కు దరఖాస్తు చేసుకున్నాడు. 2023 మార్చిలో వెంకటేశ్ తన స్నేహితుడి సాయంతో జూబ్లీహిల్స్‌లోని హరీశ్‌రావు కార్యాలయానికి వచ్చి సీఎం రిలీఫ్ ఫండ్ గురించి వాకబు చేశాడు. అయితే వెంకటేశ్‌కు మంజూరైన రూ.45 వేలను అప్పటి ఉద్యోగి జోగుల నరేశ్ ఫోర్జరీ సంతకాలతో చెక్కును సొంత ఖాతాలో వేసుకున్నట్టు తెలిసింది. వెంకటేశ్ అప్పుడు అనారోగ్యంతోనే ఉండటంతో చేసేదేం లేక వెనుదిరిగాడు. స్నేహితుల సలహా మేరకు ఈనెల 15న జూబ్లీహిల్స్ పోలీసులకు అతడు ఫిర్యాదు చేశాడు. ఇదే తరహాలో మరో బాధితుడు కూడా అంతకుముందే ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. ఈక్రమంలోనే మెట్టుగూడకు చెందిన జోగుల నరేశ్, వనస్థలిపురానికి చెందిన బాలగోని వెంకటేశ్‌లను అదుపులోకి తీసుకొని విచారించారు. 2023 ఎన్నికల సమయంలో హరీశ్‌రావు కార్యాలయం నుంచి విడుదలైన 19 చెక్కులను ఎవరూ క్లెయిమ్ చేసుకోకపోవడంతో వంశీ, ఓంకార్, మరో మహిళతో సాయంతో ఫోర్జరీ సంతకాలు చేసి రూ.8.71 లక్షలు కాజేసినట్లు వారు అంగీకరించారు.

భూకబ్జా కేసులో ఆదిలాబాద్ జిల్లా జాగృతి అధ్యక్షుడి అరెస్టు

భూకబ్జా కేసులో ఆదిలాబాద్ జిల్లా జాగృతి అధ్యక్షుడు రంగినేని శ్రీనివాస్‌ను పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. శ్రీనివాస్ మునిసిపాలిటీ రోడ్డును కబ్జా చేసి నకిలీ పత్రాలతో రిజిస్ట్రేషన్ చేసినట్లు విచారణలో తేలిందని పోలీసులు వెల్లడించారు.

బీసీ రిజర్వేషన్లకు రోల్ మోడల్.. తెలంగాణ

» అందులో భాగం కావడం నా అదృష్టం

» ఏఐసీసీ ఓబీసీ సలహా మండలి భేటీలో టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్



హైదరాబాద్, జులై 16 (ఆంధ్రజ్యోతి): బీసీ రిజర్వేషన్ల అంశంలో తెలంగాణ రాష్ట్రం దేశానికే రోల్ మోడల్‌గా నిలిచిదని టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్‌గౌడ్ అన్నారు. 'మనమెంతో.. మనకంత' అన్న రాహుల్‌గాంధీ నినాదాన్ని సమగ్రంగా అమలు చేయడానికి తెలంగాణ ప్రభుత్వం అన్ని రకాల చర్యలూ తీసుకుందన్నారు. విద్య, ఉద్యోగాల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించాలంటూ అసెంబ్లీలో బిల్లులను ఆమోదించి.. రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్‌లో చేర్చేందుకు వీలుగా కేంద్రానికి పంపామని గుర్తు చేశారు. స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్‌ను అమలు చేస్తూ ఆర్డినెన్స్ తీసుకురావాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. అలాంటి చరిత్రాత్మక ఘట్టంలో తనకూ భాగస్వామ్యం దక్కడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. బెంగళూరులో బుధవారం కర్ణాటక సీఎం సిద్ధరామయ్య అధ్యక్షతన ఏఐసీసీ ఓబీసీ సలహా మండలి సమావేశాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా మహేశ్‌గౌడ్ మాట్లాడుతూ ఎన్నికలకు ముందు కామారెడ్డి సభలో టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ హోదాలో బీసీ డిక్లరేషన్‌ను తాను ప్రతిపాదించానని, ఆ సభకు సిద్ధరామయ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారని గుర్తు చేశారు. ఇప్పుడు టీపీసీసీ అధ్యక్షుడి హోదాలో బీసీ రిజర్వేషన్ కోసం రాహుల్ గాంధీ, సీఎం రేవంత్‌రెడ్డితోపాటు సైనికుడిలా పనిచేస్తున్నానన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి అగ్రకులానికి చెందిన వారైనా బీసీ రిజర్వేషన్ అమలుకు కృషి చేస్తున్నారని కొనియాడారు. ఏఐసీసీ ఓబీసీ సలహా మండలి సమావేశాన్ని అక్టోబరు నెలలో హైదరాబాద్‌లో నిర్వహించనున్నట్లు వెల్లడించారు. సమావేశంలో బీసీ మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి, పార్టీ నేతలు వి.హన్మంతరావు తదితరులు పాల్గొన్నారు.

సెంటిమెంట్ పేరిట ఎంతకాలం బతుకుతారు?

» కేటీఆర్, హరీశ్‌పై ఆది శ్రీనివాస్ ధ్వజం

"కృష్ణా, గోదావరి జలాలపై ఢిల్లీలో చర్చలు జరిగితే మీరెందుకు ఉలిక్కి పడుతున్నరు? అజెండాలో బనకచర్ల లేదని కుమిలిపోతున్నరా? ఇంకెంత కాలం తెలంగాణ సెంటిమెంట్ పేరిట బతుకుతారు?" అంటూ కేటీఆర్, హరీశ్‌రావుపై ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ధ్వజమెత్తారు. చేపల పులుసు తిని గోదావరి జలాలను రాసిచ్చినట్లు, జగన్‌ను ప్రగతి భవన్‌కు పిలిచి కృష్ణా జలాలను తాంబూలంగా ఇచ్చినట్లు తామూ చేస్తామనుకున్నారా? అని నిలదీశారు.

రాష్ట్రంలో 70 పంచాయతీలు తగ్గాయి!

660 వార్డులు.. 44 ఎంపీటీసీలు కూడా.. మొత్తం వార్డులు 1,12,694, పంచాయతీలు 12,778

» ఎంపీటీసీలు 5,773.. ఎంపీపీ, జడ్పీటీసీలు 566.. స్థానిక సంస్థల నిర్ధారణ

» పంచాయతీరాజ్ శాఖ ఉత్తర్వులు

» గవర్నర్ నుంచి ఆర్డినెన్స్ వచ్చిన తర్వాత వారంలో రిజర్వేషన్లు!

హైదరాబాద్, జులై 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం వడివడిగా అడుగులు వేస్తోంది. రాష్ట్రంలో వార్డులు, పంచాయతీలు, ఎంపీటీసీ, జడ్పీటీసీ, ఎంపీపీ, జడ్పీ చైర్మన్ స్థానాలను ఖరారు చేసింది. పలు గ్రామాలను కొత్త మునిసిపాలిటీల్లో విలీనం చేయడంతో స్థానిక సంస్థల సంఖ్య తగ్గింది. రాష్ట్రవ్యాప్తంగా ఎన్నికలు జరగాల్సిన స్థానిక సంస్థల సంఖ్యను ఖరారు చేస్తూ పంచాయతీరాజ్ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. 2019లో 1,13,354 వార్డులుండగా ఇప్పుడా సంఖ్య 660 తగ్గి.. 1,12,694 వార్డులకు చేరింది. గతంలో 12,848 పంచాయతీలుండగా.. ప్రస్తుతం 12,778 ఉన్నాయి. 70 పంచాయతీలు తగ్గాయి. ఎంపీటీసీలు 5,817 ఉండగా.. 44 తగ్గి ఈ సారి 5,773కు; ఎంపీపీ, జడ్పీటీసీ స్థానాలు 570 ఉండగా 4 తగ్గి.. ఈ సారి 566 స్థానాల్లో ఎన్నికలు జరగనున్నాయి. రాష్ట్రంలో ప్రస్తుతం 32 జడ్పీ స్థానాలుండగా.. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా పరిధిలోని గ్రామాలన్నింటినీ మునిసిపాలిటీలో కలపడంతో ఈ స్థానం తగ్గి 31కి చేరింది. మరోవైపు జిల్లా పంచాయతీ అధికారులు, ఎంపీడీవోలను స్థానిక ఎన్నికల నిర్వహణకు సన్నద్ధంగా ఉండాలని ఆ శాఖ ఉన్నతాధికారులు ఆదేశించారు. మరోవైపు స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్ల అమలుకు పంచాయతీరాజ్ చట్టం-2018లోని సెక్షన్ 285(ఏ)లో సవరణ చేయడానికి గవర్నర్ ఆమోదం కోసం ఇప్పటికే ఆర్డినెన్స్ ముసాయిదాను పంపింది. గవర్నర్ దగ్గరి నుంచి ఆర్డినెన్స్ రావడమే తరువాయి అన్నట్లుగా రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ప్రక్రియలో ముందుకెళుతోంది.

ఆర్డినెన్స్ రాగానే..

గవర్నర్ దగ్గరి నుంచి ఆర్డినెన్స్ వచ్చిన వారంలోపే రిజర్వేషన్ల అంశాన్ని తేల్చే దిశగా ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. దాంతో పాటు ఎన్నికల సిబ్బందికి శిక్షణ కూడా పూర్తవనుంది. మొత్తంగా స్థానిక ఎన్నికల్లో రిజర్వేషన్ల ఖరారు ప్రక్రియను హైకోర్టు సూచించిన జులై 25కల్లా పూర్తిచేయనున్నట్లు అధికార వర్గాలు చెబుతున్నాయి. ఆ తర్వాత ఏ క్షణమైనా స్థానిక సమరానికి నోటిఫికేషన్ విడుదల చేయొచ్చనే ఊహాగానాలు వినిపిస్తున్నాయి. ఆగస్టు 15కల్లా స్థానిక సంస్థల ఎన్నికల క్రతువును పూర్తిచేయాలని సర్కారు యోచిస్తున్నట్లు సమాచారం. ఆ తర్వాత అసెంబ్లీ సమావేశాలను నిర్వహించాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఆగస్టులో అసెంబ్లీ సమావేశాలు నిర్వహించే అవకాశం ఉందంటూ ఇటీవల శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు ఇందుకు బలం చేకూరుస్తున్నాయి.

రిజర్వేషన్లు ఎలా ఉంటాయో?

స్థానిక ఎన్నికలకు సంబంధించి ఒక్కో అడుగు ముందుకు పడుతుండడం, తాజాగా ఎన్నికలు నిర్వహించే వార్డులు, గ్రామాలు, ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాలను సర్కారు ఖరారు చేయడం, వాటిని ప్రకటించడంతో క్షేత్రస్థాయిలో రాజకీయం వేడెక్కుతోంది. వార్డు నుంచి జడ్పీ చైర్మన్ వరకు రాబోయే రిజర్వేషన్ల వ్యవహారంపైనే చర్చ జరుగుతోంది. ఇదే విషయానికి సంబంధించి తమ గ్రామం, మండల పరిధిలో రిజర్వేషన్లు ఎలా వస్తాయనే దానిపై అన్ని పార్టీల నాయకులు ఆరా తీస్తున్నారు. ఎస్సీ, ఎస్టీలకు పోగా మిగిలిన వాటిలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను కేటాయించనుండడమే ఇందుకు కారణమనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

బీసీలకు 42 % రిజర్వేషన్లను అడ్డుకుంటే సహించేది లేదు

» బీఆర్ఎస్, బీజేపీలు తప్పుడు ప్రచారాన్ని మానుకోవాలి

» ఆగస్టు 7న గోవాలో జాతీయ ఓబీసీ మహాసభ

» పోస్టర్ ఆవిష్కరించిన జాజుల శ్రీనివాస్ గౌడ్



గోవాలో జరుగనున్న ఓబీసీ మహాసభల పోస్టర్‌ను బీసీ కుల సంఘాల జేఏసీ ప్రతినిధులతో కలిసి ఆవిష్కరించిన బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల

హైదరాబాద్, పంజాగుట్ట, జులై 16 (ఆంధ్రజ్యోతి) : బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలును అడ్డుకునే ప్రయత్నాలను సహించేది లేదని బీసీ కుల సంఘాల ప్రతినిధుల జేఏసీ స్పష్టం చేసింది. విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో బీసీలకు అవకాశాలు రాకుండా అణగదొక్కే కుట్రలను ఎదుర్కొనేందుకు ఎంతటి త్యాగానికైనా సిద్ధంగా ఉన్నట్టు బీసీ కుల సంఘాల ప్రతినిధులు పేర్కొన్నారు. గోవాలో ఆగస్టు 7న జరిగే జాతీయ ఓబీసీ మహాసభ పోస్టర్లను బీసీ కుల సంఘాల జేఏసీ చైర్మన్ కుందారం గణేశ్‌చారితో కలిసి సోమాజీగూడ ప్రెస్‌క్లబ్‌లో బుధవారం బీసీ సంక్షేమసంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీసీ రిజర్వేషన్ల పెంపుపై బీజేపీ, బీఆర్ఎస్ నేతలు అదేపనిగా తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం జీవో ఇచ్చినా, ఆర్డినెన్స్ తెచ్చినా కోర్టుల్లో నిలవదనే గోబెల్స్ ప్రచారాన్ని మానుకోవాలని హితవు చెప్పారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు, కేంద్రమంత్రి బండి సంజయ్ బీసీ రిజర్వేషన్లపై అవగాహన లేకుండా మాట్లాడుతున్నారని విమర్శించారు. తెలంగాణ ప్రభుత్వం బీసీలకు విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో రిజర్వేషన్లను 42 శాతానికి పెంచుతూ అసెంబ్లీలో బిల్లు ఆమోదించి గవర్నర్ ద్వారా కేంద్రానికి పంపి 3 నెలలు గడిచిందన్నారు. అయినా నేటికీ దానికి ఆమోదం తెలపకుండా బీసీలకు అన్యాయం చేస్తూ, మత ప్రాతిపదికన రిజర్వేషన్లు అంటూ తప్పించుకోవడం వారి దివాలాకోరుతనానికి నిదర్శనమని అన్నారు. దేశవ్యాప్తంగా ప్రస్తుతం బీసీలకు అమలవుతున్న 27 శాతం రిజర్వేషన్లలో సైతం ముస్లిం సమాజం ఉన్నదని గుర్తుచేశారు. ఎన్డీయే భాగస్వామ్య పక్షాలైన చాలా రాష్ట్రాల్లో ముస్లింలకు రిజర్వేషన్లను మత ప్రాతిపదికన అమలు చేస్తున్నారని, ఆంధ్రప్రదేశ్‌లో కూడా ఉందని చెప్పారు. బీసీ వర్గానికి చెందిన బండారు దత్తాత్రేయను హరియాణా గవర్నర్ పదవి నుంచి తొలగించడం, నాలుగుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొందిన బీసీ సామాజిక వర్గానికి చెందిన రాజాసింగ్‌ను బీజేపీ నుంచి బహిష్కరించడం, రాష్ట్ర అధ్యక్షులుగా బీసీలకు అవకాశం ఇవ్వకుండా రాంచందర్‌రావుకు ఆ పదవి కట్టబెట్టడం బీజేపీ బీసీ వ్యతిరేక చర్యలేనని జాజుల తీవ్రంగా మండిపడ్డారు. ఇక బీఆర్ఎస్ నేతలు కేసీఆర్ ప్రభుత్వంలో బీసీ రిజర్వేషన్లను 34 శాతం నుంచి 18 శాతానికి తగ్గిస్తూ తీసుకున్న నిర్ణయంలో పాలుపంచుకుని ఈ రోజు బీసీ రిజర్వేషన్లు పెంచాలని మాట్లాడడం దయ్యాలు వేదాలు వల్లించిన చందంగా ఉందన్నారు. బీసీ రిజర్వేషన్లు పెంచాలని కేంద్ర ప్రభుత్వంపై బీఆర్ఎస్ ఢిల్లీలో ధర్నా చేపట్టాలని డిమాండ్ చేశారు.

పరిశ్రమల స్థాపనకు తెలంగాణ అనుకూలం

» ఫ్రాన్స్ బృందానికి వివరించిన డిప్యూటీ సీఎం భట్టి

హైదరాబాద్, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : పరిశ్రమల స్థాపనకు తెలంగాణ రాష్ట్రం అనుకూలమైన ప్రాంతమని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. సచివాలయంలో భట్టి విక్రమార్కతో ఫ్రాన్స్ కాన్సుల్ జనరల్ మార్క్ లేమి బృందం బుధవారం మర్యాదపూర్వకంగా భేటీ అయింది. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం ఆ బృందానికి పరిశ్రమల స్థాపన గురించి వివరించారు. రాష్ట్రంలోని మానవ వనరులు, వాతావరణం, ప్రభుత్వ విధానాలు తదితర అంశాలను అధ్యయనం చేయాలని సూచించారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడానికి అన్ని సౌకర్యాలు ఉన్నాయన్నారు.



ఉప్పల్ ఫ్లైఓవర్ పనులను పరిశీలిస్తున్న మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి

వచ్చే ఏడాది దసరా నాటికి ఉప్పల్ ఫ్లైఓవర్ పూర్తి

» మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి

హైదరాబాద్, ఉప్పల్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): వచ్చే ఏడాది దసరా నాటికి ఉప్పల్-నారపల్లి ఫ్లైఓవర్‌ను అందుబాటులోకి తీసుకొస్తామని రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. హైదరాబాద్‌లో పీవీ ఎక్స్‌ప్రెస్ హైవే తరువాత అతిపెద్ద ఫ్లైఓవర్‌గా ఉప్పల్-నారపల్లి ఫ్లై ఓవర్ ఉంటుందని చెప్పారు. బుధవారం ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, స్థానిక ఎమ్మెల్యే లక్ష్మారెడ్డితో కలిసి మంత్రి క్షేత్రస్థాయిలో ఉప్పల్ ఫ్లై ఓవర్ పనులను పరిశీలించారు. పనుల పురోగతిపై అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి కోమటిరెడ్డి మాట్లాడుతూ.. ఉప్పల్ రింగ్ రోడ్డు నుంచి నారపల్లి వరకు 8 కి.మీ. మేర నిర్మిస్తున్న ఫ్లై ఓవర్ పనులు వేగంగా జరుగుతున్నాయని తెలిపారు. 2017లో ఉప్పల్ ఎలివేటెడ్ కారిడార్ పనుల మొదలైతే అనేక అవరోధాలతో పనుల్లో జరిగిన జాప్యంతో వరంగల్, యాదగిరిగుట్ట, భువనగిరి వైపు వెళ్ళే ప్రజలు ఎంతో ఇబ్బందులు పడ్డారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీతో ఉన్న పరిచయాలతో ప్రత్యేక చొరవ తీసుకొని కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పించి కాంట్రాక్టర్‌ను మార్చి పనులు కొత్త వారికి ఇప్పించామన్నారు.

టీడీఎఫ్ సిల్వర్ జూబ్లీ వేడుకలకు కోమటిరెడ్డికి ఆహ్వానం

అమెరికాలో ఆగస్టు 8, 9, 10 తేదీల్లో జరిగే తెలంగాణ డెవలప్‌మెంట్ ఫోరమ్ (టీడీఎఫ్) సిల్వర్ జూబ్లీ వేడుకలకు రావాలని కోరుతూ ఫోరమ్ ప్రతినిధులు మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డికి ఆహ్వానం అందించారు. ఈ మేరకు బుధవారం సచివాలయంలో మంత్రిని మర్యాదపూర్వకంగా కలిశారు. రాష్ట్ర సాధన ఉద్యమంలో కీలక పాత్ర పోషించి అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తున్న టీడీఎఫ్‌ను మంత్రి అభినందించారు. మంత్రిని కలిసిన వారిలో టీడీఎఫ్ ఇండియా అధ్యక్షుడు మట్ట రాజేశ్వర్‌రెడ్డి, ఫోరమ్ ఇండియా ఛైర్మన్ ఎంవీ గోనరెడ్డి, జనరల్ సెక్రటరీ వినీల్ ఉన్నారు.

ఆలయాల బడ్జెట్‌కు ప్రభుత్వ అనుమతి తప్పనిసరి

» మంత్రి కొండా సురేఖ ఆదేశం



దేవాదాయ శాఖ పరిధిలోని పెద్ద ఆలయాల వార్షిక బడ్జెట్‌కు ఇకపై ప్రభుత్వ అనుమతి తప్పనిసరి. ఆలయాలకు బడ్జెట్ కేటాయింపుల్లో జరుగుతున్న అక్రమాల కట్టడి చర్యల్లో భాగంగా ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు మంత్రి కొండా సురేఖ ఆదేశాలతో దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యార్ మెమో జారీ చేశారు. ఇప్పటి వరకు దేవాదాయ శాఖ పరిధిలోకి వచ్చే ఆలయాల వార్షిక బడ్జెట్‌కు.. ఆలయ అధికారుల నుంచి వచ్చే ప్రతిపాదనలకు ఆ శాఖ అధికారులు ఆమోదం తెలిపేవారు. అయితే బడ్జెట్ కేటాయింపులు, మంజూరులో అవకతవకలు జరుగుతున్నాయని ఆరోపణలున్నాయి. దీంతో ఇకపై ఆ తరహా సమస్యలకు ఆస్కారం లేకుండా ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది.

గురుకులాలకు భవనాల సమస్య పరిష్కరిస్తాం

» నిధుల విడుదలకు కృషి: ఎస్సీ, ఎస్టీ కమిషన్ ఛైర్మన్

హైదరాబాద్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ గురుకుల విద్యాసంస్థలకు త్వరలో భవనాల సమస్య పరిష్కరించడానికి ప్రభుత్వం నుంచి నిధులు విడుదల అయ్యేలా కృషి చేస్తానని ఎస్సీ ఎస్టీ కమిషన్ ఛైర్మన్ బక్కి వెంకటయ్య తెలిపారు. గురుకుల విద్యాలయాల్లో రూల్ ఆఫ్ రిజర్వేషన్(ఆర్‌వోఆర్) అమలు తీరుపై ఆయన హైదరాబాద్‌లోని ఎస్సీ గురుకుల విద్యాలయాల సంస్థ కార్యాలయంలో సమీక్షించారు. అనంతరం జూమ్ మీటింగ్ ద్వారా రాష్ట్రంలోని అన్ని జోనల్ అధికారులతో ముఖాముఖి చర్చించి సమస్యలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గురుకులాల్లో పలు ప్రక్షాళన కార్యక్రమాలు చేపట్టి దేశంలోనే ఆదర్శంగా తీర్చిదిద్దుతున్నట్లు చెప్పారు.

గోదావరి బోర్డు సభ్య కార్యదర్శికి కేంద్రం షాక్

» వరుస ఆరోపణలతో బాధ్యతల నుంచి తప్పిస్తూ నిర్ణయం

మహిళా ఉద్యోగినుల పట్ల అనుచితంగా వ్యవహరించడం, బోర్డులో సమస్యలు సృష్టిస్తుండడంతో గోదావరి నది యాజమాన్య బోర్డు(జీఆర్ఎంబీ) సభ్య కార్యదర్శి ఆర్.అజగేషన్‌పై కేంద్ర జలశక్తి శాఖ కన్నెర్ర చేసింది. వివాదాల నేపథ్యంలో బోర్డు సభ్య కార్యదర్శిగా పనిచేస్తున్న ఆయన్ను బాధ్యతల నుంచి తప్పించి... ఆ స్థానంలో ఆర్.కె. కనోడియాను నియమించింది. కనోడియా ప్రస్తుతం బోర్డులో సభ్యుడిగా పనిచేస్తున్నారు. కనోడియాను సభ్య కార్యదర్శిగా నియమించడంతో అజగేషన్‌ను సభ్యుడిగా బదిలీ చేసింది. ఈమేరకు కేంద్ర జలశక్తి శాఖ ఉత్తర్వులు ఇచ్చింది.

ఈఎన్‌సీ అడ్మిన్‌గా ఓ.వి.రమేష్‌బాబు

నీటిపారుదల శాఖ ఈఎన్‌సీ(అడ్మిన్)గా ఓ.వి.రమేష్‌బాబుకు ప్రభుత్వం పూర్తి అదనపు బాధ్యతలు కట్టబెట్టింది. ప్రస్తుతం సూర్యాపేట చీఫ్ ఇంజనీర్‌గా పనిచేస్తున్న రమేష్‌బాబు ఖమ్మం చీఫ్ ఇంజనీర్‌గానూ పూర్తి అదనపు బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. గత కొన్ని రోజులుగా ఈఎన్‌సీ(అడ్మిన్) పోస్టు ఖాళీగా ఉంది. దాంతో రమేష్‌బాబుకు అడ్మిన్‌గా పూర్తి అదనపు బాధ్యతలు కట్టబెట్టారు. ఈమేరకు నీటిపారుదల శాఖ ముఖ్య కార్యదర్శి రాహుల్ బొజ్జా బుధవారం ఉత్తర్వులు ఇచ్చారు.

భూముల విలువల పెంపుపై వారంలో తేల్చేస్తాం

» రిజిస్ట్రేషన్ శాఖ ఐజీ రాజీవ్‌గాంధీ హనుమంతు

భూముల మార్కెట్ విలువల పెంపుపై గత ఏడాది ఏప్రిల్ నుంచి కసరత్తు జరుపుతున్న అధికారులు.. ఎట్టకేలకు సర్కారుకు ప్రతిపాదనలు సమర్పించేందుకు సిద్ధమవుతున్నారు. భూముల మార్కెట్ విలువల పెంపు విషయమై వారం రోజుల్లో శాఖాపరంగా తుది నిర్ణయం తీసుకుంటామని స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ ఇన్‌స్పెక్టర్ జనరల్ (ఐజీ)గా రాజీవ్ గాంధీ హనుమంతు తెలిపారు. 'ఆంధ్రజ్యోతి'తో ఆయన మాట్లాడుతూ.. తమ ప్రతిపాదనలను ప్రభుత్వానికి అందజేస్తామని.. ఆ తరువాత సర్కారు సూచనల ప్రకారం ముందుకెళ్తామన్నారు. ఈ వారంలో మంత్రి వద్ద విలువల పెంపుపై ఏకాభిప్రాయానికి వస్తే.. ఆ తరువాత ఇవే ప్రతిపాదనలను సీఎం రేవంత్‌రెడ్డి ముందుకు తీసుకెళ్లనున్నారు. ఆయనతో చర్చించాక మార్పులు, చేర్పుల అనంతరం విలువల పెంపుపై స్పష్టత వచ్చే అవకాశముందని రిజిస్ట్రేషన్ శాఖ వర్గాలు చెబుతున్నాయి.

జలవివాదాలపై కమిటీ

(మొదటిపేజీ తరువాయి)

జాతీయ ఆనకట్టల భద్రత సంస్థ (ఎన్‌డీఎస్ఏ) నివేదిక మేరకు మరమ్మతు చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు. ఇక కృష్ణా నదీ యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ)ను హైదరాబాద్ నుంచి ఏపీకి తరలించాలన్న నిర్ణయం కూడా జరిగింది. గోదావరి బోర్డును హైదరాబాద్‌లో కొనసాగిస్తూ.. కృష్ణా బోర్డు కార్యాలయాన్ని విజయవాడ లేదా అమరావతికి తరలించేందుకు ఇద్దరు సీఎం రేవంత్‌రెడ్డి, చంద్రబాబు అంగీకారం తెలిపారు.



ఢిల్లీలో మీడియాతో మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి, చిత్రంలో మంత్రి ఉత్తమ్, ఎంపీ మల్లు రవి

ఇది తెలంగాణ విజయం..

తెలుగు రాష్ట్రాల మధ్య జల వివాదాలకు ఇరు రాష్ట్రాలు, జలశక్తి అధికారులు, ఇంజినీర్లు, సాంకేతిక నిపుణులతో కమిటీ ఏర్పాటుకు నిర్ణయం జరిగిందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. కృష్ణా జలాల వినియోగంపై టెలిమెట్రీ యంత్రాల ఏర్పాటుకు, శ్రీశైలం ప్రాజెక్టు మరమ్మతులకు ఏపీ అంగీకరించిందని చెప్పారు. ఇది తెలంగాణ సాధించిన విజయమన్నారు. శ్రమశక్తి భవన్‌లో ముఖ్యమంత్రుల సమావేశం అనంతరం ఢిల్లీలోని లీ మెరిడియన్ హోటల్‌లో రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో కలిసి సీఎం రేవంత్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. సమావేశంలో బనకచర్లకు సంబంధించిన అంశాలేవీ ప్రస్తావనకు రాలేదన్నారు. గోదావరి-బనకచర్ల కడతామని ఏపీ అడిగితేనే కదా.. తాము అభ్యంతరం తెలిపేదని వ్యాఖ్యానించారు. అసలు ఎజెండాలో బనకచర్ల ప్రతిపాదనే లేదని, అలాంటప్పుడు ఆ ప్రాజెక్టును ఆపాలనే చర్చ ఎందుకు వస్తుందని ప్రశ్నించారు. బనకచర్లపై తాము ఇప్పటికే ఫిర్యాదు చేశామని, తమ ఫిర్యాదును పరిగణలోనకి తీసుకుని పోలవరం అథారిటీ, సీడబ్ల్యూసీ, గోదావరి బోర్డు ఏపీ తీరుపై అభ్యంతరం వ్యక్తం చేశాయని గుర్తు చేశారు. అంతేకాకుండా కేంద్ర ప్రభుత్వ పరిధిలోని సంస్థలు కూడా ఆ ప్రాజెక్టుపై అభ్యంతరాలు లేవనెత్తాయని తెలిపారు. కృష్ణా, గోదావరి నదులపై ఉమ్మడి రాష్ట్రాల సమస్యలను చర్చించడానికి, గుర్తించడానికి ఇంజినీర్లు, నిపుణులతో కమిటీని ఏర్పాటు చేయాలని, ఆ కమిటీలో చర్చించిన తర్వాత మిగతా అంశాలు ముఖ్యమంత్రుల స్థాయిలో చర్చించాలని నిర్ణయం తీసుకున్నామని చెప్పారు. నీటి కేటాయింపులు, ప్రాజెక్టుల నిర్మాణం, పాత ప్రాజెక్టులకు అనుమతులు, నిర్మిస్తున్న ప్రాజెక్టులపై అభ్యంతరాలు.. వంటివన్నీ కమిటీ 30 రోజుల్లో గుర్తిస్తుందని అన్నారు. ఇది అపెక్స్ కమిటీ సమావేశం కాదని, కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన సమావేశమని పేర్కొన్నారు.

కృష్ణా జలాల వినియోగంపై టెలిమెట్రీ యంత్రాలు..

కృష్ణా జలాల నీటి వినియోగంలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ఎన్నెన్ని నీళ్లను వినియోగిస్తున్నాయనే దానిపై టెలిమెట్రీ యంత్రాలు ఏర్పాటు చేయాలని సమావేశంలో నిర్ణయించినట్టు సీఎం రేవంత్ తెలిపారు. దీనివల్ల నీటి వినియోగానికి సంబంధించిన సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. శ్రీశైలం ప్రాజెక్టు డ్యామేజ్ అయ్యిందని, దీనికి తక్షణమే మరమ్మతు చేయాలని ఎన్‌డీఎస్ఏ సహా మిగిలిన సంస్థలు నివేదికలు ఇచ్చాయని అన్నారు. శ్రీశైలం ప్రాజెక్టు నిర్వహణ బాధ్యత ఏపీ ప్రభుత్వానిదే అయినందున మరమ్మతుకు ఏపీ అంగీకారం తెలిపిందని చెప్పారు. గోదావరి, కృష్ణా నదీ యాజమాన్య బోర్డులు చెరో రాష్ట్రంలో ఉండాలని పునర్విభజన చట్టంలో, 2020 అపెక్స్ కౌన్సిల్ సమావేశంలో నిర్ణయం జరిగిందని గుర్తు చేశారు. గత పదేళ్ల అధికారంలో ఉన్న కేసీఆర్.. తెలంగాణకు తీరని అన్యాయం చేశారని, తెలంగాణ హక్కులను కేసీఆర్ ఆంధ్రాకు ధారాదత్తం చేశారని సీఎం రేవంత్ ఆరోపించారు. పదేళ్లలో ఏ జలవివాదానికీ పరిష్కార మార్గాన్ని చూపలేదన్నారు. 2020లో ఇద్దరు ముఖ్యమంత్రులు సంతకాలు పెట్టినప్పటి నుంచి ఇప్పటివరకు ఎవరూ ఆ ప్రతిపాదనలు ఏమయ్యాయని ప్రశ్నించలేదని, కానీ.. ఇప్పుడు తాము పరిష్కరిస్తుంటే దాన్నొక సమస్యలా చూస్తున్నారని మండిపడ్డారు. జల వివాదాలపై ప్రస్తుతం చర్చలు జరుగుతున్నాయని, ఈ సమయంలో లడాయి చేసే అంశం ఎక్కడి నుంచి వస్తుందని ప్రశ్నించారు. ఈ చర్చలతో పరిష్కారం లభించకపోతే అప్పుడు పోరాటం గురించి ఆలోచిస్తామన్నారు. ఈ భేటీ ఇరు రాష్ట్రాల మధ్య వివాదాల పరిష్కారం కోసమే తప్ప.. సమస్యలను పెద్దవి చేసుకోవడానికి కాదన్నారు.

తెలుగు రాష్ట్రాల మధ్య గొడవల కోసం కొందరి ఎదురుచూపు..

తెలుగు రాష్ట్రాల మధ్య జరిగిన చర్చలు సహృద్భావ వాతావరణంలో జరిగాయని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. అయితే, రెండు రాష్ట్రాల మధ్య గొడవల కోసం కొందరు ఎదురు చూస్తున్నారని ఆరోపించారు. ఇరు రాష్ట్రాలు కొట్టుకుంటే తమకు బాగుంటుందని వాళ్లు (బీఆర్ఎస్‌ను ఉద్దేశించి) అనుకుంటున్నారని, వారిని చూసి జాలిపడడం తప్ప ఏమీ చేయలేమని అన్నారు. పదేళ్ల అవకాశమిచ్చినా ఏ సమస్యనూ పరిష్కరించలేకపోయారని, వాళ్ల దుఃఖాన్ని, బాధను తాము అర్థం చేసుకుంటామని ఎద్దేవా చేశారు. వాళ్లకు సమాధానం ఇవ్వడానికి తాము లేమని, తెలంగాణ ప్రజలకు జవాబుదారీగా ఉన్నామని చెప్పారు. పరిపాలన ఎలా చేయాలో తమకు తెలుసునన్నారు. వివాదాలు చెలరేగకుండా సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడం తమ బాధ్యత అని అన్నారు. అపెక్స్ కమిటీ సమావేశం కూడా భేటీకి ఎటువంటి నిబద్ధత ఉంటుందని అడిగిన ప్రశ్నకు రేవంత్ బదులిస్తూ.. పార్లమెంట్ సాక్షిగా జరిగిన చట్టాలకే దిక్కులేదని, ప్రధాని నరేంద్రమోదీ వాటిని ఏ రోజూ పట్టించుకోలేదని వ్యాఖ్యానించారు. నమ్మకం మీదే ముందుకు సాగాలన్నారు. ఈ సమావేశంలో ఎంపీలు మల్లు రవి, అభిషేక్ సింఘ్వీ, చామల కిరణ్ కుమార్ రెడ్డి, రఘువీర్‌రెడ్డి, రఘురాంరెడ్డి, కడియం కావ్య, సురేష్ షెట్కార్, వంశీకృష్ణ, బలరాం నాయక్ పాల్గొన్నారు.

తెలంగాణ ప్రయోజనాలు కాపాడాలి

» ఇచ్చంపల్లి రిజర్వాయర్ నిర్మించాలి.. జాతీయ హోదా ఇవ్వాలి

» పాలమూరు-రంగారెడ్డికి 45 టీఎంసీలతో ఆమోదం తెలపాలి

» శ్రీశైలం నుంచి బ్యాక్‌వాటర్ తరలింపును అడ్డుకోవాలి: ఉత్తమ్

» ముఖ్యమంత్రుల సమావేశంలో తెలంగాణ ఎజెండా ప్రస్తావన

హైదరాబాద్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): కృష్ణా, గోదావరి నదులపై ప్రాజెక్టుల విషయంలో తెలంగాణ ప్రయోజనాలను కాపాడాలని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. బుధవారం ఢిల్లీలో కేంద్ర జలశక్తి శాఖ మంత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రుల సమావేశంలో తెలంగాణ ఎజెండాను ఉత్తమ్ ప్రస్తావించారు.

తెలంగాణ ఎజెండాలోని అంశాలు..

- గోదావరి-కావేరి అనుసంధానంలో భాగంగా ఇచ్చంపల్లిలో రిజర్వాయర్ కట్టాలి. 148 టీఎంసీలతో చేపట్టే గోదావరి-కావేరిలో తెలంగాణకు కేటాయించే వాటాను ఇతర బేసిన్‌లో వాడుకోవడానికి అవకాశం ఇవ్వాలి. ఇచ్చంపల్లి బ్యారేజీ నుంచి 200 టీఎంసీల వరద జలాలను వాడుకోవడానికి వెసులుబాటు కల్పించాలి. పోలవరం ప్రాజెక్టులాగే ఇచ్చంపల్లి ప్రాజెక్టుకు జాతీయ హోదా కల్పించి, ఆర్థిక సహాయం అందించాలి.
- పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం డీపీఆర్‌ను తొలిదశలో కేటాయించిన 45 టీఎంసీల నీటితో ఆమోదం తెలిపాలి. మైనర్ ఇరిగేషన్‌లో 90 టీఎంసీలు ఉండగా... అందులో పొదుపు చేసిన 45 టీఎంసీలను పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి కేటాయించాం. ఈ ప్రాజెక్టుకు రెండో దశ పర్యావరణ అనుమతి ఇవ్వాలి. డిండి ఎత్తిపోతలనూ క్లియర్ చేయాలి.
- సమ్మక్కసాగర్ (తుపాకులగూడెం) ప్రాజెక్టు డీపీఆర్‌ను క్లియర్ చేయాలి. ఛత్తీస్‌గఢ్ నుంచి ఎన్‌వోసీ తెచ్చుకోవాలని సీడబ్ల్యూసీ షరతు విధించింది. ప్రాజెక్టుకు వచ్చే వరదతో ముంపునకు గురయ్యే ప్రాంతాలకు ఐఐటీ ఖరగ్‌పూర్ నివేదిక ఆధారంగా పరిహారం ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నాం.
- శ్రీశైలం ప్రాజెక్టు బ్యాక్ వాటర్ నుంచి ఏపీ నీటి మళ్లింపును అడ్డుకోవాలి. 20 రోజుల్లో 200 టీఎంసీలను ఇతర బేసిన్‌లకు తరలించడానికి అవసరమైన మౌలిక సదుపాయాలను ఏపీ అభివృద్ధి చేసింది. రాయలసీమ ఎత్తిపోతల పథకం నుంచి రోజుకు 3 టీఎంసీలల తరలింపు కోసం పనులు చేస్తున్నారు. పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటరీ నుంచి రోజుకు 8 టీఎంసీలు, ముచ్చుమర్రి నుంచి రోజుకు 0.63 టీఎంసీలు, మల్యాల నుంచి రోజుకు 0.545 టీఎంసీల నీటి తరలిస్తున్నారు. దీన్ని అడ్డుకోవాలి.
- శ్రీశైలం, నాగార్జునసాగర్‌లోని అన్ని కాంపోనెంట్ల వద్ద టెలిమెట్రీ కేంద్రాలు పెట్టాలి. దీనికోసం 2024-25లో తెలంగాణ రూ.4.15 కోట్లు విడుదల చేసింది. అయినా జాప్యం జరుగుతోంది.
- తుంగభద్ర జలాలను కేసీ కెనాల్‌కు హైలెవల్, లోలెవల్ కెనాల్ ద్వారా తరలిస్తూనే శ్రీశైలం బ్యాక్ వాటర్ నుంచి కూడా తీసుకెళుతున్నారు. ముచ్చుమర్రి, ఎస్కేప్ రెగ్యులేటర్ ద్వారా కేసీ కెనాల్‌కు నీటిని తరలిస్తున్నారు. ఇది బచావత్ ట్రిబ్యునల్‌కు వ్యతిరేకం. తక్షణమే దీనిని అడ్డుకోవాలి.
- రాయలసీమ ఎత్తిపోతల పథకం పనులు చేయకుండా ఎన్జీటీ స్టే విధించినా.. ఏపీ అక్రమంగా పనులు చేపడుతోంది. వీటిని కేంద్రం అడ్డుకోవాలి. పోతిరెడ్డిపాడు నుంచి శ్రీశైలం రైట్ మెయిన్ కెనాల్(ఎస్ఆర్ఎంసీ)కు రోజుకు 44 వేల క్యూసెక్కుల నీటి తరలిస్తుండగా.. కెనాల్ లైనింగ్ చేసి.. రోజుకు 89,762 క్యూసెక్కులు తరలించడానికి పనులు చేస్తున్నారు. దీనిపై బోర్డుకు, కేంద్ర జలశక్తి శాఖకు ఫిర్యాదులు చేస్తున్నా ఏపీ ఆపడం లేదు.
- శ్రీశైలం ప్రాజెక్టు నిర్వహణ ప్రమాదంలో పడింది. గత ఆరేడేళ్లుగా ఈ ప్రాజెక్టు మరమ్మతులు చేయడం లేదు. కోట్లాది మంది దీనిపై ఆధారపడి జీవిస్తున్నారు. అక్రమంగా ఏపీ నీటి తరలింపుతో జలవిద్యుత్ ఉత్పాదనపై, తాగు, సాగునీటి అవసరాలపై తీవ్రమైన ప్రభావం పడుతోంది.
- డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ప్రాణహిత-చేవెళ్ల ఎత్తిపోతల పథకంలో భాగంగా తుమ్మిడిహెట్టి బ్యారేజీ నిర్మాణానికి కేంద్రం ఏఐబీపీ కింద ఆర్థిక సహాయం అందించాలి. ఈ ప్రాజెక్టు ప్రాథమిక సాధ్యాసాధ్యాల నివేదికను 2009 ఏప్రిల్‌లో సమర్పించగా... దీనికి సీడబ్ల్యూసీ 2010 ఏప్రిల్‌లో సమ్మతి తెలిపింది.

బనకచర్ల ప్రస్తావనే లేదంటూ రేవంత్ అబద్ధాలు

» కమిటీ నిర్ణయాన్ని అంగీకరించడం.. మరణ శాసనమే: హరీశ్‌రావు



హైదరాబాద్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): తెలుగు రాష్ట్రాల సీఎంల భేటీలో బనకచర్ల ప్రస్తావనే లేదంటూ సీఎం రేవంత్‌రెడ్డి అబద్ధాలు చెప్పారని బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు ఆరోపించారు. బనకచర్ల అంశం ఎజెండాలో లేనప్పుడు ఆపమనే ముచ్చటే రాదని బుకాయించారని, ఒక సీఎం ఇంత నిస్సిగ్గుగా మాట్లాడటం దురదృష్టకరమని అన్నారు. ఇరు రాష్ట్రాల సీఎంల సమావేశం ఏజెండా కాపీలోని మొదటి అంశమే గోదావరి- బనకచర్ల ప్రాజెక్టు గురించి అని పేర్కొంటూ సంబంధిత కాపీని మీడియా ఎదుట విడుదల చేశారు. బనకచర్ల ప్రాజెక్టు, ఇతర అంశాల పరిష్కారానికే కమిటీ ఏర్పాటు చేస్తున్నట్లు ఏపీ మంత్రి నిమ్మల రామానాయుడు చెప్పారని గుర్తు చేశారు. బనకచర్లపై సమావేశాన్ని బాయ్‌కాట్ చేస్తానని లీకులిచ్చిన సీఎం.. మాటమార్చి అందరికంటే ముందు సమావేశంలో ఆసీనులయ్యారని ఎద్దేవా చేశారు. ఎవరి ఒత్తిడితో ఈ సమావేశానికి వెళ్లారో రేవంత్‌రెడ్డి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. అసలు బనకచర్లపై కేంద్రం భేటీయే తప్పని.. అందులో తెలంగాణ సీఎం పాల్గొనడం మరో తప్పన్నారు. నాలుగు కేంద్ర సంస్థలు తిరస్కరించిన ప్రతిపాదనపై సమావేశం ఎలా నిర్వహిస్తారని నిలదీశారు. కమిటీ నిర్ణయాన్ని అంగీకరిస్తామని రేవంత్ చెప్పడం సబబు కాదన్నారు. ఇది తెలంగాణ పాలిట మరణ శాసనమని అభివర్ణించారు. రాష్ట్రంలో నడుస్తున్నది కాంగ్రెస్ పాలన కాదని, బీజేపీ-టీడీపీ రిమోట్ పాలన అని విమర్శించారు. చంద్రబాబు డైరెక్షన్‌లో రేవంత్ పాలన సాగిస్తున్నారని, తెలంగాణ నీళ్లను అక్రమంగా తరలించుకుపోతున్నా స్పందించడం లేదని దుయ్యబట్టారు. రేవంత్‌రెడ్డికి నోటి తీట తప్ప, నీటి వాటా సాధించాలన్న చిత్తశుద్ధి లేదని విమర్శించారు. ఏపీలో కూటమిపాలన, తెలంగాణలో విషకూటమి పాలనసాగుతోందని ధ్వజమెత్తారు.

తెలుగు రాష్ట్రాలే నాకు ముఖ్యం

ఒక్కరే బాగుండాలనుకునే వ్యక్తిని కాను.. సమస్యలు సామరస్యంగా పరిష్కరించుకుందాం: చంద్రబాబు

» కమిటీ ముందు అన్నిటిపైనా చర్చిద్దాం

» తెగకపోతే అపెక్స్ కౌన్సిల్‌లో చర్చిద్దాం

» గోదావరిలో మా వాటా కిందే బనకచర్ల

» వృధాగా పోయే వరద నీరే వాడుకుంటాం

» అది కూడా ఎగువ రాష్ట్రాలు వాడుకున్నాకే

» తెలంగాణ పథకాలకు అడ్డుచెప్పను

» ఢిల్లీ భేటీలో ఏపీ సీఎం వ్యాఖ్యలు

50 ఏళ్ల గోదావరి వరద లెక్కలను పరిగణనలోకి తీసుకుని.. ఎగువ రాష్ట్రాలన్నీ వాడుకున్నాక మిగిలిన జలాలు సముద్రంలోకి వృథాగా పోకుండా రాష్ట్రావసరాల కోసం వినియోగించుకోవడం పోలవరం-బనకచర్ల పథకం ఉద్దేశం. గోదావరి జలాల్లో మా రాష్ట్ర వాటా మేరకే దీనిని చేపడుతున్నాం.

తెలంగాణ ప్రాజెక్టుల నిర్మాణానికి నేనెప్పుడూ అడ్డుచెప్పను. రెండు రాష్ట్రాలుగా విడిపోయినా.. ప్రాంతాలు, పార్టీలకు అతీతంగా తెలుగు ప్రజలు కలిసే ఉంటారు.

- ఏపీ సీఎం చంద్రబాబు



అమరావతి, జూలై 16 (ఆంధ్రజ్యోతి): తెలుగు రాష్ట్రాలే తనకు ముఖ్యమని.. రెండు రాష్ట్రాలూ బాగుండాలని కోరుకునేవారిలో తాను ముందుంటానని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. ఒక రాష్ట్రం బాగుండాలని.. మరో రాష్ట్రం వెనుకబడిపోవాలని భావించే వ్యక్తిని కానని తేల్చిచెప్పారు. బుధవారం ఢిల్లీలో కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్ వద్ద జరిగిన సమావేశంలో చంద్రబాబు, తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వాల్లో రెండు రాష్ట్రాల మంత్రులు, అధికారుల బృందాలు పాల్గొన్నాయి. విశ్వసనీయ సమాచారం ప్రకారం.. తెలంగాణ నిర్మించుకునే ప్రాజెక్టులకు తాను ఎప్పటికీ అడ్డుచెప్పబోనని చంద్రబాబు పునరుద్ఘాటించారు. ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రిగానూ.. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కూడా కర్ణాటక నిర్మించిన ఆల్మట్టి, మహారాష్ట్ర నిర్మించిన బాబ్లీ ప్రాజెక్టుకు వ్యతిరేకంగా పోరాడానని.. అరెస్టు కూడా అయ్యానని గుర్తుచేశారు. బాబ్లీ ప్రాజెక్టు ఆందోళన సమయంలో రేవంత్‌రెడ్డి కూడా ఉన్న విషయాన్ని ఈ సందర్భంగా ప్రస్తావించారు. సాగునీటి ప్రాజెక్టుల విషయంలో సామరస్యంగా చర్చించుకుని సమస్యలు పరిష్కరించుకుందామన్నారు. కేంద్రం ఆధ్వర్యంలోని సాంకేతిక, నిపుణుల కమిటీలో చర్చించాక కూడా సమస్యలు తేలకపోతే.. అప్పుడు అపెక్స్ కౌన్సిల్‌లో చర్చిద్దామని సూచించారు. తాము వ్యతిరేకిస్తున్నా.. పోలవరం-బనకచర్ల అనుసంధాన పథకం గురించి సమావేశంలో చర్చ తీసుకురావడంపై తెలంగాణ నీటిపారుదల మంత్రి ఉత్తమకుమార్‌రెడ్డి అభ్యంతరం తెలిపారు. ఈ సమయంలో చంద్రబాబు జోక్యం చేసుకున్నారు. గోదావరి ట్రిబ్యునల్ ఇచ్చిన ఆదేశాలు, కేటాయింపుల మేరకే.. సముద్రంలో వృధాగా పోయే వరద జలాలను మాత్రమే వాడుకునేలా ఈ ప్రాజెక్టుకు రూపకల్పన చేశామని చెప్పారు. బనకచర్ల ప్రాజెక్టు రాయలసీమ కోసం నిర్మిస్తున్నదని.. ఈ ప్రాజెక్టుపై ఎక్కడైనా చర్చించేందుకు సిద్ధమేనని, తనకు భేషజాలు లేవని చెప్పారు. ఈ ప్రాజెక్టుతో ఎగువ రాష్ట్రాలకు ఎలాంటి నష్టమూ లేదని తేల్చిచెప్పారు. వరద జలాల ఆధారంగానే ప్రాజెక్టును నిర్మిస్తున్నామని చెప్పేందుకు కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ వాప్కోస్ ఇచ్చిన నివేదికను కేంద్రానికి సమర్పించామని తెలిపారు. పథకంపై ఉన్న సందేహాలు నివృత్తి చేస్తూ రూపొందించిన సమాచారం ప్రతులను ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డికి, ఉత్తమకుమార్‌రెడ్డికి పంపారు.

పాలనామోదం ఉన్నా కొత్తవే..

కృష్ణా నదిపై నిర్మిస్తున్న పలు ప్రాజెక్టులు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో పరిపాలనా ఆమోదం పొందినవేనని రేవంత్‌రెడ్డి అన్నారు. దీనిపై చంద్రబాబు స్పందిస్తూ.. ప్రాజెక్టుల ప్రతిపాదనలకు అప్పట్లో పరిపాలనా ఆమోదం పొందినప్పటికీ.. డిజైన్లు, అలైన్‌మెంట్లు మారిస్తే వాటిని కొత్తవిగానే పరిగణించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. వీటిపైనా సమన్వయంతో.. సంప్రదింపులతోనూ.. సామరస్యంగా పరిష్కరించుకుందామన్నారు. కృష్ణా జలాలపై టెలిమెట్రీల ఏర్పాటుకు ఏపీ వ్యతిరేకిస్తోందని ఉత్తమకుమార్‌రెడ్డి అనగా.. ఏపీ జల వనరుల శాఖ సలహాదారు వెంకటేశ్వరరావు జవాబిచ్చారు. తాము టెలిమెట్రీల ఏర్పాటును వ్యతిరేకించడం లేదన్నారు. కానీ ప్రాజెక్టుల వద్ద నీరు విడుదల చేసే చోట కాకుండా.. ఇతర ప్రాంతాల్లో కూడా వాటిని అమర్చాలని తెలంగాణ డిమాండ్ చేయడాన్ని ప్రశ్నించారు. దీనినే తాము అంగీకరించడం లేదని స్పష్టంచేశారు. దీనిపైనా ఒకసారి మాట్లాడుకుందామని రేవంత్ అన్నారు. ప్రాధాన్య క్రమంలో టెలిమెట్రీలను ఏర్పాటు చేద్దామని తెలిపారు. శ్రీశైలం జలాశయం ప్లంజ్ పూల్ అంశం చర్చకు వచ్చినప్పుడు.. దీనిపై నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ, ఎన్‌డబ్ల్యూపీఆర్ఎస్ డిజైన్లు ఇవ్వగానే మరమ్మతు పనులు ప్రారంభిస్తామని చంద్రబాబు వెల్లడించారు.

నిధులు రాహుల్‌కు.. నీళ్లు చంద్రబాబుకు

» ఇంకెందుకు రెండు రాష్ట్రాలు.. ఇద్దరు సీఎంలు: కేటీఆర్

హైదరాబాద్, జులై 16 (ఆంధ్రజ్యోతి): 'ముసుగు వీడింది.. నిజం తేటతెల్లమైంది.. రేవంత్‌రెడ్డి 48వ ఢిల్లీ పర్యటన గుట్టురట్టయింది. నిధులు రాహుల్ గాంధీకి, నీళ్ల చంద్రబాబుకు ధారదత్తం చేస్తున్నారు' అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. తెలంగాణ వ్యతిరేకిని గెలిపించినందుకు ప్రజలకు బూడిదే మిగిలిందని పేర్కొన్నారు. "ఇంకెందుకు రెండు రాష్ట్రాలు.. ఇద్దరు సీఎంలు.. సరిహద్దులు చెరిపేసి నీ అక్కను చల్లార్చుకో.. జై తెలంగాణ అనాల్సిన బాధ నీకు తప్పుతుందేమో! ఒక్క మాట గుర్తుపెట్టుకో.. ప్రాంతేతరుడు మోసం చేస్తే తరిమి కొడతాం! ప్రాంతం వాడే మోసం చేస్తే ఇక్కడే పాతిపెడతాం.. తెలంగాణను పీక్కుతింటున్న రాబందుల పని పడతాం" అని వ్యాఖ్యానించారు. రేవంత్‌రెడ్డికి దమ్ముంటే నాగార్జునసాగర్ కట్టమీద కాదు.. మేడిగడ్డ బ్యారేజీ మీద చర్చకు రావాలని సవాల్ విసిరారు. దళితబంధుపై పెట్టిన ఫ్రీజింగ్‌ను వెంటనే తొలగించి దళిత బిడ్డలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. రాజకీయాల్లో బూతులు మాట్లాడడం తమకు ఇష్టం లేదని, కానీ రేవంత్‌కు ఆయన భాషలో చెప్తేనే అర్థమవుతుందని ఇలా మాట్లాడాల్సి వస్తుందని అన్నారు.

స్థానిక ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు సమాధి

తెలంగాణ సెంటిమెంట్‌తో పబ్బం గడుపుకుంటున్న కేటీఆర్, హరీశ్: కాంగ్రెస్ ఎంపీల ఫైర్

న్యూఢిల్లీ, జూలై 16 (ఆంధ్రజ్యోతి): బనకచర్ల పేరుతో, తెలంగాణ, ఆంధ్రా సెంటిమెంట్‌తో పబ్బం గడుపుకోవాలని కేటీఆర్, హరీశ్‌రావు ప్రయత్నిస్తున్నారని తెలంగాణ కాంగ్రెస్ ఎంపీలు ఆరోపించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీపై కేటీఆర్ చేసిన వ్యాఖ్యలను వారు తీవ్రంగా ఖండించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీకి ప్రజలు సమాధి కడతారంటూ ధ్వజమెత్తారు. ఈ మేరకు ఎంపీలు మల్లు రవి, చామల కిరణ్‌కుమార్ రెడ్డి, కుందూరు రఘువీర్ రెడ్డి, రామసహాయం రఘురాంరెడ్డి, కడియం కావ్య, సురేష్ షెట్కార్, గడ్డం వంశీకృష్ణ, పోరిక బలరాం నాయక్ న్యూఢిల్లీలో బుధవారం విలేకరులతో మాట్లాడారు. అంబేడ్కర్, రాజ్యాంగం కోసం కేటీఆర్ మాట్లాడటం విడ్డూరంగా ఉందని ఎద్దేవా చేశారు. దళిత ముఖ్యమంత్రితోపాటు అనేక హామీలు నెరవేర్చని వ్యక్తి కేసీఆర్ అని గుర్తు చేశారు. అసెంబ్లీలో చర్చ జరుగుతుంటే ప్రతిపక్షనేత కేసీఆర్ ఫాం హౌస్‌లో ఎందుకు దాక్కున్నారని ప్రశ్నించారు. రెండు రాష్ట్రాల జల వివాదాల విషయంలో బుధవారం కీలక చర్చ జరిగిందని చెప్పారు. ఈ ప్రాజెక్టులపై మాట్లాడానికి కేటీఆర్‌కు అర్హత లేదని, ప్రతిపక్ష నేత హోదాలో కేసీఆర్ వస్తే తాము చర్చకు సిద్ధమని చెప్పారు. కేటీఆర్ ఇలాగే మాట్లాడితే భారీ మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు.

అమెరికా నుంచి మీ ఫోన్లను తెప్పించండి

» ప్రభాకర్‌రావుకు సిట్ ఆదేశాలు..8 గంటల పాటు విచారణ

హైదరాబాద్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): ఫోన్ ట్యాపింగ్ కేసులో ఎస్‌ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్‌రావు బుధవారం మరోమారు సిట్ విచారణకు హాజరయ్యారు. ట్యాపింగ్ జరిగినప్పుడు ప్రభాకర్‌రావు వాడిన అధికారిక సెల్‌ఫోన్‌ను మాత్రమే ఆయన సిట్‌కు అందజేశారు. ల్యాప్‌టాప్, ట్యాబ్‌లలో డాటాను ఆయన డిలీట్ చేయడంతో.. సిట్ అధికారులు ఎఫ్ఎస్ఎల్ విశ్లేషణ, డాటా రికవరీకి పంపారు. అయితే.. ప్రభాకర్‌రావు ట్యాపింగ్ సమయంలో వాడిన రెండు సెల్‌ఫోన్లను అమెరికాలోనే వదిలేశారు. దీంతో.. "మీ ఫోన్లను అమెరికా నుంచి తెప్పించండి.." అంటూ సిట్ అధికారులు ప్రభాకర్‌రావును ఆదేశించారు. అధికారులు ఆయనను దాదాపు 8 గంటల పాటు ప్రశ్నించినా.. విచారణకు సహకరించలేదని తెలిసింది. ఎస్ఐబీలో ఆధారాలను ధ్వంసం చేయడం, అక్రమంగా/మోసపూరితంగా పలువురి ఫోన్లను ట్యాపింగ్ చేయడం, ప్రభాకర్‌రావు వాడిన ఎలక్ట్రానిక్ పరికరాలపై సిట్ అధికారులు ప్రశ్నల వర్షం కురిపించినట్లు తెలిసింది. "ఫోన్ ట్యాపింగ్ చేశాక.. ఆ సమాచారాన్ని ఎవరికి పంపేవారు?".. "ఎందుకోసం నిఘా పెట్టారు?".. అనే కోణాల్లో ప్రశ్నించారు. ఇప్పటి వరకు సిట్ అధికారులు 300 మంది బాధితుల వాంగ్మూలాలను నమోదు చేయగా.. వారిలో కొందరి పేర్లను ప్రస్తావిస్తూ.. "వారి నంబర్లను ఎందుకు ట్యాపింగ్ చేశారు? అంత అవసరమేమొచ్చింది?" అని ప్రశ్నించినట్లు సమాచారం. అయితే.. సిట్ అడిగిన ప్రశ్నలకు ప్రభాకర్‌రావు చాలా వరకు సమాధానాలు చెప్పలేదని తెలిసింది. విచారణకు సహకరించకుండా.. మౌనంగా కూర్చున్నట్లు సమాచారం.

పునాది పూర్తవ్వగానే బిల్లు చెల్లిస్తాం

» ఇందిరమ్మ ఇల్లు బిల్లు కోసం వ్యక్తి ఆత్మహత్యాయత్నం ఘటన

» 'ఆంధ్రజ్యోతి' కథనానికి అధికారుల స్పందన

మాసాయిపేట జూలై 16 (ఆంధ్రజ్యోతి): 'ఇందిరమ్మ ఇంటి బిల్లు రాలేదని ఆత్మహత్యాయత్నం' శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో బుధవారం ప్రచురితమైన కథనానికి గృహ నిర్మాణ శాఖ అధికారులు స్పందించారు. ఆత్మహత్యకు యత్నించిన మెదక్ జిల్లా మాసాయిపేటకు చెందిన నర్సింహులు చేపట్టిన ఇంటి నిర్మాణాన్ని గృహ నిర్మాణ శాఖ పీడీ మాణిక్యం బుధవారం ఉదయం స్వయంగా పరిశీలించారు. పునాది ఇంకా పూర్తవ్వకపోవడంతోనే బిల్లు మంజూరు కాలేదని స్పష్టం చేశారు. పునాది నిర్మాణం పూర్తి చేసి గ్రామ కార్యదర్శి ద్వారా రికార్డు చేయించుకుంటే నిబంధనల ప్రకారం బిల్లు మంజూరు చేస్తామని సూచించారు. ఇందిరమ్మ గృహాలకు బిల్లులను ఎప్పటికప్పుడు చెల్లిస్తున్నట్లు మాణిక్యం వెల్లడించారు.

ఆ ఫ్లాట్ ఏజెన్సీకిచ్చాం.. ఎవరున్నారో తెలీదు!

» ఏపీ లిక్కర్ స్కాం నిందితులతో లావాదేవీలు లేవు: శ్రవణ్

హైదరాబాద్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): దుబాయ్‌లో తమ కుటుంబ సభ్యుల పేరుతో ఉన్న ఫ్లాట్‌ను ఓ రెంటల్ ఏజెన్సీకి లీజుకు ఇచ్చామని ఫోన్ ట్యాపింగ్ కేసులో నిందితుడిగా ఉన్న శ్రవణ్ రావు స్పష్టం చేశారు. ఆ ఏజెన్సీ వారు ఎవరికి అద్దెకు ఇచ్చారో, అందులో ఎవరున్నారో తమకు తెలియదని వెల్లడించారు. 'శ్రవణ్ రావు దుబాయ్ ఫ్లాట్‌లో లిక్కర్ స్కాం నిందితుల మకాం' పేరుతో 'ఆంధ్రజ్యోతి'లో బుధవారం ప్రచురితమైన కథనంపై శ్రవణ్ రావుకు చెందిన సంస్థ వివరణ ఇచ్చింది. 'శ్రవణ్ రావు కుటుంబ సభ్యులు గతంలోనే దుబాయ్‌లో ఫ్లాట్ కొనుగోలు చేశారు. అయితే ఆ ఫ్లాట్‌ను హాలీడే హోమ్స్ అనే ఏజెన్సీకి 2023లో లీజుకు ఇచ్చారు. ఆ సంస్థ తాత్కాలిక పద్ధతిలో భారత్‌తోపాటు ఇతర దేశాల నుంచి దుబాయ్ వచ్చే వారికి అద్దెకు ఇస్తోంది. హాలీడే హోమ్స్ ఆ ఫ్లాట్‌ను ఎవరికి అద్దెకు ఇస్తుందనే విషయంతో యజమానికి ఏ సంబంధం లేదు. ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన లిక్కర్ స్కాంలో నిందితుడిగా ఉన్న రాజ్ కసిరెడ్డితోగానీ, ఆ కేసులో మిగతా నిందితులతోగానీ శ్రవణ్ రావు, అతని కుటుంబ సభ్యులకు ఎలాంటి వ్యాపార లావాదేవీలు లేవు. 2023 నుంచి దుబాయ్‌లోని ఫ్లాట్ శ్రవణ్ రావు కుటుంబం ఆధీనంలో లేదు' అని వెల్లడించింది.

తల్లిదండ్రులు చదివించలేం అని చెప్పడంతో..

» బాలిక మనస్తాపం.. ఉరివేసుకొని ఆత్మహత్య


మదిహా(ఫైల్)

నిజాంపేట, జూలై 14 (ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులు చదువు మాన్పించడంతో మనస్తాపానికి గురైన బాలిక ఆత్మహత్య చేసుకుంది. మెదక్ జిల్లా నిజాంపేట మండలంలోని రాంపూర్‌లో ఈ ఘటన జరిగింది. గ్రామానికి చెందిన సులేమాన్ కూతురు మదిహా(15) పదో తరగతి పూర్తిచేసింది. కామారెడ్డిలోని మైనారిటీ జూనియర్ కళాశాలలో సీటు సంపాదించింది. అక్కడ చదివించేందుకు ఆర్థిక స్తోమత లేదని చెబుతూ తల్లిదండ్రులు చదువు మాన్పించారు. బుధవారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో మదిహా చున్నీతో దూలానికి ఉరివేసుకుంది. కొద్దిసేపటికి తిరిగొచ్చిన తల్లిదండ్రులు.. ఆమె ఉరివేసుకున్న స్థితిలో చూసి కన్నీరుమున్నీరయ్యారు.

ఆర్ఎఫ్‌సీఎల్‌లో గ్యాస్ పైప్‌లైన్ లీకేజీ

యూరియా ఉత్పత్తి నిలిపివేత.. పునఃప్రారంభానికి 15రోజులు

కోల్‌సిటీ, జూలై 16 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి జిల్లా రామగుండం ఫెర్టిలైజర్స్ అండ్ కెమికల్స్ లిమిటెడ్ (ఆర్ఎఫ్‌సీఎల్)లోని అమ్మోనియా మెయిన్ ప్లాంట్‌లో బుధవారం అమ్మోనియా గ్యాస్ పైప్‌లైన్ లీకైంది. ఈ లీకేజీ కారణంగా ప్లాంట్‌లో యూరియా ఉత్పత్తిని నిలిపివేశారు. ఎల్‌బో పైప్‌లైన్‌లో వెల్డింగ్ ఊడిపోవడం వల్లే లీకేజీ జరిగినట్టు తెలుస్తోంది. వెంటనే అప్రమత్తమైన అధికారులు ప్లాంట్‌ను షట్‌డౌన్ చేశారు. దీంతో పెను ప్రమాదం తప్పింది. ప్రస్తుతం ప్లాంట్‌లో యూరియా నిల్వలు లేవని, లీకేజీ కారణంగా నిలిపివేసిన ఉత్పత్తిని తిరిగి ప్రారంభించడానికి సుమారు 15 రోజులు పట్టే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. ఆర్ఎఫ్‌సీఎల్‌లో ఉత్పత్తి నిలిచిపోవడంతో రాష్ట్రంలో యూరియా కొరత మరింత తీవ్రమయ్యే అవకాశం ఉంది.

పదోన్నతుల్లో జాప్యం.. డీఎంఈ ఆఫీస్ డీడీపై వేటు

హైదరాబాద్, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : వైద్య కళాశాలల్లో అధ్యాపకుల పదోన్నతి అంశం ఓ డిప్యూటీ డైరెక్టర్‌పై వేటుకు కారణమైంది. వైద్యవిద్య సంచాలకుల కార్యాలయం డీడీ వెంకటయ్యను ప్రభుత్వం సస్పెండ్ చేసింది. ఈమేరకు హెల్త్ సెక్రటరీ క్రిస్టినా జడ్ చోంగ్తు జీవో జారీ చేశారు. వైద్య కళాశాలల్లో తీవ్రమైన అధ్యాపకుల కొరత నేపథ్యంలో జాతీయ వైద్య కమిషన్ అన్ని సర్కారీ కళాశాలలకు షోకాజ్ నోటీసులు జారీ చేసింది. నిర్ణీత కాల వ్యవధిలో అధ్యాపకులను సర్దుబాటు చేస్తామని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ అధికారులు ఎన్ఎంసీకి లిఖితపూర్వక హామీ ఇచ్చారు. ఈ నేపథ్యంలో ప్రొఫెసర్ల కొరతను అధిగమించేందుకు వైద్యశాఖ పదోన్నతులు చేపట్టింది. అసోసియేట్ ప్రొఫెసర్ల నుంచి ప్రొఫెసర్లుగా పదోన్నతులు చేపట్టాలని నిర్ణయించింది. అందుకు సంబంధించిన ఫైలును వెంటనే పెట్టాలని డీడీ వెంకటయ్యను సర్కారు ఆదేశించింది. ఈ విషయంలో ఆయన తీవ్ర జాప్యం చేశారనే కారణంతో సస్పెండ్ చేశారు. దీంతో డీఎంఈ కార్యాలయంలోని ఇతర ఉద్యోగులంతా చిన్న చిన్న కారణాలకే సస్పెండ్ చేస్తారా అంటూ ప్రశ్నిస్తున్నారు.

టెలికాం శాఖ నుంచి 'విపత్తు' సందేశాలు

» కొత్త సాఫ్ట్‌వేర్‌ను పరీక్షిస్తున్న టెలికాం శాఖ

హైదరాబాద్, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : విపత్తుల సమయాల్లో ప్రజలను అప్రమత్తం చేసేందుకు వీలుగా టెలికాం శాఖ(డీవోటీ) రెండు వారాల నుంచి సందేశాల(అలర్ట్)ను పంపుతోంది. గతంలో ప్రజలను అప్రమత్తం చేసేందుకు జాతీయ విపత్తుల నిర్వహణ సంస్థ ద్వారా సందేశాలు వచ్చేవి. తాజాగా కొత్త సాఫ్ట్‌వేర్‌ను అందుబాటులోకి తీసుకొచ్చిన టెలికాం శాఖ విపత్తుల నిర్వహణ సంస్థతో అనుసంధానమై అత్యవసర సమయాల్లో దేశ ప్రజలను అప్రమత్తం చేస్తూ సందేశాలను పంపే ఏర్పాట్లు చేసింది. దీన్ని పరీక్షించే చర్యల్లో భాగంగా నాలుగు వారాల పాటు ఈ అలర్ట్ సందేశాలను సెల్‌ఫోన్ వినియోగదారులందరికీ పంపనుంది. మొత్తం 36రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో.. 19 భాషల్లో ఈ టెక్స్ట్ సందేశాలు పంపుతున్నారు. వాటిపై ఎవరూ స్పందించాల్సిన అవసరం లేదని, ఆందోళన చెందాల్సిన అవసరం లేదని డీవోటీ అధికారులు తెలిపారు. అప్రమత్తత(అలర్ట్) సందేశాలు గత రెండు వారాలుగా వస్తున్నాయి. మరో రెండు వారాల పాటు ఇవి కొనసాగే అవకాశం ఉంది.

నీటి వాటాల్లో రాజీపడేది లేదు

» బీఆర్ఎస్ పాలనలోనే బనకచర్లకు అనుమతులు

» అప్పుడు ఎవ్వరూ నోరు మెదపలేదు

» మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి


ఇందిరా మహిళాశక్తి సంబురాల్లో మహిళలకు వడ్డీ రాయితీ చెక్కు అందిస్తున్న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

ములకలపల్లి/దమ్మపేట, జూలై 16 (ఆంధ్రజ్యోతి): కృష్ణా, గోదావరి జలాల్లో తెలంగాణకు రావాల్సిన వాటాల విషయంలో రాజీపడే ప్రసక్తే లేదని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. ఈ అంశంలో ప్రభుత్వం రాజీ లేని పోరాటం చేస్తోందని వెల్లడించారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడే ఏపీలో బనకచర్ల ప్రాజెక్టుకు అనుమతులు వచ్చాయని తెలిపారు. ఆ సమయంలో బనకచర్ల అంశంపై ఎవ్వరూ నోరుమెదపలేదని పొంగులేటి గుర్తు చేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ములకలపల్లి మండలం తిమ్మంపేట గ్రామంలో రూ.9 కోట్లతో నిర్మించిన ఎత్తిపోతల పథకాన్ని మంత్రి పొంగులేటి బుధవారం సాయంత్రం ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ నీటి వాటాల అంశంలో ప్రభుత్వ వైఖరిని తెలియజేశారు. తిమ్మంపేట ఎత్తిపోతల పథకం గిరిజనులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఇక, భద్రాద్రి జిల్లా దమ్మపేటలో బుధవారం జరిగిన అశ్వారావుపేట నియోజకవర్గస్థాయి ఇందిరా మహిళా శక్తి సంబురాల్లోనూ పాల్గొన్న మంత్రి పొంగులేటి.. డ్వాక్రా సంఘాలకు వడ్డీ లేని రుణాలకు సంబంధించి రూ.3.02కోట్లు చెక్కును అందజేశారు. అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ అధ్యక్షతన జరిగిన ఈ సభలో పొంగులేటి మాట్లాడుతూ.. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందని చెప్పారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేరుస్తున్నామని వివరించారు. మహిళా సంఘాల సభ్యులకు రుణ బీమా, ప్రమాద బీమాను ప్రభుత్వం అందిస్తోందన్నారు. గత ప్రభుత్వం మహిళా సంఘాలకు వడ్డీ రాయితీ కూడా ఎగ్గొట్టిందని పొంగులేటి ఆరోపించారు. అనంతరం కొత్త రేషన్ కార్డులను లబ్ధిదారులకు అందజేశారు.

ఆ ముగ్గురి అక్రమాస్తులు 1000కోట్ల పైనే!

(మొదటి పేజీ తరువాయి)

కంపెనీల్లో పెట్టిన పెట్టుబడులు, కాళేశ్వరం ప్రాజెక్టు కాంట్రాక్టులపైనా ఈడీ అధికారులు విచారణ జరపనున్నారు. మనీలాండరింగ్ కోణంలో దర్యాప్తు చేయనున్నారు. ఏసీబీ విచారణలో ఈ ముగ్గురు ఇంజనీర్లకు లగ్జరీ విల్లాలు, ఫ్లాట్లు, ఎకరాల కొద్దీ భూమి, వాణిజ్య సముదాయాలు ఉన్నట్లు తేలింది. మురళీధర్‌రావుకు మోకిలలో ఉన్న 6500 గజాల స్థలం విలువే రూ.65-70 కోట్లు ఉండొచ్చని ఏసీబీ అధికారులు అంటున్నారు.

ఏసీబీ సోదాల్లో గుర్తించిన ఆస్తుల వివరాలు..

హరిరామ్ నాయక్

కాళేశ్వరం ప్రాజెక్టు ఈఎన్‌సీగా పనిచేశారు. ఈ ఏడాది ఏప్రిల్ 26న ఏసీబీ అధికారులు అతన్ని అరెస్టు చేశారు. 13 ప్రాంతాల్లో సోదాలు నిర్వహించారు. షేక్‌పేట, కొండాపూర్‌లో రెండు లగ్జరీ విల్లాలు, నార్సింగ్, మాదాపూర్, శ్రీనగర్‌లో ప్రముఖులు ఉండే అపార్ట్‌మెంట్లలో మూడు ఫ్లాట్లు, అమరావతిలో వాణిజ్య స్థలం, మర్కూక్ మండలంలో 28 ఎకరాల వ్యవసాయ భూమి, పటాన్‌చెరులో 20 గుంటల భూమి, శ్రీనగర్ కాలనీలో రెండు ఇండిపెండెంట్ ఇళ్లు, బొమ్మల రామారాంలో ఆరెకరాల ఫాంహౌస్ (మామిడితోట), కొత్తగూడెంలో నిర్మాణంలో ఉన్న భవనం, కుత్బుల్లాపూర్, మిర్యాలగూడలో రెండు ఇళ్ల స్థలాలు, ఒక బీఎండబ్ల్యూ కారు, బ్యాంకు లాకర్లు, ఫిక్స్‌డ్ డిపాజిట్లు, బంగారు ఆభరణాలను గుర్తించారు.

నూనె శ్రీధర్..

సాగునీటి శాఖలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఈఈ)గా పనిచేశారు. ఈ ఏడాది జూన్ 11న ఏసీబీ అధికారులు శ్రీధర్‌ను అరెస్టు చేశారు. 13 చోట్ల సోదాలు నిర్వహించారు. హైదరాబాద్‌లోని మలక్‌పేటలో 4 అంతస్తుల విలాసవంతమైన భవనం, షేక్‌పేటలోని ఖరీదైన గేటెడ్ కమ్యూనిటీలో ఫ్లాట్, తెల్లాపూర్‌లో లగ్జరీ విల్లా, వరంగల్‌లో జీ+3 భవనం, కరీంనగర్‌లో మూడు ఫ్లాట్లు, ఒక ఇండిపెండెంట్ ఇల్లు, అమీర్‌పేటలోని వాణిజ్య సముదాయంలో ఆస్తులు, 16 ఎకరాల వ్యవసాయ భూమి, హైదరాబాద్, కరీంనగర్, వరంగల్‌లోని అత్యంత ఖరీదైన ప్రాంతాల్లో 19 ఇళ్ల స్థలాలు, కరీంనగర్‌లో హోటల్‌ను గుర్తించారు. లాకర్లలో ఉన్న రూ.5 కోట్ల విలువైన ఆభరణాలు, మరికొన్ని ఆస్తుల పత్రాలను ఏసీబీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. శ్రీధర్ తన కుమారుడి వివాహాన్ని థాయ్‌లాండ్‌లో నిర్వహించారు.

మురళీధర్‌రావు..

సాగునీటి శాఖ విశ్రాంత ఈఎన్‌సీ మురళీధర్‌రావును మంగళవారం ఏసీబీ అధికారులు అరెస్టు చేశారు. 11 చోట్ల సోదాలు నిర్వహించారు. మురళీధర్‌రావుకు కొండాపూర్‌లో ఒక విల్లా, బంజారాహిల్స్, యూసుఫ్‌గూడ, కోకాపేట, బేగంపేటలో నాలుగు ఫ్లాట్లు, కరీంనగర్‌లో ఒక వాణిజ్య సముదాయం, హైదరాబాద్‌లో మరో వాణిజ్య సముదాయం, కోదాడలో ఒక అపార్ట్‌మెంట్, జహీరాబాద్‌లో 2కేవీ సౌర విద్యుత్కేంద్రం, వరంగల్‌లో నిర్మాణంలో ఉన్న ఒక అపార్ట్‌మెంట్, 11 ఎకరాల వ్యవసాయ భూమి, హైదరాబాద్‌లో అత్యంత ఖరీదైన ప్రాంతాల్లో నాలుగు ఇళ్ల స్థలాలు, మోకిలాలో 6,500 గజాల ప్లాటు, మెర్సిడెజ్ బెంజ్ సహా మూడు కార్లు ఉన్నట్లు ఏసీబీ అధికారులు గుర్తించారు. ఇంకా బ్యాంకు లాకర్లు తెరవాల్సి ఉందని చెప్పారు. మురళీధర్‌రావు కుమారుడు అభిషేక్‌రావు కాళేశ్వరం ప్రాజెక్టులో కాంట్రాక్టులు చేసినట్లు గుర్తించారు.

14 రోజుల రిమాండ్

ఆదాయానికి మించి ఆస్తుల కేసులో అరెస్టయిన మురళీధర్‌రావును ఏసీబీ అధికారులు మంగళవారం రాత్రి న్యాయమూర్తి నివాసంలో హాజరుపరచగా.. 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించారు. దీంతో ఆయన్ను చంచల్‌గూడ జైలుకు తరలించారు.

ఏసీబీకి చిక్కిన పంచాయతీరాజ్ ఇంజనీర్ ఇన్ చీఫ్



హైదరాబాద్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): పంచాయతీరాజ్ శాఖ ఇంజనీర్ ఇన్ చీఫ్ వీరవల్లి కనకరత్నం ఏసీబీకి చిక్కారు. డీఈ బదిలీ కోసం రూ.50 వేల లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. సొంత శాఖలోని డీఈ తాండూరు నుంచి వికారాబాద్‌కు బదిలీ చేయాలని కోరగా.. అందుకు రూ.50 వేలు లంచం ఇవ్వాలని కనకరత్నం డిమాండ్ చేశారు. దీంతో ఆ డీఈ ఏసీబీని ఆశ్రయించారు. పథకం ప్రకారం.. డీఈ కనకరత్నానికి రూ.50 వేలు ఇస్తుండగా ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అనంతరం కేపీహెచ్‌బీ కాలనీలోని కనకరత్నం ఇంట్లోనూ సోదాలు నిర్వహించారు. వాస్తవానికి ఈ ఏడాది మార్చిలోనే కనకరత్నం పదవీ విరమణ పొందారు. అయితే, ప్రభుత్వం ఆయన పదవీ కాలాన్ని మరో ఏడాది పాటు పొడిగించింది.

చందు నాయక్‌పై 2 తుపాకులతో కాల్పులు

» హత్య ఘటనలో 8 నుంచి 10 మంది ప్రమేయం

» అద్దెకారులో వచ్చి ఫైరింగ్.. శరీరంలో 5 బులెట్లు

చాదర్‌ఘాట్, జూలై 16(ఆంధ్రజ్యోతి): సీపీఐ నేత చందు నాయక్ హత్య కేసులో కొత్త విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. ఆయన్ను హత్య చేసేందుకు దుండగులు అద్దెకారులో వచ్చినట్లు పోలీసులు గుర్తించారు. హత్యకు ఒకరోజు ముందే చైతన్యపురిలో ఓ సంస్థ నుంచి కారును అద్దెకు తీసుకున్నట్లు తేల్చారు. చందు నాయక్‌ను హత్యచేశాక.. నలుగురు నిందితులు కారులో చైతన్యపురివైపు పారిపోయారు. నలుగురిలో ముగ్గురు మధ్యలోనే దిగిపోగా.. ఒకరు కారును అద్దెకు తీసుకున్న సంస్థలో అప్పగించాడు. అనంతరం.. కారును అప్పగించిన నిందితుడు అక్కడి నుంచే ఆన్‌లైన్‌లో బైక్‌ను బుక్ చేసుకొని ఉప్పల్ వైపు వెళ్లినట్లు గుర్తించారు. కారును ఇప్పటికే పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. చందు నాయక్ హత్య ఘటనలో నలుగురి ప్రమేయం ఉందని తొలుత భావించినా 8 నుంచి 10 మంది వరకు ఉన్నట్లు పోలీసులు ఆధారాలు సంపాదించినట్లు సమాచారం. అలాగే.. చందు నాయక్‌పై ఐదురౌండ్ల కాల్పులు జరిపారని భావించినా, హత్య కోసం రెండు తుపాకీలు ఉపయోగించారని, 8రౌండ్లు కాల్చారని నిర్ధారణకొచ్చారు. చందు నాయక్ శరీరంలో ఐదు బులెట్లు దిగాయి. ఘటనాస్థలి నుంచి మూడు బులెట్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. చందు నాయక్‌ను హత్య చేసిన వ్యక్తులు ఎవరనే విషయంలోనూ పోలీసులు ఓ అంచనాకు వచ్చినట్లు తెలిసింది. చందు నాయక్‌తో సన్నిహితంగా ఉండే రాజేశ్, శివ, ఏడుకొండలు, ప్రశాంత్, పాషా, యాదగిరితో పాటు మరికొందరికి హత్య ఘటనలో ప్రమేయం ఉన్నట్లు ప్రాథమిక ఆధారాలు సంపాదించారు. సాయినగర్‌లో గుడిసెల ఏర్పాటులో భాగంగా ఆర్థిక లావాదేవీలపై తలెత్తిన వివాదంతో పాటు వివాహేతర సంబంధం కూడా హత్యకు కారణంగా భావిస్తున్నారు. ఎనిమిది మందిలో ఇప్పటికే నలుగురిని పోలీసుల ఎదుట లొంగిపోయినట్లు తెలుస్తోంది.

ఇక.. కేసీఆర్ ఆస్తులు ఎంత ఉంటాయో?

» అవినీతిపరుల ఆస్తులను పేదలకు పంచాలి

» ఎమ్మెల్యేలు మదన్‌మోహన్, మేడిపల్లి సత్యం

హైదరాబాద్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): మాజీ ఈఎన్‌సీ మురళీధర్‌రావు వద్దే రూ.500కోట్ల పైబడి ఆస్తులు ఉంటే.. ఇక కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు వద్ద ఎన్ని ఆస్తులు ఉంటాయో ఎవరికీ అంతుపట్టడం లేదని కాంగ్రెస్ ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు, ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. కాళేశ్వరం నిర్మాణంలో భాగస్వామ్యమైన వారిలో ఎవరి ఆస్తులు లెక్క కట్టినా అంచనాలకు మించి తేలుతున్నాయన్నారు. గాంధీభవన్‌లో బుధవారం ఎమ్మెల్యే మదన్‌మోహన్.. ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ కాళేశ్వరంలో అవినీతిపై ప్రభుత్వం పకడ్బందీగా విచారణ చేపట్టాలని, దోపిడీదారుల ఆస్తులు జప్తు చేసి పేద ప్రజలకు పంచాలని అభిప్రాయపడ్డారు. మేడిపల్లి సత్యం మాట్లాడుతూ కాళేశ్వరంలో జరిగిన దోపిడీపై హరీశ్‌రావు పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ఇస్తే బాగుంటుందని వ్యాఖ్యానించారు. పదేళ్లు అధికారంలో ఉండి దళితులను పట్టించుకోని కేటీఆర్.. ఇప్పుడు ఆయా వర్గాల పట్ల మొసలి కన్నీరు కారుస్తున్నారని ధ్వజమెత్తారు. దళితబంధు కోసం రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేయాలని రెచ్చగొడుతున్న ఆయన.. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు.

సీఐడీ కస్టడీకి జగన్‌మోహన్‌రావు బృందం

హెచ్‌సీఏ కార్యదర్శి దేవరాజ్ కోసం గాలింపు

హైదరాబాద్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) నిధుల దుర్వినియోగ ఆరోపణల కేసులో అరెస్టు అయిన హెచ్‌సీఏ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రావు సహా అయిదుగురిని ఆరు రోజుల పాటు సీఐడీ కస్టడీకి అనుమతిస్తూ మల్కాజిగిరి కోర్టు బుధవారం తీర్పునిచ్చింది. వారిని విచారణ చేయడానికి పది రోజులు కావాలని సీఐడీ కోరగా ఆరు రోజుల కస్టడీకి కోర్టు అనుమతి ఇచ్చింది. దీంతో హెచ్‌సీఏ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రావు, శ్రీనివాసరావు, సునీల్ కాంతే, రాజేందర్ యాదవ్, కవితలను సీఐడీ అధికారులు జైలు నుంచి గురువారం తమ కస్టడీలోకి తీసుకోనున్నారు. ఈ కేసులో ఏ2గా ఉన్న హెచ్‌సీఏ కార్యదర్శి దేవరాజ్ రామచందర్‌ను పట్టుకోవడం కోసం తమ బృందాలు గాలిస్తున్నాయని సీఐడీ అదనపు డీజీ చారుసిన్హా తెలిపారు. మరోవైపు హెచ్‌సీఏ కార్యవర్గంపై మహబూబ్‌నగర్, ఆదిలాబాద్, వరంగల్, ఖమ్మం జిల్లాల క్రికెట్ అసోసియేషన్లు పోలీసులకు ఫిర్యాదు చేశాయి. జిల్లా క్రికెట్ అభివృద్ధికి ఏటా 20 లక్షల రూపాయలు కేటాయిస్తున్నట్టు చెప్పినప్పటికీ, ఫోరెన్సిక్ ఆడిట్‌లో నిధుల గోల్‌మాల్ బయటపడిందని పేర్కొన్నాయి. ఇప్పటికే జగన్‌మోహన్‌రావు బృందంపై ఫోర్జరీ, నిధుల దుర్వినియోగం, మోసం, బ్లాక్‌మెయిలింగ్, బెదిరింపులకు సంబంధించిన ఆరోపణలపై సీఐడీ కేసు నమోదు చేసిన సంగతి తెలిసిందే. ఈడీ కూడా మనీలాండరింగ్ కోణంలో దర్యాప్తునకు సన్నద్ధమయింది. సీఐడీ నుంచి ఎఫ్ఐఆర్, వాంగ్మూలాలను ఈడీ అధికారులు సేకరించారు.

ఫ్యూచర్ సిటీపై ఫార్మాసిటీ బఫర్‌జోన్ కత్తి!

లేఅవుట్, భవన నిర్మాణ అనుమతులు రావట్లేదు.. రెండేళ్ల క్రితమే ఫార్మాసిటీకి బఫర్‌జోన్ ఖరారు

హైదరాబాద్ సిటీ, జూలై 16(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ మహానగరాన్ని విశ్వనగరంగా మార్చే క్రమంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్మిస్తున్న ఫ్యూచర్ సిటీపై.. ఫార్మాసిటీ బఫర్‌జోన్ కత్తి వేళాడుతోంది. 56 రెవెన్యూ గ్రామాలతో 765 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో అభివృద్ధి చేయాలని నిర్ణయించిన ఫ్యూచర్ సిటీకి ప్రత్యేక డెవలప్‌మెంట్ అథారిటీ ఏర్పాటు చేసినా.. ఫార్మాసిటీ బఫర్‌జోన్ అడ్డంకిగా మారుతోంది. ఫార్మాసిటీ కోసం రెండేళ్ల క్రితం అప్పటి ప్రభుత్వం బఫర్‌జోన్‌ను నిర్ణయిస్తూ ఆదేశాలు జారీ చేసింది. నేటికీ ఆ ఆదేశాలు కొనసాగుతున్నాయి. ఈ బఫర్‌జోన్‌లో ఎలాంటి నివాస లేఅవుట్లకు, భవన నిర్మాణాలకు అనుమతులు ఇవ్వకూడదంటూ అప్పట్లో హెచ్ఎండీఏకి మునిసిపల్ శాఖ ఆదేశాలిచ్చింది. ఆ ఆదేశాలు ఇప్పటికీ ఫ్యూచర్ సిటీ పాలిట అడ్డంకిగా ఉన్నాయి. దీంతో.. లేఅవుట్, భవన నిర్మాణ అనుమతులకు దరఖాస్తులు రావడం లేదు. ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ(ఎఫ్‌సీడీఏ) పూర్తిస్థాయిలో ఏర్పాటు చేసేంత వరకు ఈ ఆంక్షలు కొనసాగుతాయని తెలుస్తోంది.

హైదరాబాద్-శ్రీశైలం మార్గంలో ముచ్చెర్ల వద్ద ఫార్మాసిటీని ప్రకటించడంతో అప్పట్లో పరిసర ప్రాంతాల్లో పెద్దఎత్తున రియల్‌ఎస్టేట్ సాగింది. భూముల ధరలు పెరగడంతో క్రయ, విక్రయాలు భారీగా జరిగాయి. అయితే, ఫార్మాసిటీ తర్వాత మూడు కిలోమీటర్ల పరిధిలో, ఐదు కిలోమీటర్ల పరిధిలో, ఏడు కిలోమీటర్ల పరిధిలో బఫర్‌జోన్‌ను నిర్ణయించడానికి హెచ్ఎండీఏ అధికారులు అప్పట్లో రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలను పంపారు. ఇందులో దేన్నీ ప్రభుత్వం ఖరారు చేయలేదు. కానీ ఫార్మాసిటీ పరిసర ప్రాంతాల్లో సుమారు ఏడు కిలోమీటర్ల చదరపు విస్తీర్ణంలో ఎలాంటి లేఅవుట్‌లు, భవన నిర్మాణాలు, చివరకు గోదాముల నిర్మాణాలకు అనుమతులు ఇవ్వకూడదని ఉన్నత స్థాయిలో ఆదేశాలు జారీ అయ్యాయి. దాంతో హెచ్ఎండీఏ అధికారులు ఫార్మాసిటీ తర్వాత ఏడు కిలోమీటర్ల పరిధిలో అనుమతులను నిలిపివేశారు. దీంతో ఇప్పటికీ.. రంగారెడ్డి జిల్లాలోని ముచ్చెర్ల, మీర్‌ఖాన్‌పేట, పంజగూడ రెవెన్యూ గ్రామాలతోపాటు యాచారం మండలంలోని కుర్మిద్ద, మేడపల్లి, నానక్‌నగర్, తాడిపత్రి గ్రామాలు, కడ్తాల్ మండలం పరిధిలోని ముద్విన్, కర్కల్‌పహాడ్, కడ్తాల్‌ను అనుకొని ఉన్న ఏడు కిలోమీటర్ల పరిధిలో ఆంక్షలు కొనసాగుతున్నాయి.

ఫ్యూచర్ సిటీకి ఇబ్బంది..!

ముచ్చెర్ల పరిసర ప్రాంతాలను ప్రస్తుతం ఫ్యూచర్ సిటీగా నిర్ణయించారు. మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం సిద్ధమైంది. ఎఫ్‌సీడీఏని ఏర్పాటు చేసింది. ఈ అథారిటీ 765 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో ఉండే 56 గ్రామాలను కేటాయించింది. ఫ్యూచర్‌సిటీ డెవలప్‌మెంట్ అథారిటీకి చైర్మన్‌గా ముఖ్యమంత్రి, వైస్‌చైర్మన్‌గా మునిసిపల్ శాఖ మంత్రి, సభ్యులుగా పలు శాఖల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులు ఉంటారు. ఇటీవల ఎఫ్‌సీడీఏ అదనపు డైరెక్టర్‌ను నియమించారు. ఈ ప్రాంతంలో భవన నిర్మాణాలు, లేఅవుట్ల అనుమతులపై స్పష్టతనిచ్చారు. అయితే.. ఫార్మాసిటీ బఫర్‌జోన్‌ను నిర్ణయిస్తూ గత ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాలు ఇప్పటికీ కొనసాగడంతో.. ఫ్యూచర్ సిటీలోని అత్యధిక ప్రాంతాల నుంచి భవన నిర్మాణ, లేఅవుట్ అనుమతుల దరఖాస్తులు హెచ్ఎండీఏకు రావడం లేదు. ఒకవేళ దరఖాస్తు చేసినా.. డెవలపర్లకు నిరాశే ఎదురవుతోంది. ఫార్మాసిటీ బఫర్‌జోన్ తొలగింపు ఆదేశాలు వచ్చేదాకా అనుమతులు ఇవ్వలేమని అధికారులు స్పష్టం చేస్తున్నారు. అయితే.. ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీని పూర్తిస్థాయిలో ఏర్పాటు చేసే వరకు.. ప్రభుత్వం బఫర్‌జోన్ ఆంక్షలను కొనసాగిస్తుందనే వాదనలు వినిపిస్తున్నాయి.


మాజీమంత్రి కొప్పుల ఈశ్వర్‌కు శుభాకాంక్షలు తెలియజేస్తున్న కేటీఆర్

కవితకు కేటీఆర్ షాక్!

» టీబీజీకేఎస్ ఇన్‌చార్జిగా కొప్పుల ఈశ్వర్

హైదరాబాద్, గోదావరిఖని, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : బీఆర్ఎస్‌కు అనుబంధంగా కొనసాగే తెలంగాణ బొగ్గుగని కార్మికసంఘం(టీబీజీకేఎస్) గౌరవాధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ షాకిచ్చారు. ఆ సంఘం ఇన్‌చార్జిగా మాజీమంత్రి కొప్పుల ఈశ్వర్‌ను తాజాగా నియమించడం గులాబీ పార్టీలో, రాజకీయవర్గాల్లో చర్చకు తెర లేపింది. తెలంగాణ భవన్‌లో బుధవారం కేటీఆర్ సింగరేణి కార్మిక సంఘాల సమావేశంలో ఈ నిర్ణయాన్ని ప్రకటించారు. దీంతో కవితకు ఆ పార్టీలో, అనుబంధ సంఘాల్లోనూ ప్రాధాన్యం తగ్గుతోందంటూ సామాజిక మాధ్యమాల్లో విస్తృత ప్రచారం జరుగుతోంది. తాజా పరిస్థితి ఇలాఉంటే.. తన తండ్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు తాను రాసిన లేఖ లీకయిన విషయంలో పరోక్షంగా వర్కింగ్ ప్రెసిడెంట్‌ను విమర్శిస్తూ.. కవిత సంచలన వ్యాఖ్యలు చేసిన విషయం విదితమే. అదే సమయంలో తెలంగాణ జాగృతి సంస్థను పటిష్టం చేయడంలో భాగంగా.. ఒక అడుగు ముందుకు వేసి.. సింగరేణి కార్మిక నాయకులను కలుపుకొని.. సింగరేణి జాగృతి పేరిట కమిటీలు కూడా వేశారని జాగృతి శ్రేణులు అభిప్రాయపడుతున్నాయి. కాగా కొప్పుల ఈశ్వర్ నియామకం సందర్భంగా ఇకపై టీబీజీకేఎస్ వెంట బీఆర్ఎస్ పార్టీ ఉంటుందని కేటీఆర్ హామీ ఇచ్చారు.

44,553 మందికి నచ్చలే!

» ఇంజనీరింగ్‌లో ఆప్షన్లు మార్చుకున్న 58% మంది

» రేపు మొదటి విడత తుది జాబితా విడుదల

హైదరాబాద్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్ కోర్సుల్లో ప్రవేశాలకు ఉద్దేశించిన ఎప్‌సెట్ మొదటివిడత కౌన్సెలింగ్ కొనసాగుతోంది. గత నెల 28 నుంచి రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభం కాగా ధ్రువీకరణ పత్రాల పరిశీలన అనంతరం ఆప్షన్లు ఇచ్చే ప్రక్రియ ఇటీవలే ముగిసింది. రాష్ట్రవ్యాప్తంగా 95,256 మంది ధ్రువీకరణ పత్రాల పరిశీలన ముగిసింది. 94,354 మంది తమకు నచ్చిన కళాశాల, కోర్సులకు సంబంధించిన ఆప్షన్లు ఇచ్చారు. అయితే ప్రతి ఏడాది ఆప్షన్ల ప్రక్రియ ముగిసిన అనంతరం సీట్ల కేటాయింపు ఉంటుండగా.. ఈ సారి సీట్ల కేటాయింపునకు ముందే మాక్ అలాట్‌మెంట్ (ఆప్షన్ల మార్పు)కు అవకాశమిచ్చారు. విద్యార్థులు తమకు నచ్చిన కళాశాల, అనుకున్న బ్రాంచీలో సీటు దక్కకపోతే వెంటనే ఆప్షన్ మార్చుకోవచ్చు. ఈ నూతన విధానాన్ని తొలిసారిగా ఈ ఏడాది నుంచే అమలు చేస్తున్నారు. తమకు నచ్చిన చోట సీటు దక్కకపోతే విద్యార్థులు కళాశాలల్లో చేరట్లేదు. దాంతో ఈ నూతన విధానాన్ని ప్రారంభించారు. తొలిసారి ప్రారంభించిన ఈ విధానంలో దాదాపు సగం మంది తమకు కేటాయించిన సీట్లను మార్చుకున్నారు. మాక్ అలాట్‌మెంట్‌లో భాగంగా ఈ నెల 12న 77,154 మందికి సీట్లు కేటాయించారు. మార్పులు చేర్పులకు ఈ నెల 15 వరకు అవకాశమిచ్చారు. గడువు పూర్తయ్యే నాటికి 44,553 మంది వారికి కేటాయించిన సీటుపై అసంతృప్తితో ఇతర ఆప్షన్లు ఇచ్చారు. అంటే సీట్లు పొందిన వారిలో 58 శాతం మంది వారికి కేటాయించిన సీటుతో సంతృప్తిగా లేరని స్పష్టమవుతోంది. తుది కేటాయింపు జాబితాను సాంకేతిక విద్యాశాఖ ఈ నెల 18న విడుదల చేయనుంది. అయితే మాక్ అలాట్‌మెంట్‌లో ఇప్పటికే సీటు దక్కించుకుని.. ఎలాంటి ఆప్షన్లు ఇవ్వనివారి సీట్లు కూడా మారే అవకాశాలున్నాయి.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: N.Rahul Kumar. Ph. No. (0870) 2100480/84, RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.